వీక్షణం


రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

VEEKSHANAM, TELUGU MONTHLY

సంపుటి : 15 సంచిక : 12 హైదరాబాద్ 197 డిసెంబర్ 2017 పేజీలు : 68 రు. 20

- ఎవరివీ ప్రపంచ తెలుగు మహాసభలు?
- తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కాగ్ వ్యాఖ్యలు
- సాయిబాబా నిర్బంధం - అనవసర వివాదం
- పెరిగిపోతున్న ఫాసిస్టు సాంస్కృతిక ఉన్మాదం
- కార్పొరేట్ ఎగవేతదారులకు నూతనోత్సాహం
- మార్క్స్ - అంబేడ్కర్ సమన్వయం సి.వి.
- పనామా పేపర్స్ నుంచి ప్యారడైజ్ పేపర్స్ దాకా





వరవరరావు కవిత్వం

1957 - 2017

రెండు సంపుటాలు

స్వేచ్ఛా సాహితి ప్రచురణ

తెలుగు స్వతంత్రలో 1957 నవంబర్‌లో అచ్చయి ఆ తర్వాత ఏ సంకలనంలోనూ చేరని సోషలిస్టు చంద్రుడు, ఆ తర్వాతి సంపుటాలు చలినెగళ్లు (1968), జీవనాడి (1971), ఊరేగింపు (1974), స్వేచ్ఛ (1978), సముద్రం (1983), భవిష్యత్తు చిత్రపటం (1986), ముక్తకంఠం (1990), ఉన్నదేదో ఉన్నట్లు (1996), అంతస్సూత్రం (2006), తెలంగాణ వీరగాథ (2007), పాలపిట్ట పాట (2007), బీజభూమి (2014), ఆ మధ్యలోనూ, తర్వాతా వెలువడిన కవితలు – అన్నీ కలిపి మొత్తంగా అరవై సంవత్సరాలలో వరవరరావు రాసిన నాలుగు వందలకు పైగా కవితలు ఇక్కడ ఉన్నాయి. ఆయా సందర్భాలలో అచ్చయి, ఆ తర్వాత వెలువడిన సంపుటాలలో చేరని కవితలలో కూడా కొన్ని ఇక్కడ చేరాయి. ఆ రకంగా ఇది వరవరరావు సమగ్ర కవితా సంపుటం.

పేజీలు: **1030**

వెల: **రు. 600**


(రెండు సంపుటాలు కలిపి)

ప్రతులకు:

అన్ని ప్రముఖ పుస్తకాల షాపులు

వీక్షణం దగ్గర కూడా లభిస్తాయి

జి–1, మైత్రీ రెసిడెన్సీ, స్ట్రీట్ నం. 3,
హిమాయత్ నగర్ హైదరాబాద్ – 500 029
ఫోన్ :040 66843495



ప్రత్యామ్నాయం

దళితుల చరిత్ర

ఆరవ భాగం

డా. కత్తి పద్మారావు

లోకాయత ప్రచురణలు

పేజీలు: **316**

వెల: **రు. 300**

మేలు ప్రతి రు. 500

ప్రతులకు:

కత్తి స్వర్ణకుమారి

లోకాయత ప్రచురణలు, లుంబినీ వనం,
అంబేద్కర్ కాలనీ, పొన్నూరు – 522 124.
ఫోన్ :98497 41695
email: padmaraokathi@yahoo.co.in

Advt.

197 ISSN 2231-6892

వీక్షణం
రాజకీయార్థిక, సామాజిక మాసపత్రిక

డిసెంబర్ 2017
సంపుటి : 15
సంచిక : 12

'వీక్షణం' పేరిట రచనలు, ఎం.ఓలు, చెక్కులు,డి.డి లు పంపాల్సిన చిరునామా

వీక్షణం
VEEKSHANAM
మైత్రీ రెసిడెన్సీ, 3-6-394, స్ట్రీట్ నెం. 3, హిమాయత్‌నగర్,
హైదరాబాద్ - 500 029. ఫాక్స్, ఫోన్ : 040-66843495
Email : veekshanam2003@gmail.com
www.veekshanam.wordpress.com

ప్రింటర్స్ : చరితా ఇంప్రెషన్స్
ఆజామాబాద్, హైదరాబాద్. ఫోన్ : 040 - 27678411

వీక్షణం చందా వివరాలు

	సంస్థలకు / లైబ్రరీలకు	వ్యక్తులకు
విడి ప్రతి	రు. 20	రు. 20
సంవత్సరం	రు. 240	రు. 200
మూడు సంవత్సరాలు	రు. 600	రు. 540
ఐదు సంవత్సరాలు	రు. 1000	రు. 900
పది సంవత్సరాలు	రు. 2000	రు. 1700

ఆన్‌లైన్ ఆంధ్రబ్యాంక్ ద్వారా డబ్బులు పంపేవారు బ్యాంక్ స్లిప్‌పై 'VEEKSHANAM' అని రాసి తమ పేరు కూడా రాయాలి. వీక్షణం అకౌంట్ నెంబర్ – **013911011002175** ఆంధ్రాబ్యాంక్, గగన్‌మహల్ బ్రాంచ్, హైదరాబాద్ పేరు మీద వేయాలి. ఇతర బ్యాంకులలో వేసేవారు **ANDB 0000139** నెంబర్‌తో పాటు తమ పేరు కూడా రాసి వేయాలి.

వీక్షణం చేస్తున్న కృషి పదికాలాల పాటు కొనసాగాలనే ఆకాంక్షతో మూలనిధికి 2017 నవంబర్ నెలలో వచ్చిన విరాళాలు - శ్రేయోభిలాషి, హోసూరు - రు. 1,000; దరావతు రాజు (టీచర్), స్టేషన్ ఘన్‌పూర్ - రు. 1,000; మిత్రులకు కృతజ్ఞతలు - సం.

వీక్షణం విడిప్రతి వెల, సంవత్సర చందా మార్పు

వీక్షణం ఆర్థిక సమస్యలలో కొట్టుమిట్టాడుతూ మరుసటి సంచిక వస్తుందా రాదా అనే స్థితిలో కొనసాగుతున్నదని వీక్షణం పాఠకులకు, అభిమానులకు తెలుసు. ఈ స్థితిలో ఆర్థిక భారాన్ని కొంతైనా తగ్గించుకోవడానికి, పెరుగుతున్న న్యూస్ ప్రింట్, ముద్రణ, నిర్వహణ వ్యయాలను తట్టుకోవడానికి వీక్షణం విడిప్రతి వెల ప్రస్తుతం ఉన్న రు. 20 నుంచి రు. 25 కు పెంచక తప్పడం లేదు. గతంలో విడిప్రతి వెల పెంపు జరిగి మూడున్నర సంవత్సరాలు అయిందని కూడ పాఠకుల దృష్టికి తేదలచుకున్నాం. విడిప్రతి వెలలో పెరుగుదల వల్ల ఇకనుంచి సంవత్సర చందా రు. 250, మూడు సంవత్సరాల చందా రు. 650, ఐదు సంవత్సరాల చందా రు. 1100, పది సంవత్సరాల చందా రు. 2000గా మారుతాయి. ఈ కొత్త ధరలు జనవరి 2018 సంచిక నుంచి అమలులోకి వస్తాయి. 2018 జనవరి 1 తర్వాత చందాలు చెల్లించేవారందరూ ఈ కొత్త చందా వివరాలు గుర్తించాలి.

శ్రీకాకుళం జిల్లా ఉద్దానం ప్రాంతంలో ప్రజలను పీడిస్తున్న కిడ్నీ వ్యాధిపై వీక్షణం నవంబర్ 2017 సంచికలో ప్రచురితమైన వ్యాసం ఆ ప్రాంతంలో నెలకొని ఉన్న కడు దయనీయ పరిస్థితిని వివరంగా తెలియజేసింది. అత్యంత వెనుకబడిన ప్రాంతంగా ఉన్న శ్రీకాకుళం జిల్లాలో కిడ్నీవ్యాధికి గురైన బాధితులకు ప్రభుత్వం ఉచితంగా మెరుగైన వైద్య సహాయం అందించి వారిని ఆదుకోవాలి. మొత్తంగా ఒక ప్రాంతాన్ని కబలిస్తున్న కిడ్నీవ్యాధికి గల కారణాలను కనుక్కొని, వ్యాధిని నివారించే చర్యలు ప్రభుత్వం తక్షణమే చేపట్టాలి.

– ఎస్. కిశోర్ కుమార్
హైదరాబాద్

'యశ్వంత్ సిన్హా అప్రూవర్ ప్రకటన' సంపాదకీయం వాస్తవికతకు దగ్గరగా ఉండి ఆలోచనాత్మకంగా ఉంది. 'జిల్లాల విభజన ప్రజలకేం ఇచ్చింది' ఏలిన వారి కళ్లు తెరిపించేదిగా ఉంది. పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు, కుదేలవుతున్న భారత ఆర్థిక వ్యవస్థ వ్యాసాలు బాగా ఆకట్టుకున్నాయి. అక్కడక్కడ వ్యాసాలకనుగుణంగా రంగుల చిత్రాల్ని ముద్రిస్తే పత్రిక మరింత అందంగా, ఆకర్షణీయంగా ఉంటుంది.

– బిక్కునూరి రాజేశ్వర్
పొన్కల్, నిర్మల్

రచయిత స్వీయ నియంత్రణ పాటించాలి (రచయిత వై.ఎచ్.కె. మోహన్ రావు, వీక్షణం నవంబర్ 2017) అనే వ్యాసం వీక్షణంలో ఎందుకు అచ్చువేసారో అర్థం కాలేదు. ప్రొ. ఐలయ్య రాసిన పుస్తకంలో కొన్ని పొరపాట్లు, లోపాలు ఉన్నమాట నిజమే గాని, దాని మీద విమర్శగా రాసిన ఈ వ్యాసం పూర్తిగా ఒక కులాన్ని సమర్థించడానికి రాసినట్టుగా ఉంది. ఐలయ్య దురుసు మాటలు వాడారని విమర్శించిన ఈ వ్యాసం అంతకంటే ఎక్కువ దురుసు, అభ్యంతరకరమైన మాటలు వాడింది. పైగా అక్టోబర్ సంచికలో ఈ వివాదం మీద పత్రిక సంపాదకులే రాసిన సమన్వయ వ్యాసం వేసిన తర్వాత ఈ ఏకపక్ష దాడి వ్యాసం ఎందుకు వేసారో తెలియడం లేదు. గత సంచికల్లో ఎవరో ఒక పాఠకుడు వ్యాఖ్యానించినట్టుగా వీక్షణం క్రమక్రమంగా 'అతి ప్రజాస్వామికం' వైపు ప్రయాణిస్తున్నట్టుగా ఉంది. ఉండవలసిన చోట కచ్చితంగా లేని 'అతి ప్రజాస్వామికం' ఉదారవాదంగా, జారుడుబండగా మారుతుంది. జాగ్రత్త.

– టి. పురుషోత్తం
హైదరాబాద్

వీక్షణం నవంబర్ సంచికలో విద్యార్థుల ఆత్మహత్యలపై రెండు వ్యాసాలు బాగున్నాయి. కాని వ్యాసాల్లో రాజ్యం పాత్రపై తగినంత విశ్లేషణ లేదు. కళాశాల అధ్యాపకుల ఒత్తిళ్లు, తల్లిదండ్రుల ఒత్తిళ్లు లేదా ప్రేమ వ్యవహారాలలో అతిగా ఆలోచించడం వలన బలవన్మరణాలకు పాల్పడుతున్నట్లు రాశారు. అది సరికాదు. 1990 తరువాత ప్రైవేట్ విద్యాసంస్థలు విస్తరించడం మొదలైంది. విద్యారంగం వ్యాపార రంగంగా మారిపోయింది. కార్పొరేట్ శక్తుల యాజమాన్యాల దగ్గర బందీ అయింది. విద్యా వ్యాపారస్తులు మంత్రులైనారు. విద్యలో పోటీ మొదలైంది. పోటీ విద్యతో తల్లిదండ్రులు ప్రేక్షకులైనారు. ప్రత్యామ్నాయం లేనప్పుడు ఏమిచేస్తారు. ప్రేమ వైఫల్య మరణాలను వీటికి ముడిపెట్టడం సరికాదు. ఇంటర్ బోర్డు నిబంధనలు, డా. చక్రపాణి కమిటీ అమలు చేయలేదు. చదువో, చావో తేల్చుకో అన్నట్లు పరిణమించింది. ఆత్మహత్యకు ముందు రాసిన లేఖలను మరణ వాంగ్మూలంగా భావించి కేసులు పెట్టాలి. ఆత్మహత్యలపై న్యాయ విచారణ లేదు. నారాయణ – చైతన్య కళాశాలల 200 హాస్టళ్లకు అనుమతులు లేవని విద్యాశాఖా మంత్రి చెప్పారు. కాని ఆ చర్యలు లేవు. విద్యార్థుల ఆత్మహత్యలన్నీ ప్రభుత్వ హత్యలే.

– తుంపాల శ్రీరామమూర్తి
గాజువాక, విశాఖపట్నం

వీక్షణం నవంబర్ 2017లో వెలువడిన 'అక్టోబర్ విప్లవం తర్వాత పరిణామాలు', 'రచయిత స్వీయ నియంత్రణ పాటించాలి' వ్యాసాల మీద పాఠకుల నుంచి పెద్ద ఎత్తున ప్రతిస్పందన వచ్చింది. 'రచయితల అభిప్రాయాలతో మాకు ఏకీభావం ఉండనవసరం లేదు' అని వీక్షణం ప్రతి సంచికలోనూ చెప్పుకున్నప్పటికీ వీక్షణం కలెక్టివ్ దృక్పథానికి పూర్తిగా వ్యతిరేకమైన అభిప్రాయాలను అచ్చువేయడం సాధ్యం కాదు. స్థూలంగా ప్రగతిశీల దృక్పథంలోనే ఎన్ని భిన్నాభిప్రాయాలకైనా వేదిక కల్పించవచ్చు. ఈ అవగాహనతో చూసినప్పుడు ఈ రెండు వ్యాసాలు వీక్షణంలో అచ్చు వేసి ఉండవలసింది కాదని వీక్షణం కలెక్టివ్ అభిప్రాయపడుతున్నది.

అసహజ మరణాల సూచి జిల్లాల కరస్పాండెంట్లు

తెలంగాణ : ఆదిలాబాద్ – సి.ఎచ్. శ్రీమన్నారాయణ మూర్తి; ఖమ్మం – సి.ఎచ్. గిరిజ; మెదక్ – ముత్తన్నగారి రాజేందర్‌రెడ్డి; మహబూబ్‌నగర్ – మహమ్మద్ ఇక్బాల్; వరంగల్ – ఓరగంటి ఎల్లయ్య

ఆంధ్రప్రదేశ్ : అనంతపూర్ – కె. నాగేశ్వరాచారి; చిత్తూరు – పలమనేరు బాలాజి; కడప – కొండ్రాయుడు; కర్నూలు – జి.వి. సుధాకర్ రెడ్డి; తూర్పు గోదావరి – కె.ఎస్. ప్రకాష్‌రావు; శ్రీకాకుళం – ఆర్. శ్రీలత; విశాఖపట్నం – పి.వి. రమణ

(ఈ సంచికలోని హైదరాబాద్, రంగారెడ్డి, నిజామాబాద్, నల్గొండ, కృష్ణా, గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, విజయనగరం, ప. గోదావరి జిల్లాల అసహజ మరణాల వివరాలు అందిస్తున్నవారు ఎస్. వెంకటేశ్)

హంతకుడే అధినేత, విచారించే న్యాయమూర్తి హతుడు

అన్ని హంతక, దౌర్జన్య కార్యక్రమాలలో ప్రధాని నరేంద్ర మోడీకి విడదీయరాని సహచరుడు, ప్రస్తుత భారతీయ జనతా పార్టీ అధ్యక్షుడు అమిత్ షా మీద హత్య నేరారోపణపై విచారణ జరుపుతున్న న్యాయమూర్తి బ్రిజ్ మోహన్ లోయా మూడు సంవత్సరాల కింద అకాలంగా, హఠాత్తుగా మరణించడం అప్పుడు చెప్పినట్టుగా గుండెపోటు వల్ల కాదనీ, అది హత్య అయి ఉండవచ్చుననీ ఒక్కొక్క వివరమూ బైటపడుతుంటే ఇవాళ మన దేశం ఎటువంటి హంతకుల చేతిలో చిక్కుకుని ఉన్నదో ఒళ్లు గగుర్పొడిచే నిజాలు బహిర్గతమవుతున్నాయి. సంఘ్ పరివార హంతక విద్వేష రాజకీయాలను నరనరానా జీర్ణించుకున్న మోడీ – అమిత్ షా గుండెలు తీసిన బంట్లు అనీ, ఎంతకైనా తెగించగలరనీ గుజరాత్ మారణకాండ పదిహేను సంవత్సరాల కిందనే రుజువు చేసింది. ఇప్పుడు లోయా హత్య వివరాలు వారి దుర్మార్గాల గురించి మరింత స్పష్టంగా తెలియజేస్తున్నాయి.

బ్రిజ్‌మోహన్ హరికిషన్ లోయా సిబిఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి. ఒక సహచర న్యాయమూర్తి కుటుంబంలో పెళ్లికి హాజరు కావడానికి బొంబాయి నుంచి నాగపూర్ వెళ్లి, ప్రభుత్వ అతిథి గృహంలో ఉండగా గుండెపోటు వచ్చిందని, మొదట సమీపంలోని ఆస్పత్రికి తీసుకువెళ్లి, అక్కడి నుంచి ప్రత్యేక హృద్రోగ ఆస్పత్రికి తీసుకువెళ్లే సరికే మరణం సంభవించిందని 2014 డిసెంబర్ 2న పత్రికల్లో వార్తలు వచ్చాయి. మరణించే సమయానికి ఆయన వయసు 52 సంవత్సరాలు. అప్పటివరకూ గుండెపోటుతో సహా ఏ అనారోగ్యమూ లేదు. అయినా ఇటువంటి ఆకస్మిక మరణాలు సంభవించే అవకాశం ఉంది గనుక పెద్ద చర్చ లేకుండానే ఈ వార్త ప్రజల దృష్టి నుంచి తప్పిపోయింది. దేశంలోని వేలాది మంది న్యాయమూర్తులలో ఒకానొక న్యాయమూర్తి మరణం పెద్ద వార్త ఏమీ కాదు. కాని, ఈ మరణాన్ని ప్రత్యేకంగా చూడవలసిన అవసరం ఉంది. ఆయన గుజరాత్‌లో 2003–2006 కాలంలో జరిగిన బూటకపు ఎన్‌కౌంటర్ కేసుల విచారణ జరుపుతున్నారు. ఈ కేసులు 2010లో సాధారణ కోర్టుల నుంచి సిబిఐ కోర్టుకు బదిలీ అయ్యాయి. గుజరాత్‌లో విచారణ జరిగితే అక్కడి ప్రభుత్వం ప్రభావితం చేసే అవకాశం ఉంది గనుక వేరేచోటికి బదిలీ చేయాలనే సుప్రీంకోర్టు ఆదేశం మేరకు 2012లో ఈ కేసులన్నీ మహారాష్ట్ర సిబిఐ ప్రత్యేక కోర్టులకు చేరాయి. వీటిలో సొహ్రాబుద్దీన్, కౌసర్ బీల బూటకపు ఎన్‌కౌంటర్ కేసు ఒకటి. ఈ కేసును మొదటి నుంచి చివరి వరకూ ఒకే న్యాయమూర్తి విచారించాలని కూడ సుప్రీంకోర్టు ఆదేశించింది. అలా జె.టి. ఉత్పల్ అనే న్యాయమూర్తి దగ్గర ఈ కేసు విచారణ మొదలైంది. తాను కోర్టుకు హాజరు కానక్కరలేని మినహాయింపు ఇవ్వాలని అమిత్ షా 2014 జూన్ 6న కోర్టును కోరగా న్యాయమూర్తి అది కుదరదని మందలించారు. అయినా ఆ తర్వాత వాయిదాకు జూన్ 20న అమిత్ షా గైర్హాజరయ్యాడు. న్యాయమూర్తి తన ఆగ్రహాన్ని వ్యక్తం చేసి జూన్ 26కు వాయిదా వేసి, ఆరోజైనా ముద్దాయి కోర్టుకు రావలసిందేనని ఆదేశించారు. ఒక్కరోజు ముందు, జూన్ 25న ఆ న్యాయమూర్తిని బదిలీ చేసి, ఆ స్థానంలో బ్రిజ్ మోహన్ లోయాను నియమించారు. అక్టోబర్ 31న హాజరు కాకపోయినా అమిత్ షాకు మినహాయింపు ఇస్తూనే ఆరోజు ముంబై లోనే ఉండి నిందితుడు కోర్టుకు రాకపోవడం ఏమిటని న్యాయమూర్తి లోయా తన అసంతృప్తి ప్రకటించారు. ప్రధాన నిందితుడైన అమిత్ షా మీద, నిందితుల న్యాయవాదుల మీద కఠినమైన వ్యాఖ్యలు చేశారు. తర్వాత వాయిదా డిసెంబర్ 15కు వేశారు. ఆ వాయిదా ఇంకా పదిహేను రోజులు ఉందనగా, నవంబర్ 30న నాగపూర్‌లో ఒక సహచర న్యాయమూర్తి కూతురి పెళ్లికి లోయాకు ఆహ్వానం వచ్చింది. లోయా ఆ పెళ్లికి వెళ్లాలని అనుకోలేదు గాని ముంబై కోర్టులోని ఇద్దరు సహ న్యాయమూర్తులు బలవంతాన ఆయనను ఒప్పించి నాగపూర్ తీసుకువెళ్లారు. పెళ్లి తర్వాత నవంబర్ 30 రాత్రి 11 గంటలకు లోయా ముంబైకి ఫోన్ చేసి భార్యతో నలభై నిమిషాలకు పైగా మాట్లాడారు. ఆ సమయంలో కూడ ఆయన తనకు నలతగా ఉందని ప్రస్తావించలేదు. తర్వాత మూడు నాలుగు గంటల్లో ఆయన ఛాతీ నొప్పి అన్నారని, కొద్ది సేపట్లోనే మరణించారని నమోదయింది.

లోయా ఛాతీ నొప్పి అన్నారని చెపుతున్నప్పటి నుంచి మరణించిన దాకా జరిగిన పరిణామాలు, ఆ తర్వాతి పరిణామాలు ఎన్నో అనుమానాలకు తావిస్తున్నాయని కుటుంబ సభ్యులు భావిస్తున్నారని కారవాన్ పత్రిక ఒక సుదీర్ఘ కథనాన్ని సరిగ్గా మూడు సంవత్సరాల తర్వాత ఇప్పుడు ప్రచురించింది. స్వయంగా ఆయన న్యాయమూర్తి అయినప్పటికీ, ప్రభుత్వ అతిథి గృహంలో ఉన్నప్పటికీ ఆయనను సమీపంలోని ఆస్పత్రికి కారులో కాకుండా ఆటోలో తీసుకువెళ్లారు. ఆయన మరణించారని ఉదయం 5 గంటలకే కుటుంబ సభ్యులకు చెప్పారుగాని, ఆస్పత్రి రికార్డులలో 6.30కు మరణించినట్టుగా నమోదు చేశారు. ఆ మరణం గురించి కుటుంబ సభ్యులకు తెలియజేసిన వ్యక్తి కుటుంబంతో ఏ సంబంధమూ లేని, లాతూరుకు చెందిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్త. అది సహజ మరణమే అయినప్పటికీ పోస్ట్‌మార్టం చేశారు. పోస్ట్ మార్టం నివేదిక మీద కుటుంబానికి ఏమీ సంబంధం లేని ఎవరో వ్యక్తి "జ్ఞాతి సోదరుడు" అని సంతకం చేశాడు. కుటుంబ సభ్యులు నాగపూర్ వస్తామంటే అవసరం లేదని చెప్పారు. మృతదేహాన్ని ఎవరూ తోడు లేకుండా లాతూరు దగ్గరి స్వగ్రామానికి పంపించారు. చొక్కా మీద నెత్తుటి మరకలు చూసిన కుటుంబ సభ్యులు రెండో పోస్ట్‌మార్టం కోరితే ఇప్పుడెందుకు అని నిరుత్సాహపరిచి, అంత్యక్రియలు జరిపించారు. మరణవార్త చెప్పిన ఆర్‌ఎస్‌ఎస్ కార్యకర్తే మూడు రోజుల తర్వాత లోయా మొబైల్ ఫోన్ తెచ్చి కుటుంబ సభ్యులకు ఇచ్చారు. ఆ ఫోన్‌లో డాటా అంత చెరిపేయబడి ఉంది. ఆయనను బలవంతపెట్టి నాగపూర్‌కు తీసుకువెళ్లిన సహన్యాయమూర్తులు మృతదేహంతో రాలేదు, అంత్యక్రియలకు రాలేదు. కేసులో అమిత్ షాకు అనుకూలంగా తీర్పు ఇస్తే వంద కోట్ల రూపాయలు ఇస్తామని ఒక సహ న్యాయమూర్తి లోయాతో అన్నారని కూడ కుటుంబ సభ్యులు చెప్పారు. ఈ అనుమానాలన్నిటికి తోడు, లోయా మృతి తర్వాత వచ్చిన కొత్త న్యాయమూర్తి ఎంబి గోసావి అసలు మొత్తంగా కేసులోంచి అమిత్ షాను నిందితుడిగా తప్పించారు. అమిత్ షా మీద నేరారోపణకు ఆధారాలేమీ లేవని, సిబిఐ కేవలం రాజకీయ కారణాలతో ఆ ఆరోపణలు చేసిందని అన్నారు. ప్రధాన నిందితుడైన అమిత్ షాను మాత్రమే కాదు, మరెంతో మంది కీలకమైన రాజకీయ నాయకులను, పోలీసు అధికారులను కూడ ఈ కొత్త న్యాయమూర్తి కేసు నుంచి తప్పించారు.

ఒక్కమాటలో చెప్పాలంటే లోయా ఉదంతం నరహంతకులే అధికార పీఠాలు ఎక్కి, న్యాయవ్యవస్థ స్వతంత్ర ప్రతిపత్తిని, విచారణాధికారాన్ని రద్దు చేసి, మాట వినని న్యాయమూర్తులను హత్య చేసి, తమకు తామే నిర్దోషులుగా ప్రకటించుకునే దుర్మార్గ రాజ్యానికి నిలువెత్తు నిదర్శనం. ఇన్ని దారుణ వివరాలు బైటపడుతున్నా కూడ ఈ రాజ్యాన్ని ఇంకా ప్రజాస్వామ్యం అందామా అని ఎవరికి వారు ప్రశ్నించుకోవలసిందే. వీ

సంపాదకీయ వ్యాఖ్య - తెలంగాణ

ఈ అంతర్జాతీయ తమాషాలు ఏం సాధిస్తాయి?

గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఆర్భాటంగా, కోట్లాది రూపాయల ప్రజాధనం వృథా చేస్తూ నిర్వహించిన జాతీయ, అంతర్జాతీయ తమాషాలను యథాతథంగా అనుకరిస్తున్న తెలంగాణ ప్రభుత్వం గ్లోబల్ ఆంత్రప్రెన్యూర్షిప్ సమ్మిట్ (ప్రపంచ వ్యాపారవేత్తల శిఖరాగ్ర సదస్సు) పేరుతో ఒక భారీ తమాషా నిర్వహిస్తున్నది. ప్రజలవైపు నుంచి చూసినప్పుడు ప్రజాధనాన్ని దుబారా చేసే నిష్ప్రయోజనకరమైన, అనవసరమైన ఇటువంటి పెట్టుబడిదారీ వేడుకల సందర్భంలో గత ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వాలు ఊదరగొట్టినట్టే, గొప్పలు చెప్పుకున్నట్టే తెలంగాణ ప్రభుత్వం కూడ ఎన్నో అతిశయోక్తులూ, అర్ధసత్యాలూ ప్రచారం చేస్తున్నది. ఇటువంటి సదస్సు జరగడం దక్షిణాసియాలోనే తొలిసారి అనీ, కేంద్ర ప్రభుత్వం, వందలాది బహుళ జాతి సంస్థలు, పారిశ్రామిక వేత్తలు, వ్యాపారవేత్తలు హాజరు కానున్నారనీ, ఈ సదస్సుతో తెలంగాణ ప్రతిష్ఠ, హైదరాబాద్ ప్రతిష్ఠ అంతర్జాతీయ స్థాయికి ఎగబాకుతుందనీ ప్రభుత్వం, వందిమాగధులూ ప్రగల్భాలు పలుకుతున్నారు. చంద్రబాబు నాయుడు పాలనాకాలంలో ప్రారంభమైన ఈ ప్రగల్భాల వేలం వెర్రి ప్రజలకు, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఏ మేలూ చేకూర్చలేదని, ఇటువంటి ప్రయత్నాలు రాష్ట్ర వనరులను దేశదేశాల పెట్టుబడిదారులకు ఉచితంగానో, కారు చౌకగానో కట్టబెట్టడానికి తప్ప మరెందుకూ పనికి రావని ఎన్నోసార్లు రుజువైంది. దేశదేశాల సంపన్నులకు ఇలా ఎర్ర తివాచీ పరిచి రాష్ట్రంలో భూమినీ, సహజవనరులనూ, మార్కెట్ నూ అప్పనంగా అప్పగించినందువల్ల ఆ పెట్టుబడిదారులు విదిల్చే ఎంగిలి మెతుకులు, ముడుపులు రాష్ట్ర పాలకులకు దక్కవచ్చునేమో గాని, వాటి వల్ల ప్రజలకు ఒరిగేదేమీ లేదు. వాటివల్ల కొత్తగా ఉద్యోగకల్పన జరగబోయేది లేదు. ఉద్యోగాల కోసం అల్లాడుతున్న తెలంగాణ నిరుద్యోగులకు ఉపశమనం అందబోయేది లేదు. ఆ పరిశ్రమలు, వ్యాపారాలు వచ్చి, వాటికి అనుబంధ వ్యాపారాలు సాగి ఆర్థిక వ్యవస్థకు అదనపు చలనం వస్తుందనే ఆశ లేదు. ఇటువంటి మేళాలన్నీ కేవలం రియల్ ఎస్టేట్ లాభార్జనాపరుల కసరత్తులుగా, అదనపు మార్కెట్ల కోసం వేటాడుతున్న బహుళ జాతి సంస్థల దుష్ప్రయత్నాలుగా ఇదివరకెన్నోసార్లు రుజువయ్యాయి. ఆ బహుళ జాతి సంస్థలు, వాటి ప్రయోజనాల కోసం పనిచేసే సామ్రాజ్యవాద ప్రభుత్వాలు పేదదేశాల ప్రభుత్వాధినేతలను ఎలా ప్రశంసిస్తాయో, ఉబ్బేస్తాయో ఎన్నో అనుభవాలున్నాయి. ఇప్పుడు జరుగుతున్న తమాషాకు స్వయంగా అమెరికా అధ్యక్షుడి కూతురు, రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త ఇవాంకా రావడం ఏదో ఘనత అన్నట్టుగా ప్రభుత్వం ఉబ్బి తబ్బిబ్బు అవుతున్నది. చక్రవర్తి కూతురు వస్తే సామంతరాజు తలకిందులు అయినట్టుగా ఊరూ వాడా ఏకం చేస్తున్నది. మూడురోజుల బాగోతానికి, ఆ మాటకొస్తే మూడు గంటల బాగోతానికి, యాభైకోట్ల రూపాయల ప్రజాధనాన్ని బూడిదపాలు చేస్తున్నది. ఎంతగా ఉద్యమ పార్టీ ప్రభుత్వాన్నని, ప్రజా ఉద్యమం ద్వారా సాధించిన తెలంగాణకు తొలి ప్రభుత్వాన్నని చెప్పుకున్నప్పటికీ తాను ట్రంప్, మోడీ, చంద్రబాబుల తానులోని ముక్కనేనని తెరాస ప్రభుత్వం చెప్పకనే చెపుతున్నది. అధికారవర్గాల సాన్నిహిత్యంతో వందల, వేల కోట్ల రూపాయల అవినీతికీ, అక్రమార్జనకూ మారుపేరుగా నిలిచిన అంబానీ, అదానీ వంటి వ్యాపారవేత్తలు, పెట్టుబడిదారులకు వేలకోట్ల రూపాయలు రుణాలు ఇచ్చి మాఫీ చేయడానికి సిద్ధంగా ఉన్న బ్యాంకు అధినేతలు, కొత్త దోపిడీ అవకాశాల గురించి చర్చించుకోవడానికి పెట్టుకుంటున్న ఈ దొంగల సదస్సు రంగును ప్రజలు తెలుసుకోవలసి ఉంది. వీ

సంపాదకీయ వ్యాఖ్య - ఆంధ్రప్రదేశ్

చంద్రబాబుపై ప్రపంచ బ్యాంకు ప్రేమ

ఆంధ్రప్రదేశ్ విషయంలో ప్రపంచ బ్యాంకు చరిత్రలో ఒక అసాధారణమైన పరిణామం జరిగి, చంద్రబాబు నాయుడుకూ ప్రపంచ బ్యాంకుకూ ఎంత అన్యోన్య మైత్రి ఉన్నదో రుజువు చేసింది. తమ పెంపుడు జంతువు అయిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి మీద ఈగ వాలినా తాము సహించబోమని, ఒకవేళ తామే పొరపాటున ఒక ప్రతికూల వ్యాఖ్య చేసినా వెంటనే సరిదిద్దుకుంటామనీ ప్రపంచ బ్యాంకు ప్రపంచానికి చాటిచెప్పింది. పైకి చూడడానికైనా పారదర్శకత, ప్రజానుకూలత ఉన్నట్టు చూపడానికి ప్రపంచ బ్యాంకు దగ్గర చాల నాటక ప్రక్రియలున్నాయి. వాటిలో ఒకటి, ప్రపంచ బ్యాంకు రుణసహాయం అందించే పథకాల మీద ఎవరైనా ఫిర్యాదు చేస్తే ఒక స్వతంత్ర పరిశోధక బృందం చేత ఆ ఫిర్యాదుల మీద విచారణ జరిపి, ఆ నివేదిక, సిఫారసులు బహిరంగంగా ప్రకటిస్తామనేది. ఆంధ్రప్రదేశ్ నూతన రాజధాని అమరావతి నిర్మాణంలో నిర్వాసితులైన భూయజమానులు చేసిన ఫిర్యాదులు 2017 మే 25న అందాయని, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ భూసేకరణ పథకం వల్ల తమకు అన్యాయం జరుగుతున్నదని, తమ జీవనోపాధులు కోల్పోతున్నామని, పర్యావరణం ధ్వంసమవుతున్నదని, ఆహార భద్రతకు ముప్పు వాటిల్లుతుందని, మొత్తం ప్రక్రియ తమతో సంప్రదింపులు జరపకుండా, పారదర్శకమైన పునరావాస ఏర్పాట్లు లేకుండా జరుగుతున్నదని ఆ భూయజమానులు ఫిర్యాదు చేశారని ప్రపంచ బ్యాంకు ప్రకటించింది. జూన్ 12న ఈ ఫిర్యాదులను ఆమోదించి, పరిశీలించడానికి పరిశోధక బృందాన్ని నియమించింది. ఆ పరిశోధక బృందం ఆగస్ట్ 29–30లలో అమరావతి ప్రాంతంలో పర్యటించి, అక్టోబర్ 8న తన 102 పేజీల నివేదికను, సిఫారసులను ప్రకటించింది. అమరావతి గురించి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రజలకు అబద్ధాలు చెప్పిందని, పునరావాస ప్రణాళిక సక్రమంగా లేదని, ఆహార భద్రతకు, పర్యావరణానికి ముప్పు వాటిల్లుతుందని ఆ నివేదిక చెప్పింది. ప్రజలు స్వచ్ఛందంగా తమ భూములు రాజధానికి ఇచ్చారని ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికీ, బెదిరింపులు, బలవంతపు ఆక్రమణలు జరిగినట్టు తమ దృష్టికి వచ్చిందని ఆ నివేదిక రాసింది. పునరావాస ఏర్పాట్ల గురించి ప్రభుత్వ హామీలను సక్రమంగా అమలు చేయడం లేదని ఆ నివేదిక రాసింది. ఈ ప్రాంతంలో భూమిలేని నిరుపేద వ్యవసాయ కూలీల సమస్య మరింత దారుణంగా మారిందని ఆ నివేదిక రాసింది. కొండవీటి వాగుకు వరదలు వచ్చే అవకాశం ఉందని, ఆ వాగు ఒడ్డున ఉన్న మాగాణి భూములను పెద్దఎత్తున వ్యవసాయేతర భూములుగా మార్చడం ప్రమాదకరమని ఆ నివేదిక రాసింది. మొత్తం మీద అమరావతి రాజధాని అభివృద్ధి ప్రణాళికకు ఆర్థికసహాయం అందించడానికి నిర్ణయం తీసుకోబోయే ముందు మరింత సమగ్రమైన అధ్యయనం చేయాలని నివేదిక సిఫారసు చేసింది. ఈ నివేదికను యథాతథంగా అక్టోబర్ 8నే ప్రపంచ బ్యాంకు వెబ్ సైట్ మీద పెట్టారు. ప్రచారసాధనాలలో ఆ వార్తలు కూడ వెలువడ్డాయి. కాని కొద్దిగంటల్లోనే నాలిక కరుచుకుని ప్రపంచ బ్యాంకు ఆ నివేదికను వెబ్ సైట్ నుంచి తొలగించింది. తొలగించడం మాత్రమే కాదు, "బోర్డు పరిశీలించక ముందే పొరపాటున ఆ నివేదికను ప్రపంచ బ్యాంకు వెబ్ సైట్ మీద ప్రకటించాం. ఈ దురదృష్టకరమైన పాలనాపరమైన తప్పిదాన్ని కార్పొరేట్ సెక్రటేరియట్ గుర్తించి, దాన్ని సవరించడానికి తక్షణ చర్యలు తీసుకున్నది. ఈ పరిశోధక బృందం సిఫారసు గురించి బోర్డు నిర్ణయం తీసుకున్న తర్వాతనే నివేదిక బహిరంగంగా అందుబాటులో ఉంటుంది" అని ఒక ప్రకటన చేశారు. చంద్రబాబు నాయుడును కాపాడడానికి ప్రపంచ బ్యాంకు పిల్లిమొగ్గ వేసి తానే తప్పు చేశానని అంగీకరిస్తున్నది! వీ

జింబాబ్వేలో ముగిసిన ముగాబే శకం


జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబేను అభిశంసించేందుకు పార్లమెంట్ జరుగుతుండగా అవమానకరంగా నవంబర్ 22 రాత్రి గద్దె దిగక తప్పలేదు. ఈ ఘటన ఆ దేశాధ్యక్షుడుగా ఉన్న ముగాబేకు విషాదకర పరిణామమే. దాదాపు నాలుగు దశాబ్దాలుగా జింబాబ్వేలో తిరుగులేని నేతగా కొనసాగుతున్న 93 ఏళ్ల ముగాబే జీవిత చరమాంకంలో ఈ దుస్థితిని ఎదుర్కోవడం స్వయంకృతాపరాధమే. శ్వేతజాతి పాలన అంతమై స్వాతంత్ర్యం పొందిన 1980 నుంచి ముగాబే ఆ దేశాధ్యక్షుడిగా ఉన్నారు. కేవలం పదిరోజుల వ్యవధిలోనే ఆ దేశంలో పరిస్థితులు చకచకా మారిపోయాయి. తన తర్వాత తన భార్య గ్రేస్ ముగాబేను అధ్యక్షురాల్ని చేయాలన్న ఆలోచనతో నవంబర్ 6న వైస్ ప్రెసిడెంట్ ఎమర్సన్ మ్నంగాగ్వాను పదవీచ్యుతుణ్ణి చేశాడు. గ్రేస్‌పై అనేక ఆర్థిక ఆరోపణలున్నాయి. మ్నంగాగ్వాకు మిలిటరీతో మంచి సంబంధాలున్నాయి. నవంబర్ 15న జింబాబ్వే దేశ అధ్యక్ష అధికారాలను మిలిటరీ తన ఆధీనంలోకి తీసుకొని అధ్యక్షుడు రాబర్ట్ ముగాబేను గృహ నిర్బంధంలో ఉంచింది. ముగాబే చుట్టు ఉన్న నేరగాళ్ల భరతం పట్టడానికే ఈ పని చేశామని జింబాబ్వే సైన్యాధ్యక్షుడు ప్రకటించాడు. జింబాబ్వేను ఆర్థికంగా, సామాజికంగా దెబ్బతీసిన కొన్ని శక్తులను ఏరిపారేస్తామని సైన్యాధ్యక్షుడు తెలిపారు. సైన్యం ఎమర్సన్‌కు వత్తాసుగా ఈ చర్యకు పాల్పడిందని స్పష్టమవుతోంది. ఇదంతా అధికార పార్టీలో ఏర్పడిన కల్లోల ఫలితమే. అత్యధిక ప్రజలు సైనిక చర్యకు మద్దతు తెలిపారు. బ్రిటిష్ వలసవాదాన్ని తరిమేసి స్వాతంత్ర్యం సంపాదించుకున్న జింబాబ్వేలో పాలన కుటుంబ పాలనగా మారింది. మరోవైపు అంతర్జాతీయ ద్రవ్య సంస్థలకు రుణాల పేరిట దేశ సహజ వనరులను అప్పగించింది.

రాజకీయ నాయకుల దోపిడీతో కూడిన అప్రజాస్వామిక రాజకీయ వ్యవస్థ ఆర్థిక దిగజారుడుకు దారితీసింది. విదేశీ మారక ద్రవ్యం నిల్వలు తగ్గిపోయాయి. 2016 సెప్టెంబర్ నుంచి ఉద్యోగులకు బోనస్ చెల్లించలేదు. కొన్ని మాసాలుగా ఉద్యోగులకు జీతాలు చెల్లించలేదు. ధరలు ఆకాశానికి చేరడంతో ప్రజల జీవనస్థితి అయోమయంగా తయారైంది. ముగాబే స్థానంలో మ్నంగాగ్వాను అధ్యక్ష అభ్యర్థిగా అధికారపక్ష కేంద్ర కమిటీ ఎన్నుకుంది. ఇంతకాలం తిరుగులేని నేతగా ఉన్న ముగాబేను వద్దని కోరుకుంటున్న ప్రజలు మరో ప్రత్యామ్నాయం లేకనే మ్నంగాగ్వాను ఆహ్వానిస్తున్నారు. దేశాన్ని ఆర్థికంగా అతలాకుతలం చేయడంలో ముగాబే పాత్ర ఎంతో, ఇంతకాలం సమర్థిస్తూ వచ్చిన మ్నంగాగ్వాకు అందులో వాటా ఉంది. సోషలిస్టు సిద్ధాంతాలతో రాజకీయ జీవితం ప్రారంభించిన ముగాబే చరమాంకం ఇలా సైనిక తిరుగుబాటుతో ముగుస్తుందని ఎవరూ అనుకోలేదు. నమ్మే సిద్ధాంతం ఏదైనా నియంత పోకడలకు పోతే, వారసత్వ రాజకీయాలకు పాల్పడితే ప్రజలను విశ్వాసంలోకి తీసుకోకుండా పరిపాలన సాగిస్తే ఎంతటివారికైనా గడ్డు పరిస్థితులు ఎదుర్కోక తప్పదని వర్తమాన జింబాబ్వే హెచ్చరిస్తోంది. విముక్తి నేతగా నాలుగు దశాబ్దాలుగా తిరుగులేని ఆధిపత్యం చలాయించి కేవలం వారసత్వ అధికార రాజకీయాలను ప్రతిష్ఠించాలని చేసిన స్వయంకృతాపరాధంతో ఇలా అప్రతిష్ఠ పాలవ్వడం నిజంగా ఓ విషాదమే! ఇది దేశాధినేతలకూ, రాజకీయ నేతలకూ ఓ గుణపాఠం లాంటిదే! ప్రజాస్వామిక విలువలను కాలరాసే వారంతా ముగాబే పాలనను గుణపాఠంగా తీసుకోక తప్పదు.


– ఎ. నర్సింహా రెడ్డి

వీ







❖ **సాకిరేవు కతలు** – మూరిశెట్టి గోవింద్ – మల్లవరపు వెలువరింతలు – 128 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 120, ప్రతులకు: పూదోట శౌరీలు, 1-2-740, హనుమాన్ మందిరం దగ్గర, రాకాసిపేట, బోధన్ – 503180. నిజామాబాద్ జిల్లా, ఫోన్: 9010153505




❖ **నల్లూరన్న** – సంపాదకులు: సాకం నాగరాజు, కోట పురుషోత్తం – తిరుపతి మిత్రులు ప్రచురణ – 248 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 150, ప్రతులకు: కోట పురుషోత్తం, 9–66–15ఎ, న్యూ మారుతీ నగర్, తిరుపతి – 517502. సెల్: 7207301233



❖ **సెంద్రి తలపులు – వెన్నెల మొగ్గలు** – కవిత్వం – బుర్రా లక్ష్మీ నారాయణ – పాలపిట్ట బుక్స్ – 60, పేజీలు, 1/8 డెమీ, వెల రు. 50




❖ **ఇదీ వరస...!** – కవిత్వం – బుర్రా లక్ష్మీ నారాయణ – పాలపిట్ట బుక్స్ – 160, పేజీలు, 1/8 డెమీ, వెల రు. 100




❖ **సూర్యశిల–సన్‌స్టోన్** – మెక్సికన్ కవిత్వం – ఆక్టేవియో పాజ్, అనువాదం: నాగరాజు రామస్వామి – పాలపిట్ట బుక్స్ – 148, పేజీలు, 1/8 డెమీ, వెల రు. 100

పై మూడు పుస్తకాల ప్రతులకు: పాలపిట్ట బుక్స్, ఫ్లాట్ నం.2, బ్లాక్–6, ఎపిఎచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్ – 500 044. ఫోన్: 040 27678430 email:palapittabooks@gmail.com




❖ **కల్లోల దృశ్యం** – తెలంగాణ వ్యవసాయ సంక్షోభం – సంపాదకులు: అంబటి నాగయ్య – తెలంగాణ విద్యావంతుల వేదిక – 144 పేజీలు, 1/8 డెమీ, వెల రు.70, ప్రతులకు:




❖ **మరోసారి కారా కథల్లోకి** – కారాయజ్ఞం– సంపాదకులు: రమాసుందరి – 230 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 150, ప్రతులకు: కథా నిలయం, విశాఖ బ్యాంక్ ఎ కాలనీ, శ్రీకాకుళం–532001. సెల్: 9490008743; అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాల్లో




❖ **అరుణోదయం** – (కవితా సంపుటి) – అనూశ్రీ – 68 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 50, ప్రతులకు: మసున విఘ్నేష్, ఇ.నెం. 1333, భద్రావతి నగర్, సాయిబాబా మందిరం ఎదురుగా, న్యూ కన్నేరి, పద్మనగర్, భీవండి, జిల్లా ఠాణె, మహారాష్ట్ర–421 305; సెల్: 8097148235/9326312741




❖ **మూడు ముక్కలాట** – దేవులపల్లి కృష్ణమూర్తి – డికె ప్రచురణలు – 164 పేజీలు, 1/8 డెమీ, వెల రు.100, ప్రతులకు: 17/98, శ్రీశ్రీ మార్గం, నకిరేకల్, నల్గొండ జిల్లా – 508 211; ఫోన్: 92900 94015



❖ **వరకవి భూమగౌడు** (1875–1950) – వేముల ప్రభాకర్ – విరాట్ పబ్లికేషన్స్ – 244 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 200, ప్రతులకు: వేముల రోహిత్, అడ్వకేట్, ఫ్లాట్ నం. 103, మనస్విని హోమ్స్, రోడ్ నం. 6, అల్వాల్ హిల్స్, సికింద్రాబాద్ – 500010; ఫోన్: 7893819376



❖ **కూరాడు** తెలంగాణ కథ–2016 – సంపాదకులు: సంగిశెట్టి శ్రీనివాస్, వెల్దండి శ్రీధర్ – సింగిడి తెలంగాణ రచయితల సంఘం – 128 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 70, ప్రతులకు: సంగిశెట్టి శ్రీనివాస్, నందనవనం అపార్ట్‌మెంట్స్, ఫ్లాట్ నం. 212, అత్తాపూర్, మెహదిపట్నం, హైదరాబాద్ – 500 048; ఫోన్: 9849220321



❖ **సదసత్సంశయం**– సింగంపల్లి అశోక్‌కుమార్ – ఆలోచన ప్రచురణ–64 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 50 – ప్రతులకు: ఆలోచన 305, ప్రగతి టవర్స్, వీరయ్య స్ట్రీట్, మారుతినగర్, విజయవాడ–520 004; ఫోన్: 0866–6617375, 9246277375 email:srisri_sahityanidhi@yahoo.com



❖ **మార్క్సిజం మార్గం** – 3, అక్కినేని చంద్రరావు – 104 పేజీలు, 1/8 డెమీ, అమూల్యం, ప్రతులకు: అక్కినేని చంద్రరావు, 40–6–3/2, రెండవ అంతస్తు, సిద్ధార్థ పబ్లిక్ స్కూల్ ఎదురు రోడ్డు, మొఘలరాజపురం, విజయవాడ – 520 010, ఎ.పి.. సెల్: 9441406331 email:questforjustice.5@gmail.com




❖ **కార్టూన్లలో మార్క్స్** – రీయస్ – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 148 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 100

❖ **మనకు తెలియని యం.ఎస్.** – దేవదాసీ పుత్రిక నుంచి సంగీత సామ్రాజ్ఞి వరకు – టి.జె.ఎస్. జార్జ్ – అనువాదం: ఓల్గా – హైదరాబాద్ బుక్ ట్రస్ట్ – 240 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 150



పై రెండు ప్రతులకు: హైదరాబాద్ బుక్ ట్రస్ట్, ఫ్లాట్ నం. 85, బాలాజీనగర్, గుడిమల్కాపూర్, హైదరాబాద్ – 500 006. ఫోన్: 23521849 www.hyderabadbooktrust.blogspot.com



❖ **దణి** – హోసూరు కతలు – పల్లె పాటల కతలు – అగరం వసంత్ – కృష్ణగిరి జిల్లా తెలుగు రచయితల సంఘం – 208 పేజీలు, 1/8 డెమీ, వెల రు. 100, ప్రతులకు: డా. ఎన్. వసంత్, 2/1097, బస్తి, ఆవులపల్లి రోడ్డు, హోసూరు – 635 109, కృష్ణగిరి జిల్లా తమిళనాడు. ఫోన్: 09488330209

ఎవరివీ ప్రపంచ తెలుగు మహాసభలు?

గత ప్రభుత్వాల పద్ధతిలోనే తెలుగు మహాసభలు నిర్వహిస్తున్న తెలంగాణ ప్రభుత్వానికి సభలు నిర్వహించే నైతిక అర్హత ఉన్నదా అని ప్రశ్నిస్తున్నారు **ఎన్. వేణుగోపాల్**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 2017 డిసెంబర్ 15 నుంచి 19 వరకూ 'ప్రపంచ తెలుగు మహాసభలు' నిర్వహించబోతున్నది. తెలంగాణ సాహిత్య అకాడమీ ఆధ్వర్యంలో జరగబోయే ఈ సభల్లో తెలంగాణలోని తెలుగు భాషాభిమానులతో పాటు, ఇతర రాష్ట్రాల్లో, విదేశాల్లో స్థిరపడిన తెలుగు భాషా ప్రేమికులందరూ పాల్గొనాలని ప్రభుత్వం ఆహ్వానం పలికింది. "ఈ సభల సందర్భంగా నిర్వహించే సదస్సులు తెలంగాణ నుంచి వెలువడిన తెలుగు సాహిత్య ప్రక్రియలన్నిటిపైన కూలంకషంగా చర్చిస్తాయి. గత వైభవాన్ని ఘనంగా తలచుకుంటూనే వర్తమానాన్ని విశ్లేషిస్తాయి. భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశిస్తాయి. కొత్త పరిశోధనలకు నాంది పలుకుతాయి. ఈ సభల్లో ఏర్పాటు చేసే కళాప్రదర్శనలు రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని దర్శింపజేస్తాయి. ఖండాంతరాల నుంచి వచ్చిన సాహిత్య రసహృదయులందరూ ఒకచోటకు చేరటంతో వారి మధ్య పరస్పర సాహిత్య సంబంధాలు, సుహృద్భావనలు నెలకొంటాయి. కొత్త తరానికి తెలంగాణ తెలుగు సాహిత్య వారసత్వాన్ని పరిచయం చేయడంతో పాటు నూతన ఉత్తేజాన్ని, ప్రేరణను కలిగిస్తాయి" అని ముఖ్యమంత్రి శాసనసభలో చేసిన ప్రకటనలో అన్నారు.

తెలంగాణ రాష్ట్ర సమితి ప్రభుత్వం, నందిని సిధారెడ్డి అధ్యక్షుడుగా ఉన్న తెలంగాణ సాహిత్య అకాడమీ ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడం రెండు కారణాల వల్ల చర్చనీయాంశమవుతుంది. ఒకటి, ఒక రాజకీయ పార్టీగా తెలంగాణ రాష్ట్ర సమితి, ఆ పార్టీ అధ్యక్షుడు కె చంద్రశేఖర రావు, ప్రభావశీలమైన ప్రజాపక్ష కవిగా, తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షుడుగా నందిని సిధారెడ్డి గతంలో, తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ కాలంలో తెలుగు భావన పట్ల ప్రకటించిన వైఖరి. రెండు, గతంలో అదే పేరుతో జరిగిన ప్రపంచ తెలుగు మహాసభల పట్ల వారు తీసుకున్న వైఖరి.

తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో తెరాస అధ్యక్షులు కె చంద్రశేఖర రావు తెలుగు భాష గురించి, ఆంధ్ర పెత్తనం గురించి ఎన్నో వ్యాఖ్యలు చేశారు. "ఎవరి తెలుగు, ఎవరి తెలుగు తల్లి, తెలుగు తల్లా దయ్యమా" అని ఎన్నోసార్లు ప్రశ్నించి వివాదం రేపారు. ఆయన అనుసరించిన చాల మంది ఉద్యమకారులు కూడ తెలుగు అనే మాటే అభ్యంతరకరమైనదిగా చూశారు. చివరికి తెలంగాణ ఏర్పడిన తర్వాత కూడ పత్రికల్లో, ప్రసార సాధనాల్లో రెండు తెలుగు రాష్ట్రాలు అనే మాట వచ్చినా అభ్యంతరాలు వ్యక్తం చేస్తున్నారు. కవి నందిని సిధారెడ్డి కూడ తెలంగాణ ఏర్పడడానికి ముందు జరిగిన సభల్లో అనేకసార్లు తెలంగాణ తెలుగు, ఆంధ్ర తెలుగు వేరువేరు అని మాట్లాడారు. ఈ ధోరణి ఇంకా తీవ్రమై తెలంగాణ భాష తెలుగే కాదని అనేంతవరకూ సాగింది. తెలంగాణ మీద, తెలంగాణ ప్రజల మీద ఆంధ్ర ప్రాంత నాయకుల రాజకీయార్థిక ఆధిపత్యాన్ని వ్యతిరేకించడం, తెలంగాణ సంస్కృతి, చరిత్ర, భాషా సాహిత్యాల మీద ఆంధ్ర ప్రాంత పెత్తందారీ తనాన్ని వ్యతిరేకించడం అనే తప్పనిసరిగా తీసుకోవలసిన వైఖరి పరిధులు దాటి ఆంధ్ర ప్రాంత ప్రజలను, ఉమ్మడి భాషను, ఉమ్మడి వారసత్వ చరిత్రను, సంస్కృతిని, సాహిత్యాన్ని ఖండించడం దాకా ఇది సాగింది. ఈ నేపథ్యంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ సాహిత్య అకాడమీ "తెలుగు సభలు" జరపాలని, గత ప్రభుత్వాలు ఉపయోగించిన పేరునే, అదే పద్ధతిలో వాడుకోవాలని అనుకోవడం ఆశ్చర్యకరమే.

రెండవది, 'ప్రపంచ తెలుగు మహాసభలు' అనే మాట కొత్తది కాదు. గతంలో సమైక్య ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలు అనే పేరుతోనే 1975లో ప్రారంభించి 2012 వరకూ నాలుగు సార్లు (మొదటి ప్రపంచ తెలుగు మహాసభలు 1975 ఏప్రిల్ 12-18, హైదరాబాద్, రెండవ ప్రపంచ తెలుగు మహాసభలు 1981 ఏప్రిల్ 14-18, కౌలాలంపూర్, మలేషియా, మూడవ ప్రపంచ తెలుగు మహాసభలు 1990 డిసెంబర్ 10-13, మోకా, మారిషస్, నాలుగవ ప్రపంచ తెలుగు మహాసభలు 2012 డిసెంబర్ 27-29, తిరుపతి) ఇటువంటి మేళాలనే నిర్వహించింది. ప్రభుత్వ ప్రోత్సాహంతో ఇతరులు కూడ అదే పేరుతో ఎన్నో చోట్ల ఇటువంటి సభలను నిర్వహించారు. ప్రస్తుతం తెలంగాణ ప్రభుత్వం, తెలంగాణ సాహిత్య అకాడమీ అదే పేరుతో నిర్వహించబోతున్నాయంటే 2017 సభలు పాత సభలకు కొనసాగింపా, భిన్నమైనవా ప్రశ్నించవలసి వస్తున్నది. గతంలో జరిగిన 'ప్రపంచ తెలుగు మహాసభలు' తెలంగాణకు అన్యాయం చేసిన సమైక్యతకు చిహ్నంగా జరిగాయంటూ బహిష్కరించాలని పిలుపు ఇచ్చినవాళ్లే ఇవాళ ఆ పేరుతోనే సభలు జరపడం, వారు వీరయ్యారా, వీరు వారయ్యారా అని సందేహానికి తావు ఇస్తుంది.

పైగా గత సభల్లో మొదటి మహాసభలు కచ్చితంగా 1969 తెలంగాణ ఉద్యమ అపజయం తర్వాత, 1972 ఆంధ్ర, తెలంగాణ ఉద్యమ అపజయం తర్వాత, ఆంధ్ర పెత్తందార్ల విజయసూచకంగా జరిగాయి. ఆ సభల నాటికి తెలంగాణ సాహిత్యవాదులు స్పష్టమైన సంఘటిత రూపం తీసుకోలేదు గనుక తెలంగాణ వాదులవైపు నుంచి వాటిని బహిష్కరించాలనే మాట రాలేదు. కాని, ఆ తర్వాత రెండు ప్రపంచ మహాసభలు విదేశాల్లో జరిగి, నాలుగో మహాసభలు సరిగ్గా ఉధృతమైన తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ సమయంలో తిరుపతిలో జరిగాయి.

ఆ మహాసభలకు ప్రత్యేక నేపథ్యం తెలంగాణ ఉద్యమాన్ని వ్యతిరేకించడమే. అప్పటికే సాగుతున్న కుహనా సమైక్య ఉద్యమానికి మద్దతు పలకడమే. అందువల్లనే ఈ తిరుపతి మహాసభలను బహిష్కరించాలని, ఇవి సమైక్యవాదుల కుట్రపూరిత సభలని తెలంగాణవాదులందరూ పిలుపునిచ్చారు. (ఇప్పుడు ఆ తిరుపతి మహాసభలు ఎంత ఉజ్వలంగా జరిగాయో స్వయంగా తెలంగాణ ముఖ్యమంత్రి ప్రధాన పౌరసంబంధాల అధికారి రాస్తున్నారు!!) తెలంగాణ వాదులలో అధికార పీఠాలు ఎక్కినవారు ఇప్పుడు మాట మారుస్తుండవచ్చు గాని అప్పుడు మాత్రం తెరాస నాయకులతో సహా ఎందరో తెలంగాణ వాదులు ఆ తిరుపతి తెలుగు మహాసభలకు వ్యతిరేకంగా మాట్లాడారు, నిరసన ప్రదర్శనలు జరిపారు. తెలంగాణ జాగృతి సంస్థతో పాటు తెలంగాణ రచయితల వేదిక, తెలంగాణ జర్నలిస్టుల ఫోరం, తెలంగాణ ధూం ధాం వంటి ఎన్నో సంస్థలు బహిష్కరణ పిలుపునిచ్చాయి.

తెలంగాణ అనే ఏకైక అంశం వల్ల మాత్రమే కాదు, ప్రభుత్వాలను, పాలకవర్గాలను మొత్తంగా ధిక్కరించే, అసలు ఈ వ్యవస్థనే మార్చాలనుకునే విప్లవవాదులు కూడ ప్రపంచ తెలుగు మహాసభలను బహిష్కరించమని, తిరుపతి సందర్భంలో మాత్రమే కాదు మొత్తంగానే అంటూ వస్తున్నారు. సాహిత్యాన్నీ, సంస్కృతినీ, సాహిత్యకారులనూ లోబరచుకునే ప్రయత్నాలలో భాగంగానే పాలకవర్గాలు ఇటువంటి కార్యక్రమాలు నిర్వహిస్తాయనీ, ప్రజల పక్షం ఉన్నవారు వీటిని బహిష్కరించాలనీ విప్లవ రచయితల సంఘం మొదటి నుంచీ పిలుపునిస్తోంది. తొలి ప్రపంచ తెలుగు మహాసభలను బహిష్కరించమంటూ విప్లవ రచయితల సంఘం ప్రజలకు పిలుపునిచ్చింది.

"శ్రమజీవులకు వీసమెత్తు స్థానం లేని ప్రపంచ తెలుగు మహాసభలు కలవారి వినోద కార్యకలాపాలకు రంగస్థలం కావటంలో ఆశ్చర్యం లేదు. తెలుగువారిమధ్య విద్వేషాలు రెచ్చగొట్టడమే గాక తిరుగబడిన విద్యార్థుల్ని, సామాన్య ఉద్యోగుల్ని సమైక్యత పేరుతో నెత్తురుటేళ్లలో ముంచిన విషయం తెలుగు ప్రజల మనోఫలకాల నుండి ఇంకా చెరిగిపోలేదు. ప్రపంచచరిత్రలోనే అనూహ్యమైన, అసాధారణమైన ప్రతిభాసంపత్తులతో ప్రజల జీవనరాగాల్ని, పోరాటాల్ని గానం చేసిన సుబ్బారావు పాణిగ్రాహిని, ముక్కుపచ్చలారని పదునాలుగేళ్ళ బాల కళాకారుడూ, విప్లవకారుడూ అయిన చినబాబును, స్త్రీలోకం గర్వించే విధంగా ప్రజల కోసం ఆయుధాలు పట్టిన పంచాది నిర్మలను, అంకమ్మను, పద్మక్కనూ, స్నేహలతనూ పొట్టన పెట్టుకున్న ప్రభుత్వం ప్రపంచ తెలుగు మహాసభలు జరపడం మొగుణ్ణి కొట్టి మొగసాలకెక్కటమే. అనేక వందల మంది విప్లవకారుల్ని పిట్టల్లా కాల్చి చంపింది ఈ ప్రభుత్వమే. విప్లవ రచనల్ని నిషేధించి రచయితల్ని కుట్రకేసుల్లో ఇరికించి దీర్ఘకాల నిర్బ%ందానికి గురి చేసిందీ ఈ ప్రభుత్వమే కూటికిలేని కూలి నాలి జనాల నుండి నిర్బంధంగా డబ్బు వసూలు చేసి కోటికి పడగలెత్తిన వేయితలల విషపునాగైన ఈ ప్రభుత్వం తెలుగు సంస్కృతీ సాహిత్యాల గురించి మాట్లాడటం విడ్డూరాలలోకెల్లా విడ్డూరం....జాతి, భాష, సంస్కృతి, సాహిత్యం, కళలు వేటినీ అభివృద్ధి చేయని, చేయలేని కృత్రిమ వేషాల, వాగ్దానాల అంటురోగం నుండి బయటపడని ఎరువు తెచ్చుకున్న మోకాటి బుద్ధితో, బూర్జువా, భూస్వామ్య సంస్కృతికి నీరాజనం పడుతూ జరుపుతున్న ప్రపంచ తెలుగు మహాసభల్ని విప్లవ రచయితల స6ఘం నిర్ద్వంద్వంగా బహిష్కరిస్తోంది..." అని విరసం కార్యవర్గ తీర్మానం ప్రకటించింది. "బూర్జువా, భూస్వామ్య సంస్కృతికి కైవారాలు పలుకుతున్న ఈ సభల్ని బహిష్కరిస్తున్నాను" అని ప్రకటించిన శ్రీశ్రీ మహాసభలు జరుగుతున్న లాల్ బహదూర్ స్టేడియం ప్రధాన ద్వారం దగ్గర విరసం సభ్యులు చెరబండరాజు, ఎంటి ఖాన్, కాశీపతి, నగ్నముని, రంగనాథం, ఇతర ప్రజాసంఘాల కార్యకర్తలు మాధవరావు, తేజ్ రాజేందర్ సింగ్, విజయ, అరుణ, జలజ తదితరులతో నిరసన ప్రదర్శన జరిపారు. పోలీసులు వారందరినీ అరెస్టు చేసి ముప్పై ఆరు గంటల పాటు అక్రమంగా నిర్బంధించారు. ఆ తర్వాత రెండు మహాసభలు దేశంలో జరగలేదు. నాలుగో మహాసభ తిరుపతిలో జరుగుతుండగా విరసం మళ్లీ బహిష్కరణ పిలుపు ఇచ్చింది. సభా ప్రాంగణంలో నిరసన తెలపడానికి వెళ్తున్న విరసం నాయకులను మార్గమధ్యంలో రైళ్లలోంచి, బస్సుల్లోంచి దించి అరెస్టు చేశారు.

ఇంత ఘన చరిత్ర గల ప్రపంచ తెలుగు మహాసభలు పేరునే యథాతథంగా కొనసాగిస్తున్న తెలంగాణ ప్రభుత్వ ప్రయత్నం గత ప్రభుత్వ ప్రయత్నాల కన్న భిన్నంగా ఏమీ కనబడడం లేదు. సభల లక్ష్యాలుగా ప్రకటిస్తున్నవన్నీ గత సభలలో సమైక్య ప్రభుత్వాలు ప్రకటించినవే. అప్పటి లక్ష్యాలలో ఒకటైన సమైక్యత కూడ ఇప్పుడు వినబడుతున్నది. అప్పుడు తెలంగాణ సాహిత్య, సంస్కృతులను అణచివేసే, సమైక్యతను ప్రబోధించే లక్ష్యాలుగా కనబడినవి ఇప్పుడు గత వైభవాన్ని ఘనంగా తలచుకునేవిగా, వర్తమానాన్ని విశ్లేషించేవిగా, భవిష్యత్ కర్తవ్యాలను నిర్దేశించేవిగా కనబడుతున్నాయి. నామమాత్రపు ప్రదర్శనా వస్తువులుగా ప్రజాకళా రూపాలు కొన్నయినా ఉన్నాయి గాని, సాహిత్య చరిత్ర మాత్రం ముఖ్యమంత్రి ప్రసంగం వరకే చూస్తే దాశరథి, కాళోజీలతో ఆగిపోయింది (అది కూడ వారిద్దరిదీ నిజాం వ్యతిరేక పోరాట కవిత్వం అనకుండా!). ఆ తర్వాత గడిచిన ఏడు దశాబ్దాల తెలంగాణ సాహిత్య చరిత్ర ప్రస్తావనకైనా రాలేదు. అంటే ఇదంతా గత వైభవం గురించి చెప్పి మైమరిపించే సర్కసే తప్ప ప్రస్తుతమూ వర్తమానమూ కాదు. వర్తమాన జనజీవనం ఎలా ఉన్నదో, ఆ జనజీవనాన్ని చిత్రించడానికి, ప్రతిఫలించడానికి, విశ్లేషించడానికి, ఉన్నతీకరించడానికి సాహిత్యం ఏ కర్తవ్యాలను నిర్వహించవలసి ఉన్నదో చెప్పదలచుకుంటే పాలకుల దుర్మార్గాల గురించి చెప్పకతప్పదు. అందువల్ల పాలకుల కనుసన్నల్లో నడిచే ఈ సభలు వర్తమానం లేని గతాన్ని, శవాన్ని పూజించడమే తమ లక్ష్యంగా భావిస్తున్నాయి. ప్రజాకళలను వినోద వస్తువుగా, అలంకారంగా, కరివేపాకుగా చూపదలచాయి గాని ఆ కళల కాణాచి అయిన ప్రజల జీవితం ఎలా కునారిల్లిపోతున్నదో చూసే, చూపే చిత్తశుద్ధి, ఓపికా, సంయమనమూ ఈ సభలకు లేదు.

నిజానికి తెలుగు అనే భాష ప్రజలది. ఆ భాషలో ప్రజలు తమ సుఖ దుఃఖాలను గానం చేసుకుంటున్నారు. ప్రజలు తమ గతపు కడగండ్లనూ పోరాటాలనూ తలచుకుని, వర్తమానం దుర్భరత్వానికి చింతిస్తూ, భవిష్యత్తు కోసం కలలు గంటున్నదీ, ఆ కలలకు సాహిత్య, కళారూపం ఇస్తున్నదీ ఆ భాష లోనే. ఆ ప్రజలకు గాని, వారి భాషకు గాని, ఆ భాష పరిరక్షణకు గాని ఏ సహాయమూ అందించని, తమ

తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కాగ్ వ్యాఖ్యలు

గత ఆర్థిక సంవత్సరంలో పాలకులు చెపుతున్న తెలంగాణ ప్రభుత్వ ఆదాయ, వ్యయ వివరాలు, వాస్తవాలను పోల్చి చూస్తే తప్పుదోవ పట్టించే విధంగా ఉన్నాయన్న సత్యాన్ని కాగ్ నివేదిక వెల్లడించిందని అంటున్నారు **బి. రామకృష్ణ**

భారత ప్రజాస్వామిక వ్యవస్థకు మూల స్థంభాలనబడే సుప్రీంకోర్టు, ఎలక్షన్ కమిషన్, కంప్ట్రోలర్, ఆడిట్ జనరల్ (కాగ్), యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్లలో కాగ్ అత్యంత ప్రాధాన్యత కలదని అంబేద్కర్ చెప్పారు. సుప్రీంకోర్టుకు ఉన్న అధికారాల్లాగనే కాగ్ కు కూడా స్వతంత్ర అధికారాలు ఉంటాయి. ప్రజాధన సంరక్షణా ఉద్దేశ్యంతో ఏర్పడిన రాజ్యాంగ బద్ధమైన స్వతంత్ర సంస్థ కాగ్. రాజ్యాంగంలోని 148, 149, 150, 151 ఆర్టికల్స్ దీని గురించి వివరించాయి.

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజా ధనాన్ని ఎలా వినియోగిస్తున్నాయో కాగ్ వివరిస్తుంది. ఆదాయ వ్యయాలను అందులో జరిగే సద్వినియోగ, దుర్వినియోగాలను గణాంకాలతో బయటపెడుతుంది. కేంద్రానికి సంబంధించిన నివేదికను రాష్ట్రపతికి అందిస్తుంది. రాష్ట్రపతి దీనిని పార్లమెంట్‌లో ప్రవేశపెట్టేలా చూస్తారు. రాష్ట్రాలకు సంబంధించిన నివేదికను గవర్నర్‌కు అందిస్తుంది. గవర్నర్‌లు దీనిని ఆయా రాష్ట్రాల అసెంబ్లీలో ప్రవేశపెట్టేలా చూస్తారు. ప్రతి సంవత్సరం కాగ్ నివేదికను విడుదల చేస్తుంది.

కాగ్ అరిచేదే కాని కరిచేది కాదు. వివరాలను బయటపెడుతుందే కాని జరిగే దుర్వినియోగాలు, అక్రమాలపై చర్యలు తీసుకునే అధికారం దానికి లేదు. అది విడుదల చేసే నివేదికలోని వివరాలు ఆయా ప్రభుత్వాలలోని వివిధ శాఖలు అందించే రికార్డులపైన ఆధారపడి ఉంటాయి. ఆడిట్‌కు చిక్కకుండా తప్పు లెక్కలను, అక్రమాలను కప్పిపుచ్చే అవకాశాలను తోసిపుచ్చలేం. పలు శాఖలు రికార్డులను అందుబాటులో పెట్టని సందర్భాలు కూడా ఎన్నో ఉంటాయి.

కాగ్ వెలువరించిన నివేదికల వల్ల దేశంలో బోఫోర్స్, బొగ్గు (కోల్‌గేట్), టెలికాం(2జి) వంటి కుంభకోణాలు బయటపడ్డాయి. కాగ్ నివేదికలను పాలక పక్షాలు పట్టించుకోవు. ఇవి ప్రతిపక్షాలకు, పాలక పక్షాలను తప్పుపట్టడానికి ఉపయోగపడుతుంటాయి.

స్వార్థప్రయోజనాలే, తమ ఆశ్రితుల ప్రయోజనాలే పరమావధిగా భావిస్తున్న ప్రభుత్వానికి తెలుగు మహాసభలను నిర్వహించే నైతిక అర్హత లేదు. తెలంగాణ ప్రజలు ఆరు దశాబ్దాలుగా ఏ ఆకాంక్షలతో, ఏ కలలతో స్వరాష్ట్రం కోరుకున్నారో, ఉద్యమించి, అపారమైన త్యాగాలు చేశారో, ఆ ఆకాంక్షలనూ, కలలనూ, ఉద్యమ సంప్రదాయాలనూ, త్యాగాలనూ నిరంకుశంగా కాలరాస్తున్న ప్రభుత్వానికి, పాలకవర్గాలకు ప్రజల భాష పేరు మీద సభలు జరిపే నైతిక అర్హత లేదు. నీళ్లు, నిధులు, నియామకాలు, ఆత్మగౌరవం, స్వయంనిర్ణయాధికారం అనే మౌలిక ఉద్యమ ఆకాంక్షలను విస్మరించి అన్ని రంగాల్లో, అన్ని స్థాయిల్లో పాత ఉమ్మడి రాష్ట్రపు నిరంకుశ, దోపిడీ, పీడన పద్ధతులనే అమలు చేస్తున్న ఈ ప్రభుత్వానికి ప్రజల భాష గురించి సభలు జరిపే నైతిక అర్హత లేదు. దళితుడే ముఖ్యమంత్రి, భూమిలేని నిరుపేద దళిత కుటుంబాలకు మూడు ఎకరాల భూమి, కెజి నుంచి పిజి ఉచిత విద్య, ఓపెన్ కాస్ట్ గనుల తవ్వకం ఆపివేత, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలు రద్దు చేసి, పూర్తిస్థాయి నియామకాలు జరపడం వంటి లెక్కలేనన్ని హామీల విషయంలో వాగ్దాన భంగం చేసిన ఈ ప్రభుత్వానికి తెలుగు భాష పరిరక్షణ అనే మరొక హామీ మీద సభలు జరిపే నైతిక అర్హత లేదు. దేశదేశాల దోపిడీదార్లకు ఎర్రతివాచీ ఆహ్వానాలు, రాష్ట్ర ప్రజల వనరుల అప్పగింత, అసంఖ్యాక రైతుల ఆత్మహత్యలు, ఇబ్బడిగా ముబ్బడిగా పెరిగిన రుణభారం, కనీస వాక్సభా స్వాతంత్ర్యాలతో సహా అన్ని పౌరహక్కుల ఉల్లంఘన, బూటకపు ఎన్ కౌంటర్లు, దళితులపై, ఆదివాసులపై దాడులు వంటి ఏ అంశం చూసినా కనీస ప్రజాస్వామ్యాన్ని, ప్రజాపక్షపాతాన్ని చూపని ఈ ప్రభుత్వానికి ప్రజల భాష గురించి సభలు జరిపే నైతిక అర్హత లేదు. తెలంగాణ కోసమే ఆలోచించి, తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న శ్రుతి వంటి విద్యాధిక యువతిపై అత్యాచారం చేసి చంపిన ఈ ప్రభుత్వం, వివేక్ వంటి ముక్కుపచ్చలారని విద్యార్థికుడిని కాల్చిచంపిన ఈ ప్రభుత్వం, తెలంగాణ కోసమే ఆడి, పాడిన కళాకారుడు ప్రభాకర్ కు స్థానికులు స్తూపం నిర్మించదలచుకుంటే అడ్డుకుని, బంధుమిత్రులను నిర్బంధించిన ఈ ప్రభుత్వం, కవి, రచయిత కాశీంపై, తెలంగాణ విద్యార్థి నాయకుడు మహేష్ పై అబద్ధపు కుట్రకేసులు బనాయించిన ఈ ప్రభుత్వం ప్రజల భాషనూ, సంస్కృతినీ కాపాడడానికే ఈ సభలు జరుపుతున్నదని ఎవరైనా అనుకుంటే వారి అమాయకత్వానికి జాలి పడడం కన్న చేయగలిగింది లేదు.

రొట్టె ఇవ్వకుండా ఉండడానికి సర్కస్ ఇవ్వు అని ఇంగ్లిష్ సామెత చెప్పినట్టు, ప్రజల ఆకాంక్షలకు ద్రోహం చేసిన, చేస్తున్న ఈ పాలకవర్గాలు ప్రజల దృష్టి మళ్లించడానికి ఏర్పాటు చేస్తున్న సర్కస్ ఈ తెలుగు మహాసభలు. ఉమ్మడి రాష్ట్ర పాలకులు కూడ అవసరం వచ్చినప్పుడల్లా ఇటువంటి సర్కస్ లు ఎన్నో నిర్వహించారు. ఆ అనుభవంతో, రెండాకులు ఎక్కువ చదివినట్టుగా ఈ పాలకులు మరొక కొత్త సర్కస్ నిర్వహిస్తున్నారు.

(రచయిత వీక్షణం సంపాదకులు) వీ

గమ్మత్తేమంటే కాగ్ నివేదికను అసెంబ్లీలో బడ్జెట్ సమావేశాల చివరి రోజున చివరి సెషన్‌లో ప్రవేశపెడతారు. వాటిని చదివి చర్చించే అవకాశమే ఉండదు. తెలంగాణలో 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కాగ్ నివేదికను 2017 మార్చ్ 26న అసెంబ్లీలో ప్రవేశ పెట్టారు. మరునాటి నుండి అసెంబ్లీ వాయిదాపడింది. వివిధ శాఖలు అధికారికంగా అందించిన వివరాలతో తయారైన ఈ నివేదికలోని విషయాలను పరిశీలిస్తే తెలంగాణ ప్రభుత్వం డొల్లతనం తేటతెల్లం అవుతుంది. బయటకు ప్రచారం చేస్తున్న వాటిలో అవాస్తవాలేమిటో బోధపడుతుంది. బడ్జెట్ కేటాయింపులు, వాటి వినియోగంలో అశ్రద్ధ అలసత్వాలను, అవినీతికి ఆస్కారమిచ్చిన అవకాశాలను ఈ నివేదికలో చూడవచ్చు.

మార్చ్ 2016లో ముగిసిన 2015-16 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఆర్థిక, సామాజిక, రెవెన్యూ, స్థానిక సంస్థలు, ప్రభుత్వ రంగ సంస్థలపై కాగ్ తన పరిశీలనలను చెప్పింది. వివిధ శాఖలకు కేటాయించిన నిధులు, వాటి ఖర్చు, ఆదాయ వనరుల అంచనా, వాస్తవ ఆదాయ రాబడులకు సంబంధించిన లెక్కలను నివేదికలో పొందు పరిచింది. దీని ప్రకారం 2015-16 ఆర్థిక సంవత్సరం బడ్జెట్ 1,39,360 కోట్లు కాగా ఖర్చు చేసింది 1,04,098 కోట్లు. అంటే 25 శాతం నిధులు ఖర్చు చేయబడలేదు.

వ్యయాలపై పర్యవేక్షణ నియంత్రణ బలహీనంగా, బడ్జెట్ అంచనాలు వాస్తవ దూరంగా ఉన్నాయని కాగ్ తెలిపింది. శాసనసభ, శాసన మండలుల అనుమతి లేకుండానే 5,881 కోట్లు అదనంగా ఖర్చు చేశారు. వివరాలు లేకుండానే 55 కోట్లు గంప గుత్తగా కేటాయింపులు జరిగాయి. బడ్జెట్ అంచనాలు వాస్తవ విలువల్లో చాలా వ్యత్యాసాలు ఉన్నాయి. ఇతర రాష్ట్రాలతో పోలిస్తే రాష్ట్రాభివృద్ధి, వ్యయ నిష్పత్తి అధికంగా ఉంది. అయినప్పటికీ విద్యకు సంబంధించి ఇతర రాష్ట్రాల సగటు కంటే తక్కువగా ఖర్చు చేసింది. మొత్తం రాబడిలో విద్యకు 5.64 శాతం వైద్యానికి 1.98 శాతం చెల్లించారు.

దారిద్ర్యరేఖకు దిగువన ఉన్నవారికి గ్రామీణ ప్రాంతంలో 36,000 డబుల్ బెడ్ రూం ఇల్లు కట్టియ్యాలని అందుకు రు. 391.67 కోట్లుస అలాగే పట్టణ ప్రాంతాలలో 2400 కట్టించాలని అందుకు రు. 7.29 కోట్లు మాత్రమే బడ్జెట్‌లో కేటాయించారు. అయితే గ్రామీణ ప్రాంతాలకు సంబంధించి రు. 32.31 కోట్లను విడుదల చేసి మిగతా రు. 359.36 కోట్లు దారి మళ్లించారు. విడుదల చేసిన రు. 32.31 కోట్లను సహితం ఖర్చు చేయలేదు. మొత్తంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో డబుల్ బెడ్ రూం ఇళ్ల నిర్మాణం చేపట్టలేదు. డబుల్ బెడ్ రూం ఇళ్ల గురించి పేదలకు ఎంతో మేలు చేస్తున్నామని ప్రచారం చేసుకునే ప్రభుత్వం ఒక్క అడుగు ముందుకు వేయలేదు. అమలు పట్ల శ్రద్ధ చూపలేదు. ప్రచారార్భాటాలు తప్ప పేదల సంక్షేమంపై చిత్తశుద్ధితో పనిచేసింది లేదని తెలిపోతున్నది.

భారత ప్రభుత్వ పథకం సర్దార్ పటేల్ అర్బన్ హౌసింగ్ స్కీమ్ కింద పట్టణ పేదలకు 2,709 ఇళ్ల కోసం రు. 149.04 కోట్లు కేటాయించారు. కాని కేంద్రం విధి విధానాలు నిర్ణయించని కారణంగా ఈ పథకం వృధా అయింది. షెడ్యూల్డ్ కులాల వారి సామాజిక ఆర్థిక అభివృద్ధి కొరకు 41,297 లబ్దిదారులకు వివిధ పథకాల కింద రు. 1,005.10 కోట్ల బడ్జెట్ కేటాయించగా ప్రభుత్వం రు. 500 కోట్లనే విడుదల చేసింది. దీంట్లో నుండి షెడ్యూల్డ్ కులాల సహకార అభివృద్ధి సంస్థ 250 కోట్లను తీసుకుని రు. 114.52 కోట్లను ఖర్చుచేయడం ద్వారా 10 శాతం లబ్దిదారులకు (4,248) మాత్రమే ప్రయోజనం చేకూరింది. కేటాయించిన మొత్తంలో దాదాపు 75 శాతం నిధులు వినియోగించకపోవడం అనేది షెడ్యూల్డ్ కులాల పట్ల ప్రభుత్వానికి గల శ్రద్ధను తేటతెల్లం చేస్తున్నది. అరోగ్యలక్ష్మి పథకం కింద గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులు, 7 నెలల నుండి 6 సం. పిల్లలకు మొత్తంగా 22,51,883 మందికి ఒక పూట భోజనం అందివ్వడానికి గాను రు. 325.77 కోట్లు కేటాయించారు. దీంట్లో రు. 309.72 కోట్లు విడుదల చేశారు. 77 శాతం ఖర్చు చేశారు.

పోషకాహార పథకం కింద గర్భిణీలకు పాలిచ్చే తల్లులకు, 7 నెలల నుండి 3 సంవత్సరాల, 3 నుండి 6 సంవత్సరాల పిల్లలకు, సంబంధించి 22,51,883 మందికి పోషకాహారాన్ని అందించడం కొరకు 412.74 కోట్లు కేటాయించారు. రు. 326.86 కోట్లు విడుదలచేసి రు. 248 కోట్లు అంటే కేటాయించిన మొత్తంలో 60 శాతం మాత్రమే ఖర్చుచేశారు.

ప్రారంభిక్ శిక్షాకోడ్ పథకం పేరుతో కేంద్ర ప్రభుత్వం సర్వశిక్ష అభియాన్, మధ్యాహ్న భోజన పథకాల కోసం రు. 245.75 కోట్లు కేటాయించింది. విధి విధానాలు లేనందున కేటాయించిన మొత్తం నిధులు ఖర్చు చేయబడలేదు. డ్వాక్రా మహిళలకు వడ్డీలేని రుణాల పథకం కింద రు. 197.34 కోట్లు కేటాయించారు. ఇది చాలా చిన్న మొత్తం కావడం వల్ల గత రుణాల చెల్లింపులకే సరిపోయింది. ఫలితంగా ఆశించిన ప్రయోజనం నెరవేరలేదు.

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన పథకం కింద రైతులకు లబ్ది చేకూర్చ దానికి రు. 192.26 కోట్లు కేటాయించగా విడుదల చేసింది రు. 148.88 కోట్లు. ఇందులోనూ రు. 64.45 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు.

స్మార్ట్ సిటీ పథకం అభివృద్ధి కోసం బడ్జెట్‌లో రు. 183.46 కోట్లు కేటాయించారు. ఏ ఒక్క పైసా ఖర్చు కాబడలేదు.

తెలంగాణకు హరితహారం పథకంలో భాగంగా వృక్ష భూభాగాన్ని 25.16 శాతం నుండి 33 శాతంకు పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. దీన్ని సాధించడానికి రు. 300 కోట్లు కేటాయించారు. రు. 166.38 కోట్లు విడుదల చేశారు. రు. 155.92 కోట్లు మాత్రమే ఖర్చు చేశారు. 1.68 కోట్ల మొక్కలు నాటాల్సి ఉండగా 1.28 కోట్లు మాత్రమే నాటారు. కేటాయించిన దాంట్లో రు. 10.46 కోట్లు ఖర్చు చేయలేదు.

స్వచ్ఛ భారత్ గ్రామీణ మిషన్ కింద కేంద్ర, రాష్ట్రాలు 75:25 వాటాతో మొత్తం రు. 171.18 కోట్లు కేటాయించారు. పాఠశాలల్లో అలాగే పేదలకు వ్యక్తిగత మరుగుదొడ్లు మొత్తంగా 6,86,842 నిర్మించాలనే లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే 2,40,193 అంటే 35 శాతం మేరకు నిర్మాణాలు జరిగాయి. డబ్బు ఖర్చయింది గాని అనుకున్నన్ని మరుగుదొడ్లు నిర్మించబడలేదు.

షెడ్యూల్డ్ కులాల సబ్ ప్లాన్ కింద కేటాయించిన దాంట్లో 48 శాతం, షెడ్యూల్డ్ తెగల సబ్‌ప్లాన్‌కు కేటాయించిన దాంట్లో 49 శాతం మాత్రమే ఖర్చు చేశారు. సగానికి పైగా కేటాయించిన నిధులు నిరుపయోగం అయ్యాయంటే ఎస్‌సి, ఎస్‌టిల అభివృద్ధికై ప్రభుత్వం చూపే చొరవ ఏపాటిదో అర్థం చేసుకోవచ్చు.

పంచాయతీరాజ్ శాఖకు మొత్తం రాష్ట్ర బడ్జెట్‌లో 8.71 శాతం అంటే రు. 12,140.15 కోట్లు కేటాయిస్తే అందులో సగం ఖర్చు చేయలేదు. అలాగే భారీ, మధ్యతరహా నీటి పారుదలకు సంబంధించి 9.7 శాతం నిధులు కేటాయించగా 37 శాతం నిధులు వినియోగించనే లేదు. 52 వేల ఎకరాలకు నీరు అందించాల్సి ఉండగా 13,900 ఎకరాలకు మాత్రమే అందించారు.

మందులు, వైద్య పరికరాలు కొనుగోళ్లకు కేటాయించిందే తక్కువ దాంట్లోనూ 40 శాతం నిధులు ఖర్చు కాలేదు. 635 నిత్యావసర మందులను గుర్తించగా 237 మందులను సమకూర్చుకోలేదు. 197 కొనుగోలు ఆర్డర్‌ల అనుమతులు లేవు. ఫలితంగా అత్యవసర మందుల సరఫరా తగ్గిపోయి రోగులకు ఇబ్బంది కలుగుతున్నది. మందుల కొనుగోళ్లలో పారదర్శకమైన రేటు కాంట్రాక్టు విధానాన్ని పట్టించుకోలేదు. ఫలితంగా కాంట్రాక్టర్లకు అనుచిత లబ్ది కలిగింది. వైద్య పరికరాల కొనుగోళ్లలో అవకతవకలు జరిగాయి. క్వాలిటీ కంట్రోల్ పరీక్షలు జరపడంలో జాప్యం జరిగింది. వైద్య పరికరాల కొనుగోళ్లు వాటి సరఫరాల్లో జాప్యం జరిగింది.

గురుకుల పాఠశాలల్లో గుణాత్మక, పరిమాణాత్మక మౌలిక వసతులు సిబ్బంది కొరత మూలంగా 2013-16 సంవత్సరాలలో ఉత్తీర్ణత క్రమంగా తగ్గుతూ వస్తున్నది. తరగతి గదులు, భోజనశాలలు, వంట గదులు, పడక గదులు, మరుగుదొడ్లు, స్నానాల గదులు, సిబ్బందికి క్వార్టర్లు ఫర్నీచర్, సురక్షిత తాగునీరు మొదలగు వసతులు లోపించాయి. తనిఖీలపై దృష్టి పెట్టలేదు. ఫలితంగా విద్యార్థుల్లో/విద్యా సంస్థల్లో అకడమిక్ సాధన స్థాయి తగ్గిపోవడం జరిగింది. గురుకుల విద్యా సంస్థల్లో అంచనాలకు, వాస్తవ పరిస్థితులకు మధ్య తేడాలున్నాయి. కొన్ని సంస్థలకు స్థలాలు కేటాయించలేదు. కేటాయించిన నిధులను ఖర్చు చేయడంలో లోపాలున్నాయి.

నిర్వాసితుల విషయంలో పునరావాస, పునర్నిర్మాణ పనులు జరుగలేదు. జరిగిన చోట విపరీతమైన జాప్యం వల్ల ప్రాజెక్టులు నిర్ణీత సమయంలో పూర్తి కావడం లేదు. ఒప్పంద సమయంలో తగిన మార్పులు చేయకుండా ప్రాథమిక పరిమితులలో మార్పులను అంగీకరించిన సందర్భాలు ఉన్నాయి. ఫలితంగా ఆయా కాంట్రాక్టర్లకు, నిర్మాణ సంస్థలకు అయాచిత లబ్ది చేకూరడానికి దారి తీసింది. నీటి ప్రాజెక్టుల నిర్మాణానికి కేటాయించిన నిధులలో ఖర్చు పెట్టింది తక్కువ. తద్వారా గ్రాంట్లుగా వచ్చే రు.224.56 కోట్లు తగ్గిపోయాయి.

వర్షపాతం, వర్షపునీటి ప్రవాహాల మధ్య నిష్పత్తిని వర్తింపచేయడంలో వరద ప్రవాహాలను సమీక్షించడంలో కేంద్ర జల సంఘం చేసిన సిఫార్సులను పాటించలేదు. ప్రాజెక్టుల్లోని విశ్వసనీయమైన నీటి లభ్యతను లెక్కించడంలో శాస్త్రీయత లేకుండా పోయింది.

సత్వర సాగునీటి ప్రయోజనం కోసం ఉద్దేశించబడిన నీల్వాయి, గొల్లవాగు, జగన్నాథ్ పూర్ వద్ద పెద్ద వాగులకు అన్ని గ్రాంట్లు అందుతున్నప్పటికీ 11 సంవత్సరాల తరువాత కూడా ఇంకా పనులు పూర్తికాకుండా ఉన్నాయి. అన్ని ప్రాజెక్టుల్లోను ఏటా వ్యయంలో రు. 319 కోట్ల మిగులు ఉన్నది. 5 ప్రాజెక్టులు పూర్తిచేసే లక్ష్యం పెట్టుకున్నారు. కాని 2 ప్రాజెక్టులే పూర్తయ్యాయి. నీటి పారుదల, రహదారుల రంగాలలో పనుల ఆలస్యం, వల్ల కేటాయింపులు పెరిగాయి. మాటలకు వాస్తవాలకు అంతరం భారీగా ఉన్నది. వాస్తవ వినియోగ పత్రాలు ఇవ్వకుండానే నిధులను విడుదల చేశారు.

ఉచిత కరెంటు అందించే విషయంలో లోపాలు జరిగాయి. రోజుకు 7 గంటల విద్యుత్‌కు సంబంధించి సబ్సిడీలు చెల్లించినప్పటికీ సంబంధిత కంపెనీలు 6 గంటల లోపే విద్యుత్ సరఫరా చేశాయి. ఉచిత కరెంటుకు సబ్సిడీగా రు. 8,237 కోట్లు చెల్లించగా రు. 1,176 కోట్లు ఉపయోగపడలేదు. నార్తర్న్ పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ చేసిన తప్పుల వల్ల రు. 1,077 కోట్ల నష్టం వచ్చింది. 2011-16 సంవత్సరాల్లో అనుమతికి మించిన కనెక్షన్లకు గాను విద్యుత్ సరఫరా జరిగింది. సదరు ఖర్చును ప్రభుత్వానికి సకాలంలో నివేదించకపోవడం వలన వెయ్యికోట్ల నష్టం వచ్చింది.

అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వ నియంత్రణ, అత్యంత బలహీనంగా ఉన్నది. అజమాయిషీ కొరవడింది. పంట రుణాల మాఫీ బాధ్యత పూర్తిగా బ్యాంకులకే అప్పగించడం వల్ల అవకతవకలు జరిగాయి.

దళితులకు 3 ఎకరాల భూపంపిణీ, స్వయం ఉపాధికి సంబంధించి 41,297 మందికి లబ్ది చేకూరేలా ఒక వెయ్యి కోట్లు కేటాయించారు. కేవలం 10 శాతం మందికి మాత్రమే లబ్ది చేకూరింది. ఈ మొత్తంలో చాలా వరకు నిధులు మురిగిపోయాయి.

కేంద్రం నుండి రు. 12,400 కోట్లు గ్రాంట్లుగా వస్తాయని అంచనా వేస్తే రు. 9,394 కోట్లు మాత్రమే వచ్చాయి.

ప్రవేశపెట్టిన పథకాలకు సంబంధించి విధానపర నిర్ణయాలు తీసుకోవడంలో వైఫల్యం చెందారు. పాలనాపరమైన అనుమతులు లేక కేటాయించిన నిధులను విడుదల చేయకపోవడం వల్ల పథకాలు అమలు కావడం లేదు. వివిధ పథకాలకు కేటాయించిన నిధులను వినియోగించ దంలో విఫలం అవుతున్నారు. కేటాయించిన నిధుల్లో మొత్తాన్ని విడుదల చేయకుండా తక్కువగా విడుదల చేశారు. ఆ తక్కువ నిధుల్లో పూర్తిగా ఖర్చు చేయకుండా కోతలు పడుతున్నాయి. దీనినే కాగ్ నివేదికలో స్పష్టంగా చూడవచ్చు. ఓ వైపు అభివృద్ధి ఫలాలు అందవల్సిన ప్రజానీకం ఎంతోమంది ఉండగా అందుకోసం కేటాయించిన నిధులేమో అరకొరగా ఉంటున్నాయి. ఆ అరకొర నిధులనైనా పూర్తిస్థాయిలో విడుదల చేశారా అంటే అదీలేదు. పోనీ విడుదలైన వాటిని పూర్తిగా ఖర్చు పెడతారా అంటే అదీలేదు. ఈ ఖర్చు చేసిన విషయంలో సహితం చేతులు మారకుండా, చేతులు తడపకుండా సరిగ్గానే అనుకున్న లక్ష్యాలను నెరవేర్చేలా సక్రమంగా వినియోగించారా అనేది ఆలోచించాల్సిన విషయమే.

ఎన్నో అస్తవ్యస్తాలను బయటపెట్టిన కాగ్ నివేదికపై చట్టసభల్లో చర్చలులేవు. ఆ నివేదిక వెల్లడించిన విషయాలపై చట్టాల దుర్వినియోగా లపై, అతిక్రమణలపై ఎలాంటి చర్యలు లేవు. అధికార పాలకవర్గాల దుష్ట నీతిని అధికారిక లెక్కల ద్వారానే బయటపెట్టిన కాగ్ నివేదిక ప్రజల పక్షం నిలిచే సంస్థలకు ఒక రెఫరెన్స్‌గా ఉంటుంది. ఎన్నో పరిమితులకు లోనైనాసరే స్వతంత్ర రాజ్యాంగబద్ద సంస్థ కాగ్ వెలుగులోకి తెచ్చే అనేక అక్రమాలను, పాలన పరమైన లోపాలను, నిధుల దుర్వినియోగాలను సరిదిద్ది వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ప్రభుత్వాలు సుముఖంగా లేవు. ఇక వారికి ప్రజాస్వామ్యంపై ఏపాటి గౌరవం ఉందో చెప్పకనే చెబుతున్నట్లుగా ఉంది.

వీ

(రచయిత ఉపాధ్యాయులు)

అధికార వ్యామోహం, అవకాశవాదమే పునరేకీకరణా?

తెలంగాణలో రాజకీయ పునరేకీకరణ విధానాల మార్పు కోసం, ప్రజల ప్రయోజనం కోసం కాదనీ, అధికారాన్ని అడ్డం పెట్టుకొని వనరులను పంచుకోవడానికేననీ అంటున్నారు **బైరెడ్డి సతీష్**

తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తొలినాళ్లలోనే రాజకీయ పునరేకీకరణ జరుగుతుందని టి.ఆర్.ఎస్. నాయకత్వం పదేపదే ప్రకటించింది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమంలో ఏకైక రాజకీయ పార్టీగా నిలబడడం ఉద్యమంలో అనేక ప్రజా సంఘాలతో కలిసి నడిచిన అనుభవం వల్ల తెలంగాణ ప్రజాజీవితపు అవగాహన ఆ పార్టీకే ఉంటుందని ప్రజలు వారికి అధికారం అప్పగించారు. నిజానికి మిగతా పార్టీలతో పోల్చితే టి.ఆర్.ఎస్. వ్యవస్థాగత నిర్మాణం అంత పటిష్టంగా లేకపోవడం వల్ల ఆ దిశగా దృష్టి సారించి బలోపేతం చేసుకోవాలనే ఉద్దేశ్యంతోనే అలా ప్రకటించారు. తెలంగాణ ఎజెండా తప్ప మిగతా ఏ విషయాల్లోనూ కూడా అప్పటికే ఉన్నటువంటి రాజకీయ పక్షాలకి టి.ఆర్.ఎస్.కి సైద్ధాంతికంగా, అభివృద్ధి నమూనా పరంగా ఏలాంటి వైరుధ్యమూ లేదు.

ఉద్యమ సమయంలో టి.ఆర్.ఎస్.లో చేరిన వారంతా తెలంగాణ ప్రజలను ప్రేమిస్తూనో, వారి పక్షాన నిలబడి తెలంగాణ సాధించడం వల్ల ప్రజాజీవితంలో ఏదో గుణాత్మకమైన మార్పు తెద్దామని కాదు కానీ ప్రజల ఆకాంక్షను రాజకీయంగా సొమ్ముచేసుకోవడానికే అనేది వాస్తవం. సహజంగా అధికారమనే ఆకర్షణ ఉన్నప్పుడు అన్నిదారులు అటువైపుగానే ఉంటాయి. రాజకీయాలు అనగానే అధికారం అనే అవగాహన కంటే ఎక్కువ పరిధిని చూసేవాళ్లు కూడా పెద్దగా లేరు. ఏ సమాజపు అస్తవ్యస్థతనైనా సృజనాత్మకంగా, క్రియాత్మకంగా పరిష్కరించి దాని రూపురేఖల్ని సమూలంగా మార్చివేయగలిగే శక్తి రాజకీయ వ్యవస్థకుంటుందనే విశాలమైన అవగాహన కంటే ప్రజలపైన పెత్తనం చెలాయించడమే రాజకీయాల లక్ష్యమనుకునే సమూహాలే అధికార రాజకీయాల పంచన చేరుతాయి. సరిగ్గా టి.ఆర్.ఎస్. చెబుతున్నటువంటి పునరేకీకరణకు ఇలాంటి అర్థమే ఉన్నది. తెలంగాణ రాష్ట్ర ఉద్యమ పొడగిట్టనివారు, ఉద్యమాన్ని తీవ్రంగా వ్యతిరేకించి ఉద్యమకారులపై నిర్బంధాన్ని అమలు చేసిన వారంతా 'పునరేకీకరణ' అవుతున్నారు.

ఒకవైపు తెలంగాణ ఉద్యమానికి నాయకత్వం అందించినవాళ్లు నిత్య నిర్బంధానికి గురౌతుంటే, నిరుద్యోగులు ఆత్మహత్యలు చేసుకుంటుంటే ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయాలని చూసిన వారంతా పదవుల్లోకి దూరి ప్రజలపై పెత్తనం చేస్తున్నారు. భిన్నమైన జెండాలు, ఎజెండాల మీద గెలిచిన వారంతా అధికార పక్షంవైపే అడుగులేస్తున్నారు. పార్టీ ఫిరాయింపుల చట్టాలు చట్టుబండలైపోయినవి. కొత్త రూపంలో ఈ నీచ రాజకీయాల అవినీతి కొనసాగుతున్నది. పైసలిచ్చి ఎదుటి పక్షం ఎం.ఎల్.ఎ.లను కొంటేనేమో అవినీతి, పదవులిచ్చి కొనుక్కుంటేనేమో రాజకీయ పునరేకీకరణ! అవినీతి అంటే ఆర్థిక వ్యవహారాలకు సంబంధించిన అంశానికి మాత్రమే సంబంధించింది కాదు, అక్రమంగా ఎదుటివాళ్లను ఆపరేషన్ల పేరుతో చేసే 'నీటు' వ్యవహారం కూడా నీతిలేని చర్యనే అవుతుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ప్రభుత్వాన్ని నడిపిన కాంగ్రెస్‌లోకి ఆనాటి టి.ఆర్.ఎస్. ఎం.ఎల్.ఎ.లను ఎగురేసుకపోతే అది తెలంగాణ ఉద్యమాన్ని బలహీనపర్చే రాజకీయ దుర్మార్గమని పదేపదే ప్రచారం చేసింది టి.ఆర్.ఎస్. ఆ విషయంలో కోర్టు తలుపులను సైతం తట్టింది. ఇవాళ అధికార పక్షంలో ఉన్న పార్టీలు కొత్త ఎత్తుగడలతో వారి ఆపరేషన్లను సమర్థించుకుంటున్నాయి. పార్టీ ఫిరాయింపుదారుల నీతిమాలిన చర్యను స్పీకర్ పరిధిలోని అంశమంటూ ఏ నిర్ణయం తీసుకోకుండా అధికారాంత కాలందాక సాగదీస్తున్నారు. అదే కాంగ్రెస్ పాలనలో స్పీకర్ ఏ నిర్ణయం తీసుకోకపోతే స్పీకర్‌ను దుమ్మెత్తిపోసిన వాళ్లంతా ఇవాళ ఏమీ మాట్లాడడం లేదు. స్పీకర్ పరిధిలోని అంశం కోర్టులు జోక్యం చేసుకోజాలవు అనే వాదన వినిపిస్తున్నారే కానీ తామూ గతంలో అదే చేశామని, తమ చర్యలు అనైతికమనో, అక్రమమనో అంగీకరించట్లేదు.

ఇవాళ పార్టీలు మారే ఎం.ఎల్.ఎ.లందరు 'అభివృద్ధి' కోసం వెళ్తున్నామంటున్నారు. నిజానికి అది ఎవరి అభివృద్ధో? ఇలా పార్టీలు మారడంలో ఎవరి స్వంత లక్ష్యం వారికున్నది. అనేక వ్యాపారాలు ఉన్నవారు, కాంట్రాక్టర్లుగా ఉన్నవాళ్లు అధికార పక్షం వెళ్లకపోతే ఆర్థికంగా గిట్టుబాటు కాదనుకునే వాళ్లంతా అభివృద్ధి పేరే చెబుతున్నారు. ఏవో అక్రమ దందాలు చేసినవాళ్లు, చేస్తున్న వాళ్లు కేసుల్లో ఇరుక్కున్నవాళ్లకు కూడా కొదువలేదనుకోండి. కొన్ని దశాబ్దాల కిందట ఏవో కొన్ని విలువలున్న నాయకులైతే ఒక ప్రత్యేక అంశంపైన విభేదించో, సైద్ధాంతిక విభేదాలవల్లనో పార్టీలు మారడం జరిగేది. ఇవాళ పార్టీలు మారడం చొక్కాలు మార్చినంత సులభమైపోయింది. ఒక నియోజక వర్గ ప్రజాప్రతినిధి ఏ పార్టీ గుర్తుమీద గెలిచాడో, ఇప్పుడు ఏ పార్టీలో ఉన్నాడో, రేపు ఏ పార్టీలోకి వెళ్తాడో అక్కడి సాధారణ ప్రజలకు కూడా తెలియని అయోమయ పరిస్థితి నెలకొని ఉన్నది.

ఓట్ల, సీట్ల బేరంలో ఫిరాయింపుదారులు, జంపు జిలానీలు, ఆయారామ్‌లు, గయారామ్‌ల సంస్కృతి ఏ విలువలూ సిద్ధాంతాలు లేని రాజకీయాల్లో సర్వసాధారణమైపోయింది. ఎన్నికలు జరిగిన తక్షణ కాలంలో అధికార పక్షంవైపు వెళ్లడం, మళ్లీ ఎన్నికలు సమీపించేనాటికి ఏ పార్టీకి అధికారం దక్కే అవకాశాలున్నాయో ఆ పార్టీకి మారడం జరుగుతున్నది. పార్టీ ఫిరాయింపుల్లో ఎక్కడ కూడా ప్రజా ప్రయోజనాలుండవు. బయటికి ప్రచారమైన కారణాలకంటే తెరచాటు లావాదేవీలే వీటిని నిర్దేశిస్తాయి. ఇటీవల ఓ టి.డి.పి. నాయకుడు కాంగ్రెస్‌లో చేరిపోవడం పెద్ద వార్తనే కాకుండా అదో రాజకీయ పరిణామమయ్యింది. మొత్తం తెలంగాణ రాజకీయ చిత్రపటమే మారిపోతుందా అనే స్థాయిలో మీడియా హడావుడి సృష్టించింది. ఇవాళ

నాయకుల సామర్థ్యాలను వారి మేధోజ్ఞానం, ప్రజాపక్షపాత సిద్ధాంతం, నీతి నిబద్ధత, త్యాగ నిరతి, లక్ష్యశుద్ధి విలువల కంటే వదరుబోతుతనం, దురుసుతనం, దుర్భాషలాడడం, మాటకుమాట అనగలిగే వాళ్లనే సమర్థులైన వాళ్లుగా, 'డైనమిక్'గా మీడియా ప్రచారం చేస్తున్నది. ఈ పార్టీలు, నాయకులు ఒకే తానులోని ముక్కలు. ఏ ముక్క ఎక్కడ ఉన్నా ఒకే పనితీరు ఉంటుంది. ఏ ముక్కలు ఎప్పుడైనా కలువవచ్చు కలవకపోయినా పరస్పర ప్రయోజనాలను పరిరక్షించుకోవడంలో ఎటువంటి తేడాలుండవు. వ్యక్తులుగా ఎటువంటి అవకాశవాదాన్ని అవలంభిస్తున్నారో పార్టీలు కూడా అంతకంటే భిన్నంగా ఏమీ ఉండడం లేదు. ఎవరు ఎవరితో పొత్తులు పెట్టుకుంటారో, ఏ సమీకరణాలకు తెరతీస్తారో తెలియకుండా వ్యవహారాలు జరిగిపోతూ ఉంటాయి. పార్టీలు సానుకూల ప్రజా తీర్పుకంటే పాలకపక్షం పట్ల వ్యతిరేకతను ఆసరాగా తీసుకొని లబ్ధి పొందాలని ఆశలు పెంచుకుంటున్నాయి. గతంలో అధికారంలో ఉన్నప్పుడు జరిగిన తప్పుల నుండి గుణపాఠం నేర్చుకుని సరిదిద్దుకునే నిజాయితీ ప్రతిపక్ష కాంగ్రెస్‌కు గానీ, లేదా ఇవాళ అధికారంలో ఉన్న తమపైన ప్రతిపక్షం నుండి కాకపోయినా పౌర సమాజం నుండి వచ్చే విమర్శను స్వీకరించే ప్రజాస్వామిక సంస్కృతిని టి.ఆర్.ఎస్.గానీ అలవర్చుకోవడం లేదు. పైగా అసహనానికి గురవుతూ అభివృద్ధి నిరోధకులంటూ ప్రచారం చేస్తున్నారు.

ఎన్నికలు సమీపించేకొద్దీ పార్టీలు హడావుడిని పెంచుతున్నాయి. పొత్తులు, సమీకరణాలకై కొత్త ప్రయత్నాలు మొదలుపెట్టాయి. ఏ పార్టీ అధికారంలో ఉన్నా ఆ పార్టీకి దగ్గరయ్యే ఎం.ఐ.ఎం. ఏకంగా టి.ఆర్.ఎస్.తో కలిసి పనిచేస్తామని, ఇంత గొప్ప ముఖ్యమంత్రి మరొకరు లేరని ఆకాశానికెత్తి భవిష్యత్ పొత్తులకు తొలి తెరలేపింది. ఆ స్నేహం చెడకుండా ఉంటే వారి పొత్తు ఖాయంగా కనిపిస్తుంది. వీరి స్నేహ బంధం మధ్యలోనే పుటుక్కుమంటే టి.ఆర్.ఎస్. బి.జె.పి. సీట్ల సర్దుబాటో, ఎన్నికల తరువాతైనా అవగాహన కుదురుతుంది. పార్టీలకు ఉన్నది 'వాస్తవిక' వాదమే, ప్రయోజనవాదమే తప్ప సిద్ధాంత వాదమంటూ ఏమీ లేని కాలంలో ఎవరికి ఎవరితోనైనా వియ్యం కుదురుతుంది. సిద్ధాంత పార్టీలుగా చెప్పుకునే వామపక్షాల పార్టీలైన సి.పి.ఐ., సి.పి.ఎం. ఇప్పటివరకు జరిగిన ప్రతి ఎన్నికల్లో ఏదో ఒక పాలక పార్టీతో జతకట్టి సైడ్ హీరో పాత్రను పోషిస్తూ శాసన వ్యవస్థలో తమ అస్తిత్వాన్ని కష్టంగా కాపాడుకుంటున్నాయి. ఈ సారి అటువంటి పరిస్థితి పునరావృతం కాబోదని పదే పదే ఆ పార్టీలు చెబుతున్నప్పటికీ ఎన్నికల నాటికి మరేదో వాస్తవ దృక్పథం మళ్లీ వారిని పాత పొత్తుల వైపే నెట్టివేసే అవకాశం ఉన్నది.

ఈసారీ టి.జె.ఎ.సి. రూపంలో తెలంగాణ యవనిక మీద మరో కొత్త పార్టీ పురుడు పోసుకుంటుందా అనే ఆసక్తి ఇప్పుడు జరుగుతున్న రాజకీయ సమీకరణాల, నాయకుల పార్టీ మార్పిడీలపైన కంటే ఎక్కువగా నెలకొని ఉన్నది. తెలంగాణ ఏర్పడిన తరువాత కూడా ఉద్యమ ఉత్సాహాన్ని కొనసాగిస్తున్నది టి.జె.ఎ.సి. అనేక ప్రజా సముదాయాల సమస్యలు, సంక్షోభాలపై అన్ని రకాల వనరులున్న రాజకీయ పార్టీలకంటే ఎక్కువగా ముందుండి పోరాడుతున్నదనేది వర్తమాన వాస్తవం. అది రాజకీయ పార్టీగా పరివర్తన చెందాలనే సాధారణ ప్రజానీకం తక్కువేం కాదు. జె.ఎ.సి.లో భాగస్వామ్య సంఘాలు విడివిడిగా అంత బలాన్ని కల్గి లేకపోయినా జె.ఎ.సి. నాయకత్వం నీడన తమ అస్తిత్వాన్ని నిలుపుకుంటున్నాయి. జె.ఎ.సి. నాయకుడిగా ఉన్న కోదండరాం కంటే భాగస్వామ్య సంఘాల నాయకత్వాలకు రాజకీయ ప్రత్యామ్నాయం పేరుతో పార్టీ ఉత్సాహం ఉరకలేస్తున్నది. పార్టీ ఏర్పాటు వాస్తవరూపం దాలిస్తే అది కొత్త సమీకరణాలకు దారి తీస్తుందా? ఒంటరిగా ఎన్నికల్లోకి వెలితే అధికార పక్ష వ్యతిరేక ఓట్లు చీలిపోయేలా పరిణామాలు ఉంటాయనేది కూడా విస్మరించరానిది. రాజకీయ పార్టీగా ఏర్పడకపోయిన కాంగ్రెస్ అనుకూల వైఖరిని తీసుకునే అవకాశమూ లేకపోలేదు!? అదే జరిగినట్లయితే విడిగా పోటీచేసి తమ స్వంత బలాన్ని ప్రదర్శించాలను కుంటున్న వామపక్షాలు కూడా పునరాలోచనలో పడతాయి. అనేక ప్రజా సంఘాలు పెద్ద పార్టీల్లో కలిసి పోవడమో వారి నాయకత్వాలకు సీట్లు అడుక్కోవడమో జరుగుతుంది. మొత్తానికి టి.ఆర్.ఎస్. పునరేకీకరణలో తను సర్దగలిగిన సంఖ్యకంటే ఎక్కువ మొత్తంలో చేర్చుకోవడం కూడా తాను ఆశించిన ప్రయోజనాలకు భంగం కలిగేలా ఉండబోతుంది. వారికోసమే నియోజకవర్గాల పెంపుకోసం ఎంత ప్రయత్నించినప్పటికీ సఫలం కాకపోవడం వారిని తప్పక నిరాశపర్చి ఉంటుంది.

రాజకీయ సమీకరణాలు పొత్తులు అనేవి ప్రజా ప్రయోజన ప్రాతిపదికన జరిగితే ప్రజలు ఆహ్వానిస్తారు. పచ్చి రాజకీయ అవకాశవాదమో, అధికార వ్యామోహమో లేదా కొన్ని ఆధిపత్య సామాజిక వర్గాలకు ఇపుడున్న పార్టీ పాలనలో 'న్యాయం' జరగలేదనే కారణంగానో పార్టీలు పావులు కదిపితే మెజారిటీ ప్రజలకు అన్యాయం చేయడమే అవుతుంది. మారుతున్న పరిస్థితుల్లో, కొత్తగా రాజేయబడిన అనవసరపు అంశాలకు ముగింపు పలకాలంటే విస్తృత ప్రజా ప్రయోజనాల ప్రాతిపదికన అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా కొత్తగా పునరేకీకరణలు జరగాల్సిందే. ఫలానా వ్యక్తి 'బాహుబలి' అనో భాగా తిడతాడనో రాజకీయాలను వన్ మ్యాన్ ఆర్మీలా మార్చడం అవాంఛనీయమైనది.

ఇప్పటికే ప్రాంతీయ పార్టీల్లో ప్రజాస్వామ్యం శూన్యం. వైచిత్రి ఏమిటంటే ప్రాంతీయ పార్టీలన్నీ దేశ స్థాయిలో ఉండే పార్టీలు, తమ ప్రాంతీయ ఆకాంక్షల్ని నిర్లక్ష్యం చేస్తున్నాయని ఏదో ఒక ప్రజాస్వామిక డిమాండ్‌తో ఉద్భవించినవే. సరిగ్గా ఇవాళ తెలంగాణ అధికార పార్టీ కూడా ప్రజాస్వామిక డిమాండ్ అయిన ప్రత్యేక రాష్ట్రానికి నిలబడింది నిజమే కానీ అధికారం వారిని ఎంత అప్రజాస్వామికంగా మార్చివేసిందో, ఎంత అహంకారాన్ని నింపివేసిందో ఉద్యమ పార్టీగా చెప్పుకునే పార్టీ ఏ శాంతియుత నిరసనను కూడా సహించకుండా నిర్బంధాన్ని మోపుతున్నది. తెలంగాణ అన్ని ఉద్యమ రూపాల్లో భాగస్వామ్యమయ్యి ఇవాళ అదే రూపాలను ప్రజా సంఘాలో, పార్టీలో కొనసాగిస్తే అభివృద్ధి నిరోధకమంటున్నది. ఉద్యమ పార్టీయే తెలంగాణలో ఉండాలంటుంది, మరే దేశానికి జాతీయోద్యమ కాలంలో నాయకత్వం వహించిన కాంగ్రెస్‌లో కూడా తాము మాత్రమే ఉండాలని కోరుకున్న ఆధిపత్య శక్తులు ఉన్నప్పటికీ అది సాధ్యం కాకపోగా ఆ ఆధిపత్యాన్ని బద్దలు కొడుతూ అనేక పార్టీలు పురుడు పోసుకొని వాటితోనే జతకట్టాల్సిన స్థితికి కాంగ్రెస్‌ను నెట్టివేసినవి. దానికి టి.ఆర్.ఎస్. కూడా మినహాయింపేమీ కాదు. సామాజిక ప్రజాస్వామిక తెలంగాణ ఎన్నికల వ్యవస్థలో సాధ్యమా అనే విశాలమైన రాజకీయ ప్రశ్నలు బలంగా ముందుకు పెడుతూ ఉద్యమాలు నడుస్తున్నాయనే అంశాన్నీ విస్మరించజాలరు.

(రచయిత ఆంగ్ల ఉపన్యాసకులు) వీ

సాయిబాబా నిర్బంధం - అనవసర వివాదం

జైలు నిర్బంధంలో ఉన్న సాయిబాబా ఆరోగ్య స్థితి గురించి తలెత్తిన ఆందోళన అవకాశంగా తీసుకుని జరిగిన వివాదాన్ని చర్చిస్తున్నారు జి. లింగమూర్తి

అక్టోబర్ చివరి వారంలో నాగపూర్ జైలులోని అండాసెల్ నుంచి జి.ఎన్. సాయిబాబా తన సహచరి వసంతకు రాసిన ఉత్తరం సోషల్ మీడియాలో కూడ వెలువడి సంచలనానికి కారణమయింది. ఆ ఉత్తరంలో వ్యక్తమైన సాయిబాబా అనారోగ్య నిస్సహాయ స్థితి, జైలు నిర్బంధంలోని దారుణం, నిర్బంధం నుంచి బైటికి తీసుకురావడానికి జరుగుతున్న ప్రయత్నాలు ఇంకా ఫలితం సాధించకపోవడం మరొకసారి తెలిసి సాయిబాబా మిత్రులూ, విప్లవోద్యమ సానుభూతిపరులూ మాత్రమే కాక బుద్ధిజీవులూ కవులూ రచయితలూ సున్నిత మనస్కులూ ఎందరో స్పందించారు. ఈ విషయాలు గతంలో అరకొరగా తెలిసినవారు కొందరూ, మొత్తంగానే మొదటిసారి తెలుసుకున్న వారు కొందరూ బాగా కదిలిపోయారు. వెంటనే ఏమైనా చేయాలని, అవకాశం ఉంటే సాయిబాబాను గంటల్లోనో రోజుల్లోనో జైలు నుంచి విడుదల చేయించే ప్రయత్నాలు చేయాలని ఆందోళన పడ్డారు. తొంభై శాతం అంగవికలుడైన వ్యక్తి పట్ల రాజ్యం ప్రవర్తిస్తున్న దుర్మార్గ వైఖరి పట్ల కోపం ప్రదర్శించారు. సాయిబాబాకూ, సాయిబాబా కుటుంబానికీ తామేమైనా ఆర్థికంగానైనా ఇతరంగానైనా సహాయపడగలమా అని ఆలోచనలు పంచుకున్నారు. సాయిబాబా విడుదల కోసం జరుగుతున్న ప్రయత్నాల సమాచారాన్ని వివరంగా, బహిరంగంగా పంచుకోవాలని కోరారు.

ఇలా సాయిబాబా పట్ల సానుభూతి, సాయిబాబాను వేధిస్తున్న రాజ్యం పట్ల ఆగ్రహం వెల్లువెత్తుతుండగానే, కొద్ది మంది మాత్రం విప్లవోద్యమం మీద విషం కక్కడానికి ఒక సందర్భం దొరికింది గదా అని సంతోషించారు. రాజ్యం మీద ఎక్కుపెట్టవలసిన ఆగ్రహాన్ని సాయిబాబా నమ్మిన విశ్వాసాల మీదికీ, సాయిబాబా సహచరుల మీదికీ మళ్లించడానికీ, వారి మీద బురద జల్లడానికీ వినియోగించుకున్నారు. సాయిబాబా విడుదలకు ప్రయత్నాలు చేయకపోవడంలో, ఆలస్యం చేయడంలో విప్లవోద్యమంలో కుల వివక్ష పాత్ర ఉందని అలవాటయిన, తమకు తెలిసిన ఆవు వ్యాసం మళ్లీ రాయడానికి ప్రయత్నించారు. తాము సాయిబాబా క్షేమాన్ని కోరుతున్నవాళ్లమన్నట్టుగా నటిస్తూ విప్లవోద్యమం మీద దాడి చేశారు. విప్లవోద్యమం సాయిబాబా చావు కోసం ఎదురుచూస్తున్నదనీ, విప్లవోద్యమపు దివాళాకోరుతనం బైటపడిందనీ అనేవరకూ వెళ్లారు. నిజానికి వీళ్లు అంతకుముందు గానీ, ఆ తర్వాత గానీ రాజ్య నిర్బంధాన్ని ఎన్నడూ ప్రశ్నించినవాళ్లు కారు. సాయిబాబా రాజకీయ విశ్వాసాల గురించీ, ఆచరణ గురించీ తెలిసినవాళ్లు కారు. సమర్థించేవాళ్లూ కారు. సాయిబాబా పేరు కూడ సరిగా రాయనివాళ్లు కూడ ఈ దాడిలో పాల్గొన్నారంటే, వారికి సాయిబాబా మీద, ఆయన నమ్మిన రాజకీయోద్యమం మీద ఎటువంటి ప్రేమా లేదని, కేవలం విప్లవోద్యమం మీద తమ ద్వేషం ప్రకటించడానికి ఒక అవకాశం దొరికిందని మాత్రమే రెచ్చిపోయారని అర్థమవుతుంది.

ఈ దురుద్దేశపూరిత వక్రీకరణలు, పెడధోరణుల సంగతి ఎలా ఉన్నా, ఈ వివాదం కొన్ని అవసరమైన విషయాలను మళ్లీ ఒకసారి చర్చలోకి తెచ్చింది. భిన్నాభిప్రాయాల పట్ల, ప్రత్యామ్నాయ ప్రజా ఉద్యమాల పట్ల, ఆ ఉద్యమాలకు సహకరించే బుద్ధిజీవుల పట్ల రాజ్యం ఎంత దుర్మార్గంగా, చట్టవ్యతిరేకంగా ప్రవర్తిస్తున్నదో మరొకసారి బైటపడింది. తమ కార్యకర్తలు నిర్బంధాల పాలు అయినప్పుడు వారిని రక్షించుకోవడంలో, వారి కుటుంబాలను ఆదుకోవడంలో ప్రజా ఉద్యమాలు చేయవలసినంత చేయడం లేదనే అంశం చర్చలోకి వచ్చింది. ఒక విద్యావంతుడైన మధ్యతరగతి బుద్ధిజీవికి నిర్బంధం ఎదురైతే స్పందించేవారు, అటువంటి, లేదా అంతకన్న దారుణమైన నిర్బంధానికి వేలాది మంది ఆదివాసులు, అట్టడుగు వర్గాల ప్రజలు గురి అవుతున్నప్పుడు, కనీసం అటువైపు కూడ చూడడం లేదనే అంశం మరొకసారి బైటపడింది. సామాజిక జీవితంలో, రాజకీయ ఉద్యమాలలో నాయకస్థానంలో ఉన్న వ్యక్తులు, సంస్థలు ఏ మాటలు వాడితే ఏ అపార్థాలు వస్తాయో, ఎంత జాగ్రత్తగా మాటలు వాడవలసిన స్థితి సమాజంలో ఉందో ఈ ఉదంతం చూపింది.

ఈ వివాదానికి దారితీసిన సాయిబాబా ఉత్తరంలో, తన ఆరోగ్య స్థితి గురించి వివరణతో పాటు, తన విడుదలకు బైట జరగవలసినంత ప్రయత్నం జరగడం లేదనే ఫిర్యాదు ఉన్నమాట నిజమే. అయితే సాయిబాబా ఆరోగ్య స్థితి అనే మొదటి అంశం గురించి బైటి సమాజంలో పెద్ద ఎత్తున ఆందోళన జరగవలసి ఉండగా, రెండో అంశమైన ఆ ఫిర్యాదు గురించి అంతకన్న ఎక్కువ చర్చ జరిగింది. ఆ ఫిర్యాదులో వ్యక్తమైన ఒకటి రెండు మాటలను అడ్డు పెట్టుకుని విప్లవోద్యమం మీద దాడి చేయవచ్చునని కొందరు అనుకున్నారు.

"రాబోయే చలికాలం తలచుకుంటే భయమేస్తోంది. ఇప్పటికే విడువని జ్వరంతో వణికిపోతున్నాను. నా దగ్గర దుప్పటి లేదు. స్వెటర్ గానీ జాకెట్ గానీ లేవు. టెంపరేచర్ తగ్గిపోయేకొద్దీ నా రెండు కాళ్లలో, ఎడమ చేతిలో నొప్పి భరించలేనంతగా పెరిగిపోతుంది. నవంబర్ నుండి ఇక్కడ ప్రారంభమయ్యే చలికాలంలో నేను జీవించి ఉండడం అసాధ్యం. చివరి ఊపిరులు తీసుకుంటున్న జంతువులాగా నేనిక్కడ పడి ఉన్నాను. ఎనిమిది నెలలు ఎలాగో ప్రాణాన్ని నెట్టుకొచ్చాను. కానీ వచ్చే చలికాలంలో నేనింక బతకను. నేనిది కచ్చితంగా చెప్పగలను. ఇక మీదట నా ఆరోగ్యం గురించి రాయడం కూడ నిష్ప్రయోజనం.

ఈ నెలాఖరుకల్లా ఎలాగైనా సీనియర్ న్యాయవాదిని ఏర్పాటు చేయి. నవంబర్ మొదటి వారంలో గాని, వీలైతే అక్టోబర్ చివరివారంలో గానీ

నా బెయిల్ అప్లికేషన్ పెట్టమని గాడ్లింగ్ గారికి చెప్పు. ఇలా చేయకపోతే నా పరిస్థితి చేయి దాటి పోతుందని గుర్తించు. దానికి నేను బాధ్యుడిని కాను. దీని గురించి ఇక మళ్లీ రాసేది కూడ ఉండదని స్పష్టం చేస్తున్నా.

మిసెస్ రెబెక్కా గారితో, నందితా నారాయణ్ తో నువ్వు మాట్లాడాలి. అలాగే ప్రొఫెసర్ హరగోపాల్ తో, మరికొందరితో కూడా మాట్లాడు. పరిస్థితి వివరంగా చెప్పు. త్వరపడాలి. మీ అందరికీ పదే పదే యాచకుడిలా, దిక్కులేనివాడిలా మొరపెట్టుకొని నేను మానసికంగా కుంగిపోతున్నాను. కానీ ఎవరూ ఒక్క అంగుళం కూడా కదలడం లేదు. నా ప్రస్తుత పరిస్థితి ఎవరూ అర్థం చేసుకోవడం లేదు. తొంబైశాతం వైకల్యం ఉన్న మనిషి, పనిచేస్తున్న ఒకే ఒక చేయితో పోరాడుతూ, అనేక జబ్బులతో బాధపడుతూ జైలు ఊచల వెనక ఉన్నాడని ఎవరూ అర్థం చేసుకోరు. నా జీవితం గురించి ఎవరూ పట్టించుకోరు. ఇది కేవలం నేరపూరిత నిర్లక్ష్యం. నిర్దయాపూరిత వైఖరి…" అని సాయిబాబా రాసిన ఉత్తరంలో ఉంది.

ఈ ఉత్తరంలో ప్రస్తావించిన అంశాలలో మొదటిది నాగపూర్ లో చలి, అనారోగ్య బాధితుడిగా, తొంబై శాతం అంగవైకల్యం ఉన్న వ్యక్తిగా సాయిబాబా ఆ చలికి తట్టుకోలేకపోవడం, తట్టుకోవడానికి అవసరమైన వేడి దుస్తులు కూడ అందకపోవడం. ఇది పూర్తిగా రాజ్యానికీ, జైలు వ్యవస్థకూ సంబంధించిన అంశం. మొట్టమొదట అబద్ధపు నేరారోపణలతో, ఏ ఒక్క ఆరోపణా రుజువు కాకుండానే యావజ్జీవ కారాగార శిక్ష విధించిన రాజ్యం, తొంబై శాతం అంగవైకల్యం ఉన్న వ్యక్తి అని సానుభూతి కూడ చూపించకుండా శిక్ష విధించిన రాజ్యం, వేడి దుస్తులు, ఆయన అనారోగ్యానికి అవసరమైన మందులు తానే అందించవలసిన రాజ్యం అందించకపోగా, బైటి నుంచి కుటుంబ సభ్యులు, స్నేహితులు, న్యాయవాది ఇచ్చినవి కూడ సాయిబాబాకు అందించడం లేదు. కనుక ఈ ఉత్తరంలోని మొదటి రెండు పేరాలూ చదవగానే ఎవరికైనా రాజ్య దుర్మార్గం మీద ఆగ్రహం కలగాలి. రాజ్యానికి ప్రత్యక్షంగానో పరోక్షంగానో మద్దతు ఇవ్వదలచుకున్నవారికి తప్ప ఎవరికైనా ఆ ఆగ్రహం కలుగుతుంది.

కాని ఈ ఉత్తరం ఆధారంగా దురుద్దేశపూరిత వ్యాఖ్యలు చేయదలచిన వారికి, ఈ ఉత్తరంలో ప్రస్తావించిన రెండో అంశం ఒక ఊతంగా దొరికింది. అందులో తన బెయిల్ అప్లికేషన్ ఇంకా పెట్టలేదనే వాస్తవాన్ని చెపుతూ, స్వయంగా సాయిబాబానే తాను యాచకుడిలా అడుగుతున్నానని, దిక్కులేనివాడిగా ఉన్నానని, ఎవరూ ఒక్క అంగుళం కూడ కదలడం లేదని, నేరపూరిత నిర్లక్ష్యం, నిర్దయాపూరిత వైఖరి చూపుతున్నారని మిత్రులమీద కొన్ని వ్యాఖ్యలు చేశారు. అంటే రాజ్యం మీదికి ఎక్కుపెట్టవలసిన ఆగ్రహాన్ని తన మిత్రుల మీదికే మళ్లించడానికి సాయిబాబానే అవకాశం ఇచ్చినట్టయింది. విషాదకర వాస్తవమేమంటే బెయిల్ అప్లికేషన్ ఎందుకు ఆలస్యమయిందో, న్యాయస్థానాలలోనూ బైటా ఈ ఎనిమిది నెలలుగా ఏయే ప్రక్రియలు సాగుతున్నాయో సాయిబాబాకు తెలుసు. అయినా తనను విడుదల చేయించే ప్రయత్నాలలో జాప్యం జరుగుతున్నదని జైలు నిర్బంధపు దుస్సహ స్థితి వల్ల, విసుగుదల వల్ల, అనారోగ్యం వల్ల ఆయనకు అనిపించి ఉండవచ్చు. ఆ అసంతృప్తి ఈ మాటల్లో వ్యక్తమై ఉండవచ్చు. కాని ఇటువంటి మాటలకోసమే ఎదురుచూస్తూ కాచుకుని కూచునేవాళ్లు ఉంటారని, ఈ మాటలను వాడుకుని తన మీద ప్రేమ, తన విడుదల గురించి ఆందోళన ఉన్నట్టు నటిస్తూ, తన విశ్వాసాల మీద, తన సహచరుల మీద, తన ఉద్యమం మీద దాడి చేస్తారని ఆయన ఊహించి ఉండవలసింది. తన మాటలను ఎవరు ఎలా వాడుకోగలరో ఊహించి జాగ్రత్త పడి ఉండవలసింది.

విప్లవోద్యమం మీద బురద చల్లడానికి, బద్నాం చేయడానికి, ఎక్కడైనా ఏదైనా పొరపాటు జరిగితే అది గోరంతలు కొండంతలు చేసి ప్రజల్లో విప్లవోద్యమ విశ్వసనీయతను దెబ్బతీయడానికి రాజ్యం ప్రేరేపిస్తున్న శక్తులు, విప్లవోద్యమం మీద అనేక కారణాల వల్ల వ్యతిరేకత ఉన్న శక్తులు, విప్లవోద్యమంలోని కొందరు వ్యక్తులను ద్వేషించే శక్తులు ఎన్నో ఆత్రుతతో ఎదురుచూస్తూ కూచున్నాయి. ఈ బురదచల్లే ప్రయత్నాలకు అన్ని ప్రచార సాధనాలూ చోటు కల్పిస్తున్నాయి. ప్రస్తుతం విపరీతంగా ప్రచారంలో ఉన్న సోషల్ మీడియా ఇటువంటి నిరాధార, నిర్హేతుక దాడులకు, దుష్ప్రచారాలకు వేదికగా ఉన్నది. కోతికి కొబ్బరికాయ దొరికినట్టుగా సాయిబాబా ఉత్తరంలోని వ్యాఖ్యలు ఈ ఆవు వ్యాసకర్తలకు అప్పనంగా దొరికాయి. ఒకటి రెండు అచ్చు పత్రికలలో, ఇంటర్నెట్ పత్రికలలో కొంత, సోషల్ మీడియాలో చాల ఎక్కువగా ఈ వివాదం చెలరేగింది. అవాకులూ చవాకులూ, చిలవలూ పలవలూ, వాస్తవాలతో సంబంధంలేని నిందా ప్రచారాలూ, సమాచారం తెలియక, తెలుసుకోవాలనే అభిప్రాయం కూడ లేకుండా ఇష్టారాజ్యంగా చేసిన వ్యాఖ్యలు సాగాయి. వారం పది రోజుల పాటు విస్తృతంగా సాగిన ఈ హోరులోంచి కింద ఉటంకిస్తున్న కొన్ని అభిప్రాయాలు చూస్తే ఈ ధోరణి అర్థమవుతుంది:

"ఎంత తేడా… ప్రొ సాయిబాబా నక్సలైట్ మద్దతుదారుడని 90 శాతం అంగవైకల్యం ఉన్న వ్యక్తికి యావజ్జీవ కారాగారం. మరి నక్సలైట్ తో ప్రభుత్వానికి చర్చలు పెట్టిన ప్రొ హరగోపాల్ గారికి…? ప్రొ సాయిబాబా అణగారిన వర్గాలకు చెందినవాడని శిక్ష. ప్రొ హరగోపాల్ గారు బ్రహ్మణుడని స్వేచ్ఛ… ఆజాద్ ను దొరకబట్టి చంపి అడవిలో పడేసి ఎన్‌కౌంటర్ అంటిరి, మరి రామకృష్ణకు అనేకమార్లు గ్రేహండ్స్ దళాలు చుట్టిముట్టినయి అని వార్తలు చూశాము కాని తర్వాత ఏం జరిగిందో వార్తల్లో రాకపోయినా మాకు తెలిసిందే మర్యాదలు చేసి వదిలేశారని… అంటే ఆజాద్ ఒక బిసి కాబట్టి దొరకబట్టి కాల్చారు. రామకృష్ణ ఒక బ్రాహ్మణుడు కాబట్టి చుట్టుముట్టి వదిలేశారు…"

"కిషన్ జీ కూడా బ్రాహ్మణుడే అయిన చంపిండ్లు కదా?" "ఎవరన్నారు మీకు కిషన్ జీ చనిపోయాడని… మొన్ననే కిషన్ జీ పూణెలో బ్రాహ్మణ సంఘం మీటింగ్ అటెండ్ అయ్యాడు."

"రామకృష్ణ విషయంలో స్పందించిన వరవరరావు, కళ్యాణరావు, ప్రొ. హరగోపాల్ మొదలైన ఎర్రనాయకులు ప్రొ సాయిబాబా విషయంలో ఎందుకు స్పందించలేదు…ఇప్పటి వరకు అతని బెయిల్ కొరకు కూడా పిటిషన్ వేయలేదు అంటే అర్థం ఏమిటి….? మీరు కులాలను బట్టి తమాషలు చేస్తే మేము తానా తందానా అనాలా…..?"

"ఆయన్ను జైల్లో పెట్టి ఇన్ని నెలలవుతున్నా హైకోర్టులో అప్పీలు చేయకపోవటమేంటి? ఎప్పుడూ శత్రువుని విమర్శిస్తూ, ప్రజల భావోద్వేగాలను గాయపర్చటం కాదు. లీగల్ ప్రొసీజర్‌లో చేసిన ప్రయత్నం ఎక్కడిదాకా వచ్చిందో చెప్పాలి…"

"సవర్ణ విప్లవకారులు జైలు పాలైతే పై కోర్టులకు వెళ్లి, పాలక పార్టీ ప్రభుత్వాలతో సంప్రదింపులు జరిపి విడిపించుకున్న సందర్భాలు తెలుగు ప్రజలకు తెలుసు. పోటా లాంటి కేసులు పెడితే హోం మినిస్టర్‌తో మాట్లాడి కేసు మాఫీ చేయించుకోవడమో లేదా అరెస్టు కాకుండా చూసుకోవడమో చేసిన సంఘటనలు హైదరాబాదులో కళ్లారా చూశాం. అలాంటి వాళ్లంతా విప్లవకారులుగా చలామణి కావటం కూడా ప్రజలకు తెలుసు. తొంభైశాతం వైకల్యంతో ఉన్న సాయిబాబను విడుదల చేయాలని కోర్టులను, అందుకు సహకరించాలని హోం మినిస్టర్‌తో చర్చలు జరిపినట్టు ఎవరికీ తెలియదు. అలాంటి ప్రయత్నం జరిగిన వార్తలు ప్రచారంలో లేవు. జాతీయ స్థాయిలో అలాంటి ప్రయత్నం జరిగితే ఫలితం వుండేదేమో. జంతర్ మంతర్‌లో ధర్నా చేసింది నాకు గుర్తుంది. కానీ తెలంగాణలో లాబీయింగ్ పద్ధతిలో కొన్ని సమస్యలు పరిష్కరించుకున్న విప్లవకారులను ప్రజలు చూశారు. అలాంటి పద్ధతిని ఢిల్లీ స్థాయిలో చేయలేరా? అంతర్జాతీయ సమాజం మద్దతు కూడగట్టలేరా? సూటిగా అడగాలంటే, సాయిబాబ విడుదల కావాలని విప్లవకారులు కోరుకుంటున్నారా? లేదా ఆయన్ని జైల్లోనే ఉంచాలని కోరుకుంటున్నారా?"

"సాయిబాబాతో పనిచేసిన ఉద్యమ సహచరులు, ఆ పార్టీ నాయకత్వం సాయిబాబా విడుదలకు కృషి చేయాలి. లేదంటే ఈ సమాజం ఆయా వర్గాలను తప్పు పట్టాల్సిన పరిస్థితి వస్తుంది. ఒకప్పుడు వాళ్ల నాయకులను విడుదల చేసుకోవడం కోసం ఐఎఎస్, రాజకీయ నాయకులను కిడ్నాప్ చేసినవాళ్లు ఇప్పుడెందుకు మిన్నకున్నట్లు?"

"నిజాయితీగా మాట్లాడితే సాయిబాబ అమరత్వం కోసం వెయిట్ చేస్తున్నట్టుగా ఉంది. ఇది అఫెన్సివ్ స్టేట్‌మెంట్ గాని, ఇందులో వాస్తవం ఉంది. అన్‌ఫార్చునేట్‌గా ఇది ప్రభుత్వ పరిపాలనలా ఉండదు కాని, ఎంక్వైరీలా పెడితే చాల అలసత్వం బయట పడుతుంది. సాయిబాబ పోరాట స్థాయికి తగ్గ సోషల్ కాపిటల్ లేదు. తాను ఆధారపడిన ఆక్సిజన్ సిలిండర్లో ఆక్సిజన్ ఎంత ఉందో చూడకుండా సముద్రంలో దూకేసిన వ్యక్తి...."

"నాలాంటి సామాన్య ప్రజలు మాత్రం ఇక ఈ విప్లవోద్యమ దివాళాకోరుతనాన్ని మాత్రం ఎప్పుడూ క్షమించరు"

ఈ అభిప్రాయాలు చెప్పిన వారందరూ విప్లవోద్యమ వ్యతిరేకులో, బురద చల్లదలచుకున్నవారో కాకపోవచ్చు. అయ్యో, సాయిబాబా ఇంత దారుణ నిర్బంధాన్ని అనుభవిస్తున్నాడే, విడుదల కోసం ప్రయత్నాలు జరుగుతున్నాయా లేదా, ఆలస్యం ఎందుకు జరుగుతున్నది, వెంటనే ఏమైనా చేయగలమా, సమాచారం అందరికీ అందుబాటులో ఉంటే మేము కూడ సహకరిస్తాము గదా లాంటి నిజమైన ఆవేదన, స్పందన వ్యక్తం చేసినవారు కూడ ఉన్నారు. కాని కనీసం ముగ్గురు నలుగురైనా సాయిబాబా దుస్థితి మీద కన్న ఎక్కువ శ్రద్ధ విప్లవోద్యమాన్ని, ప్రత్యేకించి విరసాన్ని, ఒకరిద్దరు విరసం నాయకులను నిందించడం మీద పెట్టారు. బహుశా అందువల్లనేనేమో విరసం ఒక వివరణ వెలువరించింది. ఆ వివరణ మీద మళ్లీ వక్రవ్యాఖ్యలూ, ఆరోపణలూ, నిందలూ సాగాయి.

మొత్తంగా విప్లవోద్యమ పక్షాన విరసం వివరణ ఇచ్చిందేమో గాని నిజానికి జైలు పాలైన విప్లవోద్యమ సానుభూతిపరుడికి న్యాయసహాయం అందించే, విడుదల కోసం ప్రయత్నించే బాధ్యత విరసానిదేమీ కాదు. సాధారణంగా పౌరహక్కుల వ్యవహారాలు చూడడానికే పౌరహక్కుల సంఘాలు ఉన్నాయి. రాజకీయ ఖైదీల విడుదల, వారికి న్యాయసహాయం, వారి అవసరాలు చూడడానికే ప్రత్యేకంగా ఏర్పడిన కమిటీ ఫర్ ది రిలీజ్ ఆఫ్ పొలిటికల్ ప్రిజనర్స్ (సి ఆర్ పి పి) అనే సంస్థ ఉంది. సాయిబాబాను ఈ కేసులో మొదటిసారి 2014 మే 9న అరెస్టు చేయగానే, ఆయనకు మద్దతుగా, ఆయన విడుదల చేయాలని కోరుతూ జూలై 6న ఏర్పడిన కమిటీ ఫర్ ది డిఫెన్స్ అండ్ రిలీజ్ ఆఫ్ జి ఎన్ సాయిబాబా ఉంది. ఆ కమిటీకి ప్రొ. జి హరగోపాల్ అధ్యక్షులు కాగా అరుంధతి రాయ్, ప్రొ. ఆనంద్ తేల్ తుంబ్డే, ప్రొ. అమిత్ భాదురి, ప్రొ. జగ్మోహన్ సింగ్, సుధీర్ ధావలే, సుమిత్ చక్రవర్తిలతో సహా 17 మంది ప్రముఖులు సభ్యులుగా ఉన్నారు. ఈ కమిటీ మూడు సంవత్సరాలుగా దేశవ్యాప్తంగా ఎన్నో సమావేశాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించింది. అధికారవర్గాలకు, న్యాయవ్యవస్థకు విజ్ఞప్తులు చేస్తూ వస్తున్నది. ఈ కేసులో సహాయపడే అవకాశం ఉన్న అధికారులను, మంత్రులను కలుస్తూ ఉన్నది. 2017 మార్చ్ 7న గడ్చిరోలి సెషన్స్ కోర్టు సాయిబాబా, మహేశ్ టిర్కి, పాండు నరోటె, హేమ్ మిశ్రా, ప్రశాంత్ రాహీలకు యావజ్జీవ శిక్ష, విజయ్ టిర్కికి పది సంవత్సరాల శిక్ష విధించిన తర్వాత కూడ ఈ కమిటీ పాత పేరుతోనే తన పని కొనసాగిస్తున్నది. గడ్చిరోలి సెషన్స్ కోర్టులో శిక్ష విధించిన తర్వాత ఏప్రిల్ 20న ఢిల్లీలో పత్రికా సమావేశం ఏర్పాటు చేసిన ఈ కమిటీ కేసు, తీర్పు వివరాలన్నీ వివరంగా చెప్పి, అప్పటికే బొంబాయి హైకోర్టు నాగపూర్ బెంచి లో ఆ తీర్పుపై అప్పీల్ దాఖలు చేయడం జరిగిందని చెప్పింది. అంటే ఏ కేసులోనైనా జరిగినట్టుగానే తప్పుడు తీర్పు మీద పై కోర్టులో అప్పీల్ దాఖలయింది. ఆ అప్పీల్ పెండింగ్ లో ఉండగా బెయిల్ దరఖాస్తు చేయడం అనే మరొక ప్రక్రియ ఉంటుంది.

అయితే ఆ అప్పీల్ ఎప్పుడు విచారణకు వస్తుందో అప్పీల్ చేసినవారి చేతిలో ఉండదు. అప్పీల్ అందుకున్న కోర్టు ఆ కేసు కాగితాలన్నీ పంపించమని తీర్పు ఇచ్చిన కోర్టుకు రాస్తుంది. అవతలి పక్షానికి నోటీసులు ఇస్తుంది. ఈ ప్రక్రియ అంతా అయిన తర్వాత తేదీలు నిర్ణయిస్తుంది. ఏ న్యాయమూర్తి ముందు విచారణ జరుగుతుందో నిర్ణయిస్తుంది. అది నాగపూర్ బెంచి కావడం వల్ల ఏ న్యాయమూర్తి ముందుకు వస్తుందో జాగ్రత్తగా చూడాలని, అధికారవర్గాల కనుసన్నల్లో నడిచే న్యాయమూర్తి కాకుండా చట్టప్రకారం తీర్పు ఇచ్చే నిష్పాక్షికమైన న్యాయమూర్తి ఉన్నప్పుడు కేసు విచారణకు వచ్చేలా చూస్తే బాగుంటుందని అనుకోవడం సాధారణం.

అలాగే, ఏ న్యాయవాది వాదిస్తే న్యాయమూర్తి అంగీకరిస్తాడు అనేది కూడ చూడవలసి ఉంటుంది. ఎవరు వాదించినా చట్టమూ న్యాయమూ సమానమే కదా అనే ఆదర్శవాదం మన న్యాయవ్యవస్థలో కుదరదు. ఒక జూనియర్ న్యాయవాది చేసిన అత్యంత సమర్థమైన న్యాయపరమైన వాదనను కూడ తిరస్కరించడమూ, ఒక సీనియర్ న్యాయవాది బలమైన వాదన చేయకపోయినా నిలబడ్డారంటేనే అంగీకరించడమూ చేసే న్యాయమూర్తులు చాలమంది ఉన్నారు. అందువల్ల ఈ కేసులో పనంతా తాను చేసినా ఢిల్లీ నుంచో, ముంబై నుంచో ఒక సీనియర్ న్యాయవాది వచ్చి నిలబడితే బాగుంటుందని నాగపూర్ న్యాయవాది అన్నారు. అలాగే

తీర్పులో దృష్టి అంతా సాయిబాబా మీదనే ఉన్నందువల్ల, మిగిలిన ఖైదీల కేసులు ముందు చేపట్టి, వాదనలు వినిపించి, వారి విషయంలో ఫలితం చూసి ఆ తర్వాత సాయిబాబా గురించి వాదనలు చేయాలని అనుకోవడం జరిగింది.

మార్చ్ 7న తీర్పు వెలువడగా, ఏప్రిల్ 20 నాటికే అప్పీలు దాఖలు కాగా, మే 7 నుంచి జూన్ 4 దాకా న్యాయస్థానానికి వేసవి సెలవులు వచ్చాయి. అంటే మూడు నెలలు అప్పీల్ గాని, బెయిల్ గాని విచారణకు రాకుండానే ఉండిపోయాయి. ఈ లోగా ఢిల్లీలోని ఒక సీనియర్ న్యాయవాదిని డిఫెన్స్ కమిటీ అధ్యక్షుడు కలిసి నాగపూర్ కు వచ్చి సాయిబాబా కేసు వాదించడానికి ఒప్పించారు. అప్పుడే పత్రికల్లో ఆయన సాయిబాబా కేసు వాదించబోతున్నారని వార్తలు కూడ వచ్చాయి. తాను వేసవి సెలవుల్లో బ్రిటన్ వెళ్తున్నానని, తీర్పు కాపీ తన ఆఫీసులో ఇమ్మని, తిరిగిరాగానే కేసు పని చూడవచ్చునని ఆయన అన్నారు. కాని తిరిగి వచ్చాక సాయిబాబా ఎవరు అని, డిఫెన్స్ కమిటీ అధ్యక్షుడు మీతో మాట్లాడారు గదా అంటే ఆయనెవరు అని ప్రశ్నించారు. తొంభై ఏళ్లు దాటిన ఆ సీనియర్ న్యాయవాది మతిమరపుకు గురయ్యారేమో అనుకుని మళ్లీ కాగితాలు ఇవ్వడానికి ప్రయత్నిస్తే, ఆయన ఆఫీసు వాళ్లు ఆయన ఈ కేసు చేయాలంటే ఇరవై రెండు లక్షల రూపాయల ఫీజు ఇవ్వాలన్నారు. అప్పుడిక ఆయన బదులు మరొక న్యాయవాదిని చూడక తప్పని స్థితి వచ్చింది. అలా మరొక రెండు మూడు నెలలు ఆయన చుట్టూ తిరగడంలో వ్యర్థమై పోయాయి. ఇంతకాలం ఢిల్లీ నుంచి సీనియర్ న్యాయవాది వచ్చి, వాదిస్తే, సాయిబాబా విడుదలైతే మిగిలినవాళ్ల కేసులు సులభమవుతాయని వాళ్లవి కూడ వాయిదా వేయడం జరిగింది. అంతేకాదు, అసలు కోర్టులో ఒక రోజు ఒక కేసు లిస్ట్ అయిన తర్వాత కూడ ఆరోజు తనకు కుదరదు అని ప్రాసిక్యూషన్ న్యాయవాది అన్నా, ఆ రోజు చూసే ఇతర కేసులు ఎక్కువ సమయం తీసుకుని, సమయం మిగలకపోయినా, న్యాయమూర్తి రాకపోయినా, డిఫెన్స్ న్యాయవాది హాజరు కాలేకపోయినా ఎటువంటి చిన్న కారణంతోనైనా కేసులు వాయిదా పడుతుంటాయి. వాయిదా పడినప్పుడల్లా కనీసం రెండు వారాలకు, సాధారణంగా నాలుగు వారాలకు వాయిదా పడుతుంది.

ఇలా అన్ని అవాంతరాలనూ దాటుకుని, ఢిల్లీ సీనియర్ న్యాయవాది రాడని తేలిపోయిన తర్వాత, అతి తక్కువ శిక్ష పడిన విజయ్ టిర్కి, తక్కువ నేరారోపణలున్న ప్రశాంత్ రాహీ ల బెయిల్ కేసు ముందు చేపట్టారు. అది నవంబర్ 6న లిస్ట్ అయింది. కాని ప్రాసిక్యూషన్ న్యాయవాది తాను సిద్ధంగా లేనని అనడంతో అది డిసెంబర్ 6కు వాయిదా పడింది.

నిందితుల మీద, ఖైదీల మీద కనీస దయా దాక్షిణ్యాలు లేకుండా ఇంత దుర్మార్గంగా, నిర్లక్ష్యంగా, అమానుషంగా పనిచేస్తున్న న్యాయస్థానాల మీద, న్యాయవ్యవస్థను ఇలా నడుపుతున్న పాలకవర్గాల మీద కోపం రావలసిన సమయంలో, ఈ వ్యవహారాలు తెలియకనో, తెలిసినా ఉద్దేశపూర్వకంగానో నిందితుల, ఖైదీల ఉద్యమ సహచరుల మీద కోపం తెచ్చుకోవడం ఎవరికి ఉపయోగపడుతుందో చెప్పనక్కరలేదు.

ఆ వ్యతిరేక అభిప్రాయాలు ప్రకటించినవారిలో కొందరికి ఈ న్యాయవ్యవస్థ సమాచారం లేకపోవచ్చు. అది వారి తప్పు కాదు. కాని సమాచారం తెలుసుకోకుండానే, తమంతట తామే కారణాలు వెతకడం, కులం వంటి సులభమైన ఆరోపణలు చేయడం వాస్తవాలను మార్చజాలదు.

నిజానికి చర్చను మరింత విశాలం చేస్తే, ఇవాళ ఒక్క సాయిబాబాకు దొరకని న్యాయం గురించి ఇంతగా మాట్లాడుతున్నవాళ్లు ఈ పాలకవర్గాల పాలనలో వేలాది, లక్షలాది ఆదివాసుల పట్ల, దళితుల పట్ల, ముస్లింల పట్ల, స్త్రీల పట్ల న్యాయవ్యవస్థ ఇలాగే, ఇంతకన్న ఘోరంగా కూడ పనిచేస్తున్నదని ఒక్కసారి కూడ గుర్తించినవాళ్లు కారు. ఏ ఒక్కరోజూ ఆ అన్యాయాల మీద నోరెత్తినవాళ్లు కాదు. కనీసం సాయిబాబాకైనా తప్పుడు తీర్పయినా ఒకటి వచ్చి, నేరస్తుడిగా తేల్చి, యావజ్జీవ శిక్ష విధించారు గాని, న్యాయస్థానాల చేత నిరపరాధులుగా నిర్ధారణ పొంది కూడ ఐదేళ్లు, పదేళ్లు విచారణలో ఉన్న ఖైదీలు ఎందరో ఉన్నారు. అంతకాలం బెయిల్ కూడ రాక, బెయిల్ వస్తే, జైలు గేట్ దగ్గర మళ్లీ అరెస్టు చేయబడి, మరొక కేసులో ఇరికించబడి వేలాది మంది జైళ్లలో మగ్గుతున్నారు.

అలాగే న్యాయవ్యవస్థ ప్రక్రియ ప్రారంభమైన తర్వాత ఎంత ప్రజా ఉద్యమం, ఎంత పెద్ద ఎత్తున అంతర్జాతీయ ఒత్తిడి జరిగినా పాలకవర్గాలు ఎంతమాత్రం పట్టించుకోవని డా. బినాయక్ సేన్ ఉదంతమే చూపుతుంది. బినాయక్ సేన్ కు కూడ సాయిబాబా లాగనే కింది కోర్టు యావజ్జీవ శిక్ష విధించింది. ఆ తీర్పుకు ముందే విచారణ సమయంలో ఆయన రెండు సంవత్సరాలకు పైగా జైలులో ఉన్నారు. యావజ్జీవ శిక్ష తర్వాత పై కోర్టుకు అప్పీలు చేసి, బెయిల్ వచ్చే లోపు మరి రెండు సంవత్సరాలు జైలులో ఉన్నారు. ఈ మధ్య కాలంలో ఆయన మీద నిర్బంధాన్ని ఇరవై రెండు మంది నోబెల్ బహుమతి గ్రహీతలు ఖండించారు, బ్రిటిష్ పార్లమెంటు సభ్యులతో సహా ప్రపంచ ప్రముఖులెందరో ఖండించారు. ఎన్నో వైద్య సంస్థలు ఆయనను విడుదల చేయమని ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపాయి. దేశ వ్యాప్తంగా వందలాది చోట్ల నిరసన ప్రదర్శనలు, సభలు, సమావేశాలు జరిగాయి. అయినా తీర్పు రాక ముందు రెండు సంవత్సరాలు, తీర్పు తర్వాత రెండు సంవత్సరాలు ఆయన జైలులోనే గడపవలసి వచ్చింది. సాయిబాబా విషయంలో విప్లవోద్యమం మీద బురద చల్లడానికి కులం గురించి, సోషల్ కాపిటల్ గురించి మాట్లాడేవారు బినాయక్ సేన్ కులం గురించీ, ఆయనకు ఉన్న సోషల్ కాపిటల్ గురించీ, వర్గ పోరాట సందర్భంలో అవి లెక్కలోకి రాకపోవడం గురించీ గుర్తిస్తే బాగుంటుంది. ఇవాల్టికీ దేశంలో వేల మంది రాజకీయ ఖైదీలు, శిక్షలు పడి కాదు, కేవలం విచారణలో ఉండి బెయిల్ కూడ దొరకక జైళ్లలో మగ్గిపోతున్నారు. స్వయంగా సాయిబాబాకు సహ ముద్దాయి అయి, పదేళ్ల శిక్షకు గురైన ఆదివాసి విజయ్ టిర్కి తల్లికి తన కొడుకును చూడడానికి జైలుకు రావడానికే ఎనిమిది నెలలు పట్టింది.

సాయిబాబా విడుదల కోసం జరగవలసిన ప్రయత్నాలలో అలసత్వం ఉంటే తప్పనిసరిగా ఖండించవలసిందే. బాధ్యులను ప్రశ్నించవలసిందే. మరింత వేగంగా పనులు జరగాలని కోరవలసిందే. కాని వాస్తవాలు తెలుసుకోకుండా, విప్లవోద్యమం మీద, తాము ఎంచుకున్న వ్యక్తుల మీద దాడి చేయడానికి, నిందా ప్రచారాలు చేయడానికి ఇది ఒక అవకాశం అని అనుకుంటే మాత్రం బైటపడేది ఆ విమర్శకుల దివాళాకోరుతనమే.

(రచయిత సామాజిక ఉద్యమ కార్యకర్త) వీ

అభంగపట్నం దళితులపై దాడి

గ్రామాల్లో అగ్రకుల దురహంకారం వల్ల దళితులు ఎంతటి వివక్షకూ, దుర్మార్గాలకూ గురవుతున్నారో అభంగపట్నంలో జరిగిన సంఘటనే నిదర్శనం అని తమ నిజనిర్ధారణ ద్వారా తెలుపుతున్నారు **బహిష్కరణ వ్యతిరేక కమిటీ సభ్యులు**

మనం అంతరిక్ష పరిశోధనలతో సమాజ ప్రగతిని చూస్తున్నాం. మరోవైపు ఆదిమకాలపు కుల వివక్షను చూస్తున్నాం. భారత్ వెలిగి పోతుందని ఒకరంటే, అన్ని వేదాల్లో ఉన్నామంటూ అసమంజస వాదనల తో మనమే 'గొప్ప' అనుకుంటున్నాం. 'భారత్' పరిస్థితులు ఇవాళ ద్వంద్వ ప్రమాణాలతో దర్శనమిస్తున్నాయి. అభివృద్ధి ఫలాలు అందరికీ అందడం లేదు. అందుకే పిల్లల బుర్రల్లోకి 'సరస్వతి అందరిది, లక్ష్మి కొందరిది' అంటూ ఆర్థిక అసమానత చాలా సహజమనే సూత్రాలను ఎక్కిస్తున్నాం.

సైన్స్ ఎంత అభివృద్ధి చెందినా మన సామాజిక పరిస్థితులు, ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా కుల వివక్ష, అగ్రవర్ణ దురహంకారం ఏదో రూపంలో కనబడుతూనే ఉంది. ఈ ఆర్థిక అసమానతలే భరత్ రెడ్డి లాంటి వాళ్లు రెచ్చిపోవడానికి ఓ కారణం.

అభంగపట్నం గ్రామ శివారులో ఉన్న ఎర్రగుంట దగ్గర మొరం తవ్వకం చేస్తూ వ్యాపారం చేసే భరత్‌రెడ్డి చిన్నప్పటి నుండి ఆకతాయిగా పెరిగినవాడు. మిలిటరీలో రాంబాబుగా చేరాడని చెప్తారు. అక్కడి క్రమశిక్షణ తట్టుకోలేక భరత్‌రెడ్డిగా ఎబివిపి, బిజెపిలో కరుడుగట్టిన హిందూ రౌడీగా తయారయ్యాడు.

ఊర్లో మంచి పేరు రావడానికి తాను తవ్విన మొరం ఊళ్లో కొన్ని ట్రిప్పులు పోయించి మంచివాడుగా చలామణి అవుతున్నాడు.

రెండు నెలల క్రితం సెప్టెంబర్ 17న మొరం తవ్వుతున్న జెసిబిని గ్రామ మాదిగ యువకులు కొండ్ర లక్ష్మణ్, రాజేశ్వర్‌లు అడ్డుకున్నారు. ఆ మొరం తవ్వకం ఆపినందుకు డ్రైవర్ వెళ్లి భరత్‌రెడ్డికి ఫిర్యాదు చేయడంతో కోపం కట్టు తెంచుకున్న భరత్‌రెడ్డి బూతులు తిడుతూ ఆ ప్రదేశానికి చేరుకున్నాడు. ఆ ఇద్దరినీ అక్కడకు పిలిపించి, బడిపిల్లల్ని బెదిరించినట్లు బెదిరిస్తూ, కర్రలతో కొట్టాడు. చేతులు కట్టుకొని మొరం తవ్వకం తప్పు కాదు అనిపిస్తూ ముక్కు నేలకు రాయించాడు. అక్కడే ఉన్న బురదగుంటలో బెదిరించి బలవంతంగా ముంచాడు.

అలా ఈ అగ్రవర్ణ దురహంకారి డబ్బు, కులం మదంతో తననెవరూ ఎదిరించరనే అహంకారంతో ప్రవర్తించి లోలోపలే భయభ్రాంతులను చేసి ఈ దుస్సంఘటన బయటకు రాకుండా కట్టుదిట్టం చేశాడు.

రెండు నెలల మౌనం పిదప ట్రక్కు డ్రైవర్ తీసిన వీడియో ఇటీవల సోషల్ మీడియాలో రావడంతో రాష్ట్రవ్యాప్తంగా ఇది చర్చనీయమైంది. నవంబర్ 12న ఫిర్యాదు చేయగా, నవంబర్ 17న ఈ యువకు లిద్దరినీ తీసుకొని భరత్‌రెడ్డి మిత్రుని కార్లో వెళ్లిపోయాడు.

ఒకవైపు దళితులపై దాడి, మరోవైపు బాధిత యువకుల కిడ్నాప్ జరిపి పోలీసులకు చిక్కకుండా రెండు వారాలుగా భరత్‌రెడ్డి తప్పించు కోవడంతో రోజూ కుల సంఘాలు, దళిత సంఘాలు, పౌరహక్కుల, ప్రజాస్వామికవాదులు అభంగపట్నం వెళ్లడం, బాధిత కుటుంబాలను పరామర్శించడం ప్రతిరోజు పత్రికల్లో వస్తున్నది చూసిన పోలీసులు సిబ్బంది కాస్త వేగం పెంచాయి. దళితులను తీసుకుపోతున్నది బిజెపి నాయకులకు, కొందరు పోలీసు అధికారులకు కూడా తెలిసే జరిగిందని బాహాటంగా ప్రజలు చెప్పుకుంటున్నారు. తప్పు మీద తప్పు చేస్తున్న ఇతనికి మద్దతుగా ఊళ్లో 'రెడ్డి' సామాజిక వర్గంతో దళిత వాడల్లో ర్యాలీ తీయించి మిగతా వారందరికీ భరత్‌రెడ్డి ఓ సవాల్‌గా మారాడు.

చీమ చిటుక్కుమన్నా పసిగట్టే తెలంగాణ పోలీసులు ఈ అరాచక వ్యక్తిని పట్టుకోకపోవడం సిగ్గుచేటు. ఇందులో రెండు హత్యకేసులు. అలజడులు సృష్టిస్తున్నాడని ఇతన్ని పోలీసులు సెక్షన్ 151 కింద అరెస్టు చేశారు. నవీపేట పోలీస్ స్టేషన్‌లో నమోదైన 185/2002, 190/2002, 100/2003 కేసులను తగిన సాక్ష్యాధారాలు లేక కొట్టేశారు.

2011లో కులాస్‌పూర్‌లో జరిగిన ఎర్రన్న హత్య కేసులో ఇతడు నిందితుడుగా ఉన్నాడు. ఆనాడు స్థానిక పోలీసులు దర్యాప్తు చేసి హత్యలో ఇతని ప్రమేయం లేదని ఆ కేసును కొట్టేశారు. ఆ హత్య కేసులో ఇతడు 12వ నిందితుడు కావడం, తనకున్న రాజకీయ ప్రాపకాన్ని వాడుకొని బయటపడ్డాడు.

కేసు పునర్విచారణకు వచ్చింది. భరత్‌రెడ్డి పేరును నిందితుడిగా చేర్చారు. సిఐడి ఆరు నెలల క్రితం కోర్టులో చార్జిషీటు దాఖలు చేసింది.

ప్రస్తుతం ఇతని ఆగడాలకు బలైంది ఇద్దరు దళిత యువకులు. ఊరు మొత్తం ఇతని కనుసన్నలో నడుస్తుంది కాబట్టి దళిత యువకుల భార్యలు కూడా ఈ విషయాన్ని బయటకు చెప్పడానికి ధైర్యం చేయలేక పోతున్నారు. పలు ప్రజాసంఘాల రాకతో వీళ్లకు కాస్త ధైర్యం వచ్చింది.

కొన్ని ప్రజాసంఘాలు, వృత్తి సంఘాలు, హక్కుల సంఘాలు, దళిత సంఘాలు అభంగపట్నం వెళ్లడం, ధర్నాలు చేయడం, భరత్‌రెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలనడం, కిడ్నాప్‌కు గురైన యువకులను విడిచిపెట్టమనడం, గత రెండు వారాలుగా సాగుతున్నా పరిష్కారం దొరకని సమస్యగా మారింది.

ఊరుమ్మడి సంపదను భరత్‌రెడ్డి తన వ్యక్తిగత ఆస్తులుగా భావించి, పాలకులకు కనుసన్నల్లో మెలుగుతూ, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను తన గుప్పిట్లో పెట్టుకొని హోదాలుగా చలామణి అవుతున్నాడు. పాలనలో ఏ పార్టీ వచ్చినా ఇలాంటి వారికి అండదండలందిస్తూ, ఊరుమ్మడి బతుకుల్ని నాశనం చేస్తున్న దుర్మార్గ ఆలోచనా విధానాన్ని పౌర, ప్రజాస్వామిక వాదులు తిప్పికొట్టాలి.

భరత్‌రెడ్డి లాంటి వారికి సరియైన శిక్ష పడితేనే తెలంగాణలో అభంగపట్నం పునరావృతం కావు. ఇప్పటికైనా ప్రభుత్వం తీవ్రంగా ఆలోచించి నిందితుడిని అరెస్టు చేసి దళిత బిడ్డలకు న్యాయం చేయాలి.

(2017 నవంబర్ 27న బహిష్కరణల వ్యతిరేక కమిటీ ఆధ్వర్యాన కన్వీనర్ దండి వెంకట్, ఎనిశెట్టి శంకర్ (తెరవే), రామ్మోహనాచారి (బిసి సంక్షేమ సంఘం జిల్లా ప్ర.కా.) సంజీవ్ (సిఐటియు కార్యదర్శి) అభంగపట్నం వెళ్లి తయారు చేసిన గ్రౌండ్ రిపోర్ట్) వీ

ఆదివాసి - లంబాడా వివాదం

ఆదివాసీలకూ, లంబాడీలకూ మధ్య జరుగుతున్న ఘర్షణను ప్రభుత్వం సామరస్యంగా పరిష్కరించకుండా, ఒకరిపై ఒకర్ని రెచ్చగొట్టే విధంగా వ్యవహరిస్తోందని అంటున్నారు **ఎం. రత్నమాల**

ఆదిలాబాద్ (పాత) జిల్లాలో ఆదివాసీలు, లంబాడాల మధ్య గత రెండు నెలలుగా సాగుతున్న ఘర్షణ తెలంగాణలోని ఖమ్మం మొదలైన ఏజెన్సీ ప్రాంతాలకే కాదు, ఆదిలాబాద్ జిల్లా (పాత) పొరుగున రెండు రాష్ట్రాల సరిహద్దు మహారాష్ట్రలోని ఏజెన్సీ ప్రాంతాలకు ఇప్పుడిప్పుడే విస్తరిస్తున్నది. 2017 అక్టోబర్ 6న జోడెన్‌ఘాట్‌లోని ఆదివాసి మ్యూజియంలో ఉన్న లంబాడా స్త్రీ విగ్రహాన్ని ఆదివాసీలు తగులబెట్టడంతో ఈ రెండు తెగల మధ్య ఘర్షణ మొదలైంది. ఈ ఘర్షణలకు మూలం 1976లో అప్పటి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లంబాడాలను ఆదివాసి తెగగా ప్రకటించింది. మహారాష్ట్ర ప్రభుత్వం లంబాడాలను ఆదివాసి తెగగా గుర్తించడం లేదు కనుక ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లంబాడాలను ఆదివాసి షెడ్యూల్డు తెగగా ప్రకటించడంతో దీన్ని అవకాశంగా తీసుకుని మహారాష్ట్ర నుంచి ఆదిలాబాద్ (పాత) జిల్లాకు లంబాడాల వలసలు పెద్ద ఎత్తున వెల్లువలా సాగాయి. ఈ వలసల ఉధృతి వల్ల అంతకు ముందు ఇక్కడ మైనస్ 2 శాతం మాత్రమే ఉన్న ఆదివాసీల జనాభా అభివృద్ధి రేటు ఒక్క 1976 సంవత్సరంలోనే 6 శాతం పెరిగింది. లంబాడాలను షెడ్యూల్డు తెగగా ప్రకటించడంతో మహారాష్ట్ర నుంచి వెల్లువెత్తిన లంబాడాల వలస కారణంగా జిల్లాలో ఒకే సంవత్సరంలో అంతకు ముందు మైనస్ జనాభా అభివృద్ధి రేటు ఇంత పెద్ద మొత్తంలో పెరగడానికి దారితీసింది. లంబాడాలను ఆదివాసి షెడ్యూల్డు తెగగా ప్రకటించడాన్ని అదివాసీలు అప్పుడే వ్యతిరేకించారు. ఆనాటి నుంచి ఈ విషయంపై ఆదివాసీల అసంతృప్తి గతంలో కూడా అనేక పర్యాయాలు ఆదివాసీలు బహిరంగంగా ప్రకటిస్తూ వస్తూనే ఉన్నారు.

ఆదిలాబాద్ కలెక్టరేట్ వద్ద కొన్నిసార్లు, హైదరాబాద్‌లోని ట్రైబల్ వెల్‌ఫేర్ కమిషనరేట్ వద్ద ఆందోళనలు చేశారు. నేను పౌరహక్కుల సంఘం అధ్యక్ష బాధ్యతల్లో ఉన్న కాలంలో రెండు సార్లు హైదరాబాద్‌లో మాసబ్ ట్యాంక్ పక్కన ఉన్న ట్రైబల్ కమిషనర్ కార్యాలయం వద్ద ఆదివాసీలు ఆందోళన చేసినప్పుడు నేను వారితో పాల్గొని కమిషనర్‌కి వినతి పత్రం ఇచ్చాం. ఇందువల్లనే గతంలో కూడా ఆదివాసీలకు ఈ విషయంపై ఆందోళన చేశారని చెప్పగలుగుతున్నాను.

అసలు ఆదివాసీలకు, లంబాడాలకు రూపురేఖల్లోనే శరీర వర్ణం, వస్త్రధారణ, ఆచార వ్యవహారాలు, మొత్తంగా ఈ రెండు వర్గాల సంస్కృతికి ఏమాత్రం పోలికలు లేవు. అభివృద్ధి విషయంలో కూడా మైదాన ప్రాంతాలతో సంబంధం ఉన్న లంబాడాలు విద్య, ఉద్యోగ, తదితర విషయాల్లో ఆదివాసీల కంటే ఎంతో ముందున్నారు. లంబాడాలను షెడ్యూల్డు తెగగా ప్రకటించిన తర్వాత ఆదిలాబాద్ (పాత) షెడ్యూల్డు తెగకు ప్రత్యేకించిన నియోజకవర్గాలన్నింటిలో ఎంఎల్ఎలు అత్యధికులు (పేరు చివరన రాథోడ్, నాయక్ కలిగినవారు లంబాడాలే) మండల, స్థానిక సంస్థల్లో కూడా లంబాడాలే అత్యధికంగా ఉన్నారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో, గురుకుల పాఠశాలల్లోని, వీటికి అనుబంధంగా ఉన్న విద్యార్థి వసతి గృహాల్లో దాదాపు 60 శాతానికి పైగా లంబాడాలు ఉంటున్నారు. 1992 – 1994 సంవత్సరాల్లో నేను ఆదిలాబాద్ జిల్లాలో దిన పత్రిక రిపోర్టర్‌గా పనిచేస్తున్న కాలంలో నేను జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి పరిశీలించిన, సేకరించిన సందర్భంలో నేను గుర్తించిన విషయం ఇది కనుకనే నేనీ విషయం స్పష్టంగా చెప్పగలుగుతున్నాను.

రాజ్యాంగంలోని 5వ షెడ్యూల్డు (సి) సెక్షన్ పేరా 13 ఆర్టికల్ 244 (1) ప్రకారం లంబాడా ఉద్యోగులు ఆదివాసి షెడ్యూల్డు ప్రాంతాల్లో ఉద్యోగానికి అనర్హులంటూ జిల్లాలోని లంబాడా ఉద్యోగులను ఈ ప్రాంతం నుంచి పంపించాలని ప్రస్తుతం ఆందోళన కొనసాగిస్తున్న ఆదివాసీలు డిమాండ్ చేస్తున్నారు. జైనూరు మండలంలోని మార్లవాయి పాఠశాలకు, ఆ తర్వాత నార్నూరు మండల కేంద్రంలోని పాఠశాలలకు ఆదివాసీలు తాళాలు వేశారు. అసలే అభద్రతా భావంతో ఉన్న ఆదివాసీలకు ప్రభుత్వ చర్యలు మరింత ఆజ్యం పోసినట్లయింది. అక్టోబర్ 6న ఆదివాసి మ్యూజియంలో లంబాడా స్త్రీ విగ్రహాన్ని తగలబెట్టారని పోలీసులు కేసు రిజిష్టర్ చేయడం, కొందరిని అరెస్టు చేయడం పట్ల నిరసనగా ఆదివాసీలు చేపట్టిన ర్యాలీకి అనుమతి ఇవ్వకుండా అడ్డుకున్న పోలీసు అధికారులు లంబాడాల ర్యాలీకి అనుమతించడం ఆదివాసీల ఆగ్రహానికి అజ్యం పోసినట్లయింది. ఈ దాంతో నవంబర్ 12న లంబాడాలు తలపెట్టిన మరో ప్రదర్శనను పోలీసులు అనుమతించలేదు.

నవంబర్ 8న ఇంద్రవెల్లి స్థూపం వద్ద నుంచి ఉట్నూరు ఐటిడిఎకు ఆదివాసీలు నిర్వహించిన రోజే లంబాడా అసోసియేషన్ ఆధ్వర్యంలో 25 మంది లంబాడా ఉపాధ్యాయులు ఐటిడిఎ ముందు ధర్నా చేశారు. ఇరు వర్గాల మధ్య ఐటిడిఎ ముందు తీవ్ర ఘర్షణ జరిగింది. అందుకే నవంబర్ 12న లంబాడాలు తలపెట్టిన సభకు పోలీసులు అనుమతి ఇవ్వలేదు. కాని అంతకు ముందు లంబాడాల ధర్నాకు ఆదివాసీలు అదే రోజు ప్రదర్శన ఉందని తెలిసి కూడా అనుమతులు ఇచ్చారు. ఇవన్నీ కూడా ప్రభుత్వం ఇరు వర్గాల మధ్య సామరస్యతకు ప్రయత్నించడం కంటే రెచ్చగొట్టే వ్యవహారంగానే కనిపించడంలో అవాస్తవమేమీ లేదు.

ఏ విధంగా చూసినా ఆదివాసీల ఆగ్రహంలో న్యాయం ఉంది. ఇంత కాలంగా ఆదివాసీల్లో ఈ విషయంపై రగులుతూ వస్తున్న అసంతృప్తి ఇప్పుడు కట్టలు తెంచుకుని ఆందోళన అలజడి ఇప్పుడు తీవ్ర స్థాయికి చేరింది. అంతేకాదు, గతకొంత కాలంగా వాల్మీకి బోయలు కూడా తమను ఆదివాసి షెడ్యూల్డు తెగగా ప్రకటించాలని డిమాండ్ చేస్తున్నారు. ఇట్ల ఒక తెగ తర్వాత మరో తెగ తమను ఆదివాసి షెడ్యూల్డు తెగగా

పెరిగిపోతున్న ఫాసిస్టు సాంస్కృతిక ఉన్మాదం

***ఫాసిస్టు బ్రాహ్మణీయ సంస్కృతే గొప్పదంటూ ఇతర సంస్కృతులను, మతాలను నిర్మూలించే విధానాలను అమలుపరుస్తూ దేశవ్యాప్తంగా నియంతృత్వాన్ని అమలు పరుస్తున్న హిందుత్వ పాలనా విధానాలను ప్రజాస్వామికవాదులు అడ్డుకోవాలని అంటున్నారు* అరణ్య**

ఒక జాతికి, సారూప్య మానవ సముదాయాలు కలిగిన భౌగోళిక ప్రాంతానికి సంస్కృతి అనేది జీవన విధానపు ప్రధాన సూచిక. సంస్కృతిని కలిగి ఉండడం, దాన్ని తయారు చేసుకోవడం, దానిలో మార్పులు చేసుకోవడం, దాన్ని రక్షించుకోవడం వంటి సాంస్కృతిక గమనంలోని అంశాలన్నీ తరతరాలుగా అనేక మానవ సముదాయాలలో కొనసాగుతూ వస్తున్నవి. ఏ ప్రాంతానికాప్రాంతం, ఏ జాతికాజాతి, ఏ అస్తిత్వానికా అస్తిత్వం విభిన్న సంస్కృతులను కలిగి ఉండే క్రమంలో సంస్కృతుల మధ్య ఏకరూపత, సారూప్యత ఉండడం సాధ్యం కాదు. సంస్కృతి ఆ విధంగా అనేక వేర్వేరు ఖండాలుగా ఉంటుంది కనుకే సంస్కృతి అఖండం కాదని అంటుంటాం. ఈ వివిధ సంస్కృతులు అవి మనుగడ సాగించే ప్రదేశాలలో నిరంతరం మార్పు చేర్పులకు గురవుతూనే ఉంటాయి. ఈ చలన శీలతవల్ల కొన్నిసార్లు తాత్కాలికం గాను, మరికొన్నిసార్లు శాశ్వతంగాను ప్రజల జీవన విధానాలలోను మార్పు సంస్కృతులను (చేంజ్ కల్చర్) సృష్టిస్తుంటాయి. ఈ మార్పు సంస్కృతులను ప్రభావితం చేసే విషయంలోని ప్రత్యేక సందర్భాలపై ఆధారపడి ఉంటుంది. మార్పు సంస్కృతులు స్థిరపడడం వల్ల ప్రధాన సంస్కృతిలో జరిగే మార్పులు ఒక దీర్ఘకాలాన్ని పరిశీలించి చూస్తే ప్రగతిశీలంగా ఉంటాయని, అవి అభ్యుదయం వైపే సాగుతుంటాయనేది మార్క్సిజం ప్రధాన సూత్రీకరణ. అయితే ఈ ప్రగతిశీల మార్పులు సాఫీగాను, రేఖామాత్రంగాను జరగవు. ఎప్పటికప్పుడు ప్రతి సందర్భం లోనూ తిరోగమన శక్తులు వాటిని అడ్డుకుంటూ వస్తాయి. ప్రగతి నిరోధకంగా మార్చాలని చూస్తుంటాయి. ఈ నిరోధక శక్తులు అనేక రూపాలలో అనేక లక్ష్యాల కోసం పనిచేస్తుంటాయి. అసలు సంస్కృతిలో ఎలాంటి మార్పులూ అవసరం లేదని, జరిగిన మార్పులన్నీ మూల సంస్కృతిని విఘాత పరుస్తాయని, కనుక మూల సంస్కృతిని పునః స్థాపించాలని కొన్ని శక్తులు పనిచేస్తుంటాయి. మళ్లీ వాటిలో కూడా హెచ్చుతగ్గుల ఆలోచనలుంటాయి. లక్ష్యాలుంటాయి. ఇక మరికొన్ని శక్తులు మార్పులు అవసరమేగానీ అవి మూల సంస్కృతికి అనుబంధంగా ఉండాలని, అట్లా ఉంటూ ఎన్ని మార్పులకు గురైనా సమ్మతమేనని భావించే శక్తులుంటాయి. ఇంకొన్ని శక్తులు మార్పులు సమూలంగా జరిగినా ఫర్వాలేదుగానీ అవి ప్రగతిశీలంగా అంటే సామ్యవాదం, కమ్యూనిజం వంటి లక్ష్యాల దిశగా మాత్రం ఉండకూడదని ఇతర లక్ష్యాలకు లోబడి ఉంటే ఏమీ అభ్యంతరం లేదని భావిస్తుంటాయి. ఈ ధోరణులే కాకుండా ఇంకా అనేకానేక ధోరణులు సందర్భానుగుణంగా మార్పులను నిరోధించడానికి ప్రయత్నిస్తుంటాయి. ఈ ఒడిదుడుకు లన్నింటి మధ్య జరిగే ప్రయాణంలో విభిన్న సంస్కృతుల అస్తిత్వాలు సంక్షోభాలకు గురవుతూ ముందుకు పోతుంటాయి. సాధారణంగా ఈ సమయంలోనే ఒక సంస్కృతి మీద మరో సంస్కృతి పెత్తనం నెరిపే సాంస్కృతిక ఆధిపత్యాలు తలెత్తుతుంటాయి. ఇక అప్పటినుండి ఈ సాంస్కృతిక ఆధిపత్యం కూడా ప్రగతిశీల మార్పులకు ఒకానొక ప్రతిబంధకంగా ఉంటూ వస్తుంది.

సాంస్కృతిక ఆధిపత్యం ప్రధానంగా సాధించే అంతిమలక్ష్యం ఏమిటంటే ఒక సంస్కృతిని అనుసరించే మనుషులపై దోపిడి నెరపడం. ఒక మానవ సముదాయంపై దోపిడి సాగించడం అనేది అనేక రూపాలలో జరుగుతుంది. యుద్ధాలలో చంపడం, భౌతిక దోపిడి, ప్రాంతాలు దేశాలను ఆక్రమించుకోవడం, అవసరానికి మించి ఆస్తులు సంపాదించడం వంటి ఎన్నో రూపాలలో దోపిడి జరుగుతుంది. ఇంకా లోతులో చెప్పుకోవాలంటే పరిణామక్రమంలో మానవ సమాజంలో భూస్వామ్యం ఏర్పడడం, పెట్టుబడిదారీ వ్యవస్థ ఏర్పడడం, సామ్రాజ్య వాదానికి దారితీయడంతో పాటు అసలు మొత్తంగా రాజ్యం ఆవిర్భావమే దోపిడి కొరకు దోపిడిని స్థిరపరిచే లక్ష్యం కొరకు జరిగిందనే కోణం కూడా ఉంది. ఇవన్నీ దోపిడి రూపాలుగా కొనసాగుతూ చరిత్ర పొడుగునా దోపిడి నిరాఘాటంగా సాగడానికి ఈ రూపాలన్నీ మానవ సముదాయా లను నియంత్రించి గుప్పిట్లో పెట్టుకునే ఆధిపత్య సాధనాలుగా పనిచేస్తూ

ప్రకటించాలని అంటూపోతే చివరికి తమ పరిస్థితి ఏమిటని ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. లంబాడాలు కొంత కాలంగా తమను లంబాడాలు అనవద్దని, గోర్బాయిలు (గోరా – ఎరుపు వర్ణం) అనాలని అంటున్నారు. కానీ, ప్రస్తుతం ఆదివాసీలతో ఘర్షణ పడుతున్న లంబాడాలు తాము చేస్తున్న ఆందోళనలన్నీ లంబాడా ఉపాధ్యాయ సంఘం – లంబాడా ఉద్యోగుల సంఘాల ఆధ్వర్యంలోనే చేస్తున్నారు. కనుక నేను కూడా ఇక్కడ లంబాడాలనే పేర్కొంటూ రాయాల్సి వచ్చింది. లంబాడాలని షెడ్యూల్డు తెగగా ప్రకటించారు గనుక ఇక్కడ మాత్రం గోర్బాయిలు అనాలనే వాదన తెలివిగా దాటవేస్తున్నారు లంబాడాలు. ఎంతైన మైదాన ప్రాంతాల సంబంధంతో అబ్బిన తెలివి తేటలు కదా లంబాడాలవి. వెనక్కి పోతున్న కొద్దీ ఎప్పటికప్పుడు మారుమూలలకు నెట్టివేయబడుతున్న ఆదివాసీలు విగ్రహం తగలబెట్టారన్న ఐదుగురు ఆదివాసీలను అరెస్టు చేయడం వాళ్లను మరింత రెచ్చగొట్టడమే. ఈ అరెస్టు తర్వాతనే ఆదివాసీలు లంబాడా టీచర్లు వెళ్లిపోవాలంటూ పాఠశాలలకు తాళాలు వేశారు. దొంగే దొంగ అని అరిచినట్లు లంబాడాలు ఒక ఆదివాసి (కొలామ్ తెగ) యువకున్ని కొట్టి అతని వద్ద ఉన్న సెల్‌ఫోన్, డబ్బులు లాక్కున్నారు. ఇది పిర్యాదు చేసినా పోలీసులు ఏ చర్యా తీసుకోలేదు. ఇవన్నీ చూసి ప్రభుత్వం లంబాడాలతో కుమ్మక్కయిందని ఆదివాసీలు అనుకోవడంలో అవాస్తవమేమీ లేదు. వీ

(రచయిత విరసం సభ్యురాలు)

వచ్చాయి. అది ఏ రూపాంలో ఉన్నాసరే, ఆధిపత్యం అనేది మాత్రమే దోపిడికి అవకాశమివ్వగలదనే ప్రధాన మార్గం అవుతూ వచ్చింది.

ఈ ఆధిపత్యం అన్ని ఇతర అంశాలలో వలెనే సంస్కృతి విషయం లోనూ బలహీన సముదాయాలను, జాతులను, ప్రాంతాలను, కులాలను, మతాలను వెనక్కినెడుతుంది. సాంస్కృతిక ఆధిపత్యం ఆయా వర్గాల సంస్కృతులను ప్రత్యక్షంగానో పరోక్షంగానో అణిచివేస్తుంటుంది. ఒక సంస్కృతి లోపల అంతర్గతంగా ఉండే విభిన్న పురోగామి తిరోగామి శక్తుల మధ్య పోరాటం లేదా పోటి కొనసాగుతూనే వేర్వేరు సంస్కృతుల మధ్య జరిగే పోరాటం లేదా పోటి రూపంలో ఈ సాంస్కృతిక ఆధిపత్యం బహిర్గతమవుతుంది. సాంస్కృతిక ఆధిపత్యం కొనసాగే సమయంలో కొన్ని ముఖ్యమైన ఫలితాలు చోటుచేసుకుంటాయి. ఒక సంస్కృతిలో తిరోగామి శక్తుల భావజాలం బలోపేతమైనపుడు ఆ సంస్కృతి ప్రగతి నిరోధక సంస్కృతిగాను పురోగామి శక్తుల భావజాలం బలోపేతమైనపుడు ప్రగతిశీల సంస్కృతిగాను అప్పటి సందర్భంలో లక్షణాన్ని కనబరు స్తుంటుంది. అలాంటి లక్షణాలు సంతరించుకున్న సంస్కృతుల మధ్య పోటీలో ప్రగతిశీల సంస్కృతి ప్రగతి నిరోధక సంస్కృతిపై ఆధిపత్యం నెరిపే సందర్భంలో తాత్కాలికంగా వాటిమధ్య జరిగే ఘర్షణల్లో ప్రగతిశీల అంశాలే ఇరు సంస్కృతులనూ ఆవహిస్తాయి. కనుక ఆ మార్పు ఆధిపత్య ఫలితంగా జరిగిననూ అది ఒక మేలైన ఫలితాన్నే ఇస్తుంది. ఇక ప్రగతి నిరోధక సంస్కృతి ప్రగతిశీల సంస్కృతిపై ఆధిపత్యం నెరిపేటప్పుడు ప్రగతి నిరోధ లక్షణాలు పైచేయి సాధిస్తాయి. అది ఒక తిరోగమన ఫలితాన్నిస్తుంది. అయితే ఈ రెండు ఆధిపత్యాల సందర్భాలలోను ప్రగతిశీల సంస్కృతి జరిపే ఆధిపత్యం లేదా అస్తిత్వ పోరాటం ప్రగతిశీల లక్ష్యం కోసం జరిగేది కాబట్టి ఒక ఆవశ్యకరూపంగాను, ప్రగతి నిరోధక సంస్కృతి చేసే ఆధిపత్యం లేదా పోరాటం ప్రగతిశీల స్వభావాన్ని దెబ్బతీసే లక్ష్యం కోసం కనుక ఒక ఉగ్రవాదరూపంగాను మానవ సముదాయం ముందుకు వస్తాయి. ఆ ఉగ్రవాదం సాంస్కృతిక ఉగ్రవాదంగా ప్రజల సంస్కృతుల మీద ప్రభావం చూపిస్తుంది.

ఇటలీ, జర్మనీలలో సాంస్కృతిక ఉగ్రవాదం

పైన చర్చించిన సాంస్కృతిక ఉగ్రవాదం ఒక భౌగోళిక ప్రాంతంలోని జాతుల మధ్య ఏవిధంగా పనిచేస్తుందో, మానవ సంస్కృతుల హననానికి ఏ విధంగా పాల్పడుతుందో ఇటలీ, జర్మనీ ఉదాహరణలుగా చూద్దాం!

సాంస్కృతిక ఉగ్రవాదం మొదట తన సంస్కృతి పట్ల మితిమీరిన అభిమానాన్ని ప్రజలలో ప్రేరేపిస్తుంది. ఇటలీలో ముస్సోలిని కంటే ముందు పరిపాలించిన ఇటాలియన్ పార్లమెంటరీ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి, కార్మికులకు ఎలాంటి అభివృద్ధిని అందించలేదు. దాంతో ప్రజలలో ప్రభుత్వం పట్ల నిరాశ ఏర్పడింది. ఈ పరిస్థితుల్లో వలస రాజ్యాలను పొందేందుకు మొదటి ప్రపంచ యుద్ధంలోకి ఇటలీని దింపింది. కానీ యుద్ధం తర్వాత జరిగిన ఒప్పందాలు ఇటలీకి ఆశావహంగా లేకపోయే సరికి సోషలిస్టు భావాలు ప్రజలలో పెరిగాయి. ఇటలీ సమాజంలో అట్టడుగు వర్గాల్లో సోషలిస్టు చైతన్యం పెరుగుతూ వచ్చింది. ఓవైపు శ్రామికవర్గ సంస్కృతి మరోవైపు ఇటలీలో భూస్వాముల వలస రాజ్యాలను కోరుకునే పెట్టుబడిదారుల సంస్కృతి స్పష్టమైన విభజన రేఖను తీసుకునే వైపు ఆ చైతన్యం కొనసాగుతూ వస్తున్న సమయంలో పెట్టుబడిదారి వర్గమంతా ప్రజాస్వామ్య వ్యతిరేక సోషలిస్టు వ్యతిరేక ఉద్యమ నాయకత్వాన్ని కోరుకున్నారు. ముస్సోలిని నాయకత్వంలో సోషలిస్టు ప్రాతిపదికన అధికారానికి వచ్చిననూ ఆ తర్వాత ఆ సిద్ధాంతాన్ని వదిలిపెట్టి విపరీతమైన హింసతో, గూండాయిజంతో నియంతృత్వ ఏకఛత్రాధిపత్య అధికార వ్యవస్థతో ముస్సోలిని ఇటలీలో తిరుగులేని నియంత అయ్యాడు. సోషలిస్టు చైతన్యాన్ని, చిగురిస్తున్న శ్రామికవర్గ సంస్కృతిని నాశనం చేశాడు. ఈ హామీని పొందింది కనుకే అధికారాన్ని ముందు పెట్టుబడిదారి వర్గమంతా ముస్సోలినిని తీవ్రంగా బలపరిచింది.

అలాగే ఫాసిస్టు సంస్కృతిలో దేశాన్ని వృత్తి సంఘ సిండికల్ రాజ్యంగా మార్చడం ఒక దశ అని హామీ ఇచ్చి అధికారానికి ముందు ఫాసిస్టులు మధ్య తరగతి వర్గం, చిన్న స్థాయిలోని వృత్తుల ప్రజలు, దుకాణ యజమానులు మొదలైన పెటిబూర్జువా వర్గ మద్దతును కూడగట్టింది. ఓవైపు తమను పీడించే పెట్టుబడిదారి వర్గం ఫాసిస్టులకు మద్దతిస్తున్ననూ మధ్యతరగతి వర్గం అదే ఫాసిజాన్ని బలపరచే పరిస్థితి ఇక్కడి వైరుధ్యం. తర్వాత సామాజిక మేధావి వర్గంగా గుర్తింపుకోసం తాపత్రయపడే బొహిమీలు అనే మేధావులు ఫాసిజానికి ఆకర్షితులైనారు. జర్నలిస్టులుగా, కవులుగా, నాటక కర్తలుగా, ప్రచురణ కర్తలుగా గుర్తింపు కోరుకునే స్వార్థపూరిత ఈ బొహిమీలను ఫాసిజం చేరదీసింది. మరోవైపు దేశభక్తి, జాతీయవాదం అంటూ పదేపదే మాట్లాడే మాజీ సైనికోద్యోగులు వాలంటీర్లను ఫాసిజం తనవైపుకు తిప్పుకుంది. ఉద్యమాలంటే స్వతహాగానే నచ్చని సైన్యం కూడా మొత్తంగా ఫాసిజం వైపుకు వచ్చింది. ఆ విధంగా వివిధ వర్గాల మద్దతుతో ముస్సోలిని అధికారాన్ని పొందాడు. ఫాసిస్టులు అనుసరించిన సంస్కృతిలో మతానికి విధేయులుగా ఉన్నారు. అధికారంలోకి రాకముందు, వచ్చాక కొంతకాలం చర్చిపట్ల విధేయులుగా ఉన్నారు. కానీ ఆ తర్వాత ముస్సోలిని మతాన్నే తలదన్నే నియంతగా ఎదిగిపోయాడు. కేథలిక్ పార్టీని తొలగించే దశకు చేరుకున్నాడు. అంటే అతని ఫాసిజం ఇటలీకి ఏకవ్యక్తి నియంతృత్వాన్ని అందించింది.

ఈ చర్యలన్నింటిని ఫాసిస్టు సంస్కృతి అన్నాడు ముస్సోలిని. ఫాసిస్టు సాంస్కృతిక మూలాలు ఈ మితిమీరిన జాతిభావనలో ఉన్నాయని అన్నాడు. అందుకే ఈ సంస్కృతిని అమలుపరిచే క్రమంలో ఇటలీలో శ్రామికవర్గ సంస్కృతులు ధ్వంసమైనాయి. ప్రాచీన రోమ్ సామ్రాజ్య వైభవాన్ని పునరుద్ధరించాలని, అందుకు మొదటగా పరాయి భూములను ఆక్రమించుకుని వారి సంస్కృతులను ధ్వంసం చేయాలని ఫాసిస్టులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం అంతటినీ ఉగ్రజాతీయవాద సంస్కృతిగా ఫాసిస్టు సంస్కృతిగా ముందుకు తెచ్చి ఇటలీలోని అన్ని ప్రజాసమూహాలు సాంస్కృతిక సమూహాలు దీన్ని ఖచ్చితంగా అనుసరించాలని లేకుంటే వారంతా ద్రోహులుగా పరిగణించబడి శిక్షింపబడతారని హెచ్చరించారు. అట్లా ఫాసిజాన్ని అనుసరించని సమూహాలపైన ఫాసిస్టులు హింసలకు, దాడులకు తెగబడ్డారు. అధికార బలంతో వారిని తీవ్రంగా అణగదొక్కారు. ఒక ప్రజా సమూహానికి ఫాసిజం తప్ప మరేవిధమైన సాంస్కృతిక అస్తిత్వం లేనంతగా ఆ అణచివేత కొనసాగింది. సోషలిజం కమ్యూనిజం అనే మాటలే వినపడకూడనంతగా భయానక వాతావరణాన్ని ఫాసిజం సృష్టించింది. అట్లా ఇతర సంస్కృతులను నిర్మూలించేందుకు ఫాసిజం ఇటలీలో సాంస్కృతిక ఉగ్రవాదాన్ని ప్రారంభించి కొనసాగించింది.

సరిగ్గా ఇదే సాంస్కృతిక సారూప్యతను కూడా నాజిజం కూడా ప్రదర్శించింది. సున్నిత మనస్కులైన జర్మన్‌లను తీవ్ర జాతీయవాద భావాలతో హిట్లర్ ఆకట్టుకున్నాడు. నేషనలిజానికి మిలిటరికి తేడా తొలగిపోయేంత తీవ్రంగా జాతీయవాద స్వరూపాన్ని హిట్లర్

మార్చివేశాడు. 1928-45 మధ్య జపాన్లో, ముస్సోలిని నాటి ఇటలీలో కూడా ఈ తేడాలు తొలగిపోయే పరిస్థితి ఏర్పడింది. 'జర్మన్ ప్రజలు స్వచ్ఛమైన ఆర్యజాతికి చెందినవారు. అలాంటివారు నివాస స్థలం లేక ఇబ్బందులు పడుతున్నారు.' అని మీన్‌కాంఫ్‌లో హిట్లర్ ప్రజలను రెచ్చగొట్టాడు. 'పరాయి వారి పట్ల శాంతి విధానం ప్రమాదకరమైంది. ఎందుకంటే అది జాతిని నిర్వీర్యం చేస్తుంది' అన్నాడు. జర్మన్ సర్వోన్నత జాతి కోసం పరాయి జాతులను తుడిచిపెట్టే దుర్మార్గ పథకాలను హిట్లర్ రచించాడు. యూదులను అన్యజాతీయులని, హీనజాతీయులని చెప్తూ వారిని సంపూర్ణంగా నిర్మూలించాలంటాడు.

వేలాది మంది యూదులపై హత్యలు, అత్యాచారాలకు పాల్పడ్డారు నాజీలు. యూరప్ సంస్కృతిని, యురోపియన్ నాగరికతను రక్షించే పరిరక్షకులం తామేనంటూ కమ్యూనిజాన్ని దానికి శత్రువుగా చూపుతూ సోవియట్ యూనియన్ పైన దండెత్తారు. ఇటలీలో లాగానే దేశంపట్ల, అలాగే జాతిపట్ల తీవ్రజాతీయ భావాలను రెచ్చగొట్టారు. సంకుచిత భావాలను ప్రజలలో ప్రేరేపించారు. జాతీయవాదమంటే కేవలం మన జాతిపై ప్రేమ ఉండడమే కాదు, ఇతర జాతుల కంటే మనజాతే గొప్పదనే నిరూపణ ఉండాలని, అందుకుగాను ఇతర జాతులను నాశనం చేయమని ప్రచారం చేశారు. దేశం కోసమే వ్యక్తి ఉన్నాడు తప్ప వ్యక్తి కోసం దేశం కాదన్నారు. ఇది వ్యక్తి స్వేచ్ఛావ్యతిరేకవాదం.

ఇటలీలో ఫాసిస్టులు అధికారంలోకి రాకముందు మధ్యతరగతి వర్గంతో, చర్చితో రాజీ చేసుకుని అధికారానికి వచ్చాక వారిని శత్రువులుగా చూసినట్లే జర్మనీలో నాజీలు అధికారానికి ముందు సోషల్ డెమోక్రటిక్‌లు బలపడుతున్న దశలో జర్మన్ కమ్యూనిస్టులతో, సోవియట్ యూనియన్‌తో స్నేహం పెంచుకుని, అధికారం వచ్చాక కమ్యూనిస్టులను శత్రువులుగా చెప్తూ హింసలకు గురిచేశారు. సెమెటిక్ జాతి సంస్కృతిని, దాన్ని అనుసరించే యూదులను జర్మనీ సమస్యలన్నింటికీ కారణంగా చూపి వారిపై నరమేధం సృష్టించారు. జర్మనీ పాడైపోవడానికి ఈ సంస్కృతే కారణమని నిందిస్తూ పూర్వ జర్మన్ సంస్కృతి పునరుద్ధరణ కోసం యూదు నిర్మూలన గావించాలంటూ జర్మనీలోనే కాక యూరప్ మొత్తంలోనూ లక్షలాది మంది యూదులను నాజీలు హత్యచేశారు. జర్మనీలో నాజీ పార్టీలో జీవితంలో విఫలమైనవారు, పురాతన సంపన్నవర్గాలు, పూజారులు, పట్టణ ప్రజలు, పెటిబూర్జువాలు, వర్తకులు మొదలైనవారు చేరారు. జర్మనీ సామాజిక వ్యవస్థలోని సమస్యలకు పరిష్కారాలుగా ఆత్మగౌరవం, వ్యక్తిపూజ, యూదు వ్యతిరేకత, కమ్యూనిస్టు వ్యతిరేకతలను చూపారు. నోర్డిక్ జాతి ఆర్య సంస్కృతిని జర్మనీ అంతా విస్తరించాలని, యూదు, స్లావ్, జిప్సి వంటి జాతులను రోమన్ కాథలిక్ మతాల వారిని సంహరించాలని నాజీలు పిలుపునిచ్చారు.

ఈ చర్యలన్నింటిని జర్మనీలో నాజీ సంస్కృతి పేరిట ప్రచారం చేసి ఇటలీలో వలెనే నాజి సంస్కృతిని వ్యతిరేకించిన వారిని నాజీలు క్రూరంగా చంపేవారు. జర్మనీలో నాజీ సంస్కృతి అంటే అన్యజాతుల వ్యతిరేకమైన ఆర్యజాతి సంస్కృతి.

ఇక్కడ ఒక ప్రధానమైన విషయాన్ని చెప్పుకోవాలి. వాస్తవానికి ఇటలీలో ఫాసిజానికి, జర్మనీలో నాజీజానికి స్వంతంగా సంస్కృతిగా ఏర్పడే ప్రాతిపదిక లక్షణాలు లేవు. అంటే సంస్కృతి పుట్టుకకు, పెరుగుదలకు, మనుగడకు, గమనానికి ఆధారభూతమైన లక్షణాలు వాటికి లేవు. అయినా వాటిని సంస్కృతులుగా చెప్తూ, ఆ సంస్కృతులను ఇతర సంస్కృతులకు శత్రువుగా చూపుతూ ఆ ఇతర సంస్కృతులను ధ్వంసం చేసే నిర్మూలించే కార్యాచరణగా సాంస్కృతిక ఉగ్రవాదాన్ని ఫాసిస్టులు నాజీలు ప్రయోగించారు. వారి కృత్రిమ సంస్కృతులు ఆయా పార్టీల సిద్ధాంతాలు, వ్యక్తులు నిర్దేశించిన సూత్రాలేనని ఆధునిక చరిత్రకారులు, సోషల్ ఆంత్రోపాలజిస్టులలో కొందరు భావిస్తున్నారు.

సంఘ్ పరివార్ సాంస్కృతిక ఉగ్రవాదం

ఫాసిజం, నాజీజంల వలెనే హిందూయిజం లేదా హిందుత్వలకు సహజ సంస్కృతి లక్షణాలు లేవు. ఒక ఉమ్మడి ప్రజా సమూహంగా ప్రజలు హిందూ ప్రజలుగా జీవించినట్లు చారిత్రక ఆధారాలు లేవు. ఈనాడు కూడా హిందూ సంస్కృతి అనే ఉమ్మడి సంస్కృతి లేదు. అందులో వివిధ కులాల, వృత్తుల, శ్రమల సంస్కృతులు వేర్వేరుగా ఉన్నాయి గానీ అవన్నీ కలగలిసిన ఉమ్మడి హిందూ సంస్కృతి ఊహామాత్ర మైనదే గానీ అస్తిత్వంలో మాత్రం ఎక్కడా ఏనాడు లేదు. కానీ సంఘ్ పరివార్ మాత్రం హిందూ సంస్కృతి గురించి మాట్లాడుతుంది. దాన్ని పరిరక్షించాలని గొడవలు చేస్తుంది. లేని సంస్కృతి కోసం దశాబ్దాలుగా మారణకాండలు సృష్టిస్తున్నది. ఇదంతా హిందూ సంస్కృతి ముసుగులో బ్రాహ్మణీయ సంస్కృతిని అమలుపరచడం కోసమేనని మనం గుర్తించాలి.

రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్‌ను 1925లో హెగ్డేవార్ స్థాపించాడు. కాంగ్రెస్ భావాలు నచ్చక బైటకు వచ్చి సావర్కర్ అతివాద బోధనలతో ప్రభావితమై ఆర్ఎస్ఎస్‌ను స్థాపించాడు. ఈ సావర్కర్ జిన్నాకంటే పదిహేనేళ్ల ముందే 1923లో ద్విజాతి సిద్ధాంతాన్ని ప్రతిపాదించాడు. తర్వాత 1938లో గోల్వాల్కర్ సంఘ్ ప్రధాన కార్యదర్శిగా నియమించ బడ్డాక ఈ సిద్ధాంతాన్ని బలపరిచాడు. ఈ సిద్ధాంతంలో ప్రధాన అంశం ఏమిటంటే హిందూ-ముస్లిం సంస్కృతులు పూర్తిగా వేర్వేరు సంస్కృతులు కనుక అవి కలిసి ఉండలేవు అనేది ప్రధాన సూత్రీకరణ. అందుకుగాను హిందూ సంస్కృతి గురించి, 'హిందుస్తాన్‌లో జీవిస్తున్న పరాయి జాతులు అనివార్యంగా హిందూ సంస్కృతిని, భాషను అలవర్చుకోవాలి. హిందూ జాతిని, సంస్కృతిని అంటే హిందూ జాతి ఘనతను కీర్తించడం తప్ప మరో ఆలోచనే వారు మనసులోకి రానివ్వకూడదు. వారందరూ హిందూ జాతిలో విలీనమయ్యేందుకు వీలుగా తమ ప్రత్యేక అస్తిత్వాలను విడనాడాలి. ఈ దేశంలో వారు జీవించాలంటే పూర్తిగా హిందు జాతికి లోబడి ద్వితీయ శ్రేణి పౌరులుగా ఎలాంటి హక్కులు, అధికారాలు, గుర్తింపులు, చివరకు పౌరహక్కులు కూడా అడగకుండా బతకాలి. వారికి అంతకంటే గత్యంతరం లేదు. మనది అత్యంత ప్రాచీన జాతి.

అందువల్ల మనదేశంలో నివసించే పరాయి జాతుల పట్ల ప్రాచీన జాతులు వ్యవహరించాల్సిన విధంగా వ్యవహరిద్దాం' అన్నాడు. ఈ క్రమంలో ఆయన తమ సంస్థ ముస్లింలను సమూలంగా నిర్మూలించాలని జర్మనీ ఉదాహరణగా చెప్పాడు. 'తన జాతి సంస్కృతుల పవిత్రతలను కాపాడుకునేందుకు గాను జర్మనీ మధ్య ప్రాచ్య జాతీయులైన యూదులను సమూలంగా నిర్మూలించి ప్రపంచానికి దిగ్భ్రాంతి కలిగించింది. అది అత్యున్నత స్థాయిలో జాతీయాభిమానాన్ని ప్రదర్శించిన అంశం ఇదే. అనేక ప్రాథమికాంశాలలో తేడాలున్న జాతులు ఒక దేశంలో కలిసిమెలిసి ఐక్యంగా ఉండడం అసాధ్యమని జర్మనీ చక్కగా నిరూపించింది. మనం కూడా ఈ గుణపాఠాన్ని అనుసరించి లబ్ది పొందవలసి ఉంటుంది.'

అంటే ఆర్ఎస్ఎస్, సంఘ్ పరివార్ దృష్టిలో సంస్కృతి అంటే హిందూ సంస్కృతే, ముస్లింలను సమూలంగా నిర్మూలించే సంస్కృతే, ఆ సంస్థల ఆచరణీయ సంస్కృతి అని చాలా స్పష్టంగా చెప్పుకున్నారు. అంతేగాక

ముస్లింలను ఏకోశాన సమర్థించిననూ అలాంటి వ్యక్తులను నిర్మూలించే సంస్కృతి సంఘ్ పరివార్‌ది. దేశ విభజన సమయంలో గాంధి ముస్లింలకు మద్దతిచ్చాడనే ఆరోపణతో గాంధీని కాల్చి చంపారు. వల్లభ్‌భాయ్ పటేల్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి రాసిన లేఖలో 'గాంధిని ఆర్‌ఎస్‌ఎస్ చంపిందన డానికి నా దగ్గర ఆధారాలున్నాయి' అని రాశాడు. గాంధీ హత్య సందర్భంగా ఆర్‌ఎస్‌ఎస్ స్వీట్లు పంచుకున్నది డెబ్బై ఏళ్ల తర్వాత ఇవ్వాళ గౌరీలంకేశ్‌ను చంపి కూడా స్వీట్లు పంచుకున్నది. అధికారికంగా, చట్టబద్ధంగా మనుషులను నిర్మూలించే స్థాయికి చేరడం ఈ హత్యా సంస్కృతిలో ఆర్‌ఎస్‌ఎస్ సాధించిన దుర్మార్గమైన పరిణతి.

మొదటి నుంచీ ఆర్‌ఎస్‌ఎస్, సంఘ్ పరివార్‌లు అనేక చారిత్రక వక్రీకరణలతో వాదిస్తున్నదేమిటంటే ఈ దేశం హిందువులదేనని. తవ్వకాల్లో సింధు నాగరికత ఆనవాళ్లు బయటపడే నాటిదాకా భారతదేశ చరిత్ర ఆర్య నాగరికతతోనే ప్రారంభమయ్యేది. కానీ ఆర్య నాగరికత కంటే ముందే అభివృద్ధి చెందిన నాగరికతగా సింధు నాగరికత నిదర్శనాలు బయటపడ్డాక కూడా ఆర్‌ఎస్‌ఎస్ సంఘ్ పరివార్‌లు తమ ఆలోచనా సరళిని మార్చుకోలేదు. పైగా సింధు ప్రజలు కూడా ఆర్యులేనన్నారు. ఆర్యుల వలస సిద్ధాంతాన్ని అంగీకరించకుండా ఈ దేశస్థులే అయిన ఆర్యులు బయటి ప్రాంతాలకు వెళ్లి మళ్లీ తిరిగివచ్చారని బుకాయించారు.

ఈ దేశం ఆర్యుల, హిందువుల మూల నివాసం కనుక ఇప్పుడు కూడా ఈ దేశం హిందువులదేనని, ఇతరులకు ఇక్కడ చోటు లేదని వాదిస్తున్నారు. కాలమధ్యంలో దండెత్తిన ముస్లిం రాజుల వల్ల ఈ దేశ సంస్కృతి, వారసత్వాలు దెబ్బతిన్నాయని వాటిని తిరిగి స్థాపించేందుకు దేశంలో ఉన్న ముస్లిం సంస్కృతిని, వారసత్వాలను నిర్మూలించే పని ప్రారంభించాలని చూస్తున్నారు. ఇస్లాం, క్రైస్తవాలు విదేశీ మతాలు కనుక వాటికి ఇక్కడ చోటు లేదంటున్నారు. ఈ దేశంలోనే పుట్టి ఆర్య బ్రాహ్మణతత్వాన్ని హిందూ మతాన్ని ప్రశ్నించిన బౌద్ధాన్ని జైనాన్ని హిందూ మతంలో దుర్మార్గంగా కలిపేసుకున్నారు. హిందు ధర్మాన్ని వ్యతిరేకించిన బుద్ధున్ని అదే హిందు అవతారాలలో ఒక అవతారంగా మార్చేశారు. ఇదీ సంఘ్ పరివార్ సంస్కృతి. వాస్తవాలతో సంబంధం లేకుండా చరిత్ర హిందువులదేనని దబాయించడం, వీలున్న ప్రతిచోట ఆ వాస్తవాలను తమకనుకూలంగా మార్చివేయడం. ప్రతిచోటా ఇదే ఫార్ములా.

అసలు ఇస్లాం, క్రైస్తవ, బౌద్ధ మతాల లాగా హిందూ సంస్కృతి స్వతంత్రమైన సంస్కృతి కాదు. ఇందులో ఒకే ఒక హిందూ సంస్కృతి అనే సింగిల్ ఐడెంటిటి రూపం లేదు. ఎందుకంటే హిందూ మతంలో కులాలున్నాయి. ఆ కులాలకు స్వంత అస్తిత్వాలున్నాయి. స్వంత సంస్కృతులున్నాయి. కానీ ఈ కులాలన్నీ కలిసి ఆ కులాలన్నింటికీ ఉమ్మడిగా ఒక సారూప్య సంస్కృతిని సృష్టించుకోవడం అనేది ఎక్కడా జరగలేదు. అందుకే హిందు మతానికి ప్రామాణిక సంస్కృతి ఏది? అని ప్రశ్నించుకున్న ప్రతిసారి వాళ్ల సాహిత్యం, చరిత్ర స్పష్టంగా చెప్తున్న సమాధానం – బ్రాహ్మణీయ సంస్కృతి అని. అంటే ఉన్న కులాల్లోనే ఒక కులం సంస్కృతి, మొత్తం హిందుమతం సంస్కృతిగా స్థిరీకరించబడింది. అసలైతే దీన్ని విపులంగా చెప్పుకోవాలి.

బ్రాహ్మణీయ సంస్కృతి సమాజంలో స్థిరపడిన తర్వాత వాళ్లు దూరంగా ఉంచిన ఇతర ప్రజా సమూహాలు వాళ్ల జీవన విధానాల ఆధారంగా కాలక్రమంలో స్వతంత్ర సంస్కృతులను ఏర్పరచుకున్నాయి. అవి శ్రమ సంస్కృతులు, ఉత్పత్తి సంస్కృతులు అయ్యాయి. సహజంగానే తమను బానిస సంస్కృతులుగా మార్చిన సంస్కృతిని అవి ప్రశ్నిస్తున్నాయి. తిరుగుబాటు చేస్తున్నాయి. ఇక్కడ చెప్పుకోవాల్సిందేమిటంటే బ్రాహ్మణీయ సంస్కృతి హిందూ మతానికి మూల సంస్కృతిగా మారినప్పటి నుండి ఇతర సంస్కృతులను దెబ్బకొట్టడానికి సాంస్కృతిక ఉగ్రవాదాన్ని ప్రయోగిస్తూ వచ్చింది. వాటిని అనాగరిక సంస్కృతులుగా ప్రచారం చేస్తూ ఆ సంస్కృతిలో భాగాలైన కట్టుబాట్లు భాష, సాంప్రదాయాలు, ఆహార అలవాట్లు వంటి ప్రతిభాగంపైనా అంటరాని ముద్రవేసి ఆ సంస్కృతులను వెలివేసి వాటిని ఎదగనీయకుండా వాటన్నింటిపైనా బ్రాహ్మణీయ సంస్కృతి ఆధిపత్యం నిరంతరం ఉండేలా చూడడానికి సాంస్కృతిక ఉగ్రవాదాన్ని హిందూ సంస్కృతి సాధనంగా చేసుకుని వాడుతూ వచ్చింది. ఇప్పటికీ ఆ సాంస్కృతిక ఉగ్రవాదం అనేక రూపాలలో కనిపిస్తూనే ఉన్నది.

ఏనాడూ ఉత్పత్తిలో పాల్గొనని వర్గం ఉత్పత్తి సాధనాలను గుప్పెట్లో ఉంచుకుని సామాజిక ఆధిపత్యం నెరపుతున్న క్రమంలో ప్రజా సమూహాలు మిగతావి మనుగడ కోసమే పోరాటాలు చేస్తుండడం వల్ల వాళ్ల సంస్కృతులు విస్తరించడానికి, అద్భుతమైన వృత్తి, కుల సంస్కృతులు మరింత ఉజ్వలంగా మారడానికి అవకాశం లేకుండా పోయింది. ఈనాటికీ వాళ్లవి దాదాపు అస్తిత్వ పోరాటాలే కావడంతో ఇంకనూ ఆ సంస్కృతులపై ఆధిపత్యం కొనసాగుతూనే ఉంది.

అందుకే ఈరోజు ఆవు సాంస్కృతిక ఉగ్రవాదాన్ని అమలు పరిచే సాధనం అయింది. పవిత్రత పేరుతో సాంస్కృతిక ఉగ్రవాదం స్వామీజీలు, బాబాలు, విశ్వహిందు పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్‌ల రూపంలో బట్టబయలవుతున్నది. నిజ జీవితంలో ఆవు, ఎద్దులతో మమేకమైన ప్రజల వ్యవసాయ పశు సంబంధిత సంస్కృతులను పవిత్రత అనేది సాంస్కృతిక ఉగ్రవాద సాధనంగా దెబ్బకొడుతూ వస్తున్నది. తాము చెప్పినట్లే చరిత్రను రికార్డు చేసుకోవాలనే నియంతృత్వ ధోరణి ఓవైపు ప్రదర్శిస్తూనే సాంస్కృతిక ఉగ్రవాదంలో భాగంగా చరిత్రను తప్పుగా వక్రీకరించి రాస్తూ వస్తున్నారు.

అల్లాఉద్దీన్ ఖిల్జి ముస్లిం కనుక అతన్ని చరిత్రలో తక్కువ చేసి చూపడానికి చరిత్రలో లేని పద్మావతి అనే రాణిని సృష్టించి పుస్తకాలు రాసి ఆ పాత్రను సినిమాలో ఎలా చూపించాలో మేమే నిర్ణయిస్తామంటూ, మాట వినకుంటే ముక్కులు కోస్తామని, తలలకు కోట్ల రూపాయల వెలలు నిర్ణయించి తెగకోస్తామని బెదిరిస్తున్నారు. తమకు వ్యతిరేకంగా తీసే ఏ సినిమాను ఆడనివ్వబోమని బెదిరిస్తున్నారు. సెన్సార్ పూర్తయిన మెర్సల్ సినిమాకు రీసెన్సార్ చేయాలని దాడులకు దిగారు. ఇదేమిటని ప్రశ్నించిన కమల్‌హాసన్, ప్రకాశ్‌రాజ్ లాంటి వాళ్లను చంపుతామని బెదిరిస్తున్నారు.

ఇక ముస్లింలు కట్టిన కట్టడాలైతే ఆ ప్రతికట్టడం వెనుకా ఒక గుడి చరిత్రను సృష్టించి ఈ కట్టడాలను కూలగొడతామంటున్నారు. తాజ్‌మహల్‌ను తేజోమహాలయంగా పదే పదే చెప్తూ గోబెల్స్‌లాగా అబద్ధాన్ని నిజం చేద్దామనుకున్న ఉదంతాన్ని ఇటీవల మనం చూసి ఉన్నాం. ముస్లింల ప్రార్థనా స్థలాలు వేటినీ వదలబోమని అయోధ్యలో బాబ్రీ మసీదు తరహాలోనే మథుర, వారణాసిల్లోని మసీదులను కూలగొడతామని బాహాటంగా చెప్తున్నారు. ఆక్రమించుకున్న దేశం ముస్లింలది, ఆక్రమిత ప్రాంతంలో ప్రజలు ముస్లింలే కనుక వాళ్ల దృష్టిలో దేశానికి అతిపెద్ద సమస్య కశ్మీర్ సమస్య అయింది. చదివే పిల్లలు ముస్లిం పిల్లలు కనుక మదరసాలను నిషేధించాలంటున్నారు.

ఈ సాంస్కృతిక ఉగ్రవాదం విస్తృతమవడానికి అధికారం తోడ్పడుతూ రావడాన్ని కూడా మనం గమనించాల్సి ఉంది. హిందూ సంస్కృతిలో ప్లాస్టిక్ సర్జరీలు ఉన్నాయంటూ గణపతిని చూపిస్తాడు సాక్షాత్తు ప్రధానమంత్రి. స్టెమ్‌సెల్స్ విజ్ఞానం ఉందంటూ వందమంది

కౌరవులను చూపిస్తాడు. ఇవి మూఢ విశ్వాసాలని వాళ్లకు ఏ కోశానా అనిపించవు.

యోగి ఆదిత్యనాథ్ ముఖ్యమంత్రి కాకముందే ఎంపిగా ఉన్నపుడే గోరఖ్‌పూర్‌లోని మియాబజార్‌ను మయాబజార్‌గా, ఉర్దు బజార్‌ను హిందీ బజార్‌గా, అలీనగర్‌ను ఆర్యనగర్‌గా పేర్లు మార్చివేశాడు. 'బానిసత్వాన్ని గుర్తు చేసుకునే చిహ్నాలు నా నియోజకవర్గం లో ఉండడానికి వీల్లేదు' అన్నాడు. ముఖ్యమంత్రి అయ్యాక తాజ్‌మహల్‌ను ఏకంగా పర్యాటక స్థలాల జాబితాలోంచే తొలగించి పారేశాడు. ఈయనను రేపటి ప్రధానమంత్రి అభ్యర్థి అంటున్నారు. టిప్పుసుల్తాన్‌ను, అక్బర్, షాజహాన్ లను ఇంకా చెప్పాలంటే దేశంలోని ఏ ముస్లిం పాలకుడినైనా రేపిస్టు అనో, హంతకుడనో నిందిస్తూ తప్పుడు ప్రచారాలు చేస్తూ వస్తున్నారు. దేశంలో ఇన్ని మతాలుండగా హిందు మత గ్రంథమైన భగవద్గీతను జాతీయ గ్రంథంగా చేస్తామంటున్నారు.

సమస్యలను పరిష్కరించాల్సిన కోర్టులను అప్రధానం చేస్తూ రవిశంకర్ లాంటి వాళ్లకు అయోధ్య లాంటి సమస్యలను అప్పగిస్తున్నారు. మరోవైపు సాంస్కృతిక రంగంలో ప్రత్యామ్నాయ సంస్కృతుల కోసం కృషి చేస్తున్న దభోల్కర్, గోవింద్ పన్సారే, కల్బుర్గీ, గౌరీలంకేష్ లాంటి వాళ్లను చంపేస్తున్నారు. పెరుమాళ్ మురుగన్, కంచ ఐలయ్య లాంటి వారిపై భౌతికదాడులకు దిగుతున్నారు.

ప్రజలు పేదరికంలో మగ్గినా, సమాజంలో అంతరాలు పెరుగుతున్నా నిరుద్యోగం, ఆకలి చావులు, హక్కుల హననాలు, హింసలు, అణిచివేతలు ఎన్ని ఉన్నా దేశమంటే ప్రేమ, భక్తి ఉండాల్సిందేనని, దేశభక్తి వదులుకోవ డానికి వీలుకాని, ప్రశ్నించడానికి వీలులేనిదిగా ఉండాలని, ఉంటుందని మితిమీరిన దేశభక్తిని నిరంకుశంగా ప్రజల మీద రుద్దుతున్నారు. తాము చెప్పినట్లు చెప్పినచోట్ల ప్రదర్శించేదే దేశభక్తి అంటున్నారు. సినిమా హాళ్లలో తప్పనిసరిగా జనగణమన పాడాలని, లేచి నిల్చోవాల్సిందేనని అంటున్నారు. అట్లా చేయకపోతే మీదపడి కొడుతున్నారు. తాము నిర్దేశించిన సంస్కృతినే స్త్రీలైనా, దళితులైనా అనుసరించి తీరాలని తమ హిందూ మతంలోని వివిధ సెక్షన్‌ల ప్రజలపై ఒత్తిడి తెస్తూ, అంగీకరించక పోతే దాడులకు దిగుతున్నారు.

స్త్రీలపట్ల వీళ్లకు ఎంత చులకన భావమంటే, స్త్రీలకు అసలు వ్యక్తిత్వమే లేదని, వాళ్లు బానిసలని చెప్తుంటారు. మోహన్ భగవత్ అంటాడు – 'అత్యాచారాలు పల్లెటూర్లలో జరగవు. పట్నాల్లో జరుగుతాయి. ఎందుకంటే పట్నాలలో ఆడవాళ్లు రెచ్చగొట్టే దుస్తులు ధరిస్తారు కాబట్టి'. ఈ మాటలను పట్టుకొని రెచ్చగొట్టే దుస్తులే రేప్‌లకు కారణమని అరుస్తూ ఆధునిక దుస్తులు ధరించే అమ్మాయిలపై దాడులకు దిగుతారు హిందూ ఉన్మాదులు. ఎంత దారుణం ఇది? వస్త్రధారణ పైనా ఇంత మోరల్ పోలిసింగా? ఇదే మోహన్ భగవత్ మరోసారి అంటాడు – 'భార్య భర్తల మధ్య ఉండే సోషల్ కాంట్రాక్ట్‌లో భాగంగా ఆడవాళ్ల పని మగవాళ్లకు సేవలు చేస్తూ గృహిణిగా ఉండడం' అని. హిందూ ధర్మాన్ని బోధించే వాళ్లూ ఇలాగే మాట్లాడతారు. 'ఆడవాళ్ల పని మగవాళ్ల తుండు గుడ్డలు పిండడం' అంటాడు చాగంటి కోటేశ్వరరావు. ఎంత దిగజారుడు మాటలు ఇవి? పద్మావతి సినిమా గురించి మాట్లాడమంటే, 'ఫిల్మ్ మేకర్‌ల భార్యలు రోజుకో భర్తను మారుస్తారు' అంటాడు రాజస్థాన్ ఎంపి చింతామణి మాలవ్య. ఇట్లా అనడం తప్పుకదా అంటే, 'నిజమే! తెలుగు సినిమాల వాళ్ల భార్యలూ అంతే' అంటాడు రాజాసింగ్. ఇవి మీడియా చర్చలో పాల్గొని చెప్పిన మాటలు.

ఆర్ఎస్ఎస్, విఎచ్‌పి వాళ్ల ప్రకారం స్త్రీ పురుషులు ఒకరినొకరు ఇష్టపడకూడదు, ప్రేమించుకోకూడదు. అది మన సంస్కృతి కాదంటారు. వాలంటైన్స్ డే రోజు పార్కుల వెంటపడి, సినిమా హాళ్ల వెంటపడి దాడులు చేస్తుంటారు. ఒకవేళ తప్పనిసరిగా ప్రేమించాల్సి వస్తే ముస్లింలను మాత్రం ప్రేమించకూడదంటారు. దానికి లవ్ జిహాద్ అని పేరుపెట్టి దాడులు చేస్తారు, కేసులు పెడతారు.

ఆవుకు పవిత్రతను జోడించి ఆవును ముట్టుకోవడానికి వీల్లేదంటారు. తరతరాల వృత్తిలో భాగంగా దళితులు తోలు పనులు చేస్తుంటే గో హత్య చేశారనే కారణం చూపి వాళ్లను హత్య చేస్తారు. ఉనాలో చూసి ఉన్నాం. కేరళలో పినరయి విజయన్ దళితులను ఆలయ పూజారుల పోస్టులలో నియమిస్తే రాద్ధాంతాలు చేశారు. దళితుల పట్ల వీళ్ల కన్సర్న్ ఇది. వీళ్లు అధికారంలో ఉన్న ఛత్తీస్‌గడ్‌లో తొలకరి పండుగ జరుపుకుంటున్న ఆదివాసుల మీద మావోయిస్టులకు సహకరించారనే కోపంతో కాల్పులు జరిపించారు. బాసగూడ లాంటి మారణ హోమాలు తరచూ జరుపుతుంటారు. స్త్రీని కేవలం లింగపరంగానే చూస్తూ ఆ రాష్ట్రంలో ఆదివాసులపై అత్యాచారాన్ని అణచివేత సాధనంగా వాడుతుంటారు. వీళ్లు నమ్మే, ఆచరించే సంస్కృతే అంటరానితనాన్ని సృష్టించింది. సామాజిక అసమానతలను, వివక్షలను సృష్టించింది. కాలానుగుణంగా మారకుండా వీళ్లు ఇంకా అదే సంస్కృతిని ఆచరిస్తున్నారు. అదే సంస్కృతిని నిలబెట్టాలని ప్రయత్నిస్తున్నారు. అందుకోసం దొంగదారులను ఆశ్రయిస్తున్నారు. ఆదివాసి సంస్కృతులకు ప్రతిరూపమైన సమ్మక్క – సారలమ్మలను అమ్మవారి అంశలుగా ఈ మధ్య ప్రచారం ప్రారంభించారు. జాతర గద్దెల దగ్గర కొబ్బరి కాయలు, కుంకుమలు, అగరుబత్తుల సంస్కృతిని తీసుకువచ్చారు. దళిత ప్రత్యామ్నాయ సంస్కృతిని దెబ్బతీయడానికి హిందూ సంస్కృతిని వ్యతిరేకించిన అంబేద్కర్ లాంటి వాళ్లను హిందుత్వ శక్తులు తమలో కలుపుకోవడానికి చూస్తున్నాయి.

ఇదంతా చేప్పే ఉద్దేశం ఏమంటే పరాయి సంస్కృతులను, బ్రాహ్మణేతర సంస్కృతులను సంఘ్‌పరివార్ ఏ విధంగా ద్వేషిస్తున్నది, వాటిని నియంత్రించి, గుప్పెట్లో పెట్టుకుని సమాజంపై బ్రాహ్మణీయ సంస్కృతిని రుద్దడానికి ఏ విధంగా ప్రయత్నిస్తున్నది, ఈ పనులను భయోత్పాతంతో ఏ విధంగా సాధిస్తున్నది అనే విషయాన్ని మనం గమనించాలి. సాంస్కృతిక ఉగ్రవాదానికి భౌతిక దాడులను జోడించి వాళ్లనుకుంటున్న సంస్కృతిని నిరంకుశంగా అమలు చేయాలనుకుంటున్న వాళ్ల కుట్రలను అర్థం చేసుకోవాలి.

ఒక్కమాటలో చెప్పాలంటే సంఘ్ పరివార్ ఈ దేశాన్ని హిందూ దేశంగా మార్చాలనుకుంటున్నది. ఈ దేశాన్ని హైందవీకరించాలను కుంటున్నది. బ్రాహ్మణీకరించాలనుకుంటున్నది. అందుకుగాను సాంస్కృతిక ఉగ్రవాదాన్ని ప్రోత్సహించి బ్రాహ్మణేతర సంస్కృతులను నిర్మూలించాలని చూస్తున్నది. ఈ లక్ష్యసాధనకు ఇప్పుడు అధికారాన్ని వాడుకుంటున్నది. ఈ నిర్మూలించే లక్ష్యంలోనే రోహిత్ వేముల లాంటి వాళ్లు బలైపోయారు. కన్నయ్య కుమార్, ఉమర్ ఖలీద్ లాంటి వాళ్లు అక్రమ కేసుల బారిన పడ్డారు. మహ్మద్ అఖ్లాక్, జునైద్ లాంటి వాళ్లు చంపబడ్డారు. గుర్‌మెహర్‌కౌర్ లాంటివాళ్లు బెదిరింపులకు గురయ్యారు. అయితే ఇటలీ జర్మనీల లాగా మితిమీరిన మత అహంకారాన్ని, కుల అహంకారాన్ని ప్రదర్శిస్తూ పోతున్న సంఘ్ పరివార్, దాన్ని పట్టుకు వేలాడుతున్న వాళ్లు చివరకు హిట్లర్, ముస్సోలినిలలాగా పతనం కాక తప్పదనేది చరిత్రలో రేపు నిరూపించబడే సత్యం.

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

వి. హనుమంతరావు స్మృతిలో

పదిహేను సంవత్సరాలు నిండుతున్న వీక్షణం వ్యవస్థాపక సంపాదకుడు వి. హనుమంతరావు లేకుండా ఏడాది గడిచింది. 2016 డిసెంబర్ 13న తుది శ్వాస విడిచే వరకు నిరంతరం వీక్షణం అభివృద్ధి గురించి ఆలోచించి, తన రచన లేకుండా ఒక్క సంచిక కూడా రాగూడదని తపన పడి వీక్షణంకు వందలాది రచనలు అందించిన హనుమంతరావు గారిని వీక్షణం వినమ్రంగా స్మరిస్తోంది. తెలుగు ప్రజాపక్ష జర్నలిజంలో, రాజకీయార్థిక, పత్రికా రచనలో అత్యున్నత ప్రమాణాల పత్రిక ఒకటి నెలకొల్పి నిరంతరాయంగా నిర్వహించాలని ఆయన కన్న కల సాకారమై 14 సంవత్సరాలు నిండడం ఆయన చూశారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తామని వీక్షణంను ఇతోధికంగా ప్రజానుకూలంగా ప్రామాణికంగా నిర్వహిస్తామని ఆయన స్మృతిలో మా దీక్షకు పునరంకితమవుతున్నాం. ఈ సందర్భంగా వీక్షణం తొలి సంచిక(జనవరి 2003)కు ఆయన రాసిన సంపాదకీయం, మరొక రచన పునర్ముద్రిస్తున్నాం. – వీక్షణం కలెక్టివ్

తొలి సంచిక సంపాదకీయం

మీదే ఈ సమీక్ష

సమాచార సాంకేతిక విప్లవం ప్రపంచాన్ని ముంచెత్తుతోంది. పుంఖాను పుంఖాలుగా వార్తలు, వ్యాఖ్యానాలు వినిపిస్తున్నాయి. ముఖ్యంగా సరళీకరణ, ప్రైవేటీకరణ, ప్రపంచీకరణ దేశాలకు దేశాలనే కమ్ముకొని వస్తున్నాయి. ఈ పరిణామాలకు అనుకూల, వ్యతిరేక వ్యాఖ్యానాలు వింటున్నాం. పాలకులే ఈ పరిణామాలకు పల్లకి మోస్తుంటే, ప్రచారం చేస్తుంటే దినపత్రికల్లో ఆ ప్రచారానికి సింహభాగం స్థలం కేటాయింపు జరుగుతోంది. ఆ పరిణామాలను ప్రశ్నించే వ్యాఖ్యానాలకు, విశ్లేషణలకు ప్రాముఖ్యత లభించడంలేదు. వాటికి సముచిత స్థానాన్ని ఇవ్వడానికి జరుగుతున్న ప్రయత్నంలో భాగమే 'ప్రజాపక్ష సమీక్ష' పక్షపత్రిక అవతరణ.

ఈ పత్రిక వెనుక డబ్బు మూటలు లేవు. నయాపైసా పెట్టుబడి పెట్టలేదు కాబట్టి ప్రతిఫలాన్ని కోరుకోవడం లేదు. ప్రత్యామ్నాయ విధానాలు, ఆచరణే దేశానికి, ప్రజలకు విముక్తి కలిగిస్తాయనే విశ్వాసమే, మా మేధస్సే మా పెట్టుబడి. చందాదారులే మా పోషకులు. ఆ విధంగా ఒక ప్రత్యేక ఒరవడి ఈ పత్రికది. మార్కెట్‌లో వార, పక్ష, మాస పత్రికలు చాలానే ఉన్నాయి గాని ఇలాంటి పత్రికలు చెదురుముదురుగానే కనిపిస్తుంటాయి. ఆర్థికం, అభివృద్ధి గురించి విస్తృతంగా చర్చించే అతికొద్ది పత్రికల కోవలో చేరుతుంది 'సమీక్ష'.

ఈ పత్రికను ప్రారంభించడమే మా వంతు. దాన్ని పెంచి, పోషించాల్సింది పాఠకులే. మీ రచనలు, ఆర్థిక సహాయమే మా ఊపిరి.

భారతదేశం ధనవంతమైంది కాని భారతీయులు నిరుపేదలు. ఇలా ఎందుకుండాలి? రాజకీయ స్వాతంత్ర్యం వచ్చింది కాని వాళ్లకేం దక్కింది? ఎవరికీ అభివృద్ధి ఫలితాలు అందుతున్నాయి? సామాన్యులు సామాన్యులుగానే మిగిలిపోయారు – వారలా ఎందుకు మిగిలిపోవాలనేదే మా ప్రశ్న. ఈ ప్రశ్ననే లక్షలాది ప్రజలు వేస్తున్నారు. పాలకులను నిలదీస్తున్నారు. ఉద్యమిస్తున్నారు. వారి ప్రయత్నాలతో, వ్యాఖ్యానాలతో కూడిన సమాచారం ఎంతో తోడ్పడుతుంది. దానిని వారికి అంద జేయడమే ఈ పత్రిక లక్ష్యం. మేము దీపం వెలిగించాం. అది వెలుగును నిరంతరంగా ప్రసరించేలా చూడడం మీ చేతుల్లో ఉంది. సంవత్సర చందా సామాన్యులకు అందుబాటులో ఉంచాం. మేం కోరేది ఒక్కటే. చందాదారులుగా చేరండి. మీ సహాయ, సహకారాలను అందించండి.

(వీక్షణం మొదట ప్రజాపక్ష సమీక్ష పేరుతో ప్రారంభించాం. రిజిస్ట్రేషన్ కారణాల వల్ల పేరు మారింది)

మొండి బాకీల ఊబి నుంచి బ్యాంకులు బయట పడేనా?

లక్షకోట్ల రూపాయల పైగా బ్యాంకుల మొండి బాకీలు తరచుగా వార్తల్లోకెక్కి బ్యాంకుల్లో డబ్బు పొదుపు చేసుకొన్న వారి గుండెల్లో రైళ్లు పరుగెత్తిస్తున్నాయి. ఇలా రుణాలు కావాలని ఎగ్గొట్టిన పారిశ్రామిక వేత్తల, వ్యాపారస్థుల, ధనిక రైతుల పేర్లు ప్రకటించాలని గత పది సంవత్సరాల్లో పార్లమెంటులో, బయటా పోరుతూ వచ్చినా ఏవో కుంటి సాకులతో రిజర్వు బ్యాంకు ప్రకటించకపోవడంతో బ్యాంకు ఉద్యోగుల సంఘమే ఆ పేర్లను ప్రకటించి సంచలనం సృష్టించింది. బాకీల చిట్టాలో వివిధ కార్పొరేట్ సంస్థలు, బడా పారిశ్రామిక వేత్తల పేర్లన్నీ బజారుకెక్కాయి. తమిళనాడు బ్యాంకు ఉద్యోగుల సంఘం ప్రకటించిన పట్టికలో తమిళనాడు ముఖ్యమంత్రి జయలలిత, ఆమె ప్రియనేస్త శశికళ, కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి టిఆర్ బాలు ఉన్నారు. (ఏయే బ్యాంకుల్లో ఎంతెంత మొండి బ్యాకీలున్నాయో పేజీలో చూడవచ్చు. సామాన్యులేవరైనా చిన్న పరిశ్రమో, వ్యాపారమో పెట్టుకోవడానికి రుణం కోసం బ్యాంకులకు వెళితే ఛీ కొట్టే యజమానులు, చిన్న సన్నకారు రైతులు బాకీ పడితే కుండా, చెంబూ వీధిలోకి విసిరేసే బ్యాంకులు లక్షకోట్ల రూపాయల బాకీలను ఎలా ఎందుకు పేర బెట్టారు?

అభివృద్ధి చెందుతున్న దేశాలను నిధుల కొరత వెంటాడుతూనే ఉంటుంది. బ్యాంకులను జాతీయం చేయడం ద్వారా, వాటిలోని నిధులను దేశాభివృద్ధికి ఖర్చు చేయడానికి అవకాశం ఏర్పడింది. ఆ అవకాశాన్ని వమ్ముచేసి, ఆ నిధులను తామే కాజేసి మొండి బాకీదారులంతా దేశాభివృద్ధిని నిరోధిస్తున్నారు. ప్రపంచ బ్యాంకు వద్దకు రుణాల కోసం వరుగులెత్తింది. దేశాన్ని రుణాల ఊబిలో ముంచడానికి కారకులవుతున్నారు. ఈ రుణాల మీద వడ్డీల రూపంలో లక్షల కోట్ల రూపాయలు దేశ సరిహద్దులను దాటి రుణ దాతలకు వెళ్లడమే కాకుండా,

వైద్యం, విద్యలాంటి సంక్షేమ కార్యక్రమాలకు ఖర్చు చేయనీయకుండా అడ్డుపడుతున్నారు. ఆస్తులను సృష్టించి మూలధనం ఏర్పాటు చేసుకోవడానికి వీలుకాకుండా చేస్తున్నారు. దేశానికి, ప్రజలకు తీరని ద్రోహం చేస్తున్నారు. మరి ప్రభుత్వం ఏం చేస్తోంది? ఇలాంటి వాళ్లకు రక్షణ కల్పిస్తుందంటే మీరు నమ్ముతారా? చూడండి.

రుణం చెల్లింపులను సంవత్సరాలుగా ఎగవేస్తున్నవారి పేర్లను ప్రకటించకుండా వారి 'మర్యాద'ను కాపాడడం ప్రభుత్వం కల్పించిన మొదటి రక్షణ ప్రభుత్వం మన్నుతిన్న పాములా పడి ఉందని ప్రజలు అనుకోకుండా ఉండడానికి ఏదో చేస్తున్నట్లు నమ్మించడం. కాని ఏం జరక్కుండా చూడడం అనే కళలో ప్రభుత్వం ఆరి తేరింది. రుణాల వసూళ్లకు 1997-98లో ట్రిబ్యునళ్లు (డెట్ రికవరీ ట్రిబ్యునల్స్) ఏర్పాటు చేసి, మొండి బాకీలు వసూలు చేస్తున్నట్లు నటించడం, అది పని చేయడానికి కావాల్సిన కుర్చీలు, టేబుళ్లు కూడా అమర్చకపోవడం, మొండి బాకీదారులను పిలిచి, కాఫీ, టీలు ఇచ్చి, కట్టమని వాళ్లను బతిమాలడం, ఏవో నామకః వసూళ్లు చేయడం - ఇలా పనిచేసే ట్రిబ్యునళ్లు లక్షకోట్ల రూపాయలు వసూలెలా చేయగలుగుతాయి? 2001-02లో ఈ ట్రిబ్యునళ్లు వసూలు చేసిన మొత్తం కేవలం రు. 2153 కోట్లు. ఇది సముద్రంలో నీటిబొట్టు. మొండి బకాయిలను ఎలా వసూలు చేయాలి, ఏం చర్యలు తీసుకోవాలో చెప్పమని ఒక కమిటీని నియమించగా, ఆ కమిటీ ఒక నివేదికనిస్తే రెండు సంవత్సరాలు ఆ నివేదికను అటకెక్కించేయడం ప్రభుత్వం కల్పించిన మూడో రక్షణ. ఆ తర్వాత వన్-టైం సెటిల్‌మెంట్ పేరుతో వడ్డీ మాఫీ చేయడం, అసలు తగ్గించడం లాంటివి చేసి నొప్పిలేకుండా ఆపరేషన్ చేయడం నాలుగో రక్షణ. ఈ పాచిక కూడా పారలేదు. కావాలని ఎగ్గొట్టే వాళ్లు అలాంటి సెటిల్‌మెంట్‌కు ఎందుకు ముందుకు వస్తారు? ఇలాంటి మొండి వాళ్లను ఏం చేసినా పాపం లేదనుకుంటాం కాని మాజీ ఆర్థిక మంత్రి సిన్హా అలా అనుకోలేదు. బ్యాంకులిచ్చిన మొత్తం రుణంలో మొండిబాకీల శాతం పడిపోతుందని పార్లమెంటులోనే ప్రకటించి వీళ్లకు గుడ్ కాండక్టు సర్టిఫికెట్ ఇచ్చారు! ఇది అయిదో రక్షణ. ఇటీవల సెక్యూరిటీ బిల్లు లోక్‌సభ ఆమోదించినపుడు కూడా 'బకాయిలు చెల్లించడంలో ఏమైనా సమస్యలుంటే ప్రభుత్వం పరిశీలించగలదని' ఆర్థిక మంత్రి జస్వంత్‌సింగ్ తాజా హామీ ఇస్తున్నారంటే ప్రభుత్వం తాజా చట్టాన్ని నిజాయితీగా అమలు పరుస్తుందని నమ్మకం కలగడం లేదు. ఈ జస్వంత్‌సింగే 13 రోజుల బిజెపి నిర్వాకం చేసినపుడు ఎన్రాన్‌కు కౌంటర్ గ్యారంటీ ఇచ్చిన విషయం గమనార్హం. ఆ ఎన్రాన్ ఒప్పందం ఏమైందో అందరికీ తెలిసిన విషయమే.

ఇక్కడ సెక్యూరిటీ బిల్లు గురించి కొంచెం ముచ్చటించాలి. నవంబర్ 26న సెక్యూరిటైసేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్సియల్ అస్సెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ బిల్‌ను పార్లమెంటు ఆమోదించింది. మొండి బాకీలున్న వారికి 60 దినాలు నోటీసు ఇచ్చి, చెల్లించకపోతే వాళ్ల మీద కేసు పెట్టి కోర్టుల చుట్టూ తిరగనవసరం లేకుండా వారి ఆస్తులను జప్తు చేసే అధికారాన్ని బ్యాంకులకు ఇస్తుంది. ఇందులో అస్సెట్ రీకన్‌స్ట్రక్షన్ కంపెనీలను ఏర్పాటు చేసే అధికారం ఇస్తుంది. దీని ప్రకారం బ్యాంకులు తమ బాకీలన్నీ ఈ కంపెనీకి దఖలు పరుస్తాయి. ఆ కంపెనీ బ్యాంకులున్నవారి ఆస్తులను జప్తు చేసి, వాటిని అమ్మి సొమ్ము చేసి బ్యాంకుకు అందచేస్తుంది. ఇందులో ఏదో మతలబు ఉందని బ్యాంకు ఉద్యోగులు అనుమానిస్తున్నారు. ఆ చట్టం పూర్తి పాఠం లభించినపుడే విశ్లేషించడానికి వీలవుతుంది. బ్యాంకులు తమ బాకీ ఉన్న వారి ఆస్తులనో, భవనాలనో, కర్మాగారాలనో జప్తు చేశాయనే అనుకొందాం. అవన్నీ అమ్మకానికి పెడతారా? టెండర్లు పిలుస్తారా? వేలం వేస్తారా? ఈ పనిచేయడానికి బ్యాంకుల్లో అదనపు సిబ్బందిని నియమిస్తారా? మోటారుకారు పోతుంటే అపుడపుడు కుక్కలు మొరుగుతూ దాని వెనుక పరుగెడతాయి. కాని కారు ఆగిపోయిన తర్వాత అదీ ఆగిపోతుంది. ఏం చేయాలో దానికీ తెలియదు. అలాగే జప్తు చేసి ఏం చేయాలో బ్యాంకులకు తెలియదు. ఇటీవల చెన్నైలో ఎవరి ఆస్తినో ఇలా జప్తు చేయగా హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకొన్నారు. ఇలా ఆస్తి జప్తు చేయడం రాజ్యాంగం ఇచ్చిన హక్కులకు వ్యతిరేకమట! అంటే బ్యాంకు నుంచి రుణం తీసుకొని సెక్యూరిటీగా పెట్టిన ఆస్తులను, బాకీ రుణాలు చెల్లించకపోతే, స్వాధీనం చేసుకోకూడదన్న మాట. ఇలా వాదించిన అడ్వకేట్ తానే బ్యాంకు ఉన్న పరిస్థితిలో ఉంటే ఏం చేసి ఉండేవాడో తెలుసుకోవాలని కుతూహలంగా ఉంది.

రాష్ట్రంలో...

రాష్ట్రంలో కోటి రూపాయలకు పైగా రుణం తీసుకున్నవారు 1020 మంది మొండి ఖాతాదారులుగా తేలి రు. 4796.12 కోట్లు బాకీ పడ్డారు. రాష్ట్ర ప్రణాళిక కేటాయింపు సుమారు తొమ్మిదివేల కోట్లు. బాకీ పడిన మొత్తం దీనిలో సగం అన్నమాట. ఇలా బాకీ పడిన కొన్ని కంపెనీలు బోర్డులు తిప్పేశాయి, అడ్రసు లేకుండాపోయాయి. ఒకే కంపెనీ నాలుగైదు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకున్న ఉదాహరణలూ ఉన్నాయి. ఎక్కువ మొత్తం బాకీలున్న వారిలో మాజీ ఉప ముఖ్యమంత్రి జెవి నరసింగరావు కుమారుడు నడిపే పెన్నార్, పాటర్సన్, వార్త పత్రిక నడిపే సంఘి గ్రూపు కంపెనీలు, విజయవాడ సరీస్ రాజు, కేంద్ర మంత్రి కృష్ణంరాజు కంపెనీ గోపికృష్ణ గ్రానైట్స్ కొన్ని ఉదాహరణలు మాత్రమే. వీరిలో ముఖ్యమైన వారి పట్టిక, వారివ్వాల్సిన మొండి బకాయిలు రెండురెళ్ల నాలుగు పేజీలో చూడవచ్చు.

గత అనుభవాలను గమనంలో ఉంచుకుంటే తాజా చట్టం బ్యాంకులకు మొండిబాకీల ఊబిలో నుంచి బయట పడవేస్తుందా అన్నది శేష ప్రశ్నగానే మిగిలిపోతుంది. మొండిబాకీ దార్లకు రక్షణ కల్పిస్తూ రావడం అత్యంత గర్హనీయం. బ్యాంకు ఉద్యోగుల సంఘాలు అప్రమత్తంగా ఉండి, వారికి తెలిసిన సమాచారాన్ని ఖాతాదార్లతో, ప్రజలతో పంచుకోవాలి.

మొండిబాకీల ఊబిలో నుంచి బ్యాంకులు బయటపడితే నష్టాలొస్తున్నాయి కాబట్టి ప్రైవేటీకరిస్తామని వాదించడానికి వీలుండదు. ఇదివరకే లక్ష మందికి పైగా ఉద్యోగులను వీఆర్ఎస్ ఇచ్చి ఇంటికి పంపడానికి వీలుండదు. బ్యాంకులను ప్రైవేటీకరించాలనే ప్రపంచ బ్యాంకు ఆదేశాన్ని అమలు పరచడానికి వీలుండదు. కాగా కొత్తచట్టం కూడా మొండిబాకీల సమస్యను పరిష్కరించకుండా ఉండడమే ప్రభుత్వ లక్ష్యం.

(ఈ వ్యాసం మొదటి సంచికలో పి. వరహాల శెట్టి పేరుతో రాశారు.) వీ

కార్పొరేట్ ఎగవేతదార్లకు నూతనోత్సాహం

మోడీని అధికారంలోకి తెచ్చిన కార్పొరేట్‌లు లూటీ చేసిన ప్రభుత్వ బ్యాంకులకు ప్రభుత్వం రెండు లక్షల కోట్ల రూపాయలు సమకూర్చనుందనీ, కార్పొరేట్‌లు ఎగవేసిన డబ్బును వారి నుంచే రాబట్టాలనీ అంటున్నారు **బి.ఎస్. రాజు**

2017 అక్టోబర్ 24న కేంద్ర ప్రభుత్వం ఓ ప్రకటన చేసింది. ప్రభుత్వరంగ బ్యాంకులకు 2,11,000 కోట్ల పెట్టుబడిని రాబోయే రెండేళ్లలో సమకూరుస్తున్నామని ఈ ప్రకటన సారాంశం. అప్పుల ఎగవేతతో జబ్బుపడి మంచం దిగలేని స్థితిలో ఉన్న ప్రభుత్వరంగ రోగగ్రస్థ బ్యాంకులకు ఈ పెట్టుబడితో కొత్తరక్తం ఎక్కించి జబ్బు నయంచేస్తామని అంటున్నది మోడీగారి ఎన్.డి.ఏ ప్రభుత్వం.

2017 జూన్ త్రైమాసికానికి బ్యాంకుల గ్రాస్ నిరర్థక ఆస్తుల మొత్తం 8,29,338 కోట్లని ద్రవ్య సంస్థల లెక్కలు చెబుతున్నాయి. ఇంత లోతుగా నిరర్థక ఆస్తుల ఊబిలో కూరుకున్న బ్యాంకులకు ప్రభుత్వం ప్రకటించిన 2.11 లక్షల కోట్ల అరకొర ఉద్దీపనా పథకం కంటి తుడుపు చర్యేగాని రోగిని గట్టెకించే మార్గం కాదని ప్రతిపక్ష రాజకీయ పార్టీలేకాక అనేక మంది అర్థిక శాస్త్రవేత్తలు కూడా పెదవి విరిచి ప్రభుత్వాన్ని తప్పు పడుతున్నారు.

ముందుగా, అసలు ప్రభుత్వ రంగ బ్యాంకులకు పదేపదే ఈ నిరర్థక ఆస్తుల దుస్థితి ఎందుకు దాపురిస్తున్నది? ఈ దుస్థితికి కారకులెవరు? బ్యాంకులను దివాళా తీయిస్తూ, భోగభాగ్యాలు అనుభవిస్తున్న ఘరానా ఖాతాలెవరివి? వేల కోట్ల అప్పులిచ్చే బ్యాంకుల ఉన్నత యాజమాన్య వర్గాలకు, రాజకీయ పార్టీలకు, అప్పనంగా అందుకున్న ఈ రుణానంద లహిరిలో తేలియాడే ఖాతాదార్లకు ఉన్న సాలెగూడు బంధానికి, కుట్రలకు బలైపోతున్నదెవరు? పరిశీలించవలసి ఉంది.

ప్రస్తుతం, బ్యాంకుల్లో పేరుకుపోయిన నిరర్థక ఆస్తుల తాజా వివరాలు, ఈ దిగువ ఇచ్చిన మూడు పట్టికల్లో చూడవచ్చు.

పట్టిక-1: మార్చ్, 2016 నుండి జూన్ 2017 మధ్య 6 త్రైమాసికాల్లో నిరర్థక ఆస్తుల స్థితిని, పెరుగుదల క్రమాన్ని తెలియచేస్తుంది.

పట్టిక-2: జూన్ 2017 నాటికి బ్యాంకుల వారీ గ్రాస్ నిరర్థక ఆస్తుల విలువ, కోట్ల రూపాయల్లో తెలియచేస్తుంది. ఈ వివరాలు 38 బ్యాంకులకు చెందినవి.

పట్టిక-3: జూన్ 2017 నాటికీ ఈ 38 బ్యాంకుల నిరర్థక ఆస్తుల నిష్పత్తులను (మొత్తంలో ఒక్కొక్క బ్యాంకు శాతాన్ని) తెలియచేస్తుంది.

ఈ పట్టికలకు ఆధారం/వెబ్ సోర్స్: 'ఏస్ ఈక్విటీ' / 'కేర్ రేటింగ్స్' సంస్థలు బ్యాంకుల నిరర్థక ఆస్తులపై ప్రచురించిన పత్రాలు.

ఈ సమాచారం ప్రకారం జూన్ 2017 నాటికి బ్యాంకుల మొత్తం నిరర్థక ఆస్తుల్లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వాటా 22.7 శాతం.

ఎస్‌బిఐ; పిఎన్‌బి; బిఓఐ; ఐడిబిఐ; బిఓబి; ఈ 5 బ్యాంకులకు కలిపి నిరర్థక ఆస్తుల్లో 47.4 శాతం వాటా ఉంది.

12 బ్యాంకుల మొత్తం ఎన్.పి.ఏ. శాతం 75.7 శాతం. ఈ 12 బ్యాంకుల్లో 'ఐ.సి.ఐ.సి.ఐ.' ప్రైవేట్ బ్యాంక్ పోను మిగతా 11 ప్రభుత్వ రంగ బ్యాంకులే ! అందునా ఐ.డి.బి.ఐ. బ్యాంక్, ఐ.ఓ.సి. బ్యాంకుల నిరర్థక ఆస్తుల శాతం 20కి మించింది.

పట్టిక-1(ఎ)

బ్యాంకుల నిరర్థక ఆస్తుల స్థితి

త్రైమాసికం	నిరర్థక ఆస్తుల విలువ రు. కోట్లల్లో	ఎన్.పి.ఎ నిష్పత్తి
మార్చ్ 2016	5,71,841	7.69
జూన్ 2016	6,18,109	8.42
సెప్టెంబర్ 2016	6,51,792	8.81
డిసెంబర్ 2016	6,77,443	9.18
మార్చ్ 2017	7,11,312	9.06
జూన్ 2017	8,29,338	10.21

పట్టిక-1(ఎ)

బ్యాంకుల నిరర్థక ఆస్తుల స్థితి

త్రైమాసికం	నిరర్థక ఆస్తుల విలువ రు. కోట్లల్లో	ఎన్.పి.ఎ నిష్పత్తి
మార్చ్ 2016	5,71,841	7.69
జూన్ 2016	6,18,109	8.42
సెప్టెంబర్ 2016	6,51,792	8.81
డిసెంబర్ 2016	6,77,443	9.18
మార్చ్ 2017	7,11,312	9.06
జూన్ 2017	8,29,338	10.21

ఓ విషయం తెలుసుకోండి! బ్యాంకుల నుండి అప్పులు తీసుకోదల్చుకున్నారా? అయితే పెద్ద కుండకు ఎసరు పెట్టండి. అరకొర అప్పులకై పాకులాడకండి! ఎంత పెద్దమొత్తంలో అప్పు తీసుకుంటే బ్యాంకులకు అంతబాగా శఠగోపం పెట్టవచ్చని నమ్మండి! డబ్బు ఎగ్గొట్టడం అంత సులువని గ్రహించండి. అంతే కాదండోయ్! బ్యాంకుల్లో అప్పు పుట్టించుకుని సొంత ఆస్తులు ఓ పదితరాలకు సరిపడా కూడ బెట్టుకోవడం, విదేశీ బ్యాంకుల్లో దాచిపెట్టుకోవడం బహు సులువైన మార్గం, సుమా! దీనికి కావలసిందల్లా దగాకోరు తెలివితేటలు, అటువంటి తెలివితేటలే గల సలహాదారులు, రాజకీయ బంధాలు, దందాలు. కాదంటారా? అయితే చూడండి ఇది నిజమో కాదో... 9000 కోట్ల

పట్టిక–2

జూన్ 2017 నాటికీ బ్యాంకుల టోకు/ గ్రాస్ / నిరర్థక ఆస్తుల వివరాలు (కోట్ల రూపాయల్లో)

బ్యాంక్ పేరు	**నిరర్థక ఆస్తులు**
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	1,88,068
పంజాబ్ నేషనల్ బ్యాంక్	57,721
బ్యాంక్ ఆఫ్ ఇండియా	51,019
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్	50,173
బ్యాంక్ ఆఫ్ బరోడా	46,173
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్	43,148
కెనరా బ్యాంక్	37,658
యూనియ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	37,286
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	35,453
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	31,398
యూకో బ్యాంక్	25,054
ఓరియంటెల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	24,409
ఆక్సిస్ బ్యాంక్ లిమిటెడ్	22,031
కార్పొరేషన్ బ్యాంక్	21,713
అలహాబాద్ బ్యాంక్	21,032
సిండికేట్ బ్యాంక్	20,184
ఆంధ్రా బ్యాంక్	19,428
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	18,049
దేనా బ్యాంక్	12,994
యూనైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	12,165
ఇండియన్ బ్యాంక్	9,653
ఎచ్ఎఫ్‌డిసి బ్యాంక్ లిమిటెడ్	7,243
విజయ బ్యాంక్	6,812
పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్	6,693
ది జమ్ము & కశ్మీర్ బ్యాంక్	5,641
కోటక్ మహింద్రా బ్యాంక్	3,727
ఐడిఎఫ్‌సి బ్యాంక్	2,004
ది ఫెడరల్ బ్యాంక్	1,868
కరూర్ వైశ్యా బ్యాంక్	1,807
దీ సౌత్ ఇండియన్ బ్యాంక్	1,696
ది కర్ణాటక బ్యాంక్	1,691
యెస్ బ్యాంక్	1,364
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1,272
ది లక్ష్మి విలాస్ బ్యాంక్	878
సిటీ యూనియన్ బ్యాంక్	735
ఆర్‌బిఎల్ బ్యాంక్	458
ధనలక్ష్మి బ్యాంక్	354
డిసిబి బ్యాంక్	285
మొత్తం	**8,29,338**

పట్టిక–3 :

జూన్ 2017 నాటికి బ్యాంకుల వారీ నిరర్థక ఆస్తుల నిష్పత్తి(%)

బ్యాంకు పేరు	ఎన్‌పిఏ (%)
ఐడిబిఐ బ్యాంక్ లిమిటెడ్	24.11
ఇండియన్ ఓవర్సీస్ బ్యాంక్	23.60
యూకో బ్యాంక్	19.87
బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర	18.59
సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	18.23
దేనా బ్యాంక్	17.37
యూనైటెడ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	17.17
కార్పొరేషన్ బ్యాంక్	15.49
ఓరియంటల్ బ్యాంక్ ఆఫ్ కామర్స్	14.83
అలహాబాద్ బ్యాంక్	13.85
పంజాబ్ నేషనల్ బ్యాంక్	13.66
ఆంధ్రా బ్యాంక్	13.33
బ్యాంక్ ఆఫ్ ఇండియా	13.05
యూనియ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	12.63
బ్యాంక్ ఆఫ్ బరోడా	11.40
పంజాబ్ అండ్ సింద్ బ్యాంక్	11.33
ది జమ్ము & కశ్మీర్ బ్యాంక్ లిమిటెడ్	10.79
కెనెరా బ్యాంక్	10.56
స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా	9.97
సిండికేట్ బ్యాంక్	9.96
ఐసిఐసిఐ బ్యాంక్ లిమిటెడ్	7.99
విజయ బ్యాంక్	7.30
ఇండియన్ బ్యాంక్	7.21
ధనలక్ష్మి బ్యాంక్ లిమిటెడ్	5.62
ఆక్సిస్ బ్యాంక్ లిమిటెడ్	5.03
ది కర్ణాటక బ్యాంక్	4.34
కరూర్ వైశ్యా బ్యాంక్	4.27
ఐడిఎఫ్‌సి బ్యాంక్	4.13
ది లక్ష్మి విలాస్ బ్యాంక్	3.78
ది సౌత్ ఇండియన్ బ్యాంక్	3.61
సిటీ యూనియన్ బ్యాంక్	3.05
కోటక్ మహింద్రా బ్యాంక్	2.58
ది ఫెడర్ బ్యాంక్	2.42
డిసిబి బ్యాంక్	1.74
ఆర్‌బిఎల్ బ్యాంక్	1.46
ఎచ్‌డిఎఫ్‌సి బ్యాంక్.	1.24
ఇండస్‌ఇండ్ బ్యాంక్	1.09
యెస్ బ్యాంక్ లిమిటెడ్	0.97

రూపాయలకు బ్యాంకులకు ఎగనామం పెట్టి బ్రిటన్ ఉడాయించిన లిక్కర్ కింగ్ విజయ్ మాల్యా, బ్యాంకు అప్పులు చెల్లించని ఘరానా చేపల చెరువులో ఓ చిన్న చేపేనని చెప్పాలి సుమా! కాదంటారా! అయితే చూడండి 'క్రెడిట్ సుయిస్సీ' వెల్లడించిన, మార్చ్ 2015 నాటికి బ్యాంకులకు అప్పులు కట్టని ఈ క్రింది తిమింగల కంపెనీల వివరాలు:

1. అనిల్ అంబానీ రిలయన్స్ గ్రూప్: రు. 1,25,000 కోట్లు (అన్ని రాజకీయ పార్టీలకు ఆప్తుడు)

2. వేదాంత గ్రూపు: రు. 1,03,000 కోట్లు (అనిల్ అగ్గర్వాల్, విశ్వాన్తర్యామి)

3. ఎస్సార్ గ్రూపు: రు. 1,01,000 కోట్లు (శశి రుయ, రవి రుయ; వీళ్లకోసం మోడీ ప్రత్యేకంగా రష్యా వెళ్లి, ఎస్సార్ ఆయిల్ కంపెనీని అమ్మడానికి పుతిన్‌తో డీల్ కుదిర్చి పెట్టాడు)

4. ఆదానీ గ్రూపు : రు. 96,031 కోట్లు (గౌతమ్ ఆదానీ,మోడీ గారి ప్రియ గుజరాతీ మిత్రుడు, ఆస్ట్రేలియాలో బొగ్గు గనుల కుంభకోణానికి స్టేట్ బ్యాంకు నుండి ఒక బిలియన్ డాలర్ల అప్పు శాంక్షన్కు తెరవెనుక మోడీ హస్తముందని, ఎందుకో ఆఖరిలో బ్రేకు పడిందని పదిమందీ అంటున్నారు)

5. జెపి గ్రూపు : రు. 75,163 కోట్లు (మనోజ్ గౌర్, ఉత్తరప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి బిఎస్‌పి అధినేత్రి హయాంలో ఓ వెలుగు వెలిగిన కంపెనీ)

6. జెఎస్‌డబ్ల్యూ (జిందాల్ స్టీల్) గ్రూపు: రు. 58,171 కోట్లు

7. జిఎంఆర్ (గ్రంధి మల్లికార్జునరావు) గ్రూపు: రు. 47,976 కోట్లు

8. ల్యాంకో (లగడపాటి) గ్రూపు: రు. 47,102 కోట్లు

9. వీడియోకాన్ (అవధూత్) గ్రూపు: రు. 45,405 కోట్లు

10. జివికె (జి.వి.కృష్ణా రెడ్డి) గ్రూపు: రు. 33,933 కోట్లు

(6 నుండి 10 వరకు ఉన్న గ్రూపులు ఎక్కువగా పి.వి.నరసింహారావు హయాం నుండి కాంగ్రెస్ పార్టీతో లబ్ధిపొందినవి.)

ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక దేశంలో బ్యాంకు అప్పుల ఎగవేతదార్ల సుదీర్ఘ పట్టికను తయారుచేసి ప్రకటించింది. గూగుల్ లో లభ్యమౌతుంది. చూడండి, మీ గుండె గుభేల్ మనక పోతే అడగండి!

ప్రతిరోజు మైకు పుచ్చుకుని 'నేనెవర్ని వదల, అందరి భరతం పడతా' నని ఊదర గొట్టే ప్రధాన మంత్రి మోడీ నిజంగానే అందరి భరతం పట్టేడు. బ్యాంకులను దిగమింగిన తిమింగలాలను మినహా దేశంలో తతిమ్మా అందరి భరతం పట్టాడు. రైతులకు ఆత్మహత్యలే శరణ్యం చేసాడు. నోట్ల రద్దుతో జనం నోళ్లుకొట్టాడు. కొత్త ఉద్యోగాలు లేకపోగా ఉన్న ఉద్యోగాలే ఊడగొట్టాడు. నల్లధనం పని పడతానని చేతిలో ఉన్న నాలుగు పైసలు కూడా చెంపలు పగలకొట్టి ఊడ్చేసాడు. జనాన్ని బిచ్చగాళ్లను చేసి బ్యాంకుల ముందు నిలబెట్టాడు. ఉన్నవాళ్లకే మేలుచేసాడు. వాళ్లనే అందలమెక్కించాడు. డిజిటల్ లావాదేవీల కంపెనీలకు, జపాన్ సాఫ్ట్ బ్యాంకుకు, దొడ్డి దారిన తలుపులు తెరిచాడు. జిఎస్‌టి బాదుడు సరేసరి. ఇంతచేసింది చాలక ఇప్పుడు బ్యాంకులకు కొత్త రక్తం ఎక్కించి అప్పుల ఎగవేతదార్లకే మళ్లీ పట్టం కట్టదల్చుకున్నాడు. గంగా ప్రక్షాళన పేరున, భారతమాల రహదారుల పేరున, కొత్త కాంట్రాక్టులకు డబ్బు కావాలి కాబట్టి, ప్రభుత్వ బ్యాంకులకు డబ్బు సమకూర్చి, 2019 లో తిరిగి అధికారంలో కొనసాగడానికి అస్మదీయులకు కాంట్రాక్టులు ఇప్పించాలి. ఇది జరగాలంటే ముందు ప్రభుత్వ బ్యాంకుల జేబుల్లో డబ్బు నింపాలి. అందుకే ఈ 2.11లక్షల కోట్ల ఉద్దీపన. బ్యాంకులకు జవసత్వాలు కల్పించడమంటే ఘరానా బ్యాంకు దొంగల లూటీకే కానీ ఇదేదో బ్యాంకుల ఉద్ధరణ కని, సామాన్యుల సేవకని అనుకుంటే శుద్ధ పొరపాటే! ఇది మరో మారు కాకులను కొట్టి గద్దలకు వేయడమే! రైతులకు, దినసరి వేతన కూలీల మేడలా కురితాళ్లే! మధ్య తరగతి మెదళ్లకు మత్తుమందే! ప్రభుత్వ రంగ బ్యాంకులకు 2,11,000 కోట్ల కొత్త రక్తం ఎక్కించడమంటే కార్పొరేట్ల కైంకర్యానికే నని వేరే చెప్పనవసరం లేదు.

భారత దేశ బ్యాంకింగ్ రంగం బాగు పడాలంటే ముందు ఈ రంగాన్ని పట్టి పీడిస్తున్న నిరర్థక ఆస్తుల జాడ్యాన్ని రూపుమాపాలి. ఇది జరగకుండా బ్యాంకింగ్ రంగం ఆరోగ్యంగా ఉండలేదు. ఇది ఆరోగ్యంగా లేకపోతే దేశ ఆర్థిక వ్యవస్థ కూడా కుదుట పడదు. రుణ వితరణ వ్యవస్థ కుదేలౌతుంది. రిజర్వు బ్యాంకు గవర్నర్ గా పనిచేసిన డా. రఘురాం రాజన్, బ్యాంకులను దోచిన కార్పొరేట్ ఘనాపాఠీలను నిలదీసి వారు దిగమింగిన సొమ్మును కక్కించే కార్యక్రమం చేబట్టగానే ఏలికలకు చేదై, ఆయన రాజీనామా పత్రం సమర్పించే వరకు వెంటాడి, వేధించిన వైనం మన అనుభవంనుండి చెరిగిపోలేదు. ఆయన్ను తరిమికొట్టి కార్పొరేట్ శక్తుల కనుకూలుడైన ఉర్జిత్ పటేల్ ను మోడీ ప్రభుత్వం రిజర్వు బ్యాంక్ పీఠమెక్కించింది. ఆ వెను వెంటనే సాధారణ ప్రజలపై పెద్ద నోట్ల రద్దు అనే మెరుపు దాడిని అత్యంత అప్రజాస్వామికంగా కొనసాగించింది. బ్యాంకుల్లో అప్పటి వరకు ప్రజలు దాచుకున్న సొమ్మును దిగమింగిన కార్పొరేట్ ఎనుబోతులపై ఎటువంటి చర్యలు తీసుకోకపోగా, సాధారణ ప్రజలను చిత్ర హింసలకు గురిచేసి, బొడ్డూడదీసి, పదీ పరకా సొమ్మును కూడా బ్యాంకుల్లో జమచేయించింది. ఈ చర్య అంతర్జాతీయ బ్యాంకింగ్ కట్టుబాట్లయిన బాసిల్ – ఎఎఎ ఒప్పందాన్ని అమలు చేయాల్సిన ప్రభుత్వ గతిలేని చర్యగా కూడా చెప్పాల్సి ఉంది.

ఏమైనా గాని, 2014 లో 'ఎన్డిఎ' ప్రభుత్వం అధికారం లోనికి వచ్చినప్పటి నుండి దేశ ఆర్థిక వ్యవస్థ ఒక పిల్లిమొగ్గల విన్యాసంగా మారింది. బడాయి మోడీ, అతని ఆర్థిక మంత్రి జైట్లీల ఈ విన్యాసాలు, వారి వాగాడంబరము, అధికారానికి వచ్చిన కొత్తలో దేశంలో మధ్యతరగతికి భలే కనువిందు చేసాయి. పసందుగా కనిపించి, వీళ్ల మోడీ! మోడీ! నమో! నమో! స్తోత్రం ఆకాశాన్నంటింది. ఆరుణ్ జైట్లీ, వెంకయ్య నాయుడు, 'మోడీ' కి కుడిఎడమల వందిమాగదులుగా డోలు–సన్నాయి వాయిస్తూ, చక్క–భజన చేస్తూ వచ్చారు. ఇక చేసిన భజన చాల్లే! విశ్రాంతి తీసుకొమ్మని వెంకయ్యకు వానప్రస్థాశ్రమం చూపిస్తే, ఇక ఇప్పుడు జైట్లీ వంతు వచ్చిందేమో అనిపిస్తోంది.

బ్యాంకులను దోచుకున్న వాళ్లను నిజమైన ప్రజాకోర్టులకు ఈడ్చి శిక్షించడమొక్కటే భారత దేశ బ్యాంకింగ్ వ్యవస్థను కాపాడుకునే ఏకైక మార్గం. ఎన్నికల ప్రజాకోర్టులో వాళ్లకెలాగు శిక్షపడదని పదే పదే రుజువైయ్యింది కాబట్టి ఈ చర్య తప్పదు. ఈ లూటీకోర్ల సమస్త స్థిర, చరాస్తులను ప్రజాకమిటీలు స్వాధీన పర్చుకుని, ఆ కమిటీల ఆధీనంలో, నిర్వహణలో బ్యాంకులను ఉంచడమే ప్రజా హిత బ్యాంకింగ్ వ్యవస్థకు పునాది. ఇది జరగాలంటే ఏమిచేయాలో, ఎటువంటి రాజకీయ ప్రస్థానం చెయ్యాలో ప్రజలు ఆలోచించాలి.

(రచయిత 'శ్రామిక నేస్తం' పత్రిక సంపాదకులు) వీ

సంస్మరణ

మార్క్స్- అంబేడ్కర్ సమన్వయం సి.వి.

భారత సమాజంలోని ఆర్థిక, సామాజిక అంతరాలను నిర్మూలించాలంటే మార్క్స్, అంబేడ్కర్‌ల కృషిని సమన్వయించాలన్న సి.వి. కృషిని తెలియజేస్తూ దాన్ని కొనసాగించాల్సిన అవసరం ఉందని అంటున్నారు డా. కత్తి పద్మారావు

ఆధునిక యుగ హేతువాద ఉద్యమ వైతాళికుడు, అలుపెరుగని కలం యోధుడు, ఆరు దశాబ్దాలకు పైగా అక్షర జ్వలనాలతో వెలిగిన జ్ఞాన సూర్యుడు సి.వి. 88వ యేట విజయవాడలో తన నివాసంలో చివరి శ్వాస విడిచారు. నలభై ఏళ్ల హేతువాద ఉద్యమ అనుబంధం మాది. భారతీయ తత్వశాస్త్రాన్ని అధ్యయనం చేసిన చార్వాక వాది సి.వి. హేతువాదిగా ప్రత్యామ్నాయ సాహితీ సృజనను పుంఖాను పుంఖంగా చేసి, వేదాలు, ధర్మశాస్త్రాలు అధ్యయనం చేసి, అందులోని వైరుధ్యాలను బయటబెట్టిన సాహసి సి.వి. మనుస్మృతి లోతులు చూసి, వర్ణ వ్యవస్థ పునాదులను తవ్వేసి సమ సమాజ భావనకు పతాకలెత్తిన హేతువాది సి.వి. కమ్యూనిస్టు ఉద్యమం నుండి వచ్చిన సి.వి. కమ్యూనిస్టులు సాంస్కృతిక, సాంఘిక, తాత్విక ఉద్యమాలను ఇంకా బలంగా నడపవలసి ఉందని ఆకాంక్షించారు.

పేదరికానికి మూలమైన అస్పృశ్యతను, కులాన్ని పారదోలందే, ప్రజల బుర్రల్లో దాగున్న మూఢాచారాల బూజును దులపందే వర్గపోరాటం కూడా విజయవంతం కాదని అంబేడ్కర్ ఆలోచనలను తన భాషలో పలికిన ఆధునిక వైతాళికుడాయన. మహాత్మాఫూలే, అంబేడ్కర్, పెరియార్ రామస్వామి నాయకర్‌ల ఆలోచనలను తన రచనల్లో జ్వలితమైన భాషలో నినదించిన మహాకవి సి.వి. కావాలి మనకు సాంస్కృతిక విప్లవం అని ఎలుగెత్తి పలికిన వాడు సి.వి. 1970 దశకం నుండి 90వ దశకం వరకు తెలుగువాడిగా పుట్టి ఓ పెరియార్‌లా, మరో హోచిమిన్‌లా ఉక్కు నాలుకతో పలికిన ధైర్యశాలి సి.వి. ఆయన రాసిన విషాద భారతం, దిగంబర కవిత్వానికి విప్లవ కవిత్వానికి మధ్య వారధి గట్టింది. పోరుబాటలో ఆయన 'కారు చీకటిలో కాంతి రేఖలు' ప్రసరింపచేశారు. ఆ తరువాత అభ్యుదయ విప్లవ జీవన విధానాల్లో కూడా వర్ణం, కులం దాగి ఉందని గమనించి 'వర్ణ వ్యవస్థ' 'చార్వాక వాదం', 'మధ్యయుగాల్లో కులం' ఇలా కుల భారతాన్నిఅన్ని శ్రేణుల్లోను తొలిచివేయాలని లోతైన విమర్శనా గ్రంథాలు రాశారు.

భారత దేశంలో కుల విస్తరణ

"ఇండియాలోని ప్రతి గ్రామమూ, నేడు కులాల పేరిట చీలిపోయింది. కమ్మటూరు – బ్రాహ్మణవీధి – తెలగపాలెం – చాకలిబజారు – మాలపల్లె –మాదిగగూడెం అనే కులాల పేరిట చీలిపోయింది. ఈ విధంగా చీలిపోయిన కులాలకు చెందినవారు కుల మతాచారాల్ని అడ్డంబెట్టుకుని మాయనాటక మాడుతోన్నారు. అంచేత, మన సాంఘిక వ్యవస్థలో ఈ కుల – మతాలకి విడదీయరాని లంకె ఉంది. స్కూళ్లు – కాలేజీలు – యూనియన్ ఎన్నికల్లో కులాలు – కాలేజీ హాస్టల్స్‌లో కులాలు – గవర్నమెంట్ ఆఫీసుల్లో కులాలు మంత్రి పదవుల పంపకాల్లో కులాలు – పత్రికా కార్యాలయాల్లో, రేడియో స్టేషన్లలో, హైస్కూలు–కాలేజీ ఉద్యోగాల నియామకాల్లో, ఆఖరికి సినిమారంగంలో సైతం ఈ కులాల కుమ్ములాటలు పెను తుఫాన్‌లా చెలరేగాయి. పార్లమెంట్ ఎన్నికల దగ్గర నించి బ్లాకు రాజకీయాల వరకూ, ఎక్కడ చూసినా ఈ కులాల కుమ్ములాటలే. ఈ కుమ్ములాటలు నేటి సాంఘిక వాతావరణాన్ని, సంపూర్ణంగా కల్మషపూరితం జేస్తున్నాయి. ఈ కులాల కుమ్ములాటలు ప్రత్యేకంగా గ్రామసీమల్లో విలయతాండవం గావిస్తున్నాయి. అందుకే కులనిర్మూలన జరగనిదే, ఈ కులాల కుమ్ములాటలూ కులకక్షలూ పోవు. కులతత్వం నాశనం గాదు. కులకక్షలు పోనిదే, కులతత్వం నాశనం గానిదే, భారతజాతిలో ఐక్యమత్యం రాదు. అంతేగాదు–అంటరానితనం మంట గలవనిదే, మనం వొక జాతిగా వొక నేషన్‌గా – మనలేము. కాబట్టి కులవ్యవస్థ సర్వనాశనం జేయబడిన నాడే, సమైక్య భారతజాతి అవతరణకి అవకాశముంటుంది.

ఈనాడు కావాల్సింది–వర్గ చైతన్యమే గాని వర్ణ చైతన్యం మాత్రం కాదు అని ఎలుగెత్తి చాటిన సాంఘిక విప్లవమూర్తి సి.వి. (వర్ణ వ్యవస్థ) సి.వి. కులనిర్మూలనా వాది, ఆయనొక గొప్పకవి, ఆయన వర్ణనా సామర్థ్యం 'పారిస్ కమ్యూన్'లో నరబలిలో మనకు కనిపిస్తుంది. పారిస్ కమ్యూన్‌లో రక్తాన్ని ఉడికించే కవితా ప్రవహాం నుండి "నూనూగు మీసాల నూత్న యవ్వనుల నుంచి / బైరు గడ్డాల ప్రౌఢవయస్కుల వరకూ / ఆయుధ పాణులై వున్న యీ అసంఖ్యాక శ్రామిక వీరులెవరు? / శాత్రవ భయంకరులైన యీ శస్త్రజీవను లెవరు? / ఫ్రాన్స్ నరకకూపాల్లో ప్రభవించిన పృధ్వీమాత పుత్రులు / పారిస్ మురికివాడల్లో జన్మించిన నేలతల్లి కుమార్తెలు / మట్టిలోంచి పుట్టుకొచ్చిన మణిమాణిక్యాలు / మానవ స్వాతంత్ర్య సముపార్జనకై ఉద్యమించిన ఆణిముత్యాలు / దోపిడీగాండ్ర గుండెల్లో నిద్రించే బాకులు / నిరంకుశుల పక్కల్లో పవళించే బల్లేలు. (పారిస్ కమ్యూన్). సి.వి. అక్షరాలతో ఆయుధాలు తయారు చేస్తారు. అక్షరాల్లో సాయుధ సైనిక కవాతులు మనకు చూపిస్తారు. శ్రీశ్రీ కవిత్వంలోని పరుగు ఆయన కవిత్వంలో మనకు కనిపిస్తుంది. వేమన కవిత్వంలోని కులాధిపత్యం పై పోరు, కబీర్, చక్రధర్, నానక్, పోతులూరి వీరబ్రహ్మం భక్తి కవుల్లోని మానవతా వాదాన్ని ఆయన హేతువాద భావాల్లో చెప్పారు. భారతదేశ సామాజిక సాంస్కృతిక వైరుధ్యాలను మన కళ్లముందు సాక్షాత్కరింప జేశారు. నేను హేతువాదిని నాకు దేవుడు లేదు అని చాటుకున్న సి.వి. ధైర్యం గల ప్రబోధకుడు. ఇటీవల ప్రజాశక్తి వారు ఆయన రచనలన్నీ ప్రచురించిన సభలో నన్ను ప్రేమతో కౌగిలించుకొన్న అనుభూతిని మరువలేను. ఆయన పురాణాల్లో

అణగారిన పాత్రలకు జీవం పోశారు. "ప్రాచీన కాలంలో, సత్యకామ జాబాలి కథనం; మృచ్ఛకటిక నాటికలోని వసంతసేనా వృత్తాంతం; పోతనామాత్యుని భోగినీదండకం; క్రీడాభిరామంలో తల్లీకూతుళ్లతో వొక్కడేపోయే జారధర్మం; వైదిక సంస్కృతిలోని ఏ పరమ పైశాచిక వాస్తవాలను తెలుపుతున్నాయి? ఆ విధంగానే, ఆపస్తంభుడూ, మనువూ ఇత్యాది హైందవ ధర్మ శాస్త్రవేత్తలు వర్ణ వ్యవస్థను గూర్చి ప్రతిపాదించిన సూత్రాలు, ఏ ధర్మాన్ని ప్రతిబింబిస్తున్నాయి." (ఊళ్లోకి స్వాములవారు వేంచేశారు) సి.వి. అస్పృశ్యతపై విరుచుకుపడ్డారు. అస్పృశ్యతా భావం అంత తేలిగ్గా పోయేది కాదు. మనుషుల మెదడుల్లో నాటుకుపోయింది. అస్పృశ్యతను పాటిస్తేనే స్వర్గలోకం వస్తుందనే నమ్మకం వల్లే బ్రాహ్మణులు అస్పృశ్యతను పాటిస్తున్నారని, శూద్రులను కూడా అస్పృశ్యత పాటించమని చెబుతున్నారని సి.వి. నిశితమైన విమర్శలు చేశారు. ఈ సందర్భంగా ఆయన భారత జాతి పునరుజ్జీవనం అనే గ్రంథంలో ఇలా విశ్లేషించారు. "అస్పృశ్యత క్రమంగా క్షీణించిపోతున్నదనీ, కొంత కాలానికది పూర్తిగా అదృశ్యమైపోతుందనీ, అలాంటప్పుడు రాజ్యాంగ రక్షణల పేరుతో వారిని సామాజిక జీవనం నుంచి వేరుపరచడం యెందుకనీ మరొక వాదన బయల్దేరింది. మానవజీవితంలో ఏదీ శాశ్వతంగాదు. ప్రతి ఒక్కటి మారి తీరుతుంది.

అస్పృశ్యతా మూలం

కాని అస్పృశ్యత అనతికాలంలో అంతమయ్యేందుకాధారమైన మౌలికమైన మార్పంటూ, ఇంతవరకూ ఏదీ జరగలేదు. అలాంటి మౌలికమైన మార్పు వచ్చేవరకూ, అస్పృశ్యంగా సమస్య తీవ్రమైనదిగా పరిగణించవలసిందే. అస్పృశ్యత అంతంగావాలని అందరూ కోరవలసిందే. కాని అలాంటి ఆశాభావంతో, నేటి పరిస్థితిని విస్మరించడం భావ్యం కాజాలదు. అస్పృశ్యత అంటే కేవలం ఒకర్ని మరొకరు ముట్టుకోక పోవడం అనే కొందరు భావిస్తున్నారు. ఇది కేవలం భౌతికమైన సమస్య గాదు. ఇది ప్రధానంగా మానసికమైన సమస్య. అందుచేత అస్పృశ్యతకు ముట్టుకోకపోవడానికి చాలా వ్యత్యాసమున్నది. ఇది కేవలం ముట్టుకోక పోవడమనే సమస్యగా భావించేవారే, అస్పృశ్యత శీఘ్రగతిలో అంతర్ధాన మౌతున్నదని వాదిస్తున్నారు. ఈ ముట్టుకోకపోవడమనేది గూడా, పట్టణాలలో కొంత సమసిపోయినట్టు కన్పించినప్పటికీ గ్రామాలలో ఇది సజావుగానే అమలు జరుపబడుతూ ఉన్నది. అలాంటప్పుడు మానసికమైన అస్పృశ్యత, సుదూర భవిష్యత్తులో అంతమైపోతుందను కొనేందుకు ఎలాంటి ఆస్కారమూ లేదు. హిందువులలో సనాతన సాంప్రదాయ మతమౌఢ్యమున్నంత కాలం, అస్పృశ్యత ఉండి తీరుతుంది. కొందరూహిస్తున్న విధంగా ఇది అనతికాలంలో అంతమైపోయే వ్యాధి కాదు. రెండువేల ఏండ్ల నుంచి, హిందూ మనస్తత్వంలో బాగా జీర్ణించుకుపోయివున్న అస్పృశ్యతా భావం, వీళ్లనుకున్నంత తొందరగా అంతరించిపోదు. (భారత జాతి పునరుజ్జీవనం) సి.వి. రచనల్లో కులనిర్మూలనా వాదం, అస్పృశ్యతా నివారణ ప్రముఖంగా కనిపిస్తాయి. ఆయన భారతీయ సమాజాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. బ్రాహ్మణాధిపత్యం నుండి భారత సమాజాన్ని విముక్తి చేయాలని కోరుకొన్నారు. సామాజిక వ్యవస్థలో చిట్టెంకట్టుకొన్న కులం పునాదులను పెకలించకుండా మనం సోషలిజాన్ని సాధించలేమని కమ్యూనిస్టులకు వెలిగెత్తిచాటాడు.

ఆర్థిక పోరాటం ఒక్కటే చాలదు

ఆర్థిక పోరాటం ఒకటే మన భారతదేశంలో పీడితులను విముక్తి చేయలేదని, ఆర్థిక, సామాజిక పోరాటాలు పరస్పర సంబంధితాలు, పరస్పర ప్రేరకాలని ఆయన నొక్కి వక్కాణించారు. మార్క్స్, ఎంగెల్స్, లెనిన్ పెద్ద ఎత్తున మతోన్మాద పోరాడారని 'దేవుడున్నాడనే' నమ్మకం పోయాక భౌతికవాదం మేధస్సు దానికి వ్యతిరేకంగా ఎక్కుతుందని ఆ తరువాతే గతితార్కిక భౌతికవాదులుగా మనం ఆవిర్భవించబడతామని అన్నారు. సి.వి. కులం మూలాలని వెతికాడు. వర్ణం కృష్ణుని పేరుతో ఎలా ప్రచారం అయ్యింది హిందూ పౌరాణిక వాదులు బ్రాహ్మణవాదాన్ని కృష్ణుని నోట పలికించారు అనే విషయాలను లోతుగా పరిశీలించి బ్రాహ్మణ వాదుల ఆధిపత్య వాదాన్ని బయటపెట్టిన ప్రచండుడు సి.వి. సి.వి. కవిత్వం రాస్తే అది గుర్రం కదం తొక్కినట్టు ఉంటుంది. సి.వి. కులం అనే మాలిన్యం అంటకుండా జీవించాడు. తన కులం ఏదో ఎవరికీ తెలియదు. పైకి మార్క్సిస్టులుగా ఉండి, ఇళ్లల్లో వెంకటేశ్వర స్వామి బొమ్మల్ని పెట్టుకొని మా ఆవిడ కోసం పెట్టుకొంది అనే ఆచరణ లేని వారిని ఆయన దుయ్యబట్టాడు. ఆర్. యస్. యస్. వారు బాలమందిరాలు పెడుతున్నారు. ఆడవాళ్ల కోసం ఎన్నో వ్రతాలు నిర్వహిస్తున్నారు. యువకులతో మత కవాతులు నిర్మిస్తున్నారు. మన క్యాడర్‌కు మనం మత ఆచరణకు ప్రత్యామ్నాయంగా ఏమి నిర్మిస్తున్నామని సి.వి. మార్క్సిస్టు శ్రేణులను ప్రశ్నించాడు. తాను ఏమి ఆచరించాడో, అది చెప్పిన త్యాగశీలి ఆయన. తన గ్రంథాలను వడ్డీలకు తెచ్చి ముద్రించి వాటిని ప్రజల దగ్గరకు తీసుకెళ్లారు. మార్క్సిస్టు పార్టీలో అన్ని శాఖల వారితో సి.వి.కి అనుబంధం ఉంది. హేతువాద సంఘంలో ఉన్న అందరి నాయకులతో ఆయన ఆత్మీయంగా ఉండేవారు.

హేతువాద, నాస్తిక వాదులతో మిత్రుత్వం

జయగోపాల్ (విశాఖ), బి. రామకృష్ణ (నిడమర్రు), రావిపూడి వెంకటాద్రి (ఇంకొల్లు), ఎన్.వి బ్రహ్మం (చీరాల), ఈశ్వర ప్రభు (విజయవాడ), ఎస్.వి. రావు (నర్సరావు పేట), అవుతు సుబ్బారెడ్డి (తెనాలి), వెనిగళ్ల సుబ్బారావు (రేపల్లే), భాను ప్రసాద్ (భద్రాచలం), వల్లంపట్ల నాగేశ్వరరావు (హన్మకొండ), వేదాంత (వరంగల్లు), మోహన్ (వరంగల్లు), గాలి రామచంద్రయ్య (సూర్యాపేట), వీరందరూ అప్పుడు హేతువాద, నాస్తిక ఉద్యమాల్లో భిన్న కోణాల్లో పనిచేసే వారు. వారందరూ సి.వి.ని గురువుగా చూశారు. మరి ముఖ్యంగా నన్ను సి.వి. సోదరునిలా ప్రేమించాడు. నా గ్రంథాల్లో ప్రమాణబద్ధంగా నేను మూల గ్రంథాల నుండి సంస్కృత శ్లోకాలను ఉటంకించడాన్ని మెచ్చుకొనేవారు. నా ఉపన్యాసాలను శ్రద్ధగా ఆలకించి ఉత్తేజపరిచేవారు. సి.వి. ఒక మార్క్సిస్టుగానే హేతువాద ఉద్యమ కారునిగా ఉండేవారు. అప్పుడు మూడు వాదాలతో హేతువాద నాస్తిక ఉద్యమాలు ఉండేవి. గోరా గాంధీకి దగ్గరగా ఉండేవారు. రావిపూడి ఎం. ఎన్. రాయ్‌కి దగ్గరగా ఉండేవాళ్లు. మేము మార్క్స్ గతితార్కిక భౌతికవాద హేతు వాదులుగా ఉండేవాళ్లం. వీటిలో ఆయన సిద్ధాంత పరంగా మార్క్స్ అనుయాయులతో ఉంటారు. అలాగే మిగిలిన వారితో కూడా స్నేహంగా ఉంటారు. ఆయన నిక్కచ్చి మనిషి. నీతిగా నిజాయితీగా ఆయన జీవించారు. మార్క్స్ జీవిత ప్రభావం ఆయన మీద ఉంది. సి.వి. అంబేద్కర్ కులనిర్మూలనా బహుదా చదివారు. తన మెదడులోకి ఎక్కించుకొన్నారు. మహాత్మాఫూలే, పెరియార్‌లను అధ్యయనం చేశారు. మార్క్స్ వాదాన్ని, అంబేద్కర్ వాదాన్ని సమన్వయం

చేసి తన వాదనల్లో ఆయన చెప్పారు. సి.వి. గారిది నిశ్శబ్ద విప్లవం. ఆయన పుస్తకాలు చాలా మందికి బెడ్‌రిడెన్ పుస్తకాలుగా ఉంటాయి. ఆ రోజుల్లో హేతువాద నాస్తికవాద ఉపన్యాసాలన్నీ ఆయన పుస్తకాల్లోని వచన ధారల అధ్యయనం నుండే ప్రవహించాయి. ఆయన భగవద్గీతను విమర్శించినందుకు కృష్ణుని దుయ్యబట్టినందుకు పురోహిత వర్గం కుతకుత లాడింది. ఆయన కృష్ణుడి గురించి భగవద్గీత గురించి ఏమి చెప్పాడో చూద్దాం. "కృష్ణుడనే కల్పిత వ్యక్తి చుట్టూ, అనేకమైన కట్టుకథలు సృష్టించి, భారత భాగవతాల్లోనూ, ప్రత్యేకంగా భగవద్గీతలోనూ ఈ కల్పిత వ్యక్తి చుట్టూ ఎన్నో మహత్యాల్నీ, సుందరమైన అబద్ధాల్ని అందంగా అల్లారు. ఇట్టి కల్పిత వ్యక్తుల్ని దేవుళ్లుగా సృష్టించడం, వైదిక పురోహితులకి వెన్నతో బెట్టిన విద్యయే. కృష్ణుడు నీలమేఘశ్యాముడని భారత భాగవతాల్లో వర్ణించబడింది. ఈ కృష్ణుడే యుద్ధరంగంలో అర్జునునికి గీతను బోధించినట్లు,

ప్రపంచంలో కనీ వినీ ఎరుగని అబద్ధాన్ని సృష్టించి, హిందూ పురోహితవర్గం కనీస ఇంగితజ్ఞానం సైతం లేకుండా గీతను భారతంలో దోపివేసింది. "చాతుర్ వర్ణం మయా సృష్టం / గుణ కర్మ విభాగశ:" (భగవద్గీత) గుణ కర్మలను (పనులను) బట్టి, మానవుల్ని నాలుగు వర్ణాలుగా దేవుడే సృష్టించాడని గీతా రచయిత రాశాడు. "జన్మమనే జాయతే శూద్రాం/కర్మణే జాయతే ద్విజ: / వేద పాఠంతు విప్రాణాం / బ్రహ్మజ్ఞానంతు బ్రహ్మణ:" (భగవద్గీత) పుట్టుక ద్వారా ప్రతివాడూ శూద్రుడే. కర్మ ద్వారా ద్విజుడుగా (బ్రాహ్మడుగా) జన్మిస్తాడు. వేదం చదివినవాడు విప్రుడు. బ్రహ్మజ్ఞానం గలవాడు బ్రాహ్మడని గీత చెప్పింది. అయితే విప్రుడికీ, బ్రాహ్మడికీ మధ్యనున్న భేదమేమిటో మాత్రం గీత చెప్పలేదు (వర్ణ వ్యవస్థ). సి.వి. సంస్కృత పురాణాల్ని ముఖ్యంగా స్మృతుల్ని బాగా అధ్యయనం చేశారు.

మనుస్మృతి, వర్ణవ్యవస్థను ఎలా రూపొందించింది, దానివల్ల భారతీయ సమాజం ఎంత నష్టపోయింది. మానవులందరూ సమానమనే భావాన్ని మనుస్మృతి ధ్వంసం చేసింది. సి.వి. శ్రమచేయని జాతులు శ్రమ చేసేవారిని దోచుకోవడాన్ని బాధపడ్డారు. ముఖ్యంగా అస్పృశ్యులను హీనంగా చూడడమే గాక వాళ్ల ఉత్పత్తినంతా కులం పేరుతో దోచుకున్నారని బ్రాహ్మణ అగ్రహారాల్లో కర్మకాండలకు పరిమితమై ఉత్పత్తి శక్తుల్ని అంటరాని వారిగా భావించడం మీద ఆయన ఎంతో మధనపడ్డారు. ఈ విషయం మీద స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ మార్క్స్ అనే పుస్తకంలో విశ్లేషణాత్మకమైన వివరణ ఇచ్చారు. "బ్రాహ్మణాగ్రహారాలలో ఏ ఒక్క బ్రాహ్మణుడు వ్యవసాయం చేయలేదని కాదు, చేశాడు. అగ్రహారాలకు ఆనుకుని వెలి గ్రామాలుండేవి. వ్యవసాయం చేసింది ప్రధానంగా వారు. బ్రాహ్మణులలో అత్యధికులు వేదశాస్త్ర అధ్యయనాలకు, యజ్ఞయాగాది కర్మకాండలకు పరిమితమైనారనేది ప్రధానాంశం. కనుక గుప్త, విష్ణుకుండిన రాజుల కాలంలో బ్రాహ్మణ విస్తరణ ఉత్పత్తి శక్తులను పెంచేందుకు తోడ్పడ్డది అని చెప్పడం సరికాదు. అలా వారు తోడ్పడిన భాగం ఒకవంతు ఉంటే, పరాన్నభుక్కులుగా జీవించిన భాగం మూడువంతులుంది. ఈ నిష్పత్తిని గమనించడం అవసరం. దీని అర్థం ప్రాచీన చరిత్రనంతా బౌద్ధ, వైదిక మత ఘర్షణ పరంగా చిత్రిస్తున్నామనా? కాదు. మత పరిభాష వదలి, సంస్కృత పరిభాషలో చెప్పాలంటే, ఉదారవాద, నిరంకుశవాద ధోరణుల మధ్య ఘర్షణ ఇది. బౌద్ధం భారతదేశంలో మతపరంగా అంతరించినా, సంస్కృతి పరంగా శాశ్వత ప్రభావాన్ని కలిగించింది. దయ, కరుణ, మానవత్వం లాంటి భావాలు మేధావి వర్గంలో బలంగా ప్రవేశపెట్టింది. బుద్ధుని దశావతారాలలో ఒకనిగా చేసి, బౌద్ధమతాన్ని మాత్రం తిరస్కరించి, బౌద్ధ సంస్కృతిలోని మానవతా అంశాలను సంస్కృత సాహిత్యం స్వీకరించింది. "ఏకో రసః కరుణ ఏవ" అని భవభూతి అనగలగడానికి ఇదే కారణం. భర్తృహరి లాంటి కవి, గౌడపాదుని లాంటి తత్వవేత్త – ఇంకా పెక్కుమంది నాటి మేధావులు, బౌద్ధం నుండి వైదికానికి ఇటు నుండి అటు పలుమార్లు మార్పు చెందడానికి ఇదే కారణం (స్వయం సంపూర్ణ గ్రామీణ వ్యవస్థ : మార్క్స్)

మార్క్స్–పూలే–అంబేద్కర్

సి.వి. మార్క్స్‌ను క్షుణ్ణంగా అధ్యయనం చేసి భారతీయ సమాజానికి అన్వయం చేశారు. ఈ కృషిలో ఆయన రంగనాయకమ్మ , హేతువాదులు, నాస్తికులు చేసేది 'నీడతో యుద్ధం' అనే శీర్షిక మీద రాసిన అభిప్రాయాలను ఖండించారు. మార్క్స్, ఏంగెల్స్‌లు తమ జర్మన్ ఐడియాలజీ గ్రంథంలో తమను తాము భౌతిక తాత్విక విద్యార్థులు గాను ఆ తరువాత గతితార్కిక భౌతిక వాదులు గాను ప్రకటించుకున్న విషయం తెలియజెప్పారు. శ్రమ జీవికి నీ శ్రమను పురోహితులు తమ పుక్కిట పురాణాలు చెప్పి దోచుకొంటున్నారనే విషయం వారికి తప్పకుండా చెప్పాలి. ప్రతి శ్రమజీవి దేవుడు మానవుని చేత కల్పించబడ్డవాడని తెలుసుకొన్నప్పుడే ఆ సంపాదనను నిలుపుకో గలుగుతాడని సి.వి. బోధించాడు. ఈ సందర్భంగా ఆయన ప్రతి కమ్యూనిస్టు మహాత్మాపూలేని, అంబేద్కర్‌ని తప్పక చదవాలని నిర్దేశించారు. పూలేకి అంబేద్కర్‌కి ఉన్న అవినాభావ సంబంధాన్ని గూర్చి రాస్తూ ఆయన "మహారాష్ట్ర సాంఘిక తిరుగుబాటు ఆకాశాన వెలసిన అరుణతార. జ్యోతిబాపూలే. (1827–1890) శూద్రుడుగా పుట్టిన పూలే, మహారాష్ట్రలో బ్రాహ్మణేతరుల, ప్రత్యేకంగా హరిజనుల సాంఘిక అధోగతిని కళ్లారా చూశాడు. పశువుల కన్న హీనంగా బతికే నాటి శూద్ర, పంచముల జీవితాలు చూసిన పూలే, నిలువెల్లా దహించి పోయాడు. అంచేతనే ఆయన అగ్రవర్ణాల పెత్తనానికీ, అత్యంత కిరాతకమైన బ్రాహ్మణ నియంతృత్వానికీ వ్యతిరేకంగా యావజ్జీవితమూ పోరాడాడు. అందువల్లనే అంబేద్కర్, పూలే కృషిని సిద్ధాంత పరంగా ప్రశంసించాడు. మహారాష్ట్రలో బ్రాహ్మణేతర ఉద్యమాన్ని స్థాపించి, దాన్ని దిగ్విజయంగా నడిపింది జ్యోతిబాపూలే. ఈ రాష్ట్రంలోని అధిక సంఖ్యాకులైన కష్టజీవులు. రైతు వృత్తికి చెందిన మరాఠా ప్రజలు. శూద్రులైన వీరే, నాటి బ్రాహ్మణేతర ఉద్యమంలో విపరీతంగా పాల్గొన్నారు. కాలక్రమేణా ఈ ఉద్యమం, ఆనాటి జాతీయోద్యమంలో అంతర్భాగమైపోయింది. అట్టి దశలో, పంచముల ఉద్యమం–అగ్ని పర్వతంలా బద్దలై, డాక్టర్ అంబేద్కర్ వంటి మహామేధావి నాయకత్వాన ముందుకు సాగింది. పూలే నిర్వహించిన బ్రాహ్మణేతర ఉద్యమం కొనసాగింపే దళిత ప్రజల శ్రేయస్సు కోసం తాను సాగించిన ఉద్యమమని అంబేద్కర్ ఖండితంగా చెప్పాడు. "ఈ దేశంలో బ్రాహ్మణేతర ఉద్యమం. ఈ ఉద్యమంతో నాకు సంబంధమున్నదనే విషయమూ అందరికీ తెలిసిందే" అని అంబేద్కర్ అన్నాడు. అంతేగాదు. తాను రాసిన "శూద్రులంటే ఎవరు?" అనే గ్రంథాన్ని జ్యోతిబాపూలేకి అంకితమిస్తూ, పూలేను ఆయన ఈ విధంగా ప్రశంసించాడు. "హిందువుల్లోని తక్కువ కులాలవారు (శూద్రులు) అగ్రవర్ణాల వారికి చేసే దాస్యం గూర్చి

తెలియజేసి, వారిని చైతన్యవంతుల్ని గావించి, విదేశ పాలన నుంచి స్వేచ్ఛ కన్న ఇండియాకి సాంఘిక ప్రజాస్వామ్యమే, అత్యంత ప్రధానమైందనే పరమసత్యాన్ని ప్రబోధించిన, ఆధునిక భారతదేశంలోని అసాధారణమైన శూద్రుడు. మహాత్మాఫూలే మొదటిగా ఆధునిక భారతంలో దశావతారాలు దళిత రాజులను చంపడానికి సృష్టించబడ్డవే అని మహాత్మాఫూలే చాటిచెప్పాడు. కుల సమాజం పునాది కదలడానికి వర్ణాంతర వివాహాలు కూడా ఒక మార్గం అని అంబేద్కర్ చెప్పారు. సి.వి. మహాఫూలే ప్రత్యామ్నాయ భావజాలాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. దేశీయ తాత్వికులను మార్క్సిస్టులు నిర్లక్ష్యం చేస్తున్నారని సి.వి. తన రచనల్లో బాహాటంగా చెప్పారు.

అంబేద్కర్‌ను అర్థం చేసుకోవలసిన అవసరం ఇంకా ఉందన్న సి.వి.

అంబేద్కర్ కోటు, సూట్, బూట్ వేసుకొన్నంత మాత్రాన ఆయన్ని బూర్జువాగా ప్రచారం చేయడం తగదు. ఆయన కరుణ, ప్రేమ, ప్రజ్ఞ గల మేధావి అని కొనియాడారు. అంబేద్కర్ తన కుల నిర్మూలనా గ్రంథంలో వర్ణాంతర వివాహాల గురించి ఇలా విశ్లేషించారు. "కుల నిర్మూలనకు సరైన పద్ధతి వర్ణాంతర వివాహాలేనని నా దృఢ విశ్వాసం. రక్త సమ్మిశ్రణ ఒక్కటే మానవులలో అన్యోన్య అనుబంధ భావాన్ని, బాంధవ్యాన్ని కలిగిస్తుంది. అట్టి బంధు భావ ప్రభావం లేనిదే కులం కల్పించిన విభేదాలను, వివక్షతలను రూపుమాపలేం. వివిధ కులాల మధ్య స్నేహానుబంధాలను కలిగించాలంటే, ఆయా కులాల, వ్యక్తుల నడుమ రక్త సంబంధాలను కల్పించక తప్పదు. హిందువుల సాంఘిక జీవనంలో వర్ణాంతర వివాహాలు, హైందవేతరులలో శాఖాంతర వివాహాల కంటే అత్యధిక ప్రాధాన్యం వహించాలి. హైందవేతరులలో సాంఘిక సమైక్యానికి ఇతర శక్తులు ఎన్నో పనిచేస్తూ ఉంటే కనుక, ఈ వివాహాలు అంత ప్రాధాన్యం వహించనక్కరలేదు. అవి ఒక సాధారణ సంఘటనలు మాత్రమే. హిందూ సమాజం కులాల వల్లా, ఉప కులాల వల్లా చిన్నాభిన్నం చెయ్యబడి ఉంది. కనుక వారందరినీ కలిపి ఒక సుసంఘటితమైన సమాజంగా తీర్చిదిద్దాలంటే, అందుకు వర్ణాంతర వివాహాలు తప్పనిసరైన తక్షణ కర్తవ్యం. కుల వ్యవస్థను రద్దు చేయడానికి సరైన మందు వర్ణాంతర వివాహాలే. మరొకటేదీ పనికిరాదు. కుల వ్యవస్థను ఎదుర్కొనడానికి ఇట్టి అమోఘమైన మార్గాన్ని చేపట్టినందుకు మీ జాత్‌పాత్ తోడక్ మండలిని నేను ఎంతగానో అభినందిస్తున్నాను. ఇలా ప్రత్యక్షంగా దానితో తలపడడంలో మీరు అసలు జబ్బు ఏమిటో తెలుసుకొని సరైన విధానాన్ని అనుసరించారు. మీ ధైర్యం గొప్పది. హిందువులకు తమను పట్టుకొన్న జబ్బు ఏమిటో సిసలుగా వారి ముఖం మీదే మీరు చెప్పగలిగారు. సాంఘిక నిరంకుశత్వం రాజకీయ నిరంకుశత్వం కంటే క్రూరమైనట్టిది. కనుక సాంఘిక నిరంకుశత్వాన్ని ఎదిరించే సంస్కర్త ప్రభుత్వాన్ని ఎదిరించే రాజకీయవాది కంటే ఎక్కువ ధైర్యవంతుడై ఉండాలి. (కుల నిర్మూలన) సి.వి. గారిని చదవడం అంటే మార్క్స్, మహాత్మా ఫూలే సాహిత్యాలను సమన్వయంతో అధ్యయనం చేసినట్లే అవుతుంది. సమ సమాజ నిర్మాణానికి కొందరు సాయుధులు కావచ్చు, కొందరు పార్లమెంటరీ పంథాల్లో పోరాడవచ్చు. కొందరు ప్రజాసంఘాల స్థాయిలో పనిచేయవచ్చును. కొందరు సాహిత్యం, కవిత్వం, కళారంగాల్లో పనిచేయవచ్చును. అందరికి పునాది మార్పు పట్ల అవగాహన తాత్విక స్థాయిలో ఉండడం అవసరం. వర్గ, కుల వైరుధ్యాలు బలమైనవిగా ఉన్నప్పుడు ఒకటి తక్కువ ఒకటి ఎక్కువ అని వాద వివాదాల కంటే సి.వి. గారి రచనల అధ్యయనంతో ఒక సమన్వయాన్ని సాధించుకొని ముందుకు సాగవలసిన అవసరం ఉంది.

సి.వి. గారిని నేను 1978లో మొదట చార్వాక ఆశ్రమం నిడమర్రులో చూశాను. నా మొదటి పుస్తకం 'కులం పునాదులు' ఆయన నేతృత్వంలో 1978లో అచ్చయింది. హేతువాద ఉద్యమంలో కొండవీటి వేంకటకవి , బి. రామకృష్ణ, సి.వి. , ఈశ్వర ప్రభు మా తరానికి ముందు హేతువాద భావజాల వ్యాప్తిలో మార్గాన్ని సుగమం చేశారు. ఎన్నో సదస్సుల్లో, సభల్లో సి.వి. నేను పాల్గొన్నాం. ఆయన నిరాడంబరత ఆదర్శనీయమైంది. ఆయన చిరునవ్వు చెరగదు, ఆర్భాటాలు లేవు. స్నేహం, ఆత్మీయత, నిరంతర రచన, అధ్యయనం ఆయన దిన చర్యలు. విజయవాడ జయంతి బుక్‌స్టాల్లో సాయంత్రం వేళ కాసేపు కూర్చుంటారు. స్వాములు, యోగులు, పరాన్న భుక్కులు మూఢాచారాలతో ప్రజలను దోచుకొంటున్న విధానాలను నిరంతరం అధ్యయనం చేశారు.

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మతోన్మాదాన్ని కులాధిపత్యాన్ని ప్రోత్సహిస్తున్నా ఆనాడు పోలీసు దమనకాండ నిరంతరాయంగా జరుగుతున్నా ఆయన ధైర్యంతో హేతువాద భావాలను ఎలుగెత్తి చాటాడు. ఆయనది సాంఘిక సాంస్కృతిక పోరాటమే అయినా రాజకీయాల్లో ఉన్న ఫాసిజం మీద తిరుగుబాటు చేస్తూనే వచ్చారు. ఆయన ఆవేదనంతా కమ్యూనిస్టు ఉద్యమం మతోన్మాదానికి ప్రత్యామ్నాయ భావజాలాన్ని ప్రచారం చేయడంలో వెనకబడుతోందని మతోన్మాద సంస్థలను కేవలం రాజకీయాల ద్వారా ఎదిరించలేం తప్పకుండా సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమానికి పదును పెట్టాలనేదే ఆయన భావన. నిజమే ఈనాడు మతోన్మాదుల చర్యలకు హింసాత్మక ఘటనలకు లౌకిక హేతువాదులు బలౌతున్నారు. పుక్కిట పురాణాలకు ప్రత్యామ్నాయంగా శాస్త్ర జ్ఞానం కావాలని సి.వి. ప్రబోధించారు.

ప్రత్యామ్నాయ సంస్కృతీ నిర్మాత సి.వి.

మార్క్స్, లెనిన్, మావో అందరూ నాస్తికులే, హేతువాదులే, గతితార్కిక భౌతిక వాదాన్ని జీవితంగా మలుచుకొన్నవారే. మరి మన జీవితాల్లో కూడా హేతువాద జీవన విధానం ఎందుకు లేదు అని సి.వి. ప్రశ్నించారు. ఇప్పుడు ఈ అవసరాన్ని మరింతగా గుర్తించే ప్రజాశక్తి ప్రచురణలు సి.వి. గారి మొత్తం గ్రంథాలను ప్రచురించాయి. అవార్డులకు, సన్మానాలకు, పొగడ్తలకు, ధన కాంక్షకు, ఆశ్రిత పక్షపాతానికి లోబడకుండా జీవించిన సి.వి. ఈనాటి ఉద్యమ కారులందరికి జీవితాచరణలో ఆదర్శప్రాయుడు. సి.వి. అధ్యయనం, రాత ప్రత్యామ్నాయ సంస్కృతీ నిర్మాణానికి సోపానాలని ఆయన ఆచరించి చూపాడు. ఈనాడు అంబేద్కర్ వాదులు, మార్క్సు వాదులు, హేతువాదులు కలిసి పని చేయడానికి కావలసిన పునాది కృషిని చేశారు. తెలుగువారి మరో మహాత్మాఫూలే ఆయన కోరినట్టే మార్క్స్, అంబేద్కర్ హేతువాద లౌకికవాద శక్తులన్నీ ఐక్యంగా సాంస్కృతిక పునరుజ్జీవన ఉద్యమాన్ని ఆచరణాత్మకంగా నిర్మించడమే ఆయనకు మనమిచ్చే ఘన నివాళి అవుతుంది. చరిత్ర నిర్మాతలకు మరణం లేదు. సి.వి. కి మరణం లేదు.

(రచయిత ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘ వ్యవస్థాపకులు, పూర్వ ప్రధాన కార్యదర్శి)

వీ

ప్రజారోగ్యం పట్ల పాలకుల నిర్లక్ష్యం

వైద్య రంగానికి బడ్జెట్‌లో కేటాయింపులను గమనిస్తే ప్రభుత్వాలు ప్రజలను పూర్తిగా ప్రైవేట్ వైద్యం వైపుకే మళ్లించే విధంగా ఉన్నాయని అంటున్నారు **విద్యాభూషణ్**

దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన పిదప, ప్రజారోగ్యం ప్రభుత్వ బాధ్యతేనని గుర్తెరగడం జరిగింది. అంతకు పూర్వం అయితే 'ఆరోగ్యం' దైవాధీనమే. పరాయి పాలన దేశాన్ని విపరీత దోపిడీకి గురిచేయడంతో, ప్రజల్ని వెనుకబాటు తనం, పేదరికం జమిలిగా వెంటాడే పరిస్థితులు నెలకొన్నాయి. పేదరిక పీడన ఫలితంగా నాటి సగటు ఆయుష్షులు సుమారు 33 ఏళ్లే. రక్షిత మంచినీటి భాగ్యం లేక సంప్రదాయ రోగాలు నీడల్లా వెంటడుతుండేవి. పేదరికం చోటున బలవర్థక ఆహారం ఉండేది కాదు. ప్రజలలో నిరక్షరాస్యత. చేతి వృత్తులకు, సేద్యానికి దూరంగా బతకాల్సి వచ్చేది. సేద్యానికి పాటుబడ్డా మెరుగైన ఉత్పత్తి ఉండేది కాదు.

ఎప్పుడైతే పరాయి పాలనకు వ్యతిరేకంగా ప్రజలు నడుం బిగించారో ప్రజలు వారి-వారి హక్కుల్ని తెలుసుకోగలిగారు. అప్పుడే 'ప్రజారోగ్యం' పాలకుల బాధ్యతగా ప్రజలు గుర్తెరిగారు. నాటి పాలకులు తాలుకాస్థాయిలో ప్రభుత్వ ఆసుపత్రులను నిర్వహిస్తూ, మందుల్ని సరఫరాచేసే బాధ్యతను నెత్తికెత్తుకున్నారు. చదువుకున్న వైద్యులు లభ్యంకాక సంప్రదాయ వైద్యులు ప్రజా రక్షకులుగా చెలామణి అయ్యేవారు. వారి ప్రాభవానికి ఎంత మంది బలైనా మూఢాచారాలు వారికి రక్షక కవచంలా దోహద పడేవి. గ్రామ దేవతల కరుణ - కటాక్షాలకు ప్రజల ప్రాణాలు వదిలేశారు. తదనంతరం స్వపరిపాలన దేశ ప్రజారోగ్య అంశాన్ని పరిశీలించాలని మొదలియార్, హాధీ కమిటీలను నియమించింది. ఈ రెండు కమిటీలు ప్రజారోగ్యం అంశాన్ని కూలంకషంగా పరిశీలించి, సాంకేతిక అంశాలను అధ్యయనం చేసి, దీన్ని రాజకీయ విధానంగా ప్రకటించాయి. 'ప్రజారోగ్య పరిరక్షణ' పాలకుల నైతిక బాధ్యతగా స్పష్టం చేశాయి.

ఇక మందుల తయారీ దేశప్రజలు తరచూ గురవుతున్న అనారోగ్యాన్ని నిశిత పరిశీలన చేసి, ఈ రోగాలకు కారణం రక్షిత మంచినీరు - బలవర్థక ఆహారలేమే కారణమని ప్రకటించడం జరిగింది. పరిష్కారంగా ప్రజల మధ్య నెలకొన్న అంతరాలను రూపుమాపాలంటూ, వారి జీవన పరిస్థితులను మెరుగు పర్చాలని సూచించడం జరిగింది. ఇందుకు అనువుగా గ్రామ పంచాయితీ స్థాయిలో సహకార రంగ వ్యవస్థను మెరుగు పర్చాలన్నారు. ఇంతటితో ఆగిపోకుండా సంప్రదాయ రోగాల బారి నుంచి బయటపడేందుకు ప్రజల మూఢ విశ్వాసాలను తొలగింప చేయాలన్నారు. నిరక్షరాశ్యతను తొలగించే చర్యలను చేపట్టాలన్నారు. కాని విచిత్రమేమంటే ఆధునిక విజ్ఞాన విస్తృతి నేపథ్యంలో మన పాలకులు పుష్కరాలను తామే నిర్వహిస్తూ మూఢాచారాలను పెంచి పెద్దచేస్తున్నారు. 70 ఏళ్ల స్వాతంత్ర పాలనలో ఎక్కడవేసిన గొంగలి ఆడనే ఉందన్నమాట.

50వ దశకంలోనే ప్రజారోగ్య మెరుగుదలకు ప్రభుత్వం వైద్య విద్య విశ్వవిద్యాలయాలను ప్రారంభిస్తూ - ఆరోగ్య పరిరక్షణా సిబ్బంది నియామకాలను చేపట్టింది. మరోవైపు మందుల తయారీ కంపెనీలను స్థాపింప పూనుకుంది. ప్రజారోగ్య పరిశోధనా కేంద్రాలను నెలకొల్పింది. గ్రామీణ ప్రాంతాల్లో ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను, కమ్యూనిటీ హెల్త్ సెంటర్లను ప్రాపకంలోకి తీసుకు వచ్చారు. సుమారుగా 30 వేల జనాభాకు ఓ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కేటాయించాలని నిర్ణయించారు - తదనుగుణంగా పూర్తి సౌకర్యాలతో వీటిని (తగు సిబ్బంది, అవసరమైన మందులతో) నిర్వహించారు. విషయానికొస్తే, అత్యవసర మందుల తయారీకే ప్రాధాన్యతనిస్తూ ధరల నియంత్రణా వ్యవస్థ ఏర్పాటును సైతం నాటి హాధీ కమిటీ సూచించడం గమనించ దగ్గది. దీంతో ఇతర దేశాల మందుల రేట్లతో పోల్చుకున్నప్పుడు మనదేశ తయారీ మందులే చౌకగా లభ్యమయ్యే పరిస్థితి. ఈ ప్రజారోగ్య విధి విధానాల అమలు నాటి సోషలిస్టు దేశాల విధానాలకు పోటీగా అమలవు తున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుఎచ్ఒ) కితాబునివ్వడం గమనించ దగ్గది. దీందో నాటి పెట్టుబడిదారీ దేశాలు సైతం మన విధానాలనే అమలు పర్చాల్సి వచ్చిందట. తదనుగుణ విధి విధానాల ఫలితంగానే, 1970లోనే, 2000 సంవత్సరం నాటికి 'అందరికీ ఆరోగ్యాన్ని' అందుబాటులోకి తీసుకురావాలనే లక్ష్యం ప్రకటితమైంది. మరి ఆచరణలో ఏమైంది?

తదనంతరం, 'ఆరోగ్యమే మహాభాగ్యం' అన్న నినాదం లక్ష్యం కాగా, నేడది 'డబ్బుంటేనే ఆరోగ్యం'గా మారిపోయింది. ధనవంతులకే ఆరోగ్య విధానాల లభ్యత. పేదవారు కునారిల్లి పోవాల్సిందే. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు కనుమరుగై, నక్షత్రాల ఆస్పత్రులు ఊరు-వాడా వెలుస్తున్నాయి. నాటి నాడి చూసి వైద్యం చేసే బ్రిటిష్ వైద్య విధాన స్థానంలో, ముందు రోగికి అన్ని పరీక్షలు నిర్వహించి, సమస్యేంటో గుర్తించాకనే వైద్యం చేపట్టే అమెరికన్ వైద్య విధానం అమల్లోకి వచ్చింది. అంటే మార్కెట్ కల్చరన్నమాట. అటు పరీక్షలు నిర్వహించే ల్యాబ్‌లకు ఆదాయం, ఇటు పరీక్షలను ప్రతిపాదించే డాక్టర్లకు కమీషన్లు. అరకొర జీతాలతో ఆర్నెల్లకోసారి జీతాలను అందుకుంటున్న ప్రభుత్వ డాక్టర్లు సైతం కమీషన్లకై అర్రులుచాచే పరిస్థితిని కేవలం ప్రభుత్వాలే కల్పిస్తున్నాయి. మరి ప్రైవేట్ రంగ వైద్యులకు లక్షల్లో జీతాలు. ఇదీ జాతా పరిస్థితి.

తెలుగు రాష్ట్రాల్లో వైద్య విధానాల అమలును పరిశీలిస్తే నేటికీ మైళ్ల కొలది రోగులను డోలీలలో మోసుకుపోవాల్సిన పరిస్థితులు గ్రామాల్లో - తండాల్లోనూ నెలకొన్నాయి. బస్సుల్లోనూ, ఇతరత్రా రవాణా వాహణాల్లోనూ ప్రసవించే ఘటనలను చెదురు - ముదురుగా పత్రికల్లో చూస్తూనే ఉన్నాం. ఆరోగ్యాన్ని అందించే బాధ్యత ప్రభుత్వాలదేనన్న ఘోషను ప్రపంచీకరణ విధానాలు తుడిచిపెట్టినాయి. ఆరోగ్య పరిరక్షణకు కీలకమైన స్వచ్ఛమైన గాలి-నీరు-బలవర్థక ఆహారం మృగ్యమైపోయాయి. ఈ ప్రాథమిక అవసరాల కల్పనకు అవసరమైన ఏర్పాట్లు కనుమరుగైపోయాయి. దేశ వ్యాప్తంగా సుమారు 55 శాతం గ్రామీణ ప్రాంతాల్లో రక్షిత మంచినీరు లభ్యం కావడం లేదు. ఆంధ్రప్రదేశ్ విషయానికొస్తే సుమారు 49 శాతం గ్రామాలకు మంచినీరు లేదు.

దీనికి తోడు గ్రామీణ ప్రాంతాల్లో ఫ్లోరైడ్ సమస్య ఒకటి. పట్టణాల్లో సైతం రక్షిత మంచినీటి పరఫరా ఇందుకు భిన్నంగా ఏమీ లేదు. రాజధాని నగరాల్లోనే రెండు రోజులకోసారి మంచినీటి సరఫరా. అదీ రక్షిత మంచినీరు కాదు. డ్రైనేజ్ పైపులు - నీటి సరఫరా పైపులు కలగలిసిపోయి, మురికి నీరు సరఫరా అవుతున్న వైనాలు ఎన్నో. ఏమంటే నైజాం కాలం నాటి ఏర్పాట్లవి, వాటిని మార్చాలి. మార్చాలంటే లక్షల కోట్లలో అంచనాలు. పైగా ఈ సొంపుకి ప్రపంచంలో ఎక్కడా లేని రాజధాని నిర్మాణాలు, సచివాలయ నిర్మాణాలు. రాజధానిలో ఈ మురుగు నీటి ప్రభావంతో డెంగ్యు - మలేరియా వంటి విష జ్వరాలు. ఇదీ నేటి ప్రజారోగ్య పరిస్థితి. మరోవైపు ప్రభుత్వ మంచినీటి సరఫరా ఈ తీరున ఉండడంతో కోట్ల రూపాయల్లో మంచినీటి వ్యాపారం - ప్రైవేట్ నీటి సరఫరా ప్రభుత్వ కనుసన్నలలోనే సాగుతున్నాయి.

ప్రజారోగ్యం పట్ల ప్రభుత్వ నిర్లక్ష్యానికి సజీవ ప్రతీక, బడ్జెట్లలో ప్రభుత్వ కేటాయింపులు రెండో పంచవర్ష ప్రణాళికా కాలంలో మన రాష్ట్రంలో 4.02 శాతం కాగా, మరో పంచవర్ష ప్రణాళిక నాటికి 6.61 శాతం అయింది. తదుపరి మరో మూడు, నాలుగో, అయిదో పంచవర్ష ప్రణాళికల నాటికి 2.49 శాతం, 1.04 శాతం, 1.20 శాతానికి కేటాయింపులు పడిపోయాయి. వైద్యం-రక్షిత మంచినీటి పరఫరాలకు రాష్ట్ర ప్రభుత్వ స్థూల కేటాయింపులు 1990-91 వరకు పెరుగుతున్నట్లు కనిపించినా - మెరుగైన పరిస్థితులు మృగ్యం. అంటే 'కేటాయింపులు' దారి మళ్లాయన్నమాట. ఇలాగే తొలిదినాల్లో అంటే 1955-56 నాటికి 296 ఆస్పత్రులు నెలకొల్పగా, 1970-71 నాటికి ఎనిమిది రెట్ల స్థాయికి పెరిగి 2,434 ఆస్పత్రుల్ని నెలకొల్పారు. అంటే సుమారు 175 శాతం పెరుగుదల. డాక్టర్ల నియామకాలైతే 565 శాతం. 1990-91 నాటికి 4,022 ఆస్పత్రులు వ్యవస్థీకృతం కాగా, 2003-04 నుండి వీటి తరుగుదల ప్రారంభమై 1980-81 నాటి స్థాయికి పడిపోయాయి. డాక్టర్ల సంఖ్యా సైతం 2003-04 నాటి నుంచి కుదించుకుపోయి 1998-99 నాటి స్థాయిని చేరుకుంది. 2002-03 నాటికై హైటెక్ పాలన ఆస్పత్రుల భవనాల నిర్మాణాలు చేపట్టి, సిబ్బంది నియామకాలను అటకెక్కించేసింది. దాంతో కొన్ని చోట్ల ఈ భవనాలు అసాంఘిక నిలయాలుగా మారిన కథనాలు వినవచ్చాయి. ఓ వైపు బడ్జెట్ కేటాయింపుల కుదింపు మరోవైపు కేంద్ర ద్రవ్యోల్బణ విధి - విధానాల ఫలితంగా మందుల ధరలు చుక్కలనంటాయి. ఐడిపిఎల్ లాంటి ప్రభుత్వ రంగ సంస్థ ఉత్పత్తులను ప్రైవేట్ రంగానికి తరలించి చెల్లింపులకు చెల్లుచీటి రాసేసి ఐడిపిఎల్‌ను ఇరు ప్రభుత్వాలు కలిసి మూసేశాయి. (కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలగలసి.)

1990-91 నుంచి ప్రత్యక్షంగా 'ప్రపంచీకరణ' తెరమీదకొచ్చింది. 80వ దశకం నుంచే మోహమాటంగా మొదలైన 'ప్రైవేటీకరణ' 1990-91 నుంచి బహిరంగంగా ఊపందుకుంది దేశ వ్యాప్తంగానే. 1985-86 వరకు దేశ జనాభాలో సుమారు 60 శాతం ప్రభుత్వ సేవలను వినియోగించుకోగా, కేవలం పదేళ్ల కాలంలో 45 శాతానికి పడిపోయిందీ వినియోగం. ఈ ప్రపంచీకరణ హయాంలోనే ప్రభుత్వ వైద్య సేవల వెసులుబాటు క్షీణించడం ఆరంభమైంది. వైద్యుల నియామకాలు - సాంకేతిక సిబ్బంది నియామకాలు కుదించుకుపోయాయి. ఒకటి-అరా జరిగినా వైద్యుల నియామకాలు సైతం కాంట్రాక్టు పద్ధతిన మొదలైంది. అది ఎప్పుడో నిర్ణయించిన వేతనం. గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నియమించడం. దశాబ్దాల తరబడి ఈ కాంట్రాక్టు పద్ధతినే కొనసాగింపు. ప్రభుత్వ ఆసుపత్రిలో అదే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో (30 వేలకు) పనిచేయనారంభిస్తే ప్రజాహితవునాశించి, నెలల తరబడి జీతాలు లేకపోవడం. అందే ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తే గంటల చొప్పున వేతనాలు. ప్రభుత్వ నియామకాలకు ఎవ్వరూ రాని విధంగా ప్రభుత్వాల ఆచరణ. చిత్తశుద్ధితో పనిచేయాలనుకున్న వారికి సైతం వెగటు పుట్టే ధోరణి. ప్రైవేట్ ఆస్పత్రులలో కార్పొరేట్ ధోరణులను పరికిస్తే డాక్టర్లకు లక్షల్లో జీతాలను ఆహ్వానిస్తూ, నెలకు ఇంత శాతం (ల్యాబ్‌లకు) పరీక్షలను ప్రతిపాదించాలి. నెలకు కనీస పరంగా ఇన్ని శాస్త్ర చికిత్సలను ప్రతిపాదించాలనే నిబంధనలు. దీంతో కాస్తో-కూస్తోగా ఉన్న ప్రజాహితవు అడుగంటిపోద్ది. ఇదే ప్రభుత్వాలకు కావాలి. ఎందుకంటే ప్రతీ రాష్ట్ర వైద్య శాఖాధిపతికి ఓ మెడికల్ కాలేజీ ఉండడం పరిపాటి. దీంతో ప్రతీ ఏడాది వైద్య కళాశాలల్లో సీట్ల ధరలు లక్షలకు లక్షలు పెంపు. ఇంత వెచ్చించి చదివిన వారికి ప్రభుత్వ పరంగా ఇవ్వాల్సిన స్టైఫండ్‌లు ఇవ్వక పోవడం ఓ ఆనవాయితీగా మారింది. ఇన్ని లక్షలు వెచ్చించి చదువుకున్న డాక్టర్లు నైతికంగా నిలువమంటే నిలవగలరా? ఇదే ఈ ప్రభుత్వాలకు కావల్సింది. దీంతో వైద్య కళాశాలలు ఓ బంగారు బాతుగుడ్డయి, వాటి సంఖ్య జిల్లాకో వైద్యశాలగా తామర తంపరగా పెరగడం చూస్తున్నాం. ఈ విధానాల ఫలితంగా గ్రామాల్లోను, చిన్న చిన్న నగరాల్లోని డాక్టర్లే కార్పొరేట్ ఆస్పత్రులకు ఏజెంట్లుగా మారిపోయే పరిస్థితి. అలాగని వీరిని తప్పుపట్టే పనిలేదు. 'మనుగడ' కోసం తప్పని పరిస్థితి.

ఈ కార్పొరేట్ ఆస్పత్రుల ఏర్పాటులో ఈ ప్రభుత్వాలు ఎనలేని శ్రద్ధను కనబరుస్తున్నాయి. కార్పొరేట్ ఆస్పత్రుల ఏర్పాటుకై వందల ఎకరాల స్థలాలను కేటాయించడం, కనీస ధరలకే ఆదాయ పన్ను రాయితీలు, సాంకేతిక యంత్ర దిగుమతుల్లో వేల కోట్ల రాయితీలు. ప్రభుత్వ ఉద్యోగులకు ఈ కార్పొరేట్ వైద్య వ్యయాలను ప్రభుత్వ పరంగా పొందే వెసులుబాటు కల్పించడం. ఇఎస్ఐ ఆస్పత్రులున్నప్పటికీ వైద్య భీమా పద్ధతులు ఉనికిలోకి వచ్చి ఆరోగ్య భీమా సంస్థలు ఇబ్బడి ముబ్బడిగా వెలుస్తున్నాయి. తప్పుడు శాస్త్ర చికిత్సలు అంటే అవసరం ఉన్నా, లేకున్నా శాస్త్ర చికిత్సలు చేపట్టడం, చనిపోయినా మా ప్రయత్నం మేం చేస్తామన్న మోసపూరిత ధోరణులు - డబ్బుకోసం చేపట్టడం అతి మామూలు అయిపోయింది. అలా జరిగినట్లు రుజువైనా, ఏ ఒక్క కార్పొరేట్ ఆస్పత్రి పైనా ప్రభుత్వ పరంగా చర్య తీసుకున్న దాఖలాలు లేవు. ఎందుకంటే రేపటి ఎన్నికలకు వీరే పెట్టుబడులు కాబట్టి.

ప్రైవేట్ ఆస్పత్రుల ప్రాపకానికై ఆరోగ్య శ్రీ వంటి వైద్య విధానాలను ప్రవేశపెట్టడం జరిగింది. తెల్ల రేషన్‌కార్డు ఉన్న వారికి ఏ రోగ నివారణకైనా దాని వ్యయం ప్రభుత్వమే చెల్లిస్తుందన్న ఈ ఆరోగ్య శ్రీ అవసరమైన వారికి కాకుండా, దళారుల భారినపడి ప్రజా ధనాన్ని ప్రైవేట్ ఆస్పత్రులు - ప్రభుత్వ అధికారులు పంచుకుంటున్న వైనం సుస్పష్టం. ఈ ఆరోగ్య శ్రీ కేటాయింపుల్లో పదోవాటా ధనం రాష్ట్ర వ్యాప్త ప్రథమిక ఆరోగ్య కేంద్రాలన్నింటినీ పరిపూర్తిగా నిర్వహించాలన్న సంగతి ఎందరో వ్యక్తం చేశారు. అయినా ఈ ప్రభుత్వాలకు చలనం ఉండదు. అది వారికి అక్కర్లేదు.

ప్రజలందరికీ ప్రజారోగ్యాన్ని అందివ్వాల్సిన బాధ్యత ప్రభుత్వాలదే అని ఆదిలోనే నిర్ణయమైనా, ఈ ప్రజారోగ్యానికి దేశ స్థూల జాతీయాదాయంలో వెచ్చిస్తున్నది 1.2 శాతం. అంటే ఇన్ని కోట్ల మందికి, అందులో ఉన్న 60 శాతం పేదలకు 1 శాతం కేటాయింపు. ఎన్ని విధాలుగా మెరుగుపడిపోద్ది ప్రజారోగ్యం. ఇంతటి ఘనమైన ఆచరణ ఉండబట్టే మానవాభివృద్ధి సూచికను ప్రపంచ దేశాలతో పోల్చి చూసినపుడు, 185 దేశాల సూచీలో మనదేశం 130వ స్థానంలో

పనామా పేపర్స్ నుంచి ప్యారడైజ్ పేపర్స్ దాకా

అవినీతిని నిర్మూలిస్తామని అధికారంలోకి వచ్చిన బిజెపి పాలన కూడా అవినీతిమయమేననే విషయాన్ని పనామా పేపర్లు, ప్యారడైజ్ పేపర్లలో వెల్లడైన విషయాలను చూస్తే తేటతెల్లమవుతోందని అంటున్నారు **సంతోష్**

డీమానిటైజేషన్ (నోట్ల రద్దు) కు వ్యతిరేకంగా నవంబర్ 8న ప్రతిపక్షాలు బ్లాక్ డే పాటిస్తే, మోడీ ప్రభుత్వం పెద్ద నోట్ల రద్దు ప్రకటించి ఏడాది పూర్తయిన క్రమంలో 'యాంటి బ్లాక్ మనీ డే'ను నిర్వహించింది. దీనికి రెండు రోజుల ముందు నవంబర్ 6న ప్యారడైజ్ పేపర్ల లీక్ వెలుగులోకి రావడం తీవ్ర ప్రకంపనాలను సృష్టించింది. ఆర్థిక కుంభకోణాల పరంపరలో ప్రపంచ దేశాల రాజకీయాలను పద్దెనిమిది మాసాల క్రితం భారీగా కుదిపేసిన పనామా పత్రాలు సృష్టించిన సంచలనం సద్దుమనుగక ముందే.. తాజాగా అంతకన్నా భారీ స్థాయిలో ఆర్థిక కుంభకోణాలను ఫ్యారడైజ్ పత్రాలు వెలుగులోకి తెచ్చాయి. వివిధ దేశాధినేతలు, రాజకీయ ప్రముఖులు, కార్పొరేట్ దిగ్గజాలు, సెలబ్రిటీలు స్వదేశాలలో పన్నులు ఎగవేసి విదేశాలలో జరుపుతున్న అక్రమ ఆర్థిక లావాదేవీలకు సంబంధించి ప్యారడైజ్ పత్రాల లీక్ ప్రపంచవ్యాప్తంగా కలకలం రేపడంతో పాటు రాజకీయ వేడి పుట్టిస్తోంది.

ఇతర దేశాలలో సంస్థలు కలిగి ఉండడం లేదా వాటికి, వాటి నుండి నిధుల బదిలీ వంటివి అనేక దేశాలలో ఆటోమేటిక్ ఆర్థిక నేరాలుగా పరిగణింపబడనప్పటికీ భారత్‌లో మాత్రం రిజర్వ్ బ్యాంకు మార్గదర్శకాల ప్రకారం భారత పౌరులు విదేశాలలో వ్యాపార సంస్థలు ప్రారంభించేందుకు 2003 వరకూ అవకాశం ఉండేది కాదు. అయితే 2004లో రిజర్వ్ బ్యాంక్ ప్రవేశపెట్టిన సరళీకృత నగదు, బదిలీ పథకం (ఎల్ఆర్ఎస్) కింద ఆయా వ్యక్తులు 25 వేల డాలర్ల వరకూ నగదును బదిలీ చేసుకోవచ్చు. 2013లో వ్యక్తులు విదేశాలలో తమ సంస్థలకు అనుబంధ సంస్థలు ఏర్పాటు చేసుకునేందుకు లేదా జాయింట్ వెంచర్లలో పెట్టుబడులు పెట్టేందుకు అనుమతిస్తూ చట్ట నిబంధనలు అమలులోకి వచ్చాయి. అంటే 2013కు ముందు విదేశాలలో సంస్థలు కలిగి ఉండడం లేదా విదేశీ బ్యాంకు ఖాతాలకు నగదు బదిలీ చేయడం వంటివి దాదాపు నిషిద్ధ పనులన్న విషయం స్పష్టంగా తెలుస్తోంది. గతంలో వెలుగులోకి వచ్చిన లీకేజీలో హెచ్ఎస్‌బిసి జెనీవా లీక్స్ ప్రముఖమైనవి.

స్వదేశంలో పన్నుల ఎగవేతకు పాల్పడి, 'పన్ను రహిత స్వర్గాలు'గా పిలువబడుతున్న దేశాలు, దీవులకు తమ అక్రమార్జనను చేరవేసి, అక్కడ నుంచి సవాలక్ష గొలుసుకట్టు కంపెనీల్లో పెట్టుబడులు పెట్టే భారతీయులకు ఆ దేశాలు స్వర్గధామంగా ఉన్నట్లు పలుమార్లు వెల్లడైంది. వికీలీక్స్, ఆఫ్ షోర్ లీక్స్, స్విస్ లీక్స్, పనామా పేపర్స్, తాజాగా ప్యారడైజ్ పేపర్స్ అట్టి భాగోతాలను బహిర్గతం చేశాయి. వారు వీరు, ఇక్కడా అక్కడా అన్న తేడాలేవీ లేకుండా ప్రపంచవ్యాప్తంగా ఉన్న సంపన్నులు, శక్తిమంతులంతా ఒక్కటేనని తేల్చేశాయి ఇవి. తమదేశాల్లో పన్ను చెల్లించడానికి వీరి మనసులు ఎంతగా క్షోభిస్తాయో, ఎగవేయడానికి ఎన్ని అడ్డదారులు తొక్కుతారో, ఎంతదూరం పోతారో ఈ పత్రాలు తెలియచెబుతున్నాయి. ఇంటర్నేషనల్ కన్సార్టియం ఆఫ్ ఇన్వెస్టిగేటివ్ జర్నలిస్ట్‌లు (ఐసిఐజె), దాని భారతదేశ భాగస్వామి ది ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లు నవంబర్ 6న 180 దేశాలకు చెందిన వ్యక్తులు, కంపెనీల సముద్రాంతర పెట్టుబడుల సమాచారాన్ని వెల్లడించాయి.

ప్యారడైజ్ పేపర్స్ పేరుతో 13.4 మిలియన్ల పత్రాలను బ్యాంకు ఖాతాల నిర్వహణ, ఆఫ్‌షోర్ కంపెనీల ఏర్పాటులో పాత్ర ఉన్న 199 ఏళ్ల నాటి 118కు పైగా వేర్వేరు ఆఫ్‌షోర్ సంస్థలను కలిగి ఉన్న బెర్ముడాకు చెందిన ఆపిల్బై, సింగపూర్‌కు చెందిన ఆసియాసిటీ ట్రస్ట్ నుంచి ఈ అక్రమ ఆర్థిక లావాదేవీల సమాచారం బయటకు వచ్చినట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ ప్రచురించిన తన మొదటి పరిశోధన నివేదికలో పేర్కొంది. ఈ జాబితాలో పేర్కొన్న 180 దేశాలలో భారత్ 19వ స్థానంలో ఉంది. ఇదిలా ఉండగా ఆపిల్బై ఖాతాదారులలో భారతీయులు రెండో స్థానంలో ఉన్నారు. ఈ పత్రాల్లో 714 మంది భారతీయుల పేర్లు బయటకు వచ్చాయి. వీరిలో కేంద్ర మంత్రులు, ఎంపిలు, సినీ, రాజకీయ ప్రముఖులు, వ్యాపారులు ఉన్నట్లు వెల్లడయింది. ప్రపంచ పరిశోధనా సహకారంతో ఈ పత్రాలు వచ్చాయి.

రాజకీయ నాయకులు, ప్రముఖులు కంపెనీలకు సంబంధించిన ఆర్థిక, చట్టపరమైన 11 మిలియన్లకు పైగా పనామా పత్రాల వివరాలు విడుదలయిన 18 నెలల తర్వాత తాజాగా ప్యారడైజ్ పత్రాలు వెలుగు

ఉంది. ప్రపంచీకరణ విధి విధానాల అమలు పతాక స్థాయికి చేరిన వేళ, 'పేదరికం' మూడు పువ్వులు – ఆరు కాయలుగా విలసిల్లుతూనే ఉంది. పదిమందికి అన్నం పెట్టే అన్నదాత ఆత్మహత్యకు పాల్పడుతున్నాడు. ఈ ఘనకీర్తి చాలదూ రొమ్ము విరుచుకు బతికేయడానికి?

'వైద్య నారాయణో హరీ' అన్నది పురాతన నానుడి. అంటే వైద్యుడు దేవుడంతటి వాడని స్థూలంగా అర్థం. అందుకే స్వాతంత్ర్యపు తొలి దినాల్లోనే వైద్య రంగాన్ని పటిష్టం చేయ పూనుకుంది ప్రభుత్వం. కాని ఇన్నేళ్ల తరువాత, అధునాతనంలోకి అడుగిడుతున్నాంమంటున్న 'హైటెక్ పాలన' ఆరడుగులు వెనక్కి జరిగి, ఆర్ఎంపి, పిఎంపి వంటి శాస్త్రీయత లేని, నకిలీ వైద్యులను ఎంపిక చేసి ప్రజా వైద్యులుగా గుర్తించాలని ప్రభుత్వం ఓ ఉత్తర్వును తీసుకొస్తున్నది. సాధారణ (బిపి) రక్తపోటు చూడడం కూడా రాని ఈ వైద్యులు, పైది (సిస్టాలిక్) ఎక్కువుంది లేదా కిందిది (డయోస్టాలిక్) తక్కువుందనే మోళీ వైద్యులను ప్రజల మీదకి వదిలేయడానికి నిర్ణయించారట. మరి ఇది పురోగమనమా? తిరోగమనమా? మీరే ఆలోచించండి. మరీ ప్రజలను ఎవరు కాపాడాలి? పుష్కరాల పేరుతో ప్రజా నిమజ్జనానికి బలి చేసిన తీరున, ప్రజా వైద్యుల పేరున ప్రజలను వారి ఖర్మలకు వారిని బలిచేయడం తగునా?

(రచయిత పాత్రికేయులు)

వీ

చూశాయి. 96 వార్తా సంస్థలతో ఇంటర్నేషనల్ కన్సార్టియం ఆఫ్ ఇన్వెస్టిగేషన్ జర్నలిస్ట్స్ (ఐసిఐజె) సంయుక్తంగా పరిశోధన జరిపింది. ఈ పరిశోధనా వ్యాసం కోసం, 380 మందికి పైగా జర్నలిస్టులు సంవత్సర కాలంపాటు విస్తృత అన్వేషణ నిర్వహించారు. జర్మనీ వార్తా పత్రిక సుడెట్చ్ జెతుంగ్ రెండు సెట్ల అక్రమ ఆర్థిక లావాదేవీల వివరాలను ప్రచురించింది. విదేశీ ఖాతాల్లో పెట్టుబడులు కలిగి ఉన్న భారత్‌కు చెందిన ప్రముఖుల వివరాలు కూడా ప్యారడైజ్ పత్రాల్లో ఉన్నాయి. సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వంటి భారత దర్యాప్తు సంస్థల ద్వారా విచారణ ఎదుర్కొంటున్న అనేక మంది కార్పొరేట్‌లూ, కంపెనీలూ ఆపిల్బై ఖాతాదారులుగా ఉన్నారు.

స్వదేశాల్లో పన్నులు ఎగ్గొట్టి విదేశాల్లో దాచుకొని, వేరే కంపెనీలు, బ్యాంకుల రూపంలో ఆ విదేశీ కంపెనీల ద్వారా మరలా స్వదేశాల్లోకి అప్పులను తెచ్చుకోవడం ప్రస్తుతం జరుగుతున్న తీరు. ఇంతకంటే దేశద్రోహం మరొకటి ఉండదు. వీళ్లే అసలైన దేశ ద్రోహులు. తల్లిపాలతో పాటుగా రక్త మాంసాలను కూడా భక్షించే కిరాతకులు వీళ్లు. ఈ జాబితాలో మనవాళ్లు 714 మంది ఉన్నట్లు ప్రస్తుతానికి కనుగొన్నారు. భవిష్యత్తులో పెరగవచ్చు. మన పాలకులు అభివృద్ధి, జిడిపి వృద్ధిరేట్లను గురించి పదేపదే వల్లిస్తుంటే, బడా బాబులు పెరుగుతున్న జిడిపిని విదేశాల్లో దాస్తూ ఆర్థిక అసమానతలకు ఈ పన్ను ఎగవేతదారులు కారకులౌతున్నారు. భారతదేశంలోని కంపెనీలు టాక్స్‌హెవెన్ దేశాలకు ఎగుమతులు చేస్తున్నప్పుడు వస్తువుల విలువను తక్కువ చూపిస్తూ, దిగుమతులు చేసుకొంటున్నప్పుడు వస్తువు విలువను ఎక్కువ చూపించి నల్లధనాన్ని సమకూర్చుకొంటున్నారు. వీరికి ఆ దేశాలు స్వర్గధామాలు కాగా మన దేశాన్ని మాత్రం నరకం చేస్తున్నారు.

18 మాసాల క్రితం విడుదల చేసిన పనామా పేపర్స్ 426 మంది భారతీయుల, భారతీయ సంతతి వ్యక్తుల పేర్లను వెల్లడించింది. విదేశాల్లో దాచిన నల్లధనాన్ని వెనక్కి రప్పించి ప్రజలకు పంచడమే తమ కర్తవ్యంగా ప్రకటించిన నరేంద్రమోడీ ప్రభుత్వం నల్లకుబేరుల చేష్టల ముందు చేతలుడిగి కూర్చుంది. ఇటువంటి నేరాలకు పన్ను ఎగవేత నేరంగానే పరిగణిస్తూ పనామా పేపర్స్ దర్యాప్తునకు 2016లో ప్రత్యక్ష పన్నుల బోర్డు ఛైర్మన్ అధ్యక్షతన బహుళ ఏజెన్సీ గ్రూపు (సిబిడిటి, ఇడి, రిజర్వు బ్యాంకు, ఫైనాన్షియల్ ఇంటెలిజెన్స్ యూనిట్ సభ్యులతో) ఏర్పాటు చేసింది. తాజాగా ప్యారడైజ్ పత్రాల లీకుతో ఆ బృందాన్ని పునర్ వ్యవస్థీకరించింది. పనామా పేపర్ల దర్యాప్తులో ఇంతవరకు ఏ ఒక్క కేసులో నేరస్తుల నిర్ధారణ జరగలేదు. అక్రమార్జన భరతం పట్టే చిత్తశుద్ధి ప్రభుత్వానికి ప్రకటనల్లోనే తప్ప ఆచరణలో లేదని మరోమారు ప్యారడైజ్ పేపర్లతో రుజువైంది.

పనామా పత్రాల ఆధారంగా అనేక దేశాలు విచారణ జరిపాయి. కొన్ని దేశాల్లో నేటికీ విచారణ కొనసాగుతున్నది. ఇద్దరు ప్రధానులు పదవి నుండి దిగిపోవాల్సి వచ్చింది. పాకిస్థాన్ ప్రధాని నవాజ్ షరీఫ్ పదవి ఊడింది. ఆయన కుటుంబ సభ్యులు కూడా సుప్రీంకోర్టు విచారణలో ఉన్నారు. ఐస్‌లాండ్ ప్రధాని సిగ్మండర్ డెలియో పేరు బయటకు రావడం, ప్రజలలో పెద్ద ఎత్తున ప్రధాని రాజీనామా చేయాలని ఆందోళనలు చెలరేగాయి. 2016లో ఆయన పదవికి రాజీనామా చేయక తప్పలేదు. పనామా పత్రాలలో మనదేశ ప్రముఖులు చాలా మంది ఉన్నారు. కానీ, ఇక్కడ ఎలాంటి విచారణ చేపట్ట లేదు. ఎవరిపైనా చర్యలు తీసుకోలేదు. అవినీతి అంతం బిజెపి పంతమని సుద్దులు చెప్పే మోడీ ప్రభుత్వం అవినీతిలో కాంగ్రెస్‌తో పోటీ పడుతున్నది. కాంగ్రెస్, బిజెపి ప్రభుత్వాలు ఏనాడు చిత్తశుద్ధితో అక్రమార్జనను అడ్డుకోలేదు.

ప్యారడైజ్ పత్రాలు వెలువడిన వెంటనే యూరోపియన్ యూనియన్ తన ఎజెండాను సరిదిద్దుకుంది. 'టాక్స్ హెవెన్స్'తో ఇయుకు వస్తున్న అప్రతిష్టను కడిగేందుకు తక్షణమే చర్యలు ప్రారంభించాలని అనుకుంటున్నది. కానీ, మన దేశంలో గతంలో పనామా పత్రాల విషయంలో కనబడిన ఉదాసీనత చూసిన తరువాత అద్భుతాలు జరుగుతాయన్న నమ్మకం ఏమాత్రం కలగడం లేదు. పనామా పత్రాలు పొరుగుదేశం పాకిస్థాన్ పాలకుడిని గద్దెదించాయి. న్యాయ స్థానాల చుట్టూ తిరిగిన నవాజ్ షరీఫ్ చివరకు రాజకీయాలకు అనర్హుడైపోయారు. కానీ, అవే పత్రాల్లో పేర్లున్న వారంతా మనదేశంలో హాయిగా తిరుగుతున్నారు. అధికారంలో ఉంటూ పన్ను ఎగవేతలపై ప్రజలకు సుద్దులు చెబుతున్నారు. పనామా పేపర్ల జాబితాను పరిశోధిస్తున్న మల్టీ ఏజెన్సీ గ్రూప్ (మ్యాగ్) అధికారుల బృందమే ఈ ప్యారడైజ్ పేపర్ల లీక్‌ను విచారిస్తుందని భారత ప్రభుత్వ అధికార వర్గాలు వెల్లడించాయి. కొంతకాలం తరువాత పనామా పత్రాలపై దర్యాప్తునకు పట్టిన గతే దీనికి పట్టదన్న గ్యారంటీ ఏమిటి?

పనామా పత్రాల విషయంలో మాదిరిగా ప్రభుత్వం ఈ మారూ వ్యవహరిస్తే మోడీని ప్రజలు నమ్మరు. పనామాలో ఉన్న మూడు వందల యాభై మందిలో యాభై మందికి ఫెమా నోటీసులు ఇవ్వడం తప్ప ప్రభుత్వం ఇప్పటి వరకూ ఇదమిత్తంగా సాధించిందేమీ లేదు. అంతకంటే తీవ్రమైన కార్పొరేట్ నేరాలను బహిర్గతం చేసిన ప్యారడైజ్ పత్రాల విషయంలో ప్రభుత్వం చొరవతో క్రియాశీలకంగా వ్యవహరించకపోతే పరువుపోక తప్పదు. అవినీతికి, పన్ను ఎగవేతకు వ్యతిరేకంగా పోరాడుతున్నట్టుగా చెప్పుకొనే పార్టీకి ఇది పరీక్షా సమయం. సార్వత్రిక ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో, తన మంత్రి వర్గంలోని ఓ మంత్రిపేరు, తమ పార్టీకి చెందిన ఓ ఎంపి పేరు బయటకు రావడం అధికార పక్షానికి అప్రతిష్ఠ తెచ్చేవే. పనామా పత్రాలు బహిర్గతమైనప్పుడు అరుణ్ జైట్లీ 'ఎవరూ పవిత్ర గోవులు కారు' అని ఓ వ్యాఖ్య చేశారు. ప్యారడైజ్ లీక్ తరువాత ప్రజలకు జైట్లీ మాటలు మళ్లీ గుర్తుకు వస్తున్నాయి.

అంతర్జాతీయంగా చూస్తే, బ్రిటన్ రాణి ఎలిజబెత్–2కు చెందిన ప్రైవేటు ఎస్టేట్ నుంచి మిలియన్ల పౌండ్లు విదేశీ ఖాతాల్లో పెట్టుబడులుగా పెట్టినట్లు నివేదిక వివరించింది. ఇక అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ బిలియనీర్స్ వాణిజ్య కార్యదర్శి విల్బర్ రాస్‌ల మధ్య సంబంధాలను కూడా పరిశోధనా నివేదిక వెల్లడించింది. రష్యా అధ్యక్షుడు వ్లదిమిర్ పుతిన్ అల్లుడు కిరిల్ షామ్‌లోవ్‌కు చెందిన ఒక గ్యాస్ ఉత్పత్తి కంపెనీలో విల్బర్ రాస్ వాటా కలిగి ఉన్నట్లుగా ఆరోపణలు ఉన్నాయి. ప్రముఖ నౌకాయాన కంపెనీ నావిగేటర్ హోల్డింగ్స్‌లో రాస్ ఒక వాటాదారు. దాని ప్రధాన వినియోగదారులలో రష్యా గ్యాస్, పెట్రో– కెమికల్ ఉత్పత్తిదారు సైబుర్ వంటివి ఉన్నాయి. అలాగే కెనడా ప్రధాన మంత్రి జస్టిన్ ట్రుడో ఆర్థిక వ్యవహారాల ప్రధాన నిర్వాహకుడి పేరు కూడా ఉంది. పాకిస్తాన్ ప్రధాన మంత్రి షౌకత్ అజీజ్‌తో సహా 120 మందికి పైగా రాజకీయ నాయకులు విదేశీ ఖాతాల్లో పెట్టుబడులు కలిగి ఉన్నట్లు ఇండియన్ ఎక్స్‌ప్రెస్ నివేదిక పేర్కొంది.

ప్యారడైజ్ పత్రాల్లో భారతీయుల జాబితాలో పలువురు సినిమా తారలు, రాజకీయ నేతలు, వ్యాపారులతో భారీగా ఉంది. సన్ టివి – ఎయిర్‌సెల్–మాక్సి కేసు, ఎస్సార్–లూప్ 2జి కేసు, ఎస్ఎన్‌సి –లావాలిన్ కేసు, ఇటీవల సిబిఐ విచారణ ఎదుర్కొంటున్న రాజస్థాన్ అంబులెన్స్ కేసు, జిక్విస్తా హెల్త్ కేర్ పేరుతో పిలవబడుతున్న ఒక కంపెనీ (సచిన్ పైలట్, కార్తి చిదంబరం స్వతంత్ర డైరెక్టర్లుగా ఉన్న), వైఎస్సార్ కాంగ్రెస్

పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై ఉన్న ఒక సిబిఐ కేసులో తాజా ఆర్థిక సంబంధాలపై వివరాలు ఉన్నట్లు ఎక్స్‌ప్రెస్ నివేదిక పేర్కొంది. అలాగే బాలీవుడ్ సినీ నటుడు అమితాబ్ బచ్చన్, ఇక కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి జయంత్ సిన్హాల పేరు ఉండడం సంచలనం రేపుతుంది. గతంలో ఆయన మేనేజింగ్ డైరెక్టర్‌గా వ్యవహరించిన ఒమిడ్యార్ నెట్‌వర్క్ అనే సంస్థకు అమెరికాకు చెందిన డిలైట్ డిజైన్‌లో పెట్టుబడులున్నాయి. కేమ్యాన్ ఐలాండ్స్‌లో అక్రమంగా పెట్టుబడులు పొందిన ఓ సంస్థ డిలైట్ డిజైన్‌కు అనుబంధంగా ఉండడం వివాదస్పదమైంది.

కాంగ్రెస్ సీనియర్ నేత వీరప్ప మెయిలీ తనయుడు హర్ష మెయిలీ పేరు కూడా బయటకు వచ్చింది. వీరప్ప యుపిఏ ప్రభుత్వంలో కేంద్ర మంత్రిగా ఉన్నప్పుడు ఆయనకు చెందిన సంస్థ 'మోక్షయుగ్ యాక్సెస్ లిమిటెడ్' (ఎంవైఎల్) సంస్థ మారిషస్‌కు చెందిన 'యూనిటస్ ఇంపాక్ట్' అనే సంస్థ నుంచి భారీగా పెట్టుబడులు పొందిందని తేలింది. పలు అంతర్జాతీయ సంస్థల నుంచి ఎంవైఎల్ పెట్టుబడులు నిబంధనల ప్రకారమే జరిగాయని చెప్పారు. రాడియా టేపుల వ్యవహారంతో అందరికీ పరిచయమైన కార్పొరేట్ లాబీయిస్ట్ నీరా రాడియా పేరు కూడా ఈ పేపర్లలో బయటకు వచ్చింది. మాల్టాలోని రెండు విదేశీ కంపెనీల్లో ఆమెకు భాగస్వామ్యమున్నట్లు ఈ పత్రాలు స్పష్టం చేశాయి. విజయ్ మాల్యాకు చెందిన యునైటెడ్ స్పిరిట్స్ లిమిటెడ్ తనకు అనుబంధంగా ఉన్న నాలుగు విదేశీ కంపెనీలకు 1.5 బిలియన్ డాలర్లు (సుమారు రు. 9వేల కోట్లు) మళ్లించారని, తర్వాత ఆ కంపెనీలు అప్పులపాలైనట్లు లెక్కలు చూపించారని ప్యారడైజ్ పేపర్స్ బయట పెట్టాయి.

మాజీ కేంద్ర మంత్రి, కాంగ్రెస్ నేత వాయలార్ రవి తనయుడు రవికృష్ణకు చెందిన సంస్థ కూడా మారిషస్‌లోని ఓ కంపెనీకి పెట్టుబడులు మళ్లించినట్లు వెల్లడైంది. రాజస్థాన్‌లో జరిగిన అంబులెన్స్ కుంభకోణానికి సంబంధించి ప్రస్తుతం 'జికిట్జా హెల్త్‌కేర్' సంస్థపై సిబిఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ విచారణ జరుపుతున్నది. అశోక్ గెహ్లాట్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు జరిగిన ఈ కుంభకోణంలో కాంగ్రెస్ నేతలు చిదంబరం తనయుడు కార్తి చిదంబరం, మాజీ కేంద్రమంత్రి సచిన్‌పైలట్ వంటివారితోనూ ఈ సంస్థకు సంబంధాలుండడం గమనార్హం. బిజెపి ఎంపి రవీంద్ర కిశోర్ సిన్హాకు చెందిన 'సిఐఎస్ ఏషియా' సంస్థకు విదేశాల్లో ఉన్న రెండు అనుబంధ కంపెనీల ద్వారా నేరుగా పెట్టుబడులను పన్నురహిత స్వర్గధామాలకు మళ్లించారని బయటపడింది. ఢిల్లీ కేంద్రంగా పనిచేస్తున్న జిఎంఆర్ గ్రూప్ ప్రస్తావన కూడా ఉన్నట్లు సమాచారం. ఆంధ్ర వ్యాపారవేత్త నిమ్మగడ్డ ప్రసాద్ పేరు ప్యారడైజ్ పత్రాల్లో ఉంది. బిజెపి రాజ్యసభ సభ్యుడు, సెక్యూరిటీ, ఇంటెలిజెన్స్ సర్వీసెస్ (ఎస్ఐఎస్) వ్యవస్థాపకుడు ఆర్‌కె సిన్హాకు చెందిన ఆఫ్‌షోర్ కంపెనీల వివరాలు కూడా ఈ జాబితాలో ఉన్నాయి. పేపర్ల లీకేజీపై స్పందించిన ఆపిల్బై సమాచారం అపహరణకు గురైందని పేర్కొంది.

అవినీతి, నల్లధనానికి ఆజ్యం పోసే ప్రపంచీకరణ ఆర్థిక విధానాలను ఒకవైపు ఉధృతంగా అమలుచేస్తూ, మరోవైపు ఆ విధానాల పర్యవసానాలపై పోరాడతానని మోడీ ప్రభుత్వం చెప్పడం హాస్యాస్పదం. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ పేరుతో కార్పొరేట్లకు పన్నుల్లో పెద్ద ఎత్తున రాయితీలు కల్పిస్తున్న బిజెపి సర్కారు ఈజ్ ఆఫ్ బ్లాక్‌మనీలో కూడా అగ్రస్థానం వహిస్తోంది. నల్లధనం పెరిగిపోవడానికి పన్ను చట్టాలు కఠినంగా ఉండడమే కారణమంటూ వీటిని మరింత సడలించాలని చూస్తున్నది. అవినీతి, నల్లధనంపై పోరాటం గురించి పెద్ద పెద్ద కబుర్లు చెప్పే మోడీ ప్రభుత్వం ఆచరణలో నల్లధనులకు కొమ్ము కాస్తోందనడానికి ఉదాహరణలు కోకొల్లలు. బ్యాంకులకు కార్పొరేట్లు ఎగవేసిన రుణాలను ముక్కుపిండి వసూలు చేయాల్సిన ప్రభుత్వం, అందుకు భిన్నంగా వారి రుణాలను మాఫీ చేసింది.

2014 ఎన్నికల సమయంలో మోడీ తనకు అధికారం అప్పగిస్తే వంద రోజుల్లో విదేశాల్లో దాగి ఉన్న అక్రమ సంపదను భారత్‌కు తెస్తానని, అవినీతి రహిత పాలన అందిస్తానని ఊదర గొట్టాడు. ఆ హామీలు నెరవేర్చలేక పోయారు. 2016 నవంబర్ 8న చేసిన నోట్ల రద్దు అవినీతి వ్యతిరేక పోరాటమని ప్రధాని మోడీ ప్రజలను నమ్మించడానికి ప్రయత్నించారు. నిజానికి పెద్ద నోట్ల రద్దు వల్ల సామాన్యులకే సమస్య తప్ప సంపన్నులకొచ్చిన ఇబ్బందేమీ లేదని తేలిపోయింది. కాకుల్ని కొట్టి గద్దలకు వేసినట్టు ప్రజల సొమ్మునంతా బడా బాబుల కోసం బ్యాంకులకు చేర్చడం, అక్రమ సంపాదనను సక్రమ సంపాదనగా మార్చుకోవడం తప్ప పెద్దనోట్ల రద్దు సాధించిందేమీ లేదు. పైగా జిఎస్‌టి, నోట్ల రద్దు వలన అన్ని రంగాలు కుదేలై దేశ ఆర్థిక వ్యవస్థ సంక్షోభంలో కూరుకుపోతుంటే, ఈ నోట్ల రద్దు ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక కుంభకోణమని మేధావులు విశ్లేషిస్తుంటే మోడీ మాత్రం ఇది అవినీతి వ్యతిరేక పోరాటమని గప్పాలు కొట్టుకోవడం విస్తుగొలుపుతున్నది.

బిజెపి మూడున్నరేండ్ల పాలన తాము కాంగ్రెస్‌కు ఏమాత్రం భిన్నం కాదని రుజువు చేస్తున్నది. పైగా ఈ కాలంలో అవినీతి తగ్గకపోగా అభివృద్ధి కుంటుపడింది. గనుల కుంభకోణం నుండి జిఎస్‌పిసిఎల్ వరకూ, బిర్లా సహారా డైరీ నుండి వ్యాపం కుంభకోణం వరకూ మోడీ ఏలుబడిలో వరుస కుంభకోణాలు వెలుగు చూస్తుంటే, అవినీతి మరకలు అంటిన నేతలతో పార్టీ యావత్తు నిండిపోతుంటే తాము అవినీతికి వ్యతిరేకులం అంటే ప్రజలు నమ్మడానికి సిద్ధంగా లేరు. ప్రజలకు తెలుసు పాలకవర్గ పార్టీలన్నీ కలిసే ఈ దేశంలో అవినీతిని వ్యవస్థీకృతం చేశాయని... 70 ఏండ్లుగా దేశంలో కేంద్రంలో అధికారంలోకి వచ్చిన పార్టీ ఏదైనా, ప్రభుత్వ రంగు ఏదైనా, వాటి సిద్ధాంతాలు ఏవైనా ఈ అవినీతికి మాత్రం అందరూ నారు పోసి, నీరు పోసి, ఎరువేసిన వారేనని...! ఇందుకు బిజెపి కూడా మినహాయింపు కాదని తేలిపోయింది. పార్టీలు మారినా, ప్రభుత్వాలు మారినా ఈ అవినీతి మాత్రం పెరుగుతూనే ఉందని అర్థమవుతోంది. ఈ చీకటి భాగోతంలో కాంగ్రెస్‌కు చెందిన ప్రముఖులు కొందరు ఉన్నప్పటికీ అగ్రస్థానం బిజెపిదే!

నల్లధనుల పీచమణచేందుకు ఉద్దేశించిన చట్టాలు కాగితాలపై ఘనంగానే ఉన్నా, ఆచరణలో అవి సంపన్నులకు నేస్తాలుగా మారుతున్నాయి. అవినీతి, నల్లధనంపై ప్రభుత్వం ఈ ద్వంద్వ ప్రమాణాలను కట్టిపెట్టి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలి. కార్పొరేట్ల సేవలో తరిస్తున్న బిజెపి ప్రభుత్వం ప్యారడైజ్ జాబితాలోనూ, అంతకు ముందు పనామా పత్రాల్లోనూ ఉన్న అక్రమార్కుల వ్యవహారాలపై నిజాయితీతో విచారణ జరిపి దోషులను కఠినంగా శిక్షించాలి. పనామా పత్రాలు పక్కకు పెట్టారు. అధ్యక్షుడు అమిత్‌షా కొడుకు అవినీతిని అటకెక్కించారు. నల్లధనం తెస్తామన్నారు, తేలేదు. తెల్లమొహం వేశారు. నవంబర్ 8న బ్లాక్‌మనీ వ్యతిరేక దినమని బాకాలూదారు. ప్యారడైజ్‌లో వచ్చిన పేర్లపై విచారణ జరపాలి. అక్రమ వ్యాపారాలు చేసిన మంత్రిని తొలగించాలి. అక్రమంగా అడ్డదారులు తొక్కిన వారికి అండగా ఉంటారో, అవినీతిని అదుపు చేస్తారో పాలకులే నిర్ణయించుకోవాలి. లేకుంటే ప్రజల ఆగ్రహానికి గురికాక తప్పదు.

(రచయిత ఉపాధ్యాయులు) వీ

చైనాలో ప్రజావైద్యం - సాంస్కృతిక విప్లవం

చైనాలో విప్లవం విజయవంతం అయ్యాక వైద్య, శ్రామిక, సాంస్కృతిక రంగాల్లో వచ్చిన విప్లవాత్మక మార్పుల గురించి వివరిస్తున్నారు **భూసారం శివన్న**

"నెత్తినిండా చీముపట్టిన కురుపులతో దీనంగా తిరిగే పిల్లలు కనిపిస్తారేమోనని చూశాను. నిలువెల్లా పేల్లతో, ఒంటినిండా చీడతో బరుక్కుంటూ; ఎర్రగా ఎరుపెక్కి పొడుచుకొచ్చిన కనుగుడ్లతో, పగిలి రక్తమోడుతున్న ఇగుళ్లతో, వీధులలో తిరుగాడే పిల్లలు ఎవరైనా కనిపిస్తారేమోనని వెదుకులాడేను. వేలాడుతున్న బాన పొట్టలతో, ఊస కాళ్లు, చేతులతో దీనంగా తిరుగాడే పిల్లలు తారసపడతారేమోనని నా కళ్లు వెదక సాగాయి. వీధి మూలల్లో, నడకదారుల్లో పెద్ద బిచ్చగాళ్లు, పిల్లల అవయవాలను అవకరం చేసి, ఆ పిల్లలే తమ సొంత పిల్లలుగా చూపిస్తూ, దారిన పోయే మంచి వస్త్రదారులను వెంబడించి, సతాయించి, బిచ్చానికి దేవిరించే దృశ్యాలిపుడు కూడా కనిపిస్తాయేమో చూడాలని తిరుగులాడేను. ఒళ్లంతా పుండ్లతో, ఆ పుండ్లపై వాలి నిరంతరం సతాయించే ఈగలతో తిరుగాడే పిల్లలు; సందు గొందులలో ఉన్న ఖార్ఖానాలలో రోజూ 12 గంటలు పైబడి పనిచేసే, కాళ్లకు సంకెళ్లు వేయబడిన బానిస పిల్లవాండ్లు; పనిచేస్తూ వేళ్లూ, చేతులు నుజ్జు చేసుకుని చావలేక బతుకుతున్న పిల్లలు, చెత్త కుప్పలపై పడి కెలుక్కుంటూ ఏదైనా ఆహారం దొరుకుతుందేమోనని తనుకులాడే అనాథ పిల్లలు ఇప్పుడు కూడా కనిపిస్తారేమోనని వెదక సాగేను".

ఈ పైన ఉదహరించిన వాక్యాలు డబ్ల్యు.ఎ. స్కాట్ అనే తెల్ల జాతీయుడు, 1965-66 ప్రాంతంలో ప్రజా చైనాను సందర్శించి రాసిన 'ఓపాత చైనా హస్తం - చైనా పునర్దర్శనం' అనే పుస్తకం లోనివి. ఈయన, 1949కి పూర్వం, చైనాలోని షాంఘై నగరంలో చాలా కాలంపాటు నివశించి ఉన్నాడు. అప్పట్లో, అతను, అనునిత్యం అక్కడ ఏహృదయ విదారక దృశ్యాలనైతే చూసేవాడో, అవే తిరిగి అగుపిస్తాయేమోనని, తన 1965-66 నాటి ప్రయాణంలో వెదుకుతూ ఉండేవాడినని తన పుస్తకంలో రాసుకున్నాడు. కానీ, అతనికి 1965 నాటి తన 'చైనా పునర్దర్శనం'లో అటువంటి చీడ-పీడల దృశ్యాలకు బదులు, పూర్తిగా భిన్నమైన, ఓ ఆరోగ్యకర సమాజం కనిపించింది.

1949కి పూర్వం 'ఆసియా ఖండపు జబ్బు' మనిషిగా పిలవబడ్డ చైనాలో, లేని రోగమంటూ ఏదీలేదు. సకల సంపదలు, వనరులు దోచుకోబడి, పూర్తిగా డొల్ల చేయబడి, సవాలక్ష రోగాల పాముల పుట్టగా, జడలు విప్పిన దారిద్ర్యం ప్రజల పాలిట పెను శాపంగా, చైనా సమాజం రక్తమోడుతూ విషాద భరితమై ఉండేది. తరతరాల రాచరికపు వ్యవస్థల అణచివేతకు తోడుగ, కొత్తగ తెరపైకి వచ్చిపడ్డ యుద్ధ ప్రభువులు, కొమింగ్-టాంగ్ దోపిడీ మూకలు, దాని సామ్రాజ్యవాద మిత్రులు; దురాక్రమణదారు జపాన్, చైనా ప్రజల రక్తాన్ని, మూలుగులను పీల్చి పీల్చి, పిప్పి చేసేసాయి.

ఇటువంటి పరిస్థితిలో 1930ల నాడే, దూరదృష్టిగల విప్లవ నాయకుడు, చైనా విముక్తి పథ నిర్దేశకుడైన మావో జె-డాంగ్, 'ప్రజా ఆరోగ్య సంరక్షణను' చైనా కమ్యూనిస్టు పార్టీ, ప్రజా విముక్తి సైన్యం ప్రాథమిక కర్తవ్యాలలో ఒకటిగా చేర్చాడు. చైనా గ్రామీణ ప్రాంతాలను, జపాన్ దురాక్రమణ నుండి, యుద్ధ ప్రభువుల నుండి, కొమింగ్-టాంగ్ దోపిడీ మూకల నుండి విముక్తి గావించే క్రమంలో వారు మూడు కర్తవ్యాలను నెరవేర్చుకుంటూ పురోగమించారు. ఆకర్తవ్యాలలో మొదటిది: భూసంస్కరణ; రెండవది: గ్రామీణ రైతాంగపు మద్దత్తును కూడగట్టడం; మూడవది: ప్రజారోగ్యంపై శ్రద్దపెట్టి పనిచేయడం.

11 చైనాలో ప్రజా విముక్తి విప్లవం విజయవంతమై,1949లో కమ్యూనిస్టు పార్టీ అధికారంలోకి వచ్చాక ప్రజారోగ్యానికి విశేష ప్రాధాన్యతనిచ్చారు. 1950 ప్రారంభంలోనే, చైర్మన్ మావో చేసిన వివిధ సూచనల మేరకు, పీకింగ్ నగరంలో మొదటి 'జాతీయ ఆరోగ్య సదస్సును' నిర్వహించారు. ఆ సదస్సులో తీసుకున్న నిర్ణయాలు, మార్గదర్శక సూత్రాలే చైనా ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ఒక సైద్ధాంతిక పునాదిని ఏర్పరిచాయి. అప్పటి నుండి మొదలు పెట్టి, సాంస్కృతిక విప్లవ కాలం వరకు దానిని మెరుగు పరచుకుంటూ ఆరోగ్య సేవలు ప్రజలకు మరింతగ చేరువవ్వాలనే పట్టుదలతో చైనా ప్రజా ప్రభుత్వం పనిచేసింది. ఆ మార్గదర్శక సూత్రాలేమిటో ఇపుడు మనం చూద్దాం.

1) వైద్య సేవలు శ్రామిక ప్రజలకు, (చైనా నుడికారంలో చెప్పాలంటే) "గోంగ్-నొంగ్-బింగ్" అంటే "కార్మికులకు-రైతులకు-సైనికులకు" తప్పక అందుబాటులోకి తేవాలి.

2) వైద్య నివారణ పద్ధతులకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ, దాని వెన్నంటి రోగ చికిత్స, వైద్య ఉపశమనం, ఔషధ ప్రక్రియలు ఉండాలి.

3) చైనా సాంప్రదాయపు వైద్యులను పాశ్చాత్య వైద్య విజ్ఞానం గల వైద్యులతో ఐక్యపరచాలి.

4) ఆరోగ్య రంగంలో పని నిర్వహణను ప్రజా ఉద్యామాలతో అనుసంధానం చెయ్యాలి.

1950లలో, ప్రజా చైనాలో, ఈ ఆదర్శాలను వేగంగా అమలు చేయడంలో, సోవియట్ రష్యా సలహా దారులు, వారి వైద్య విధానాలు, వైద్య విద్యా బోధనా పద్ధతులు, సాంకేతిక విజ్ఞానం ప్రధాన భూమికను పోషించాయి. ఆ క్రమంలోనే, చైనా తన సొంత వైద్య-ఆరోగ్య ప్రణాళికలను, విధి-విధానాలను చైనా ప్రాంతీయ స్థితిగతుల, ప్రజల అవసరాలకు అనుగుణంగా, సొంత వనరులపై ఆధారపడి సుదూర ప్రాంతాలలో నివసించే ప్రజలకు కూడా వైద్య సేవలను అందించడంలో సఫలీకృతమైంది. 1950-1965 మధ్య కాలంలో, అంటే కేవలం ఓ

15 సంవత్సరాలలో, దుర్భరమైన ఆకలి, అనారోగ్యాలతో కొట్టుమిట్టాడు తున్న 60 కోట్ల చైనా జనాభాకు జనరంజకమైన వైద్య-ఆరోగ్య సేవలు అతివేగంగా అందుబాటులోకి తీసుకురావడం అనేది ప్రపంచ చరిత్రలోనే అనూహ్యమైన ఘట్టం. కలరా, ప్లేగు, స్మాల్ పాక్స్, నల్లమందు వాడకం, సుఖ రోగాలు, పోషకాహారలేమి వల్ల వచ్చే జబ్బులూ, వీటన్నిటినీ రూపుమాపడంలో ఇటు ప్రజలను, అటు వైద్యులను, ఆరోగ్య కార్యకర్తలను, సాంఘిక విప్లవోద్యమంలో భాగస్వాములను చేయడం ద్వారా చైనా ఘనవిజయాలను సాధించ గలిగింది. అంతేగాక, యావత్ ప్రజా రాశులను దేశ పునర్నిర్మాణానికి కదిలించి, నడిపించడం ద్వారా సమాజంలో నాలుగు చీడలు; అంటే – ఈగలు, దోమలు, ఎలుకలు, నల్లులు లేకుండా రూపుమాపుకున్నారు. (మొదటిలో పిచ్చుకలను చేర్చినా తరువాత పిచ్చుకలను నిర్మూలించడం తప్పని సరిదిద్దుకున్నారు). తమ సొంత ప్రజా ఉద్యమాల ద్వారా చైనా ప్రజలు పురాతన అనారోగ్యపు అలవాట్ల నుండి బయటపడి, తమను తాము సంస్కరించుకుని, ఆరోగ్యవంతమైన జీవనం గడపడం ఓ ఉన్నత సమాజ సూత్రంగా స్వీకరించారు. ఎక్కడికక్కడ ప్రజా సమూహాల నుండే లక్షలాది ఆరోగ్య కార్యకర్తలను అత్యంత వేగంగా శిక్షణ ఇచ్చి సమకూర్చుకున్నారు. ఆధునిక వైద్య విద్య గరిపిన వైద్యులను, సాంప్రదాయ వైద్యులను, ఆరోగ్య కార్యకర్తలను సమన్వయపరచి ప్రజలకు సేవలందించడంలో మావో నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ, ఆరోగ్యరంగంలో, ప్రపంచ శ్రామిక ప్రజలకు ఆదర్శనీయమైన మార్గాన్ని చూపించింది.

1945-65 మధ్య కాలంలో, చైనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ ఎంతో ఓర్పుతో, దీక్షతో, ప్రజా సమీకరణలతో ఎన్నో క్లిష్టతరమైన మైలు రాళ్లను దాటి విజయవంతమైన ప్రయాణం కొనసాగించిందనే చెప్పాలి. అప్పటి వరకూ చైనా, ఆరోగ్య రంగంలో ఎంతో ప్రగతి సాధించిందని అనుకుంటూ, విదేశాలలోని చైనా పరిశీలకులూ, చైనాలోని పార్టీ ప్రముఖులూ, వైద్య-ఆరోగ్య అధికారులూ సేద తీరుతున్న తరుణం అది. ఇది ఇలా ఉండగా, చైర్మన్ మావో మట్టుకు ఈ విషయంలో పెదవి విరిచాడు. 1965 జూన్ 26న చైనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ పని విధానంపై ఒక ఘాటైన విమర్శ చేశాడు. ఆ విమర్శతో పాటు, దిశా నిర్దేశం కూడా చేశాడు. చైనా ఆరోగ్య మంత్రిత్వ శాఖ కేవలం 15 శాతం ప్రజలకే సేవలను అందిస్తున్నదనీ, ఆ శాఖ తన పేరు మార్చుకోవాల్సి ఉన్నదనీ, దానిని "నగర ప్రభువుల ఆరోగ్య శాఖగా" పిలవడమే సమంజసమనీ ఆయన వ్యాఖ్యానించాడు. గ్రామాలకు సేవలందించడంలో ఆ శాఖ వెనకబడి ఉన్నదనీ, అందుచేత ఇప్పుడది తన కేంద్రాన్ని నగరాల నుండి గ్రామాలకు మళ్లించి అక్కడి రైతాంగం తోను, ప్రజలతోను మమేకమై పనిచెయ్యాలని దిశా నిర్దేశం చేశాడు.

ఈ 'విమర్శా-దిశా నిర్దేశమే' చైనా ఆరోగ్య రంగానికి 'మావో జూన్ 26 సూచన'గ దేశం నలు దిశలా మారుమోగింది. దానితో యావత్ చైనా దేశమూ, విదేశాలలోని చైనా పరిశీలకులూ, అభిమానులూ కూడా ఉలిక్కిపడ్డారు. లేచినిలబడి ఆలోచించసాగారు. తాము ఎక్కడ ఆగి పోయారో ప్రశ్నించుకోవలసి వచ్చింది. జవాబులు వెతుక్కోవలసి వచ్చింది. ఇది ప్రభుత్వ అధికారులనూ, పార్టీ కేడర్నూ, వైద్యులను, వైద్య విద్యార్థులనూ, వైద్య -ఆరోగ్య రంగంలో పనిచేస్తున్న ఉద్యోగులనూ, కార్యకర్తలను పెను కుదుపు కుదిపింది. కొత్త గాలి వీచడం మొదలైయ్యింది. కొత్త ఆలోచనలకు, మేథోమదనానికీ, కొత్త ఆచరణకు మార్గం వేసింది.

చిటారు కొమ్మన మిటాయి పొట్లంలా, కేవలం నోరూరిస్తూ, ఎందరికో అందని విధంగా వేల్లాడుతూ ఉన్న వైద్య ఆరోగ్య వ్యవస్థను; "దిగుదిగు నాగ దివ్య సుందరి నాగ, దివి నుండి భువికి" అని, ఆకాశాన్నుండి భూమి మీదికి దింపిన ఆలోచన మావో నాయకత్వంలోని ఒక సెక్షన్ కమ్యూనిస్టు పార్టీ నాయకులదే. పాత సమాజం నుండి విముక్తి కోరుకుని, తమ అమూల్యమైన త్యాగాలతో, పార్టీతో కదం-కదం కలిపి పోరాడి గెల్చుకున్న విప్లవ విజయం వెనుక ప్రజల బలీయమైన ఆకాంక్షలను పార్టీలో ఒక వర్గం మరిచిపోయి, తిరిగి బూర్జువా బాటపట్టిన సంగతి లోక విదితమే.

మనం ఎవరికి సేవ చేయాలి? గుప్పెడు ధనికులకు, అధికారులకు, పార్టీ నాయకులకూ మాత్రమే సేవ చెయ్యాలా? లేక యావత్ ప్రజలకూ, అంటే గ్రామీణ ప్రజలకూ, రైతులకు, కార్మికులకు, సైనికులకు, ఇంకా వెనకబడి ఉన్న కోట్లాది ప్రజానీకానికా? అనే ప్రశ్నలను నిరంతరం వేసుకుని తదనుగుణంగా మన విధానాలను, సేవలను అందించాలని మావో, పార్టీ నాయకులకు, ప్రభుత్వంలో పనిచేసే వివిధ సంస్థల అధికారులకూ, విద్యాధికులకు, బుద్ధిజీవులకూ, పట్టణాలకే అంకితమై పోయి, గ్రామాల సంగతే విస్మరిస్తున్న వర్గాలకూ హితబోధ చేశాడు. పని కేంద్రాలను గ్రామాలకు తరలించాలనే పిలుపు నిచ్చాడు. "నూరు పూలు వికసించనీ, వెయ్యి ఆలోచనలను సంఘర్షించనీ"; "నిరంతర వర్గ పోరాటమనే ఆయుధాన్ని, ప్రజా పంథాని విడవ వద్దు", "ప్రజలకు నిరంతరం సేవ చేయండి"; "ధైర్యంగా ఆలోచించు-ధైర్యంతో ముందుండి ఆచరించు"; "విప్లవ తత్వాన్ని ఒడిసిపట్టు-ఉత్పత్తిని పెంచు" అనే తాత్విక-భావనాత్మక ఆయుధాలను మావో దేశ రాజకీయ, ఆర్థిక సామాజిక వ్యవస్థను ప్రజానురంజకంగా నిర్మించడానికి చైనా ప్రజలకు అందించాడు. ఇవి ఏదేశ ప్రజలకైనా ఆదర్శనీయమే! ఆచరణీయమే!

నాపేరు రివై ఎల్లీ, నా మిత్రుని పేరు ఫ్రెడ్ బుర్వేట్. అది 1973వ సంవత్సరం, వేసవి కాలం. అప్పుడు మేం చైనాలో ప్రయాణిస్తున్నాం. చైనా మా ఇద్దరికీ కొత్తేమీకాదు. రివై ఎల్లీ నైన నేను నలభైఏళ్లు పైబడి చైనాలో నివసించిన వాణ్ణి. సాంస్కృతిక విప్లవానంతరం, చైనాలో చోటుచేసుకున్న అనూహ్యమైన, అధ్భుతమైన మార్పులను ప్రపంచ ప్రజలకు అందించాలనే కుతూహలం, పట్టుదల మా ఇద్దరినీ, చైనా యాత్రకు పురిగొల్పింది. మా ఈ చైనా యాత్రా విశేషాలను మేము ఒక పుస్తక రూపంలో తీసుకొచ్చాం. ఆ పుస్తకం పేరు "చైనా: జీవన ప్రమాణాల నాణ్యత" (చైనా : ది క్వాలిటీ ఆఫ్ లైఫ్ / అఊఎఔెం: ుఊఇ ఖిఐంఒఎెజ ాఈఇ ఒఎఈఇ). ఈ పుస్తకం అందరూ చదవండి. చదివితే, చైనా గురించి మీకు తెలియని ఎన్నో విషయాలు అవగత మవుతాయి. ప్రస్తుతానికి మట్టుకు మేము, చైనాలో వైద్య-ఆరోగ్య రంగానికి సంబంధించి క్లుప్తంగా మీకు కొన్ని విషయాలు తెలియచేస్తాం. ఈ విషయాలను, చైనా ప్రజల జీవితాలతో మమేకమై అక్కడే స్థిరపడిపోయిన సుప్రసిద్ధ వైద్యుడు, మహోన్నత వ్యక్తి అయిన 'డాక్టర్. మా హాయ్-టే' (డాక్టర్. జార్జ్ హేటం) ద్వారా మేం తెలుసుకున్నాం. ఆ విషయాలనే మీకు చెప్పదల్చుకున్నాం, చదవండి.

చైనా ప్రజా ఆరోగ్య రంగంలో చెప్పుకోదగ్గ అత్యంత ప్రధానమైన అంశం ఏమిటని మేము డా. మాను అడిగాం; దానికి ఆయన ఇలా చెప్పారు.

ఆ అంశం ఏమంటే, వైద్య- ఆరోగ్య సేవలను మట్టి వేళ్లవరకు

తీసుకుపోవడం; ఆ సేవలు రాత్రీ పగలూ, 365 రోజులూ, ప్రజలకు అందుబాటులో ఉంచడం; కుళాయి ఎండిపోకుండా నీరు బొట్లు బొట్లుగా ఎల్లప్పుడు ప్రవహిస్తూ ఉండేలా చూడడం; ఇలా చేయడం వల్ల నిలకడైన విజయాలు సాదించాం. రోగనివారణకై జరిపిన ప్రజా ఉద్యమాలు గొప్ప పాత్రను పోషించినప్పటికీ, క్షేత్ర స్థాయిలో ప్రజల భాగస్వామ్యంతో, అంకితభావంతో జరిపే నిరంతర పర్యవేక్షణ లేకుండా రోగాలను రూపుమాపడం సాధ్యమయ్యే పనికాదు. అన్నిటికన్నా ప్రధానమైన అంశమేమంటే, యావత్ జనాభాకు వైద్యం-ఆరోగ్యం అందాలనే ప్రణాళికపై దృష్టి కేంద్రీకరించి అందరూ పనిచేయడం. ఇప్పుడు చైనా ప్రజలు ఆరోగ్యంతో కళకళలాడుతున్నారంటే దానికి ముఖ్య కారణాలు: సరైన పోషకవిలువలు కలిగిన ఆహారం అందుబాటులోకి రావడం; తమ ఆరోగ్యం పట్ల, తమ పిల్లల ఆరోగ్యం పట్ల శ్రద్ధ పెరగడం. ఈ మధ్యన (1973), బయటి ప్రపంచం నుండి వస్తున్న సందర్శకులు, చైనా వీధులలో వికసిత ఆరోగ్యంతో వెలిగిపోతూ కన్పించే ప్రజా రాసుల వెనుక దాగి ఉన్న రహస్యమేమిటని తరచూ అడుగుతున్నారు. 'డబ్బుతో పనిలేని, నిరంతరం అందుబాటులో ఉండే వైద్య ఆరోగ్య సేవలు; ఆ సేవలను చక్కగా ఉపయోగించుకుని, ఆరోగ్యకర జీవనం ప్రోది చేసుకోవాలనే ప్రజాస్పృహే దీనివెనుక ఉన్న రహస్యం'.

1949లో ఎర్రసైన్యం విజయం నాటికి, అత్యంత అధిక జనాభాతోనూ, పేదరికంతోను, ఆకలి - అనారోగ్యంతోనూ, భయంకరమైన వ్యాధులతోనూ సతమతమవుతున్న ఆనాటి చైనా ఆరోగ్య రంగంలో పెను మార్పులు తీసుకురావడానికి ఎటువంటి కార్యాచరణను పాటించారు?

"మూడు కాళ్ల" విధానాన్ని అనుసరించడం ద్వారా అది సాధ్యపడిందని డాక్టర్. మా, ఒక్క ముక్కలో సమాధానం చెప్పి, ఇంకా ఇలా వివరించారు: పాదచారి వైద్యులు (బేర్ ఫుట్ డాక్టర్స్), సాంప్రదాయ వైద్యం, సహకార ప్రజా వైద్య సదుపాయం, అనే మూడు కాళ్ల విధానం ఓపికతో, విసుగు చెందక, గట్టిగ అమలు చేయడం ద్వారానే గడ్డి వేళ్లస్థాయిలో ప్రజారోగ్య వైద్య వ్యవస్థకు గట్టి పునాది ఏర్పాటయ్యింది. అధిక జనాభా కలిగి ఉన్న చైనా వంటి దేశంలో ఎక్కడికక్కడ, ఎప్పటి కప్పుడు, వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలంటే, వేరే మార్గం ఉందని నేననుకోను. ఇప్పుడు(1973) 10 లక్షల పాదచారి వైద్యులు చైనాలో ఉన్నారు. అంటే ఎంతలేదన్న, 90 శాతం కమ్యూన్లలో నివసిస్తున్న ప్రజలకు ఈ ముక్కాలి విధానం ద్వారా మంచి వైద్యం అందుతున్నట్టే.

సహకార వైద్యమంటే అర్థం ఏమిటంటే : కమ్యూన్ సభ్యులు, వైద్యానికి అతి తక్కువ రుసుం చెల్లిస్తారు. ఆ సొమ్ము బ్రిగేడ్ ఉమ్మడి ఖాతాకు జమచేస్తారు. పాదచారి వైద్యులకు, వారు పని చేసిన కాలానికి వర్క్ పాయింట్లు లెక్క కట్టి, బ్రిగేడ్ ఉమ్మడి సొమ్ము నుండి వేతనం చెల్లిస్తారు. కమ్యూన్ సభ్యులు చెల్లించే వైద్య రుసుముల ద్వారా జమయిన సొమ్ము నుండి, యాంటి బయోటిక్స్ మందులు సమకూర్చుకుంటారు. ఎక్కువ భాగం సాంప్రదాయ మందులు, మూలికలు ఎక్కడికక్కడ పండించుకోవడం ద్వారా సమకూర్చుకుంటారు, అడపాదడపా, అవసరమైతే, మందులు అతితక్కువ ధరలకు ప్రభుత్వ మందుల దుకాణాల నుండి, బ్రిగేడ్ ఉమ్మడి సొమ్ముతో కొంటారు.

'పాదచారి సంచార వైద్యులు' (బేర్ ఫుట్ డాక్టర్స్) అనే భావన రంగం మీదికి ఎలా వచ్చిందో చెప్పగలరా అని మేము డాక్టర్. మా గార్ని అడిగేం.

ఎర్ర సైన్యం తన సుధీర్ఘమైన ప్రజావిముక్తి యాత్రలో ఒక అంశంగా ఈ భావన ఉన్నదని డాక్టర్. మా అభిప్రాయపడ్డారు. అప్పటిలో 'పాదచారి సంచార వైద్యులు' అనే పేరు లేకపోవచ్చు కాని, దాని మూలాలు మట్టుకు అక్కడనే ఉన్నాయి. అప్పటిలో, ఎర్రసైన్యపు సోవియట్ విముక్తి ప్రాంతాలలో, మా వైద్య పాటశాలలు ఏడూ లేక ఎనిమిది నెలలపాటు ప్రజలకు శిక్షణ నిచ్చి ఆరోగ్య కార్యకర్తలను సమకూర్చుకునేది. అప్పుడు ఎర్ర సైన్యంలోను, విముక్తి ప్రాంతాలలోను పనిచేసిన వృత్తి వైద్యుల సంఖ్యను వేళ్లపై లెక్కపెట్టవచ్చు. కుదించిన కాలపరిమితిలో వైద్య శిక్షణనిచ్చి, మేము తయారు చేసుకున్న ఆరోగ్య కార్యకర్తల పరివారమే మొత్తం రోజువారీ సాధారణ వైద్యచికిత్స, యుద్ధంలో క్షతగాత్రులైన వారికి ఆపరేషన్లూ (క్లిష్టమైనవి తప్ప), ఇతర ఆరోగ్య సేవలు యావత్తూ నిర్వహించేవారనే చెప్పాలి. ఈ వైద్య అనుబంధ పరివారానికి సుదీర్ఘమైన చరిత్ర ఉన్నది. సున్నితమైన చాతీ, అంతర్గత అవయవ ఆపరేషన్లు మినహా, మిగతా సర్జరీలు వారే చేస్తూ ఉండేవారు. అప్పటికింకా ఎక్యుపంచర్ ఎనస్థీషియా ప్రక్రియ అభివృద్ధి కాలేదు. జూన్ 26, 1965 నాటి ఆరోగ్య మంత్రిత్వశాఖపై మావో విమర్శ తరువాత, దాదాపు, ఆ ఒక్క సంవత్సరంలోనే రమారమి 1,50,000 మంది వైద్యరంగ నిపుణులు, కార్యకర్తలు, వారి అనుభవాన్ని, జ్ఞానాన్ని, నైపుణ్యతలను ప్రజలకు అందించడానికి పట్టణాల నుండి గ్రామ సీమలకు తరలివెళ్లారు. ఆ తరువాత ప్రవాహం మరింతగా పెరిగి వెల్లువై ప్రవహించింది. ఇందులో కొంతమంది తాత్కాలికంగా ఆరు నెలల నుండి ఒక సంవత్సరంపాటు గ్రామాలలో పనిచేసి వెనక్కిమళ్లినవారు ఉండగా, మరికొంత మంది అక్కడనే స్థిరపడి పొయ్యారు. వీరు, గ్రామీణ ప్రాంతాలలోని ఆసుపత్రులలోనూ, కమ్యూన్లలో, కౌంటీ స్థాయిలో పనిచేస్తూ తక్కువ వ్యవధిలో లక్షలాది యువతీ యువకులకు తర్ఫీదు ఇచ్చారు. వారిని మంచి వైద్య-ఆరోగ్య కార్యకర్తలుగా తీర్చిదిద్దారు. అలా ఎక్కడికక్కడ స్థానిక ప్రజలే వారి ఆరోగ్య సమస్యలను పరిష్కరించుకునే విధానం నిలదొక్కుకున్నది. నవంబర్ 1965 నాటికి ఈ 'పాదచారి సంచార వైద్యులు' అనే పదం ప్రాచుర్యంలోకి వచ్చింది. కొంతమంది విదేశీ పరిశీలకులు కమ్యూన్ల సందర్శనకు వెళ్లినప్పుడు, తెల్లకోట్లు, తెల్ల టోపీలు ధరించిన వైద్య కార్యకర్తలు కాళ్లకు బూట్లు లేకుండా తిరుగాడడం, వ్యవసాయ బ్రిగేడ్లలోని పొలాల్లో, మోకాటిలోతు బురదమట్టిలో దిగి వ్యవసాయ పనులు చేయడం గమనించి, వారిని బేర్ఫుట్ డాక్టర్లుగ/ 'పాదచారి సంచార వైద్యులు'గా పిలవడం జరిగింది. ఆ పదం, అలా, ఆనోటా ఈనోటా ప్రపంచం నలుమూలలా పాకి స్థిరపడి పోయింది. అంతేకాక, ఈ పాదచారి సంచార వైద్యులు, కమ్యూన్ వైద్యులతోనూ, కౌంటీ ఆసుపత్రుల వైద్యులతోనూ నిత్య సంబంధాలను నెరుపుతారు. వారితో క్షేత్ర స్థాయి వైద్య సమస్యలు చర్చిస్తూ, కొత్త విషయాలను నేర్చుకుంటూ ఉంటారు. చికిత్స ప్రమాణాలు పెంచుకోవడానికి ఎప్పటికప్పుడు తక్కువ కాలవ్యవధిగల శిక్షణను పొందుతూ ఉంటారు. ఏదైనా కొత్తవ్యాధి సోకుతున్న చాయలు కనపడుతున్నపుడు, పాత వ్యాధులు తిరగబెడుతున్నప్పుడు పాటించాల్సిన తక్షణ చర్యలు, నివారణా ఉపాయాలు ఎలా చేపట్టాలో, ఎటువంటి మందులను ఉపయోగించాలో

సలహాలు, కావలసిన శిక్షణను అనుభవజ్ఞులైన వైద్యుల నుండి తక్షణం పొందుతూ ఉంటారు. అలాగే ఏదైనా కొత్త వైద్య ప్రక్రియ, విజ్ఞానం అందుబాటులోకి వస్తే, వాటిపై అవగాహనను కూడా పెంపొందించుకుంటారు. ఉన్నత విద్య అభ్యసించిన, అభ్యసిస్తున్న, వైద్యులు, వైద్య విద్యార్థులు లక్షలల్లో నగరాల నుండి పట్టణాలకు తరలడం ద్వారా వైద్యునికి-రోగికి మధ్య ఎర్పడి ఉన్న అగాధాన్ని పూడ్చడానికి, విప్లవాత్మకమైన ఈ పాదచారి సంచార వైద్య వ్యవస్థ ఎంతగానో దోహదపడింది. సమాజంలో, చదువుకుని ఉన్నతమైన శిక్షణ పొందిన వైద్యులు, ఆ సమాజం భుజాల పైకెక్కి, నేలబారునున్న ప్రజా రాసులను వెక్కిరించే మనస్తత్వం మూలంగా, ఏ ఇతర దేశాల ప్రజల కన్నా కూడా, చైనా ప్రజలు అత్యంతగా నష్టపోయారన్నది చేదు వాస్తవం.

వైద్యులు ముక్కులకు అడ్డంగా, గాజు గుడ్డ (ఎజిబిన్) కట్టుకునే అలవాటును, మావో జే-డాంగ్, తాత్విక కోణంలో వ్యంగ్యంగాను, లోతుగాను విమర్శిస్తూ- 'వైద్యుడు మానసికంగా రోగికి- వైద్యునికి మధ్య ఒక తెర కట్టుకుంటున్నాడనీ అంటూ, వైద్యుడు తన ఈ జబ్బు, తన చుట్టూ ఉన్న ప్రజలకు సోకుతుందని భయపడుతున్నాడని అనుకుందామా? కాదనుకుంటా, బహుశా, అందరి జబ్బులు తనకెక్కడ అంటుకుంటాయోననే భయంతో ఉన్నాడని మనం భావించాల్సి ఉంటుంది.' అని వ్యాఖ్యానించాడు. వైద్యునికి-రోగికి మధ్యన ఎర్పడి ఉన్న ఇటువంటి కృత్రిమమైన అడ్డు గోడలు; చదువరులు, బుద్ధిజీవులు గ్రామాలకు తరలి ప్రజలతో మమేకమై పనిచేయడం ద్వారా మాయమైనాయని చెప్పాలి.

జనవరి 1971 నాటికి పట్టణ ఆరోగ్య కార్య- కర్తలు, కొత్తగా విద్య ముగించుకుని బయటపడ్డ వైద్య విద్యార్థులతో సహా 3,30,000 మంది గ్రామాలలో నివసిస్తున్నారనీ, ఇంకో నాలుగు లక్షల మంది పట్టణ కార్యకర్తలు సంచార ఆరోగ్య బృందాలలో కలసిమెలసి పనిచేశారనీ, చైనాలో ఒక ప్రత్యేక సర్వే జరిపిన, అమెరికాకు చెందిన రచయిత 'మార్క్ సెల్డెన్' లెక్క కట్టాడు.

చైనాలో ఆరోగ్య వ్యవస్థ ఘన విజయం సాధించడానికి మూల కారణం; కొట్లాదిగా ప్రజలను మెప్పించి, వారిని పెద్ద ఎత్తున కార్యరంగంలో కదంతొక్కించే మావో ప్రత్యేక తాత్విక ఆలోచనా విధానమని తను బలంగా నమ్ముతున్నట్లు డాక్టర్. మా అన్నారు. సమస్య మూలల్లోకి వెళ్లడం, సమస్యను అన్ని కోణాల నుండి ప్రజారాసుల దృష్టికోణం నుండి ఆలోచించడం - అంటే తాత్విక రాజకీయ ఆలోచనలను ముందు నిలబెట్టడం (పాలిటిక్స్ ఇన్ కమాండ్) అనే మావో సూత్రం విజయ సాధనకు అన్నిటికన్నా ముఖ్యమైనదని గుర్తించాలి. 'సిఫిలిస్' వంటి సుఖ రోగాలు గాని, ఇంకా సమాజాన్ని పట్టి పీడుస్తున్న అనేకానేక ఇతర జాడ్యాలు గాని ఈ 'పాలిటిక్స్ ఇన్ కమాండ్' అంటే తాత్విక రాజకీయ ఆలోచనలను ముందు నిలబెట్టడం అనే ఆయుధం ఆధారంగానే రూపుమాపడం జరిగిందని ఆయన అన్నాడు.

ఆసుపత్రులలో కొత్త, పాత రోగుల మధ్య చర్చలు, సులభమైన పనులలో రోగులు ఆసుపత్రి ఉద్యోగులకు సహాయం చెయ్యడం, ఇత్యాది పనుల ద్వారా ఒక గృహ వాతావరణాన్ని, సామూహిక మానవీయ తత్వాన్ని రోగులలో పెంచడం కూడా జబ్బులు త్వరితగతిన నయమై ప్రజలలో నూతన ఉత్సాహం నింపాయి. (ప్రముఖ అమెరికాకు చెందిన వైద్య జంట, 'విక్టర్ డబ్లు సిడెల్', 'రుత్ సిడెల్'లు కలసి చైనా పర్యటించి, ప్రజా చైనాలో వైద్యం-ఆరోగ్యం పై సోదాహరణంగా రాసిన "ప్రజలకు సేవచేయండి" అనే పుస్తకంలో ఎన్నో వివరాలు లభ్యమౌతాయి). 'రుత్ సిడెల్' చైనా మానసిక రోగులపై రాసిన పరిశీలనా వ్యాసంలో, ఆమె ఒక ముగింపు వాక్యం రాసింది. అదేమంటే, ఏ మనిషిలోనైనా ఇమిడి ఉన్న మలచుకోదగ్గ గుణం, ఉన్నతీకరించుకోబడే గుణం, అంటే వీటిని సరిగ్గా గుర్తించి మరల, మరల విద్య, శిక్షణలు ఇవ్వడం ద్వారా ఉన్నతమైన సామాజిక విజయాలు సాదించవచ్చనే నమ్మకం చైనాలో రుజువైనదని, బహుశా అందుకనే 'మావో జే-డాంగ్' ఆలోచనా అధ్యయన బృందాలు ఏర్పడ్డాయని ఆమె వివరించింది. అలాగే స్విట్జర్లాండ్‌లో పుట్టి, చైనాలో స్థిరపడ్డ అభ్యుదయ భావాలు కల్గిన 'డాక్టర్. హేన్స్ మ్యూల్లర్' చైనాలో ప్రజా పంథాను అనుసరించడం ద్వారా దుర్భరమైన నల్లమందు జాడ్యాన్ని ఎలా వదలగొట్టి విజయాలను సాదించింది వివరించారు..

'మరియా అంటోనీట్ట మేక్కియొక్కి ఇటలీకి చెందిన ప్రముఖ పత్రికా విలేఖరి, రచయత్రి. ఇటలీ కమ్యూనిస్టు పార్టీలో ప్రముఖ నాయకురాలు. ఆమె 1970 అక్టోబర్ నెల చివర నుండి చైనాలో పర్యటించి రాసిన గ్రంథం పేరు - "విప్లవ చైనాలో రోజువారీ ప్రజా జీవనం" (డైలీ లైఫ్ ఇన్ రివల్యూషనరీ చైనా). ఆమె ఈ పుస్తకంలో, కేవలం చైనా ప్రజల దైనందిన జీవితంలోని అ, ఆ, ఇ, ఈల గురించేకాక, చైనా ప్రజల జీవన రథ గమనానికి అవసరమైన తాత్విక చోదకశక్తి పైకూడా ఎంతో విలువైన, లోతైన సమాచారాన్ని ప్రపంచ ప్రజలకు అందించింది. ఆ సమాచారం నుండే, ఆమె మాటల్లోని కొన్ని విషయాలను మనం తెలుసుకుందాం. బీజింగ్ (పీకింగ్) నగరానికి 50 మైళ్ల దూరంలో ఉన్న ఆకుపచ్చ కమ్యూన్ - "ఎవర్ గ్రీన్ కమ్యూన్" కి వెళ్లాం. అక్కడి పర్యాటక విశ్రాంతి కేంద్రంలో ఓ 19 సంవత్సరాల యువతి మమ్ములను కలిసింది. ఆమె పాదచారి వైద్యురాలు, ఫార్మసిస్ట్ కూడా. వైద్యం చేయడంలోనే గాక మందులు వాడకంలో, మందుల తయారీలో కూడా తర్ఫీదు పొందిన ఆ యువతి పేరు 'క్యో'. ఆ కమ్యూన్లో సాంప్రదాయ మందులు ఎలా తయారు చేస్తారో, ఆ మందులను అక్కడి రైతాంగ ప్రజలు ఎంతగా ఇష్టపడతారో, అక్కడ ఆరోగ్య కేంద్రం ఎలా స్థాపించారో తన్మయత్వంతో ఆమె మాకు చక్కగా వివరించింది. 1965 జూన్ మాసంలో 'వైద్య వృత్తిని గ్రామాలకు తరలించండి' అన్న మావో సూచనతో ఇక్కడ వైద్య ఆరోగ్య కేంద్రం స్థాపించడం జరిగిందనీ, 1966లో మొదటి కేంద్ర పాదచారి వైద్యుల బృందాన్ని తయారు చేయడానికి ఎంపిక జరిగిందనీ ఆమె చెప్పింది.

ఆ జట్టులో 16-17 ఏళ్ల వయస్సు గల రైతాంగ యువతీ యువకులను ఎంపిక చేశారు. చాలా వరకు, వారు ప్రాథమిక విద్యాభ్యాసం గలవారు మాత్రమే. నగరాల నుండి వచ్చిన వైద్యులు మాకు పాటాలు చెప్పేవారు, శిక్షణ ఇచ్చేవారు. రాత్రుళ్లు, పనులు లేని శీతాకాలంలో నేర్చుకునే వాళ్లం. అలా మూడు సంవత్సరాల శిక్షణ పొందాం. మొదటి సంవత్సరం వైద్య విద్య పాటాలు; రెండవ, మూడవ సంవత్సరాల్లో వైద్య చికిత్స, ఆరోగ్య సేవలు క్షేత్ర స్థాయిలో ప్రజలకు ఎలా అందించాలో నేర్చుకున్నాం. తేలికపాటి సాదారణ జబ్బులకు చికిత్స చేయడంతో మొదలు పెట్టి క్రమంగా క్లిష్టమైన జబ్బులుకు కూడా వైద్యం చేసి నయం చెయ్యడం అలవాటు చేసుకున్నాం. ఆ యువతి,

జబ్బుపడ్డవారి హావభావాలు ఎలా ఉంటాయో, తను రోగులతో మాట్లాడడానికి, వారిని అర్థంచేసుకోడానికి ఎలా భయపడేదో, తనకు చెమటలు ఎట్లా పట్టేవో అనుకరించి చక్కగా చూపిస్తూ ఇంకో విషయం చెప్పింది. చైర్మన్ మావో రచనలు, సూక్తులు చదవడం ద్వారా తన భయం అంతా మాయమై పోయిందనీ, గొప్ప ఉత్సాహంతో ప్రజలకు సేవ చేయగల్గాననీ చెప్పింది. తనతోపాటు మిగతా బృంద సభ్యులు కూడా ప్రజలకు మంచి వైద్య సేవలందించడంలోను, కొత్త ప్రజా వైద్య కార్యకర్తలకు తర్ఫీదివ్వడంలోనూ ఎంతో కృషి సల్పామని చెప్పింది.

ఇప్పుడు మా వైద్య కేంద్రంలో 36 మంది పాదచారి వైద్యులం ఉన్నాం. ఒక్కొక్క వైద్య బృందంలో 18 సభ్యుల చొప్పున, రెండు బృందాలుగా ఉన్నాం. ఒక బృందంలో ప్రత్యేకంగా 19 నుండి 30 సంవత్సరాల వయస్సు గల మహిళలే ఉన్నారు. మహిళా బృందం, రోజువారీ వైద్యంతోబాటు పురుళ్లు పోయడం, జనాభా నియంత్రణ కార్యక్రమాల్లో పాల్గొనడం, గర్భ నిరోధక ప్రక్రియలో స్త్రీలకు సమాచారాన్నీ, సలహాలను ఇవ్వడం కూడా నిర్వహిస్తారు. పురుష వైద్యులు కూడా మాతో అన్ని సేవలూ అందించినా, స్త్రీలు మహిళా వైద్యులతో ఎక్కువ చొరవగా ఉండి తమ సమస్యలను చెప్పుకుంటారు. వైద్య కేంద్రంలో ఉన్న పడకలు సరిపోవు కాబట్టి, మేము మైళ్ల కొద్ది కాలి నడకన ప్రతి గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్తాం. ఎక్కడ రోగి ఉంటె అక్కడకు వెళ్లి వైద్యం చేసి వస్తాం. కొండలు, గుట్టలు ఎక్కి వైద్య మూలికలను, ఆకులు, అలములను పోగుచేసుకు వస్తాం. ఇప్పుడు చాలా మందులు మేమే తయారుచేసుకుని జబ్బుపడ్డ రైతులకు, పిల్లలకూ, పెద్దలకూ అందచేస్తున్నాం.

మాపని కేవలం వైద్యంతో సరిపెట్టుకోవడమే కాదు, నెలలో 15 రోజులు కమ్యూన్ పొలాల్లో పనిచేస్తాం, ఇంకో 15 రోజులు వైద్య సేవలను అందిస్తాం. ఇలా చేయడం ద్వారా మేము విప్లవ తత్వాన్ని దిగజార్చుకోకుండా నిలబడగల్గుతాం. ప్రస్తుతం 8000 మంది జనాభాకు మేం 36 మందిమే ఉన్నాం. బీజింగ్ నుండి వైద్య నిపుణులు వచ్చి కొత్త బృందాలకు శిక్షణ ఇస్తున్నారు. కొత్త కోర్సులు, తక్కువ వ్యవధిలో శిక్షణ ఇచ్చి ఎక్కువ సంచార వైద్య బృందాలను తయారు చేస్తున్నారు. ఎక్యుపంక్చర్ విజ్ఞానాన్ని పెంపొందించు కోవడానికి మాపై మేమే ప్రయోగాలు జరుపుకుంటాం. యుద్ధంలో పాల్గొనడం ద్వారానే మేము యుద్ధాన్ని నేర్చుకుంటాం. అలాగే ప్రజలకు వైద్యం అందించడానికి కూడా మేం ఈ సూత్రాన్నే పాటిస్తాం.

కమ్యూన్లో సంచార వైద్యులుగా ఎవరు శిక్షణ పొందాలో ఎలా నిర్ణయిస్తారు?, అని అడిగితే, ఆ యువతి ఇలా చెప్పింది– సభ్యులను పేద, మధ్య తరగతి రైతులు తమ తమ ఉత్పత్తి జట్ల నుండి ఎంపిక చేస్తారు. వారి గుణగణాలను ఉత్పత్తి బ్రిగేడ్ సభ్యులకు వివరిస్తారు. వీరంతా కలిసి ఒక సభ్యుల జాబితాను తయారుచేసి కమ్యూన్ విప్లవ కమిటీకి పంపిస్తారు. ఆ కమిటీ చర్చించి ఖరారు చేసిన సభ్యుల జాబితాను తిరిగి బ్రిగేడ్లకు పంపిస్తారు. బ్రిగేడ్ల సర్వసభ్య సమావేశంలో చర్చించి దానిని ఓకే చేస్తారు.

ఇక్కడొక విషయం మట్టుకు ప్రస్తావించి నా వివరణ ముగిస్తాను. 1957లో 'మలపార్టే 'అనే నా రాజకీయ మిత్రుడు చైనాలో ప్రయాణిస్తూ చైనా తను ప్రేమించే ప్రజల కోసం ఎంతగా తపన పడతుందో వివరిస్తూ నాకో ఉత్తరం రాశారు. ఆయన 'చుంగ్కింగ్' ప్రాంతంలో పర్యటిస్తున్నప్పుడు చాలా జబ్బు పడ్డాడు. ఆయనను ముందుగ హన్కో పట్టణానికి, ఆ తదనంతరం పెకింగ్ నగరానికి తరలించారు. అలా ఆయన మూడు నెలల పాటు చైనాలోని ఆసుపత్రులలో గడిపారు. 'మలపార్టే' నాకు రాసిన ఉత్తరంలో ముఖ్య భాగం ఇలా ఉంది – "హాంగ్ కాంగ్లో నివసిస్తున్న ఇంగ్లీష్ వారు, అమెరికన్లు, చాంగ్ కై షేక్ చైనీయులు, నా పరిస్థితి పై చాలానే మాట్లాడారు. అంతేనా నాపై చాలా జాలి పడుతున్నారు. నేను కావాలని చైనా వెళ్లి కష్టాలను, అనారోగా న్ని కొనితెచ్చుకున్నాననీ, ఒకసారి చైనా వైద్యుల చేతిలో పడితే హరీ అనడం ఖాయమనీ కూడా రాస్తున్నారు. ఎందుకనంటే, వారి దృష్టిలో చైనా సరైన ఆసుపత్రులు, వైద్య సౌకర్యాలు లేని, అశుభ్రత, అనారోగ్య వాతావరణంతో కంపుకొట్టే దేశం.

నా ప్రియమైన 'ఆంటోనీట్టా' ! నీకో సత్యం చెప్పాలనుకుంటున్నాను: ఇటలీలో ఉన్న ఆసుపత్రులన్నీ చైనాలోని ఆధునిక ఆసుపత్రులవలె సకల సౌకర్యాలు, హంగులు కలిగి ఉండాలని నేను కోరుకుంటున్నాను. టిబెట్ కి ఆవల సింకియాంగ్ లోని 'ఉరుమ్చి' లో, నేనొక అద్భుతమైన ఆధునిక ఆసుపత్రిని చూశాను. అది ఇటలీ రాజధాని 'మిలన్' లోని నిగూ ఆర్డా ఆసుపత్రికన్నా రెండింతలు పెద్దది. ఈ 'ఉరుమ్చి' అన్నది ప్రపంచ పటం మీద ఉన్నట్లు ఇప్పుడే తెలిసింది. ఇప్పటివరకూ అది ఓ కీకారాణ్య ప్రాంతం. ఇక్కడున్న ఈ ఆసుపత్రికి అనుబంధంగా ఓ శస్త్ర చికిత్సా విశ్వవిద్యాలయమే ఉన్నదంటే బహుశా మీరంతా నమ్మకపోవచ్చు. ఇది అన్ని హంగులతో, క్లినికల్, బయోకెమికల్ పరిశోధనా విభాగాలు కల్గి ఉంది. మరి ఇదేదో మన 'మిలన్' నగరానికి 60 మైళ్ల దూరంలో ఉన్నట్లు కాదు; పామీర్ పర్వతాలలో కజక్, టుర్క్, కిర్గిజ్, యూగుర్ జాతి ప్రజలు గుర్రాలు, గాడిదలు ఎక్కి ప్రయాణించే ప్రదేశం. కియంగ్సూ, షెన్సీ, షెజ్వాన్ మొదలైన అన్ని ప్రదేశాలలో అత్యంత ఆధునిక ఆసుపత్రులను నేను చూశాను. ఎవరో ఏదో చెబితే విని నేను ఈ విషయాలు చెప్పడం లేదు. నా కళ్లతో నేను చూసి ముగ్ధుడనై ఈ నిజాలను ప్రపంచ ప్రజలకు తెలియచేస్తున్నాను.

(ప్రస్తుత ఘరానా గజదొంగల టోకరా రాజ్యంలో, ధనికుల వైద్యం ఎంత భోగ భాగ్యాలతో తులతూగుతున్నదో చూస్తున్నాం. అదే, శ్రామిక ప్రజలకందే వైద్యమెంత అధ్వాన్నమై, అమానుషమై ఉందోకూడా చూస్తున్నాం. నిత్యం దేశం నలుమూలలా పేద పసి పిల్లలను, బాల బాలికలను అతి దయనీయంగా నరక కూపాలైన ఆసుపత్రులలో ఎలా చిదిమివేస్తున్నారో చూస్తున్నాం. 65 సంవత్సరాల స్వాతంత్రానంతరం కూడా ఇంకా ఈ దేశంలో అసలు ఆధునిక ఆసుపత్రులంటే ఏమిటో కూడా తెలియని కోట్లాది నిరుపేద ప్రజలు ఎటువంటి జీవితాలు గడుపుతున్నారో తెలుసుకోవడానికి కూడా ఈ దేశంలో చదువరులు, సంపాదనా పరులు అసహ్యపడడం, ఈ సమాజ కర్కశత్వానికి మచ్చుతునక. ఇక ఈ సమాజానికి ఏ రకమైన శస్త్ర చికిత్స అవసరమో, కోట్లాది పేద శ్రామిక ప్రజలు తప్పక ఆలోచించాలి. అలనాటి సోషలిస్ట్ సోవియట్ రష్యాలో, మావో నాటి ప్రజా చైనాలో ప్రజా వైద్య–ఆరోగ్యాలు, మాతా–శిశు సంరక్షణ, బాలల–ఎదిగే పిల్లల పెంపకం, వీటన్నిటి పట్ల సోషలిస్ట్ సమాజం తీసుకున్న భాధ్యతను అర్థం చేసుకుంటే, సదాలోచనాపరులు ఎవరైనా 'మాకు సోషలిజమే కావాలని' కోరుకుంటారు)

(రచయిత సామాజిక కార్యకర్త) వీ

సోషల్ సామ్రాజ్యవాద శక్తిగా చైనా

జిన్‌పింగ్ నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ పేరుకు మాత్రమే కమ్యూనిస్టు పార్టీగా ఉందనీ, మావో మరణానంతరం సోషల్ సామ్రాజ్యవాద దేశంగా మారి ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం చేయాలని చూస్తోందనీ అంటున్నారు **ఎ. నర్సింహారెడ్డి**

అయిదేళ్లకు ఒకసారి జరిగే చైనా కమ్యూనిస్టు పార్టీ (సిసిపి) 19వ జాతీయ మహాసభలు అక్టోబర్ 18 నుండి 24వ తేదీవరకు దేశ రాజధాని బీజింగ్ నగరంలో జరిగాయి. మావో బతికున్నంత వరకు చైనా అధ్యక్ష ఎన్నికలు, చైనా కమ్యూనిస్టు పార్టీ ఎన్నికలు పీడిత ప్రజల ప్రపంచ విప్లవోద్యమానికి పరిమితమయ్యేవి. ఇవాళ చైనా ప్రపంచంలో రెండవ అతిపెద్ద ఆర్థిక శక్తిగా ఎదిగింది. ప్రపంచీకరణ సారథ్యానికి తహ తహలాడుతుంది. కాబట్టి కమ్యూనిస్టు పార్టీ ప్రధాన కార్యదర్శి ఎన్నిక అంతర్జాతీయ రాజకీయార్థిక, భౌగోళిక రాజకీయాలపై ప్రభావం చూపనుంది. అందువల్లనే సామ్రాజ్యవాద దేశాలు ఆసక్తిగా గమనించాయి. అగ్ర రాజ్యమైన అమెరికా బలహీన పడడం, యూరప్ దేశాలు నిర్ణయాత్మక శక్తిగా లేకపోవడం వల్ల ఆర్థికంగా శక్తివంతమైన దేశంగా చైనా ఆవిర్భవించడంతో జీ జిన్‌పింగ్ విధానాలకు, 19వ సిసిపి మహాసభలకు ప్రాధాన్యత ఏర్పడింది. అందరు ఊహించినట్లే జిన్‌పింగ్ సిపిసి ప్రధాన కార్యదర్శిగా ఎంపిక అయ్యారు. అలాగే పార్టీ రోజువారి పరిణామాలలో కీలక పాత్ర వహించే ఉన్నత స్థాయి పోలిట్ బ్యూరో స్టాండింగ్ కమిటీకి జిన్‌పింగ్‌కు వందిమాగధులైన ఆరుగురిని ఎంపిక చేశారు. దీంతో చైనాలో జిన్‌పింగ్ బలమైన నేతగా ముందుకు వచ్చారు.

మావో నాయకత్వంలో చైనా :

1949లో చైనాలో నూతన ప్రజాస్వామిక విప్లవం పూర్తయిన తర్వాత, మావో నేతృత్వంలో చైనా కమ్యూనిస్టు పార్టీ మొదటి విప్లవం "మూడేళ్ల సన్నాహం" (1949-52), పదేళ్ల ప్రణాళిక బద్ధమైన ఆర్థిక విధానాన్ని చేపట్టింది. చైనా రిపబ్లిక్ 1956 నాటికి వ్యవసాయంలోనూ, చేతివృత్తులలోనూ, పెట్టుబడి పరిశ్రమల్లోనూ, వర్తకంలోనూ, ఉత్పత్తి సాధనాలపై వ్యక్తి యాజమాన్యం మౌలికంగా రద్దయ్యింది. వ్యవసాయంలో సమిష్టి పద్ధతి దేశవ్యాప్తంగా అమలులోకి వచ్చింది. ప్రాథమికంగా సోషలిస్టు సమాజం ఏర్పడింది. నూతన ప్రజాస్వామిక రాజ్యం సోషలిస్టు రాజ్యంగా పరివర్తన చెందింది. యావత్తు ఉత్పత్తి లాభాపేక్షతో కాకుండా సమాజపు అవసరాలు తీర్చడం కొరకు కొనసాగింది. పర్యవసానంగా కార్మికుల, రైతుల జీవన ప్రమాణాలు పెరిగాయి. నిరుద్యోగం అంతమైంది. అందరికీ పని హామీ ఇవ్వబడింది.

పురోగమనానికి ఒక గొప్ప ముందడుగు (గ్రేట్ లీఫ్ ఫార్వర్డ్ 1958-62) "స్వావలంబన విధానం మీద ఆధారపడి పురోగమించండి" "విప్లవాన్ని అర్థం చేసుకోండి, ఉత్పత్తిని పెంచండి" వంటి ఉద్యమాలు నడిచాయి. తర్వాత రెండు కాళ్ల మీద నడక 'వ్యవసాయం, పరిశ్రమలు రెండు కాళ్ళపై నడవడం (గ్రేట్ లీఫ్ ఫార్వార్డ్) పై ఆధారపడుతూ సమన్వయంతో వర్గపోరాటం, ఉత్పత్తి కోసం పోరాటం, స్వతంత్ర నూతన టెక్నాలజీ కోసం ప్రయోగాలు, దేశీయ వనరులపై ఆధారపడి పురోగమించాలనే అవగాహనను' ప్రజల్లో ప్రచారం చేసింది. ఒక గొప్ప ముందడుగు పారిశ్రామిక రంగంలో ఘననీయమైన గుణాత్మక మార్పులు వచ్చాయి. వ్యవసాయం పురోగమించింది. పెద్ద ముందంజ వంటి వినూత్న ప్రజా అభివృద్ధి నమూనాలతోనూ,"పదేళ్ల ప్రణాళికబద్ధమైన ఆర్థిక నిర్మాణం"(1949-59) అనే విధానాన్ని చేపట్టింది.

అక్టోబర్ విప్లవం ద్వారా కూలదోయబడిన బూర్జువా, భూస్వామ్య వర్గాల వద్ద కొంతడబ్బు, కొన్ని ఉత్పత్తి సాధనాలు మిగిలే ఉన్నాయి. పాత వ్యవస్థ భావజాల అవశేషాలు కూడా వ్యాప్తిలో ఉన్నాయి. రైతాంగం, మధ్యతరగతి వద్ద కొద్దిపాటి ఆస్తులు ఉన్నాయి. ఇవే అనివార్యంగా పెట్టుబడిదారీ విధానాన్నీ, బూర్జువా వర్గాన్ని తిరిగి తలెత్తేలా చేశాయి. శారీరక శ్రమకు, మానసిక శ్రమకు మధ్య, కార్మికులకు, రైతులకు మధ్య, పట్టణాలకు, గ్రామాలకు మధ్య, వ్యవసాయానికి, పరిశ్రమలకు మధ్య, వివిధ ప్రాంతాల మధ్య, వివిధ జాతుల మధ్య అంతరాలు కొనసాగాయి. సోషలిస్టు ఆర్థిక పునాదిని విచ్ఛిన్నం చేసేందుకు అవకాశం కల్పించే పాత సమాజపు దోపిడీ సంస్కృతి, సంప్రదాయాలు, అలవాట్లు ఉపరితలంలో కొనసాగాయి.

సోషలిస్టు రాజ్యంలో సైతం పాత బూర్జువా వర్గం, అభివృద్ధి నిరోధకుల ఉనికి కొనసాగుతుంది. వీరికి దన్నుగా బయటి నుంచి సామ్రాజ్యవాదులు, అభివృద్ధి నిరోధకులు, విప్లవ ప్రతీఘాతకులు, రివిజనిస్టులు ఒక సమూహంగా ఏర్పడ్డారు. ఈ వర్గం చాపకింది నీరులా చైనా కమ్యూనిస్టు పార్టీలో ఉన్నత అధికారాన్ని హస్తగతం చేసుకున్నారు. వీరు పెట్టుబడిదారీ విధాన పునరుద్ధరణకు పథకం ప్రకారం పనిచేశారు. 'ఉత్పత్తి శక్తుల' రివిజనిస్టు సిద్ధాంతాన్ని రహస్యంగా, బహిరంగంగా అమలు చేశారు. సోషలిజంలో వర్గ పోరాటాన్ని కొనసాగించడం, కమ్యూనిస్టు (వర్గరహిత, రాజ్యరహిత) సమాజాన్ని సాధించేంత వరకు విప్లవాన్ని కొనసాగించాలనే మావో బోధనలు "పెట్టుబడిదారీ కేంద్రాన్ని బద్దలు కొట్టండి (బొంబార్డ్ హెడ్ క్వార్టర్స్) అనే ఆయన పిలుపు అనుగుణంగా 1966-76 మధ్య పది సంవత్సరాలు కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం కొనసాగింది. లీ షావ్ చీ- లిన్ పియావో- డెంగ్ సియావో పింగ్ ముందుకు తెచ్చిన విప్లవ ప్రతిఘాతుక పంథా అయిన 'ఉత్పత్తి శక్తుల' సిద్ధాంతానికి వ్యతిరేకంగా తీవ్ర వర్గ పోరాటం జరిగింది. రివిజనిజానికి – మార్క్సిస్టు లెనినిస్టు మావో ఆలోచన విధానానికి మధ్య పోరాటం సైద్ధాంతిక రంగంలో పదునుగా, క్లిష్టంగా కొనసాగింది. 1966-76 మధ్యకాలంలో జరిగిన శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం చైనాలో పెట్టుబడిదారీ విధానం పునరుద్ధరణ జరగకుండా నివారించగల్గింది.

డెంగ్ నాయకత్వంలో చైనా

శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవంతో (1966-76)నూ ప్రపంచం దృష్టిని, ప్రత్యేకంగా ప్రపంచ పీడిత ప్రజల దృష్టిని అపారంగా ఆకర్షించిన చైనా, మావో మరణం తర్వాత ఆ స్థానాన్ని కోల్పోయింది. 1976 సెప్టెంబర్ 9న మావో మరణించాకా హువా-డెంగ్‌ల నాయకత్వంలోని పెట్టుబడిదారీ వర్గం విప్లవ ప్రతిఘాతుక కుట్ర ద్వారా అధికారం హస్తగతం చేసుకుని సాంస్కృతిక విప్లవ విజయాలను తిరగదోడడంలో విజయవంతమయ్యారు. సైద్ధాంతిక, ఆర్థిక రాజకీయ, సాంస్కృతిక రంగాలలో పెట్టుబడిదారీ విధానాన్ని వ్యవస్థీకృతం చేయగలిగారు. అనతికాలంలోనే వీరు కమ్యూనిస్టు పార్టీని రివిజనిస్టు పార్టీగా, కార్మిక వర్గ నియంతృత్వాన్ని బూర్జువా నియంతృత్వంగా, సోషలిస్టు వ్యవస్థను పెట్టుబడిదారీ వ్యవస్థగా మార్చి తమ లక్ష్యాన్ని సాధించగలిగారు.

మార్క్సిజానికీ విప్లవానికి మావో నెలకొల్పిన సోషలిస్టు పంథాకు డెంగ్ తూట్లు పొడిచారు. 1978లో డెంగ్ సియావోపింగ్ మార్గదర్శకత్వంలో చైనా పెట్టుబడిదారీ బాట పట్టిన తరువాత ఆర్థిక సంస్కరణలను వేగంగా అమలు చేశారు. అయితే రాజకీయ సంస్కరణలను మాత్రం అమలు చేయకుండా అదే ఏకపార్టీ పాలనను కొనసాగిసున్నారు. ఆర్థిక సంస్కరణల వల్ల కలిగే అనర్థాలు సామాజిక సంక్షోభాలకు దారితీయడం సహజం. అందుకు చైనా మినహాయింపు కాదు. అయితే చైనాలో ఏకపార్టీ వ్యవస్థ అందులోనూ బలమైన కమ్యూనిస్టు పార్టీ పాలన ఉండడం వల్ల ప్రజల అసంతృప్తిని వ్యక్తీకరించే దారులు మూసుకుపోయాయి. దీంతో చైనా ప్రజల్లోనూ, వివిధ దేశాల ప్రజల్లోనూ విప్లవోద్యమంలో చైనా కమ్యూనిస్టు పార్టీ తిరోగమనంపై వ్యతిరేకత పెరిగింది

హువా-డెంగ్ నాయకత్వం అధికారం చేపట్టిన వెంటనే ప్రజలను సైద్ధాంతికంగా, భావజాలపరంగా నిరాయుధం చేసేందుకు విప్లవ భావజాల ముసుగునే ధరించారు. 'మాటల్లో సోషలిజం చేతల్లో పెట్టుబడిదారీ వ్యవస్థ పునరుద్ధరణ'ను చేపట్టారు. 1982లో జరిగిన 12వ సిపిసి మహాసభలో పెట్టుబడిదారీ ఆర్థిక సంస్కరణలు ఆమోదించారు. పెట్టుబడిదారీ విధానాన్ని అభివృద్ధి చేయడం కోసం మార్కెట్ సంస్కరణలు చేపట్టారు 1982-89 వరకు మొదటి దశ సంస్కరణలు అమలుచేశారు. 1990ల తర్వాత రెండవ దశ సంస్కరణలు చేపట్టారు. వీటిని సరళీకృత సంస్కరణగా పిలుస్తున్నారు. ప్రజల మెదళ్లలో పాతుకుపోయిన విప్లవ విలువలన్నింటినీ బహిరంగంగా నిందిస్తూ అనేక వ్యాసాలను ప్రచురించారు. శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవాన్ని తప్పుబట్టారు. మార్క్సిజం స్థానంలో వ్యవహారిక సత్తావాదాన్ని (ప్రాగ్మాటిజం) ముందుకు తెచ్చారు. మావో అనుచరులను నిర్బంధించారు, అణచివేశారు, ఉరిశిక్షలు వేసి చంపారు. ఈ విధంగా ప్రత్యర్థులను తొలగించుకొని తమ స్థితిని సుస్థిరం చేసుకున్నారు.

డెంగ్ సియావోపింగ్ అధికారానికి వచ్చి ప్రవచించిన ఆర్థిక సంస్కరణలు, నాలుగు ఆధునికీకరణలు, మార్కెట్ సోషలిజం, చైనీయ లక్షణాలతో కూడిన సోషలిజం వంటి సిద్ధాంతాలన్నీ చైనాలో పెట్టుబడిదారీ పునరుద్ధరణకు మార్గం సిద్ధం చేశాయి. డెంగ్ ప్రారంభించిన ఈ పెట్టుబడిదారీ పునరుద్ధరణ మార్గాన్ని ఆ తర్వాత అధికారం చేపట్టిన లీ జియానియన్, యాంగ్ షాంగ్ కున్, జియాంగ్ జెమిన్, హు జింటావోలు కొనసాగించారు, మరింత వేగంగా ముందుకు తీసుకువెళ్తూ చైనాను ఒక సామ్రాజ్యవాద శక్తిగా మార్చడానికి ప్రయత్నించాయి. సోషలిస్టు సమాజంలో పెట్టుబడిదారీ సంస్కరణలు తెచ్చినప్పుడు అనివార్యంగా ఆ వ్యవస్థకు సంబంధించిన రుగ్మతలు సమాజంలో ప్రబలుతాయి. ఈ క్రమంలోనే దేశంలో అతి భయంకరమైన శ్రమ దోపిడీ, తీవ్రమైన అసమానతలు, దారిద్ర్యం, అతి దారుణమైన అవినీతి, అత్యంత నిర్బంధపూరితమైన పాలన కొనసాగిస్తూ అంతర్జాతీయంగా పెట్టుబడులతో దేశదేశాల్లో తన ఆర్థిక ప్రయోజనాల కోరలు చాస్తున్న చైనా పాలకులు ఇంకా ఈ పనులన్నిటినీ సోషలిజం ముసుగు కిందనే సాగిస్తున్నారు. రంగు మార్చకుండానే దిక్కు మార్చి చాలదూరం వెళ్లారు.

హువా-డెంగ్‌ల నాయకత్వం "చైనా తరహా సోషలిజం" పేరుతో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించింది. డెంగ్ మాటల్లో చెప్పాలంటే "ఆర్థిక సంబంధాలు అన్నీ పెట్టుబడిదారీగా మారిపోయి, రాజకీయ సంబంధాలు మాత్రం 'సోషలిజం' పేరుతోటి, ప్రజల నియంతృత్వ పేరుతోటి ఏకపార్టీ ఆధిపత్యం కింద ఉండాలి". ఈ ముసుగులోనే చైనా నేడు సోషల్ సామ్రాజ్యవాదంగా మారింది. వీళ్ల మాటల్లో చైనా లక్షణాలతో కూడిన సోషలిజం అంటూ ప్రజలను మభ్యపెట్టారు. సోషలిస్టు వ్యవస్థ, శ్రామికవర్గ నియంతృత్వం, కమ్యూనిస్టు పార్టీ నాయకత్వం, మార్క్సిజం-లెనినిజం, మావో ఆలోచన విధానాలను తప్పుడుగా ప్రవచిస్తూ ప్రజలను మోసపూరితంగా సిపిసి నాయకత్వం పక్కదారి పట్టించింది. చైనాలో ఉన్న కొన్ని ప్రభుత్వ రంగ సంస్థలను చూపిస్తూ, అమలులో ఉన్న పెట్టుబడిదారీ విధానాన్ని సోషలిజంగా గందరగోళపరిచారు. 2001 నుంచి ప్రైవేట్ వాణిజ్య వేత్తలకు కమ్యూనిస్టు పార్టీలో సభ్యత్వం ఇవ్వడం ప్రారంభించారు. 2002 నాటికి చైనాలో ప్రైవేట్ పారిశ్రామికవేత్తలలో ఐదింట ఒకవంతు సిపిసిలో సభ్యులుగా ఉన్నారు.

1979లో వ్యవసాయ సంస్కరణలు అమలు చేశారు. కమ్యూన్లను, సహకార వ్యవసాయ సంఘాలను రద్దు చేశారు. 1988లో భూమిని వినియోగించే హక్కును బదిలీ చేసే సంస్కరణ తెచ్చింది. ఫలితంగా లక్షలాది మంది రైతులకు పనిలేకుండా పోయింది. వీరంతా అదనపు స్వేచ్ఛా ఆర్థిక కార్మికులుగా మారారు. 1984లో పట్టణ సంస్కరణలు చేపట్టారు. అనేక సముద్ర తీరప్రాంత నగరాలను స్వేచ్ఛా ఆర్థిక మండళ్లుగా మార్చారు. 1980లో ప్రపంచబ్యాంకు, ఐఎంఎఫ్‌లో చేరింది. రాజ్య యాజమాన్యంలోని పరిశ్రమలను విచ్ఛిన్నం చేశారు. విదేశీ కంపెనీలకు తాము కోరుకున్న సదుపాయాలు కల్పించారు. బహుళ జాతి సంస్థలు విదేశీ వ్యాపారాన్ని స్వతంత్రంగా చేసుకునేందుకు అనుమతించారు. విదేశీ పెట్టుబడులకు తలుపులు బార్ల తెరిచారు. విదేశీ ప్రైవేట్ కంపెనీలు తమ ఇష్టానుసారంగా వేతనాలు నిర్ణయించే హక్కు, కార్మికులను తొలగించే హక్కు కల్పించారు. లాభాలను పెంచుకునేందుకు అనుమతించారు.

చైనా జిడిపిలో ప్రైవేట్ రంగం 60 శాతం వరకు ఉంది. 1998-2010 మధ్యకాలంలో పారిశ్రామిక ఆస్తుల్లో ప్రభుత్వ వాటా 68 శాతం నుంచి 40 శాతానికి పడిపోయింది. ప్రభుత్వ సంస్థల ఎగుమతుల వాటా 57 శాతం నుంచి 10 శాతానికి పడిపోయింది. అదే సమయంలో ప్రభుత్వ రంగ ఉద్యోగుల సంఖ్య 60 శాతం నుంచి 20 శాతానికి తగ్గింది. ఈ కాలంలో ప్రపంచ మార్కెట్‌లో పోటీని

తట్టుకునేందుకు చేపట్టిన పరిశ్రమల అధునీకరణ వల్ల 60 లక్షల మంది కార్మికులను తొలగించారు. కార్మికులు జీవితాంతం ఉద్యోగంలో ఉండే హక్కును రద్దు చేశారు. కాంట్రాక్టు లేబర్ వ్యవస్థను తీసుకొచ్చారు. చైనా విదేశీ పెట్టుబడి 2002లో 2.5 మిలియన్ డాలర్లు మాత్రమే. 2007 నాటికి అది 18.6 మిలియన్ డాలర్లకు చేరింది. 2008 నాటికి 52.2 మిలియన్ డాలర్లకు, 2009 నాటికి 65 మిలియన్ డాలర్లుగా పెరిగింది. ప్రపంచ ఉత్పత్తిలో చైనా వాటా 1991లో 4.1 శాతం ఉండగా 2011 నాటికి ఇది 14.3 శాతానికి పెరిగింది. దీంతో చైనా ప్రపంచ సామ్రాజ్యవాద మార్కెట్‌లో విడదీయరాని భాగమైంది.

జిన్‌పింగ్ నాయకత్వంలో చైనా

2012లో జిన్‌పింగ్ అధికారానికి వచ్చిన వెంటనే తన స్థానాన్ని సుస్థిరం చేసుకోవడం ప్రారంభించారు. నియంత తరహాలో పార్టీలో తనకు వ్యతిరేకత లేకుండా చర్యలు చేపట్టాడు. పాత వ్యవస్థలను ధ్వంసం చేసి తన కేంద్రంగా కొత్త వ్యవస్థలను నిర్మించుకున్నాడు. అప్పటి వరకు వివిధ రంగాలలో నిర్ణయాత్మక పాత్ర వహిస్తున్న వ్యవస్థలకు ప్రత్యామ్నాయంగా 'సెంట్రల్ లీడింగ్ గ్రూప్స్' తన అధ్వర్యంలో పనిచేసే కొత్త వ్యవస్థలను సృష్టించారు. ఆర్థిక సంస్కరణలకు సంబంధించిన బృందం కీలకమైనది. దీనికి తోడు ఇంటర్‌నెట్ భద్రత పేర మరో బృందాన్ని సృష్టించారు. జాతీయ భద్రతా కమీషన్‌ను కూడా ఏర్పాటు చేసుకోవడంతో ఇక జిన్‌పింగ్‌కు ఎదురులేకుండా పోయింది.

గతంలో పార్టీ ప్రధాన కార్యదర్శులుగా పనిచేసినవారు ఐదేండ్లు ముందుగానే తన వారసున్ని గుర్తించేవారు. కానీ జిన్‌పింగ్ తన తరువాత నాయకుడిగా ఎవరులేని పరిస్థితిని పొలిట్‌బ్యూరో స్థాయి సంఘంలో సృష్టించారు. పార్టీ నిర్మాణాలన్నీ జిన్‌పింగ్ విధేయులతో నిండిపోయాయి. అధికారంలోకి వచ్చిన వెంటనే జిన్‌పింగ్ చేపట్టిన 'అవినీతి నిర్మూలన కార్యక్రమం చేపట్టారు. పార్టీలో పై స్థాయి నుండి కింది వరకు కీలక పాత్ర పోషిస్తున్న లక్షలాది మందిని తొలగించారు. ఈ విధంగా పార్టీలోని ప్రత్యర్థి వర్గాలకు చెందిన వారిని తొలగించడమే కాకుండా అనేకమందిని జైలు పాలు చేశాడు. పార్టీలోనే కాకుండా, ప్రభుత్వంలో, సైనిక దళాల్లో సంస్కరణల పేరుతో, అవినీతి నిర్మూలన పేరుతో ప్రత్యర్థులను నామరూపాలు లేకుండా చేసి అన్ని వ్యవస్థల్లో, అన్ని స్థాయిల్లో తన విధేయులను నియమించుకున్నారు. ఐదేండ్ల కాలంలో దేశంలోని అన్ని వ్యవస్థల్లో జిన్‌పింగ్ పట్టు బిగుసుకుపోయింది. నిజానికి అవినీతిని అంతమొందిస్తానంటూనే పార్టీలో అవినీతిని పెంచి పోషించాడు.

ఇవాళ ఒక కొత్త సోషల్ సామ్రాజ్యవాద శక్తిగా ఎదిగిన చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ మహాసభలు పీకింగ్‌లో జరిగాయి. దేశ వ్యాపితంగా 8 కోట్ల 90 లక్షల మంది పార్టీ సభ్యులకు ప్రాతినిధ్యం వహిస్తూ 2,280 మంది ప్రతినిధులు మహాసభకు హాజరైనారు. పార్టీ ప్రధాన కార్యదర్శి జి జిన్‌పింగ్ ప్రవేశపెట్టిన నివేదికపై చర్చించి, ఆమోదించిన అనంతరం 205 మంది సభ్యుల నూతన కేంద్ర కమిటీని, మరో 171 మంది ప్రత్యామ్నాయ సభ్యులను మహాసభ ఎన్నుకుంది. కొత్త కేంద్ర కమిటీ అక్టోబర్ 25న సమావేశమై 25 మందితో నూతన పొలిట్ బ్యూరోను, ఏడుగురు సభ్యుల పొలిట్ బ్యూరో స్థాయీ సంఘాన్ని ఎన్నుకుంది. జి జిన్‌పింగ్ రెండోసారి ప్రధాన కార్యదర్శిగా ఎన్నికయ్యారు. గత ఐదు సంవత్సరాలుగా జిన్‌పింగ్ బలమైన నేతగానే కాకుండా ప్రభుత్వ అధినేతగానూ గట్టి పునాదులు వేసుకున్నారు. చైనా కమ్యూనిస్ట్ పార్టీ (సిపిసి) ప్రధాన కార్యదర్శిగా మరోసారి ఎన్నిక కావడం ద్వారా చైనా అధ్యక్షుడిగా రెండోదఫా కూడా ఆయనే కొనసాగబోతున్నారు. జిన్‌పింగ్ ఆధిపత్యం సుస్థిరమైపోయింది. ఇందుకోసం ఆయన వ్యూహాత్మకంగానే పావులు కదిపారు. తనకు పోటీ అని ప్రచారంలో ఉన్నవారిని అవినీతి ఆరోపణలతో పక్కనపెట్టారు. భవిష్యత్‌లో దేశ అధ్యక్ష పదవికి మరెవ్వరూ పోటీకి రాకుండా పార్టీలో మార్పులు చేశారు.

చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ మహాసభలో నాలుగు ప్రధాన లక్ష్యాలపైన కేంద్రీకరించి చర్చలు జరిపారు. పార్టీ ప్రధాన కార్యదర్శి, దేశాధ్యక్షుడు జిన్‌పింగ్ మహాసభలను ప్రారంభించారు. 2021 నాటికి ఒక మాదిరిగా పురోగతి చెందిన సమాజ నిర్మాణం ప్రథమ లక్ష్యం. 2049 నాటికి పురోగతి చెందిన సోషలిస్టు సమాజ నిర్మాణం రెండవ లక్ష్యం. రెండవ లక్ష్యం కింద చైనా విముక్తి చెంది 2049 నాటికి 100 సంవత్సరాలు అవుతుందని అప్పటికి ప్రజలందరూ మధ్యతరహా ఆదాయాన్ని పొందే సమాజం నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. 2010లో నమోదైన జిడిపికి రెట్టింపు వృద్ధిని 2021 నాటికి సాధించడం లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పటికీ 70 మిలియన్లమంది ప్రజలు పేదరికంలోనే ఉన్నారు. పారిశ్రామిక కాలుష్యం ప్రధానమైన నగరాలన్నిటినీ చుట్టుముట్టింది.

రానున్న 30 సంవత్సరాలకి సంబంధించిన రాజకీయ కార్యక్రమాన్ని ఈ మహాసభలో రూపొందించారు. జిన్‌పింగ్ ప్రతిపాదించే సైద్ధాంతిక ముసాయిదాను రాబర్ట్‌కున్ రాజకీయ, ఆర్థిక విశ్లేషకుడు ఆయన నాలుగు సమ్మిళిత లక్ష్యాలను వివరించారు. జిన్‌పింగ్ తాత్వికతను 'నాలుగంచెల సమగ్ర వ్యూహమ'ని అంటున్నారు. తగు విధమైన సంపద్వంత సమాజ నిర్మాణం, చట్టబద్ధ పాలన స్థిరపరచడం, పటిష్టమైన పార్టీ క్రమశిక్షణ, వేగవంతమైన సంస్కరణల సాధన– ఆ నాలుగంచెల సమగ్ర వ్యూహంలోని ప్రధానాంశాలు. వీటిని 2021లో జరగబోయే పార్టీ శత వసంతాల ఉత్సవాల కల్లా సాధించాలని జీ జిన్‌పింగ్ చెబుతున్నారు. నిజానికి చైనాలో పార్టీ నాయకత్వంలో, ఉన్నత ఉద్యోగ వర్గంలో అవినీతి ప్రబలిపోయింది. పారిశ్రామిక వేత్తల అవినీతికి పార్టీలోని, ప్రభుత్వంలోని అగ్రనాయకత్వానికి సజీవ సంబంధం ఉంది. ప్రస్తుత అధ్యక్షుడు జిన్‌పింగ్, మాజీ అధ్యక్షుడు హు జింటావో కుటుంబ సభ్యులకు పరిశ్రమల్లో లక్షలాది కోట్ల డాలర్ల పెట్టుబడులున్నాయి. వీరి సంతానానికి, బంధువులకు పలు పారిశ్రామిక సంస్థల్లో కోట్లాది డాలర్ల పెట్టుబడులున్నాయి. ఇదీ చైనా తరహా సోషలిజం.

జిన్‌పింగ్‌కు మావోతో సమాన హోదా కల్పిస్తూ ఆయన పేరు, విధానాలను పార్టీ రాజ్యాంగంలో చేర్చాలని సిపిసి 19వ జాతీయ మహాసభల్లో నిర్ణయించారు. 'చైనా ప్రత్యేకలతో నూతన యుగంలో సామ్యవాదం' పేరిట జిన్‌పింగ్ విధానాన్ని రాజ్యాంగంలో చేర్చేందుకు అవసరమైన సవరణలకు మహాసభ ఆమోదం తెలిపింది. జిన్‌పింగ్‌కు ముందు అధ్యక్షులుగా ఉన్న జియాంగ్ జెమిన్, హు జింటావోల ఆలోచనలకు కూడా రాజ్యాంగంలో చోటు దక్కినా వారి పేరును మాత్రం అందులో చేర్చలేదు. ప్రస్తుతం జిన్‌పింగ్ విధానాలను, పేరును అందులో చేర్చడం వల్ల వాటిని చైనాలోని పాఠ్యపుస్తకాల్లో పాఠ్యాంశాలుగా చేర్చే అవకాశం కూడా ఉంది. ఇప్పటి వరకు మార్క్సిజం సిద్ధాంతాన్ని చైనా దేశ కాల పరిస్థితులకు అన్వయించి మార్క్సిస్టు మేధావిగా మావో గుర్తింపు

పొందారు. ఆయన సిద్ధాంతాన్ని మావోయిజంగా అనుసరిస్తున్నారు. ఇక సోషల్ సామ్రాజ్యవాద సిద్ధాంతాన్ని బోధించబోతున్నారు.

"చైనీయ లక్షణాలతో నవయుగ సోషలిజంపై జి జిన్‌పింగ్ ఆలోచనా విధానం" ఇక నుంచి చైనా రాజకీయార్థిక విధానాలకు మార్గదర్శక సూత్రంగా ఉంటుంది. ఇప్పటిదాకా చైనా ప్రజలు మావో సిద్ధాంతాలను ఎలా అధ్యయనం చేశారో, ఇకనుంచి జిన్‌పింగ్ ఆలోచనలను అలా అధ్యయనం చేయాలనీ, నవయుగపు సోషలిజం గురించి తెలుసుకోవాలనీ, లోతైన సంస్కరణలు కావాలనీ ఈ మహాసభలు పిలుపునిచ్చాయి. జిన్‌పింగ్ ఆలోచనావిధానం అంటే పెట్టుబడిదారీ విధానాన్ని పెట్టుబడిదారుల కన్న క్రూరంగా, అమానవీయంగా అమలు జరుపుతూనే దానికి సోషలిజం అని పేరు పెట్టడం అని కార్మికులు చెపుతారు, దేశవ్యాప్తంగా అభివృద్ధి పేరిట నిర్వాసితులవుతున్న ప్రజలు చెపుతారు. కమ్యూన్లను రద్దు చేసి, సొంత ఆస్తిని పునరుద్ధరించి, జపాన్ సామ్రాజ్యవాదం రోజుల్లోకి, కొమింటాంగ్ పాలన రోజుల్లోకీ దేశాన్ని నడిపించడమే నవయుగ సోషలిజం అని రైతాంగం చెపుతుంది.

దశాబ్ద కాలంగా చైనా ప్రపంచ మార్కెట్‌పై ఆధిపత్యం కోసం అమెరికాతో పోటీ పడుతున్నది. తన శక్తి యుక్తులన్నింటినీ వినియోగించి ప్రపంచ మార్కెట్‌ను హస్తగతం చేసుకునేందుకు కసరత్తు చేస్తున్నది. దీనికోసం అత్యధిక నిధులను కేటాయిస్తున్నది. ఈ క్రమంలోనే చైనా బీజింగ్‌లో బెల్ట్ అండ్ రోడ్ ఫోరమ్ (బీఆర్ఎఫ్) పేరుతో గత సంవత్సరం సదస్సును నిర్వహించింది. ఈ సదస్సుకు ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్, ఐఎంఎఫ్ చీఫ్, ప్రపంచ బ్యాంకు అధ్యక్షులు హాజరయ్యారు. చైనా కూడ ప్రపంచీకరణలో భాగమై ప్రపంచ మార్కెట్‌లో ప్రవేశించడం వల్ల అమెరికా అధ్యక్షుడు హర్షం వ్యక్తం చేయడం గమనార్హం. చైనా కొత్త సిల్క్‌రోడ్డుతో దేశాల మధ్య సమాన, సౌహార్ద సంబంధాలకు తావులేకుండా పోతున్నది. దేశాల అంతర్గత విషయాలు, రాజకీయాలు కూడా ఆధిపత్య శక్తికి అనుకూలంగా రూపొందే ప్రమాదం పొంచి ఉన్నది. మరోవైపు సోషల్ సామ్రాజ్యవాద దేశంగా మారిన స్థితి నుండి సైనికంగా ఆధునికరణపై దృష్టి సారిస్తోంది. 2050 నాటికి ప్రపంచంలో అగ్రశ్రేణి సైనిక శక్తిగా తయారుకావడానికి ఏటా ఏడు శాతం సైనిక బడ్జెట్ పెంచనుంది.

చైనా కమ్యూనిస్టు పార్టీ 19వ సమావేశాలు అక్టోబర్ 24తో ముగిసాయి. చివరి రోజు సమావేశంలో భాగంగా పార్టీ రాజ్యాంగాన్ని సవరించారు. ఈ సందర్భంగా జిన్‌పింగ్ పేరును పార్టీ రాజ్యాంగంలో చేర్చారు. మావో తర్వాత ఈ ఘనత అందుకున్న వ్యక్తి జిన్‌పింగ్. 1977లో డెంగ్ జియావోపింగ్ పేరును మరణానంతరం ఈ విధంగా చేర్చారు. 'నూతన శకంలో చైనా లక్షణాలతో కూడిన సామ్యవాదం' అనే పేర జిన్‌పింగ్ ఆలోచన విధానాన్ని, ప్రతిపాదించిన సిద్ధాంతాన్ని బోధిస్తారు. దీంతో జిన్‌పింగ్ చైనాను పూర్తిగా తన చెప్పు చేతల్లో పెట్టుకోవడానికి పావులు కదుపుతున్నారు. – కమ్యూనిస్టు పార్టీ సభ్యులు, పాఠశాలల్లోని పిల్లలకు, కాలేజీ విద్యార్థులు.... మొదలైనవారంతా మొన్నటిదాకా మావో సిద్ధాంతాన్ని ఎలా అధ్యయనం చేశారో, చదువుకున్నారో, ఇకపై 'జిన్‌పింగ్ తత్వం' గురించి కూడా చదువుకోవాలి.

చైనా సోషల్ సామ్రాజ్యవాదాన్ని, జిన్‌పింగ్ సిద్ధాంతాన్ని మావో బోధించి, ఆచరించిన శాస్త్రీయ సోషలిజం వెంటాడుతోంది. ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక ప్రచురించిన వార్త, ఒక సంవత్సరం క్రితం ఐఎంఎఫ్ విడుదల చేసిన నివేదిక ప్రకారం చైనాలో అసమాన ఆర్థిక వ్యవస్థ వేళ్లూనుకుంది. దీన్ని వ్యతిరేకిస్తున్న పదమూడు రాష్ట్రాలకు చెందిన మావో అనుయాయులు యెనాన్ ప్రావిన్స్ లియాంగ్ పట్టణంలో రెండు రోజులు రహస్యంగా సమావేశమయ్యారు. ఈ సమావేశం విడుదల చేసిన ప్రకటనలో చైనాలో అమలవుతున్న పెట్టుబడిదారి విధానాన్ని రివిజనిస్టు ప్రతిఘాత జిన్‌పింగ్ నాయకత్వాన్ని విప్లవం ద్వారా కూలదోయాలని ప్రజలకు పిలుపునిచ్చారు. ఇదంతా గమనిస్తే సిపిపి పట్ల గూడుకట్టిన అసమ్మతి, వ్యతిరేకత స్పష్టమవుతుంది. ప్రజలు మావో కాలంలో అనుభవించిన ఫలితాలు మదిలో ఉంచుకొని నాటి–నేటి పరిస్థితుల మధ్య తేడాను గ్రహిస్తున్నారు. జిన్‌పింగ్ ఎంత నిరంకుశంగా వ్యవహరించినా ప్రజల నుండి ప్రతిఘటన ఎదుర్కోక తప్పదు.

ముగింపు

కమ్యూనిస్టు పార్టీ సభ్యులతో సహా చైనాలోని చాలామందికి అధికారికంగా ప్రవచిస్తున్న సిద్ధాంతాలపై ఎలాంటి నమ్మకం లేదు. ఆర్థికంగా చూస్తే చైనాలో సాగుతున్న ఉత్పత్తిలో అరువై శాతం ప్రైవేటు రంగం నుంచే వస్తున్నది. చైనాలో సంస్కరణవల్ల ఆర్థికవృద్ధి జరిగినప్పటికీ ఆదాయ, ప్రాంతాల మధ్య అసమాన అభివృద్ధి అసమానతలు పెరగడంతో పాటు, సామాజికంగా మత ప్రభావం పెరిగింది. సామాజిక భద్రత మృగ్యమయింది. సాధారణ చైనా ప్రజల జీవితాలలో కమ్యూనిస్టు పార్టీకి పాత్ర లేకుండాపోయింది. ఇదీ జిన్‌పింగ్ పాలనలోని పరస్పర విరుద్ధ స్థితి. కొన్ని దశాబ్దాలలోకెల్లా ఏకపార్టీ వ్యవస్థ గల పెద్ద దేశానికి అధినేతగా జిన్‌పింగ్ ప్రపంచంలోనే అతి బలమైన నేతగా కనబడుతున్నారు. కానీ చైనా సమాజంపై ఆయన ప్రభావం మాత్రం ఊహించుకున్న దానికన్నా చాలా తక్కువే. ఎందువల్లనంటే మార్క్స్, లెనిన్, మావోలు బోధించిన శాస్త్రీయ సోషలిజానికి, నాటి డెంగ్ సంస్కరణలు గాని, నేటి జిన్‌పింగ్ సిద్ధాంతానికి పోలిక లేదు.

నేడు చైనా ఒక నూతన సోషల్ సామ్రాజ్యవాద శక్తిగా మారింది. ప్రపంచ పెట్టుబడిదారీ సామ్రాజ్యవాద వ్యవస్థలో భాగమైంది. కార్మికవర్గానికి, ప్రపంచ పీడిత జాతులకు, ప్రజలకు ప్రతికూలంగా మారింది. చైనా వద్ద ఉన్న భారీ ద్రవ్యనిల్వలు దాని ఆర్థిక, రాజకీయ ప్రభావాన్ని విస్తరించేందుకు తోడ్పడుతున్నాయి. చైనా సోషల్–సామ్రాజ్యవాదం వెనుకబడిన దేశాలకు, ఇతర దేశాలకు యుద్ధ సామాగ్రిని, పెట్టుబడిని ఎగుమతి చేయడం ద్వారా అసమాన వ్యాపారం ద్వారా, వాటి సహజ వనరులను దోచుకుంటోంది. వాటి అంతర్గత వ్యవహారాల్లో జోక్యం చేసుకుంటూ, సైనిక శిబిరాలను సంపాదించుకునేందుకు అవకాశాల కోసం చూస్తున్నది. అమెరికా సామ్రాజ్యవాదంతో పోటీ పడుతున్నది. ఈ రకంగా చైనా సోషల్–సామ్రాజ్యవాదం సామ్రాజ్యవాదానికి సంబంధించిన వలయంలోనే తిరుగుతూ ఉంది. సోవియట్ యూనియన్‌లో స్టాలిన్ మరణానంతరం కృశ్చేవ్–బ్రెజ్నెవ్‌లు పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించినట్లే, చైనాలో మావో మరణానంతరం హువా–డెంగ్ నాయకత్వంలో పెట్టుబడిదారీ విధానాన్ని పునరుద్ధరించారు. దాన్నే జిన్‌పింగ్ నేతృత్వంలో సోషల్ సామ్రాజ్యవాద శక్తిగా మార్చారు.

(రచయిత ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు, రాజనీతిశాస్త్ర విద్యార్థి) వీ

అమలు కాని దళితుల భూమి హామీ-2

***కుల సమాజంలో ఆర్థికంగా, రాజకీయంగా, సామాజికంగా వెనుకకు నెట్టివేయబడ్డ దళితులకు ప్రభుత్వాలు అమలు పరుస్తున్న భూసంస్కరణల వల్ల ఎటువంటి ప్రయోజనాలు చేకూరలేదని అంటున్నారు* నలమాస క్రిష్ణ**

(గత సంచిక తరువాయి)

3 ఎకరాల భూ పంపిణీ పథకం

తెలంగాణ ఉద్యమంలో నీళ్లు, నిధులు, నియామకాలే కాక భూమి సమస్య ప్రత్యక్షంగా పరోక్షంగా వ్యక్తీకరించబడుతూ వచ్చింది. రాజకీయంగా బలీయమైన చైతన్యాన్ని ప్రదర్శించగలిగిన దళిత సామాజిక వర్గాన్ని ఆకట్టుకోవలసిన సందర్భం 2014 నాటికి వివిధ రాజకీయ పార్టీలకు ఏర్పడింది. ఈ నేపథ్యంలోనే దళితులకు 3 ఎకరాల భూమి పంపిణీ కార్యక్రమాన్ని తెలంగాణ రాష్ట్ర సమితి ఎన్నికల ప్రణాళికలో చేర్చింది. 2014లో తెలంగాణ తొలి ప్రభుత్వాధికారం చేపట్టిన ముఖ్యమంత్రి కేసీఆర్ దళితులకు భూ పంపిణీ కార్యక్రమాన్ని ఎంతో ప్రతిష్ఠాత్మకంగా 2014 ఆగస్టు 15న గోల్కొండ నుంచి ప్రారంభించారు. ఈ పథకాన్ని శాంతియుత విప్లవంగా కొందరు ప్రభుత్వ మేధావులు కీర్తించారు. ఎన్నో త్యాగాలు చేసిన తెలంగాణ ప్రజలు తమ తల్లిదండ్రుల బిడ్డల నెత్తురు చిందని నేలను ఏ మూలన చూసి ఎరుగరు. అటువంటిది నెత్తురు చుక్క రాలకుండా శాంతియుత పద్ధతుల్లో భూమి అందిస్తాననడం సంతోషదాయకమైన వార్తగా ఆనందించారు దళిత ప్రజలు.

భూమి కొనుగోలు పథకం ద్వారా తెలంగాణ ప్రభుత్వం నిరుపేద మహిళా కుటుంబాలకు భూమి కొనుగోలు పథకాన్ని ప్రారంభించింది. తెలంగాణా ప్రభుత్వం భూమి కొనుగోలుకు, అసైన్డ్ చేయడానికి 1,4ని జారీ చేసింది. ఈ పథకం కింద భూమిలేని నిరుపేద దళిత వ్యవసాయ ఆధారిత కుటుంబాలకు మొదటి విడతగా మూడు ఎకరాల భూమి ఇవ్వడం జరుగుతుంది. రెండవ విడతలో మూడు ఎకరాల కన్నా తక్కువ భూమి ఉన్నవారికి – మిగతా మొత్తం అసైన్డ్ చేసి మొత్తం మూడు ఎకరాల యజమానులుగా మార్చుతుంది.

భూమి అసైన్డ్ చేయడంతో పాటు వ్యవసాయానికి సంబంధించి విత్తన కొనుగోలు, ఎరువులు, పురుగుల మందులు, నీటి పారుదల, బిందు సేద్యం, చిన్న నీటి పారుదల, పంపు సెట్లు అందించడంలాంటివి ప్రభుత్వమే భరిస్తుంది. ఇందుకు సంబంధించిన మొత్తాన్ని లబ్దిదారుల ఖాతాలకు జమ చేస్తుంది. ఈ పథకంలో లబ్దిదారులకు 100 శాతం సబ్సిడీ అందజేయడం జరుగుతుంది. తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్‌ని మినహాయించి అన్ని జిల్లాల నుంచి ఎకరాకు 2 లక్షల నుంచి 7 లక్షల వరకు వెచ్చించి భూమి కొనే విధంగా జిల్లా కలెక్టర్‌లకు అధికారం ఉంటుంది.

తెలంగాణలో 11.92 లక్షల దళిత కుటుంబాలున్నాయి. వీరు రాష్ట్ర జనాభాలో 15.14 శాతం. ఇందులో 9.2 లక్షల మంది గ్రామీణ ప్రాంతాలలో నివసిస్తున్నారు. మిగిలిన వారు అర్బన్, సెమీ అర్బన్‌లో ఉంటున్నారు. వీరిని వెట్టి చాకిరి నుంచి విముక్తి చేసి" (ఎస్‌సిఆర్‌పి) సాధికారత కల్పిస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసింది.

"ఆ దిశలో ప్రభుత్వం 9 మార్గదర్శకాలను ప్రకటించింది. అసలే భూమిలేని కుటుంబాలకు మొదటి దశలో 3 ఎకరాల భూమి ఇవ్వడం,

2014 నుండి 2016 వరకు తెలంగాణ ప్రభుత్వం చేసిన భూపంపకం వివరాలు

జిల్లాల వారిగా సిడిఎస్ రిపోర్ట్, కేస్ స్టడీస్

	జిల్లా	లబ్దిదారుల సంఖ్య	పంచిన భూమి (ఎకరాలు)	అనుమతించిన నిధులు	రిజిస్ట్రరైన భూ విస్తీర్ణం	రిజిస్ట్రరైన లబ్ధిదారుల సంఖ్య	వాస్తవంగా వెచ్చించిన నిధులు	రిజిస్ట్రేషన్ వ్యయం	మొత్తం వ్యయం	సగటు ఎకరం వ్యయం	జిల్లాలకు విడుదల చేసిన మొత్తం నిధులు
1	ఆదిలాబాద్	800	2312.09	8736.06	1284.24	444	4816.11	0	4816.11	3.75	3525.85
2	కరింనగర్	411	1025.37	3617.96	623.03	235	2517.2	0.03	2517.23	4.04	2448.64
3	ఖమ్మం	96	265.32	1651.91	110.03	43	606.66	0	606.66	5.51	907.2
4	మహబూబ్‌నగర్	416	1221.03	4162.34	1002.05	345	3333.94	3.23	3337.17	3.33	3377.54
5	మెదక్	607	1414.28	6785.04	1145.11	506	5450.09	0	5450.09	4.76	5803.55
6	నల్గొండ	302	744.04	2651.76	469.31	202	1676.33	4.16	1680.49	3.57	1599.48
7	నిజామాబాద్	540	1284.33	5924.18	910.37	371	4208.85	0	4208.85	4.62	3673.99
8	రంగారెడ్డి	69	182.37	620.94	124.16	43	423.55	10.22	433.77	3.41	490.02
9	వరంగల్	430	1212.11	6416.2	1123.23	395	6112.35	16.57	6128.92	5.44	5239.51
	మొత్తం	**3,671**	**9663.34**	**40,566.39**	**6793.33**	**2,584**	**29,145.08**	**34.21**	**29,179.29**	**4.29**	**27,065.78**

అర ఎకరం, ఎకరం, ఎకరంన్నర, రెండెకరాలు ఉన్న కుటుంబాలకు మిగిలిన మేర భూమిని కలుపుతూ ఆ కుటుంబాలలో కూడా ఒక్కో కుటుంబానికి 3 ఎకరాల భూమి ఉండేటట్టు చేయడం తమ లక్ష్యమని ప్రభుత్వం ప్రకటించింది. మహిళల పేరు మీద పట్టాదారు పాసు బుక్కు, టైటిల్ డీడ్, రిజిస్ట్రేషన్, 1బి, మ్యుటేషన్, మ్యాప్, పహాణీ అందజేయాలని కలెక్టర్లను ఆదేశించింది. ఇందుకు సమగ్రమైన ప్యాకేజీని కూడా ప్రకటించింది. సాగునీటి వసతి, డ్రిప్, విత్తనాలు, వ్యవసాయ ఖర్చులు, ఎరువులు, మందులు, విద్యుదీకరణ, బోర్ పంపులు అందజేయాలని ఒక సంవత్సరం ఈ మద్దతు కొనసాగించాలని భూ హక్కుదారుల ఖాతాల్లోకి ఈ మొత్తం ఖర్చులను జమ చేయాలని ప్రభుత్వం ఆదేశించింది. (గమనిక: అమలుకు సంబంధించి టేబుల్, సిడిఎస్)

1983 నుండి భూ పంపిణీ కార్యక్రమం జరుగుతున్నది. 32 ఎండ్లలో పదహారు ఏండ్లు కాంగ్రెస్ పార్టీ, పదహారేండ్లు తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నాయి. అప్పటి నుండి 2004 దాకా తెలంగాణలో 32,800 మందికి 39,798 ఎకరాల భూమి పంచినట్లు రికార్డుల్లో ఉంది. ఒక్కొక్కరికి అర ఎకరం, ఒక ఎకరం, ఎకరం పావు చొప్పున భూమిని పంచారు. ఎక్కువ శాతం వ్యవసాయ యోగ్యంకానీ భూమినే పంచారు. గుట్టలో, బోర్లో, చెట్టున్నయో, చవుడో, బీడో ఏదో ఒకటి అన్నట్టుగా ఈ భూముల పంపిణీ తంతు జరిగింది. ఈ కొద్ది పాటి భూమి వారికి ఏ విధంగా ఉపయోగపడలేదు. ఒక కుటుంబానికి ముడెకరాల భూ వసతి కల్పిస్తే అది వారి కుటుంబాన్ని పోషించుకోవ డానికి అనువైన వనరుగా ఉపయోగపడుతుందని భావించిన ప్రభుత్వం తెలంగాణ ఏర్పడిన వెంటనే 2014 ఆగస్టు 15న స్వాతంత్ర్య దిన వేడుకల సందర్భంగా ముఖ్యమంత్రి దళితులకు ముడెకరాల భూమి కార్యక్రమాన్ని ప్రారంభించిండు.

చిన్నగూడూర్: పూర్వ వరంగల్లు ప్రస్తుత మానుకోట జిల్లాలోని మండల కేంద్రమైన గ్రామం చిన్నగూడూర్. గ్రామం జనాభా 3628 ఉంటుంది. వీరిలో దళిత కుటుంబాలు 52 జనాభా 650 ఉంటుంది. 3 ఎకరాల భూమి పథకం కింద 110 ఎకరాల భూమిని 70 మంది దళితులకు ప్రభుత్వం 2015 ఆగస్టు నెలలో పంపిణీ చేసింది. ఆ భూములకు రోడ్డు సౌకర్యం లేదు. సాగు యోగ్యమైన భూమి ఏ మాత్రం కాదు. అంతా రాళ్లు, బోళ్లు, ముండ్ల కంచగా ఉంటుంది. ఇటువంటి భూములు ఇవ్వబడ్డప్పటికీ దళితులకు దానధర్మంగా ఇచ్చామనే ధోరణి అధికారులలో, అధికార పార్టీ రాజకీయ నాయకులలో వ్యక్తమైతుంది. అయితే 3 ఎకరాల భూపంపిణీ ఒక అధికార పార్టీ రాజకీయార్థిక విధానంగా ఉన్నదని చెప్పడానికి అనేక ఉదాహరణలున్నాయి. ఎవరి భూమి కొనాలి? లబ్దిదారులు ఎవరు? ఎకరా భూమికి ధర ఎంత? మార్కెట్ ధరను నిర్ణయించేటప్పుడు పాటించే ప్రమాణాల అమలు ఎవరు పర్యవేక్షిస్తారు? మొదలగు విషయాలు అన్ని చట్టబద్ధంగా అమలు జరుగుతున్నట్టు నివేదికలు చెబుతున్నాయి. చిన్నగూడూర్ గ్రామంలోని రామిరెడ్డి అనే తెలంగాణ రాష్ట్ర సమితి నాయకుడు దళితులకు మంజూరు చేయబడ్డ భూమి అమ్మినవాడు. (తెలంగాణ సాయుధ పోరాట కాలంలో రామిరెడ్డి తాతను కమ్యూనిస్టులు చంపేశారు. భూస్వామ్య కుటుంబం ఆనవాళ్లు మాత్రం ఇంకా కొనసాగుతూనే ఉన్నాయి) రామిరెడ్డి అమ్మిన భూమి ఆయన సొంత భూమి కాదు. అది చెరువు శిఖం భూమి, ప్రభుత్వ భూమి. ప్రభుత్వ భూమిని భూస్వామి ఎలా ప్రభుత్వానికి అమ్మగలిగాడు? దానికి ప్రతిఫలంగా దాదాపు 2 కోట్ల రూపాయలు డబ్బు తీసుకున్నాడు.

భూమి కొనుగోలు పథకం

సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ లబ్దిదారులను ఎంపిక చేసుకొని ఆదిలాబాద్, ఖమ్మం, వరంగల్, మహబూబ్‌నగర్, మెదక్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల్లో సర్వే చేసింది. సర్వేలో పరిశీలించిన అంశాలు..భూమి సాగుకు యోగ్యమైంద. నీటి లభ్యత ఉందా, విద్యుత్తు లభ్యత ఉందా భూమికి అనువుగా దారి ఉందా, భూమి లబ్దిదారునికి పూర్తిగా కేటాయించారా, పాస్ బుక్‌లు ఇవ్వడం జరిగిందా?

	సాగు యోగ్యమైన భూమియేనా? (ఎకరాలలో)			సాగు యోగ్యమైన భూమియేనా? (శాతం)	
జిల్లా	**అవును**	**కాదు**		**అవును**	**కాదు**
ఆదిలాబాద్	35	64	99	35.35	64.65
ఖమ్మం	36	0	36	100	0
మహబూబ్ నగర్	101	12	113	89.38	10.62
మెదక్	59	110	169	34.91	65.09
నల్గొండ	100	23	123	81.3	18.7
రంగారెడ్డి	17	10	27	62.96	37.04
వరంగల్	121	21	142	85.21	14.79
మొత్తం	469	240	709		

వ్యవసాయ భూమిలేకపోవడం అన్నది గ్రామాల్లో పెద్దసమస్య. ఆదిలాబాద్, మహబూబ్‌నగర్ జిల్లాల్లో వ్యవసాయ భూమి లబ్యత ఎక్కువగా ఉంది. ఈ సర్వే ప్రకారం నల్గొండ జిల్లాలో 67.48 శాతం లబ్దిదారులకు అందిన భూమి వ్యవసాయానికి అనువుగా లేదు. రంగారెడ్డి జిల్లాలో 55.56 శాతం లబ్దిదారులకు అందిన భూమికి రోడ్డు సౌకర్యం లేదు. మిగతా జిల్లాలో 50 కంటే ఎక్కువ మంది లబ్ది దారులకు రోడ్డు సౌకర్యం ఉంది.

	చేతికి వచ్చిన భూమి (ఎకరాలలో)			చేతికి వచ్చిన భూమి (శాతం)	
జిల్లా	**వచ్చినది**	**రానిది**		**వచ్చినది**	**రానిది**
ఆదిలాబాద్	93	6	99	93.94	6.06
ఖమ్మం	21	15	36	58.33	41.67
మహబూబ్‌నగర్	99	14	113	87.61	12.39
మెదక్	143	26	169	84.62	15.38
నల్గొండ	121	2	123	98.37	1.63
రంగారెడ్డి	22	5	27	81.48	18.52
వరంగల్	135	7	142	95.07	4.93
మొత్తం	634	75	709		

ఈ సర్వే ప్రకారం ఖమ్మం జిల్లలో 41.67 శాతం లబ్దిదారులకు భూమి చేతి వరకూ రాలేదు. మిగతా జిల్లాలో ఇది 20 శాతం ఉంది. సర్వే ప్రకారం 14.36 శాతం లబ్దిదారులకు భూమి చేతి వరకూ రాలేదు. దాని ద్వారా రైతులు ఆ భూమిని తమ పేరు మీద సాగు చేసుకునే వీలు

లేకుండా పోయింది. వీరికి అరకొరగా వస్తున్న సబ్సిడీని వాడుకోలేకుండా పోతున్నారు.

	పాస్ బుక్ పొందిన వారు (సంఖ్య)			పాస్ బుక్ పొందినవారు (శాతం)	
జిల్లా	ఇచ్చినవి	ఇవ్వనివి		ఇచ్చినవి	ఇవ్వనివి
ఆదిలాబాద్	93	6	99	93.94	6.06
ఖమ్మం	21	15	36	58.33	41.67
మహబూబ్‌నగర్	91	19	110	82.73	17.27
మెదక్	153	16	169	90.53	9.47
నల్గొండ	95	28	123	77.24	27.26
రంగారెడ్డి	19	11	30	63.33	36.67
వరంగల్	127	15	142	89.44	10.56
మొత్తం 599	110	709			

భూమి కేటాయించిన తరువాత కూడా చాలామంది పాస్ బుక్కులు పొందలేక పోయారు. దీని ద్వారా వారు బ్యాంకుల నుంచి లోన్‌లు పొందలేకపోతున్నారు. ఖమ్మం 41.67 శాతం రంగారెడ్డి 67 శాతం జిల్లాల్లో ఇది ఎక్కువగా ఉంది.

గ్రామం దళితులకు పనికిరాని ఆ బీడు భూములపై హక్కు కల్పించారు. అసలు ఏ మాత్రం భూమి లేకుండా ఉన్నవారికి తరాలుగా వారి కల్లాలలో పరిగే ఏరుకొని బతికే వారికి ఉదారంగా భూములిచ్చానని భావించాడు. భూమి పట్టాలు పొందిన వారు ఏ ఇతర ప్రభుత్వ సదుపాయాలు ఒక్కటీ పొందలేకపోయినా భూమి పట్టా ఏదో దొరికింది చాలూ. అంతో ఇంతో విలువ భవిష్యత్‌లో రాకపోతుందానని నిధానంగా ఉన్నారు. పౌరహక్కుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రంజిత్, సమాచార హక్కు చట్టం కింద సమాచారం సేకరించి 2016 నవంబర్‌లో అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఎంఆర్ఓ, ఆర్‌డిఓ, కలెక్టర్, ఏ అధికారీ చర్యలు తీసుకోలేదు. పట్టువదలని ప్రయత్నం కారణంగా భూమి కొనుగోలుపై విచారణ చేపట్టిన అధికారులు కంటితుడుపు విచారణ జరిపినారు కానీ ఈనాటికీ ఏ చర్య కూడా తీసుకోలేదు. అగ్రకుల భూస్వామ్య వర్గం గ్రామంలోకి పెత్తందార్లుగా, రాజకీయ పార్టీలకు వారదులుగా, అధికారులకు నమ్మిన వారిగా ఉంటుంటారు. సాధారణంగా అధికార వర్గం అగ్రకులాలకు చెందినవారో లేదా అగ్రకుల స్వభావంతో ఉండే వారే ఉంటారు. కనుక ఇలాంటి మోసాలలో భాగంగానే ఉంటారు కనుక ఎట్టి పరిస్థితులలో చర్య తీసుకోరు. ఒకవేళ అవినీతిని బయటపెట్టాలనే గట్టి ఉద్దేశంతో పని చేసినాసరే వారికి బెదిరింపులు, రకరకాల ఒత్తిడి ఉంటుంది. వాటిని భరించి నిలబడ్డా సరే న్యాయ స్థానాలకు బదిలీ చేయబడే ఇలాంటి సమస్యలు రూపం, సారం పక్కకు మార్చుకొని భూ వివాదాల కింద నమోదౌతాయి. మేము ఏదైనా చేయగలం అనే వారికి వ్యతిరేకంగా ఇటువంటి వివాదాలు నమోదు కావడం ఆహ్వానించాల్సిందే. కానీ ఈ దేశంలో ఏ భూ వివాదంలో పెద్ద పోరాటం లేకుండా బాధితులు న్యాయమైన ఫలితం సాధించారు?

తెలంగాణలో కేవలం 7,404 కుటుంబాలకు మాత్రమే 5 ఎకరాలకు పైగా 41,799 కుటుంబాలకు 2.5–5 ఎకరాల భూమి ఉంది. 1,67,942 మందికి 2.5 ఎకరాల లోపు భూమి ఉంది. 2,40,806 కుటుంబాలకు ఎకరం లోపు, 3 లక్షల కుటుంబాలకు అసలే భూమి లేదు." (ఎస్‌సిఆర్‌పి) 2016. వీరందరికీ సగటున 3 ఎకరాల చొప్పున భూమి ఇవ్వాలంటే ఇంకా 16 లక్షల ఎకరాల భూమి అవసరం ఉంటుంది. వీరికి ప్రభుత్వం ఎప్పుడు భూమి ఇస్తుంది.? ఎక్కడి నుండి సేకరిస్తారు? అనే ప్రశ్నలకు జవాబులేదు. ఊరుమ్మడి లేదా పంపకానికి యోగ్యత కలిగి భూమిలేదని చూపడానికి ప్రభుత్వాధికారులు అనేక తప్పుడు వాదనలు చెస్తారు. కానీ అందుబాటులో ఉన్న భూములను మాత్రం పంచడానికి అనేక చిక్కుముడులు అడ్డుపడతాయనేందుకు గద్వాల జిల్లా అలంపూర్ మండలంలోని ధర్మవరం గ్రామంలో దళితులు చేస్తున్న భూపోరాటం పట్ల ప్రభుత్వ వైఖరి ఉదాహరణగా చూడవచ్చు.

ధర్మవరం; గ్రామంలో గత 70 సంవత్సరాలుగా ఊరుమ్మడి భుమి 112 ఎకరాల 7 మంది రెడ్డి కులస్తుల చేతిలో ఉంది. సాగుయోగ్యమైన సారవంతమైన ఈ భూమి బీడుగానే ఉంటుంది. దీనిని భూమిలేని దళిత, పేదలకు పంచాలనీ తెలంగాణ రైతాంగ సమితి నాయకత్వంలో రైతాంగం అధికారులకు ఎన్ని అర్జీలు పెట్టుకున్న జిల్లా కలెక్టర్ నుండి ఎంఆర్ఓ వరకు పైపై మాటలతో కాలం వెళ్లదీస్తున్నారు తప్ప భూమి పంపకం దిశగా ఎటువంటి ప్రయత్నం సాగడంలేదు. కారణం ఆ భూమి ఆధిపత్య రాజకీయార్థిక శక్తుల చేతిలో ఉండడం, భూమి పొందడానికి పేదలకున్న హక్కును అధికారగణం నిరాకరించడమే. పేదలు తమకున్న సంఘటిత శక్తితోని అనేక ప్రదర్శనలు, ధర్నాలు చేసి అలిసిపోయి చివరికి భూమిపై సాగుకు దిగడంతో పోలీసులు, అధికారులు రంగ ప్రవేశం చేసి ప్రజలను కేసులు పెడతామని తీవ్రంగా హెచ్చరించారు.

కాన్పూర్; మంచిర్యాల జిల్లా జైపూర్ మండలంలో కాన్పూర్ 4000 జనాభా గల అన్నీ కులాలు నివసించే పెద్ద గ్రామం. 35 సంవత్సరాల క్రితం గ్రామంలో కలరా సోకి చాలా మంది చనిపోవడంతో ప్రజలు ఆ గ్రామాన్ని వదిలి సమీపంలోనే వేరే వైపు వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకొని నివసిస్తున్నారు. తమ పూర్వ నివాసంలోని విశాదనుభవం వల్ల కొంత కాలందాకా ప్రజలు తిరిగి ఆ గ్రామం వైపు చూడలేదు. కొన్ని సంవత్సరాలు గడిచాక తిరిగి రైతాంగం తమ భూములలోకి వెళ్లాలనీ అనుకొన్నారు. కాన్పూర్ చెరువు, దాని కింద ఉన్న భూములను సాగు చేసుకోవడానికి అనుమతిలేదని అటవి శాఖ అధికారులు పోలీసుల సహాయంతో భూమిపైకి దిగారు. ఈ భూములు తమవేనని రైతాంగం చేసిన వాదనలు పట్టించుకోని అధికారులు దళితులను ఇతర పేద రైతాంగాన్ని తీవ్రంగా వేధించారు. నిజాం కాలం నుండి ఇప్పటిదాకా భూమి కాస్తుదారులుగా, యజమాన్యం హక్కులు ఉన్న వివిధ ప్రభుత్వ రికార్డులను మొత్తం నిర్దిష్టంగా జిల్లా కలెక్టర్‌తో అన్నీ స్థాయి అధికారులకు రైతాంగం నివేదించారు. ఊరు రైతాంగం అనేక ప్రజాస్వామిక రూపాలలో అనేక ఉద్యమాలు చేసినారు. వారికి తాత తండ్రుల నుండి సంక్రమించి చట్టబద్ధమైన హక్కు కూడా ఉన్న భూమిపై ఉన్న హక్కును తెలంగాణ ప్రభుత్వం నిరాకరించడాన్ని వ్యతిరేకిస్తూ రైతాంగం భూమిపైకి ఉమ్మడిగా సాగుకు దిగినారు. 2007 వర్షా కాలంలో పంటకూడా వేశారు. రైతాంగం చూపిస్తున్న చారిత్రక, చట్టబద్ధ ఆధారాలకు గానీ జవాబు చెప్పలేని స్థితిలో ఉన్న అధికార యంత్రాంగం 40 మంది రైతులపై భూ ఆక్రమణ కేసు నమోదు చేసి జైలుకు పంపారు. నేటికీ అనేక వేధింపుల మధ్యనే రైతాంగం తమకు భూమిపైగల న్యాయమైన హక్కుకోసం పోరాటం చెస్తూనే ఉన్నారు. ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చరు, చట్టాలను

అమలు చేయరు, ఉన్న హక్కులనూ నిరాకరిస్తారు. ఇదేమీ అన్యాయమంటే చిత్రహింసలు, కేసులు, జైళ్లు ఇదీ!.. దళితులకూ భూమిపై హక్కులు కల్పించే పాలకుల విధానం.

70 ఏండ్ల స్వాతంత్ర్యం దళితులకు భూమిపై హక్కు ఎందుకు నిరాకరిస్తుంది. వర్గానికీ, కులానికీ ఉన్న సంబంధాన్ని అర్థం చేసుకోవాలంటే భారతీయ సమాజంలో రెండు అధికార శ్రేణులు కొనసాగుతున్నాయనే విషయాన్ని గ్రహించాలి. అందులో ఒకటి బ్రాహ్మణులు అత్యున్నత స్థాయిలోనూ 'అస్పృశ్యులు అట్టడుగు స్థాయిలోనూ ఉన్నది కాగా-రాజకీయ, ఆర్థిక హోదా కలిగిన భూస్వాములు అత్యున్నత స్థానంలోనూ, భూమిలేని నిరుపేదలు అట్టడుగు స్థాయిలోనూ ఉన్న శ్రేణి మరొకటి. (పేజీ నెం 28, ఉమా చక్రవర్తి, 2017)

50వ దశకంలో మాదిగలు షమీర్‌పేటలో చాలా అడుగున ఉన్న కులస్థులు. ఆర్థికంగా వీరు అందరికంటే పేదవారు మాలలు, మాదిగల కంటె కొద్దిగా ఉన్నతులు, మాలలు స్వంత పొలాలు సాగుచేసుకొంటూనో లేదా రోజుకూలికి రైతు కూలీలుగానో పని చేస్తారు. మాదిగలు గ్రామంలో పెద్ద రైతుల ఇండ్లను అంటిపెట్టుకొని ఉంటారు. భూ స్థితిని బట్టి ఒక్కొక్క రైతు కుటుంబానికి ఒకటి రెండు మాదిగ కుటుంబాలు శాశ్వతంగా అంటిపెట్టుకొని ఉంటాయి. సంవత్సరం పొడవునా జరిగే ప్రతి వ్యవసాయం పనులలోనూ ఆ ఇంటిని అంటిపెట్టుకొని ఉన్న మాదిగ, అతని భార్య, బిడ్డలు తమ రైతు పొలాలలో పనిచేస్తూ ఉంటారు. వీరికి రోజువారీ వేతనాలు ఉండవు. నూర్పిళ్లు అయిపోయిన తరవాత, కళ్లాల దగ్గర యజమానులను వేడుకొంటారు. వారికి ఎంత ధాన్యం కొలవ వలసిందీ సంఘ ఆచారాలు నిర్ణయిస్తాయి. ఇది రైతు సాగుచేసే భూమి విస్తీర్ణం మీద ఆ సంవత్సరం పండిన పంటమీద ఆధారపడి ఉంటుంది. అంటే కొంత నిర్ణీత విస్తీర్ణానికి కనీసం ఇంత అని ఇవ్వవలసి ఉంటుంది. బాగా పంటలు పండి అధిక దిగుబడి వస్తే, దానికి తగ్గట్టు మాదిగ కుటుంబానికి ఎక్కువ ధాన్యం ఇస్తూ ఉంటారు. గతంలో బాగా నిర్బంధం మీద పనిచేయించుకొనే వారు. మాదిగలు మేం అలాంటి ఎట్టి పనులు చేయమని చెప్పగలిగే స్థితిలో లేనందువల్ల నిరంకుశమయిన యజమానులకు బానిసలుగా ఉండవలసివచ్చేది. యజమాని మంచివాడు, దయగలవాడు అయితే తమ అదృష్టమని భావించేవారు. యజమాని చెడ్డవాడయినా వారు అనునయించడమే మంచిది. అతడు చెప్పినపని చేయమని ఎదురు తిరిగితే, పర్యవసానం గ్రామ బహిష్కరణ. ఈనాడు పరిస్థితులు మారినాయి. అమర్యాదగానూ, అసంబద్ధంగానూ, దురుసుగానూ ప్రవర్తిస్తే మాదిగలు ఇక ఏ మాత్రం సహించరు. జీతాలు చేసిన పనినిబట్టి, కొంతవరకు యజమాని స్వభావాన్ని బట్టి ఉంటాయి. నిదానంగానూ, బద్ధకంగానూ పనిచేసేవారికి చాలా తక్కువ ముదుతుంది. బాగా పనిచేసేవారికి ఎక్కువ వస్తుంది. ఒక మాదిగ చెప్పిన దానిని బట్టి, "మేము కష్టపడి పని చేయకపోతే, మాకెవరు ఇస్తారు? అంతంత మాత్రంగా, అదీ మరీ అసంతృప్తికరంగా చేస్తే, చివరకు మాకు దక్కేది అంతంత మాత్రంగానే ఉంటుంది. కష్టపడి పనిచేయకపోతే అభిమానం ఉంచుకోలేం. యజమాని తిట్లేతిట్లకు తట్టుకోవాలంటే వంటిమీది చర్మం మందమెక్కి ఉండాలె. అట్లా కాకుండా, కష్టపడుతూ, చెమటోడ్చి సంపాదించినామనుకోండి, యజమాని మాపట్ల సవ్యంగా ప్రవర్తించ వలసిందే." మరొకరు ఇట్లా అన్నారు. 'కొంతమంది యజమానులు విశాల హృదయులు. మా చేత కష్టపడి పనిచేయిస్తారు. దానికి తగ్గట్టు మాకు పోషణ చేస్తారు. ఇతరులు మమ్మల్ని ఎద్దులవలె పనిచేయమంటారు. పెట్టడం వచ్చేటప్పటికి, లేగదూడలకు మాదిరి గుప్పిళ్లతో కుమ్మరిస్తారు. ఎప్పుడూ శాపనార్థాలు పెడతారు, సణుగుతారు, మాకు జీతం ఇవ్వవలసి వచ్చేటప్పటికీ, మా కడుపులు నింపవలెనని, మా వంటికి కప్పుకోవడానికి ఒక్క గజం గుడ్డయినా కావలె అనే విషయం వారు పూర్తిగా మరిచిపోతారనుకొంటాను. నూర్పిళ్ల సమయంలో యజమాని దయాదాక్షిణ్యాలమీద వచ్చే సంపాదన కాక, ముమ్మరంగా వ్యవసాయ పనులు ఉన్న తరుణంలో యజమాని రోజుకొకపూట వీరికి తిండిపెడతాడు. సంప్రదాయం ప్రకారం, ఏ యజమాని పొలాలలో అయితే మాదిగ కుటుంబం పనిచేస్తుందో వారికి ఏటా కొత్త బట్టలను ఇవ్వవలె.

మాదిగలలో చెప్పుకోదగినంత పొలం ఉన్న వారు తక్కువమంది. ఎవరి వ్యవసాయం వారు చేసుకొనేవారు లేరనే చెప్పుకోవచ్చు. అయితే, జీవనోపాధిని సంపాదించుకొనే మార్గాలు అదనంగా కూడా ఉన్నాయి. గ్రామంలో మృత పశువులను వీరు తొలగించవలె. మృత పశువుల నుంచి తీసే చర్మంలో సగభాగం ఇతనికీ, మిగిలిన సగభాగం యజమానికీ దక్కుతుంది. యజమానికి చెందిన సగ భాగం చర్మం నుంచి, వ్యవసాయానికి అవసరమయిన తోలు పనిముట్లు అతని గృహాన్ని అంటిపెట్టుకొనే మాదిగ కుటుంబం తయారుచేసి ఇవ్వవలసి ఉంది. అనేక మాదిగ కుటుంబాలు చర్మం పరిశుభ్రపరిచి చర్మకారక కృత్యాలు చేస్తాయి. ఇతరులు ఉత్సవాలలో డప్పులు వాయించి జీవనం చేస్తారు."(భారతీయ గ్రామం. మాదిగలు. పేజీనెం69,70) దళితుల పరిస్థితిలో పెద్దగా మార్పు రాలేదనీ అర్థం అవుతుంది.

ఈ నాటికి భూమి 50 శాతానికి పైగా అగ్రకులాల చేతిలో ఉంది. ప్రభుత్వాలు ఉన్నత కులాలలోని సంపన్న వర్గ ప్రయోజనాలకే పెద్ద పీట వేస్తాయి. 1950 దశకంలో వ్యవసాయాన్ని, పరిశ్రమలను అభివృద్ధి చేయడమే ప్రభుత్వం ప్రాధాన్యతగా ఎంచుకున్నది. "భూస్వామ్య కులాలు వ్యవసాయాన్ని ఆధునీకరిస్తూ వచ్చిన అవకాశాలను వారే హస్తగతం చేసుకున్నారు. నూతన పద్ధతులు, సులభమైన బ్యాంక్ రుణాలు, యాంత్రీకరణ, మిగతా వసతులను తమవైపు మలుపుకున్నారు. దానితో పాటు ప్రభుత్వరంగ విస్తరణలో భాగంగా ఉత్పన్నమైన ఉద్యోగాలు ఎదిగిన కులాలకు దక్కినవి, భూమిపై ఉన్న కుల ఆధిపత్యం ఆర్థిక వెసులుబాట్లను కల్పించడంతో రాజకీయాధిపత్యాన్ని వారే సాధించడం జరిగింది" (కులం నీడలో అభివృద్ధి రాజకీయాలు, పేజీ నెం: 4,5. బాలబోయిన సింహాద్రి, 2008, బలహీన వర్గాల సాధికారత వేదిక, హైద్రాబాద్)

ఉద్యోగ, రాజకీయ, ఎక్సైజ్, ఆర్థిక రంగంలో సాధించిన ఆధిపత్యం నూతనంగా వస్తున్న పరిశ్రమలవైపు మళ్లడం ద్వారా పారిశ్రామిక వ్యాపార, సినిమా రంగాలలో తిరుగులేని శక్తిగా ఎదిగినారు. భూస్వామ్య కులాల ఎదుగుదల యాదృచ్ఛికమైనదేమీ కాదు. భూమిపై పునాది స్థాయిలో ప్రజలు చేసిన వీరోచిత ప్రతిఘటన భూస్వామ్య కులాలను గ్రామ పునాది నుండి బయటకు కదిలించింది. తెలంగాణ సాయుధ పోరాటం, ఆ తర్వాత ఇక్కడ సాగిన భూస్వామ్య వ్యతిరేక పోరాటాలు వాటి ప్రతిఫలాలు చూడవచ్చు. 1990ల తర్వాత ప్రపంచీకరణ పర్యవసానాలు మొదలైనాక తిరిగి అగ్రకుల భూస్వామ్యానికి భూమిపై మక్కువ పెరిగింది. అప్పటికే దళితులు భూమిపై పట్టా నిలుపుకునేందుకు పెనుగులాడుతూనే వారికి చెందాల్సిన హక్కు కోసం పోరాడుతున్నారు.

రెండవ వైపు నుండి రాజ్యం భూ ఆక్రమణలకు ప్రయత్నం చేయడం ప్రారంభం అయ్యింది. 1940 దశకంలో ప్రపంచ వ్యాప్తంగా ముందుకు వచ్చిన సంక్షేమ రాజ్యం అనే భావన క్రమంగా మారుతూ వచ్చింది. 1990 నాటి వరకు రాజ్యం భూ సంస్కరణల మాట మాట్లాడడం అందుకు ఎంత లోపభూయిష్టమైనవైనా సరే చట్టాలు చేయడం కనిపిస్తుంది. కొంత భూమి పంపకం కూడా చేసినట్టు గమనించవచ్చు. తర్వాత వచ్చిన మార్పులలో రాజ్యం భూమిపై పట్టు సాధించడం గమనించవచ్చు. ముఖ్యంగా దళితుల భూమి పరాయీకరణ క్రమాన్ని మనం పరిశీలిస్తే 1990కి పూర్వం దళితుల భూములు ప్రయివేటు వ్యక్తులు, భూస్వాములు, పెత్తందార్లు, దళితేతర కులాల వారి ఆధీనంలోకి వెళ్లినట్టు అనేక ఉదంతాలు కనిపిస్తాయి. సామ్రాజ్యవాద ప్రపంచీకరణ దశలో దళితులు, పేదల భూములపై ప్రైవేటు వ్యక్తులు రాజ్యం వేరువేరుగానూ కలిసి ఆక్రమణకు పూనుకుంటాయి. ఈ రెండింటి మధ్య ఏదో విడదీయరాని సంబంధం వారి ఐక్యతను కాపాడుతున్నది. కనుకనే ఎన్ని చట్టాలను ఉల్లంఘించిన దళితేతరులకు కూడా ఎలాంటి శిక్షలు, ఇబ్బంది లేకుండా దళితుల భూములను ఆక్రమించు కోగల్గుతున్నారు. అనుభవించ గలుగుతున్నారు.

అసైన్‌మెంట్ భూముల (బదాలాయింపు నిషేధ) చట్టం 19/77 ప్రకారం లక్షలాది ఎకరాల భూమి తిరిగి స్వాధీనం చేసుకొని పేద దళితులకు ఇవ్వాలి. ప్రభుత్వం ఇచ్చిన భూమిని కూడా నిలబెట్టుకోలేని నిస్సహాయ స్థితికి కారణమవుతున్న సామాజిక, ఆర్థిక మూలాలను లోతుగా పరిశీలించి పరిష్కారాలు చూపించకుండా నిందించి ప్రయోజనం లేదు. భూమిని అనుభవిస్తున్న వారు ఏ దళితేతర కులాలైనా సరే లేదా లబ్దిదారుడు కాని దళితుడైనా సరే చట్ట విరుద్ధంగా అనుభవించడం సాధ్యం కాని పరిస్థితులు కల్పించబడాలి.

గ్రామాలలోని సగటు పేదల పరిస్థితి ఎంతో దయనీయంగా ఉంటుంది. అందునా దళిత కులాల పేదల పరిస్థితి అధ్వాన్నంగా ఉంటుంది. ఈ క్రమంలో విద్య, వైద్యం కుటుంబ భారం, వ్యవసాయ పెట్టుబడి మొదలగు వాటిని నిబాయించుకొని వ్యవసాయాన్ని నిలబెట్టుకోవడం చాలా కష్టం. రెక్కాడితే డొక్కాడని కులాలలోని పేదలకు వ్యవసాయ పెట్టుబడి ఏ బ్యాంకులూ ఇవ్వవు. షావుకార్లు కూడా అంత సులభంగా నమ్మి ఇవ్వరు. పని చేయకుండా పూట గడవని కుటుంబం 6 నెలలు పంటలు చేతికొచ్చే దాకా ఏం తిని బతకగలరు? తమ చుట్టూ ఉన్న స్నేహితులు, బంధువులు కూడా అదే స్థితిలో ఉంటారు. కనుక వారి నుంచి సహాయాన్ని ఆశించడం సాధ్యం కాదు. పైగా ఊరికి, వాడకు మధ్యనున్న సరిహద్దు చెరిపి వేయకూడదని భావించే విభజన రేఖ ఉంటుంది. దళితులు వ్యవసాయం చేసుకొని ఆర్థికంగా స్వయం పోషకంగా ఎదిగితే తమ చేను, చెలకలలోకి కూలీలు ఎవరొస్తారని భావించే భూస్వామ్య లక్షణం ధనిక, మధ్య తరగతి రైతాంగంలో ఉంటుంది. కనుక దళితులు వ్యవసాయంలో నిలదొక్కుకోవడానికి సహాయం చేయరు. తగిన ఆదాయం లేక దళితులు, భూములు ఇతరులకు కౌలుకు ఇవ్వడం గమనించవచ్చు. చాలా సందర్భాల్లో కౌలుకు తీసుకున్న వ్యక్తి అవసరాలకు అప్పు ఇవ్వడం ద్వారానో లేదా మరే ఇతర రూపంలోనో భూమిని శాశ్వతంగా సొంతం చేసుకుంటారు. దళితుల్లో నిరక్షరాస్యత శాతం కూడా అధికమే. ఇది తెలంగాణాలోని కర్ణాలకు, పట్వారీలకు దోచుకోవడానికి అవకాశం కల్పించింది. అక్కడక్కడ ఏ కొద్ది మంది భూములు పట్టా చేయించుకునే స్పృహ కలిగి ఉన్నా వారి కుటుంబ వారసులు తర్వాత ఆ కాగితాలను భద్రపరచకపోవడం, రెన్యువల్ చేయించుకోకపోవడం జరిగింది. మరికొన్ని ఉదాహరణలు గమనిస్తే ఎలాంటి పరిహారం లేకుండానే భయానికి తమ భూములను దొరలకు, గ్రామ పెత్తందార్లకు దారాధత్తం చేసిన సంఘటనలున్నాయి. చాలా చోట్ల బిడ్డల పెళ్లిల్లకు భూములు అమ్ముకోవడం, తనఖా పెట్టడం సర్వసాధారణంగా కనిపిస్తుంది. దళితుల భూ పరాయీకరణ క్రమాన్ని పరిశీలిస్తే ప్రభుత్వాలు పంచిన భూములు కూడా వారి చేతుల్లో లేవనేది ప్రభుత్వ గణాంకాలే స్పష్టం చేస్తున్నాయి.

రాజ్యమే దళితుల భూములను ఆక్రమించడం ద్వారా దళితుల భూ పరాయీకరణ వేగం అయితుంది. వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల పేరా చట్ట ప్రకారంగానే వ్యవహరిస్తామంటూ రాజ్యం పేదల భూములనే లక్ష్యంగా చేసుకుంటుంది. ప్రభుత్వం మంజూరు చేసిన భూములు ఉన్న చోట ఎటువంటి ప్రతిఘటన లేకుండానే దళితులు ఇవ్వాల్సిన అనివార్యత ఏర్పడుతుంది. ఒకవేళ ప్రతిఘటించాలన్నా వారికి ఆర్థిక శక్తి, సామాజిక తోడ్పాటు తక్కువగా ఉంటుంది. చట్టం ప్రకారంగా అసైన్డ్ భూములు ప్రభుత్వం పరిహారం లేకుండా తీసుకోవచ్చని ప్రభుత్వ అధికారులు బెదిరిస్తారు. కనుక ఎంతో కొంత ఇచ్చింది చాలని భూమిని తిరిగి ప్రభుత్వానికి స్వాధీనం చేయడం చాలా సాధారణ విషయంగా మనకు అనేక చోట్ల కనిపిస్తుంది. ఇలాంటి స్వాధీన వ్యవహారాలు చూసే దాని కోసం ఎపిఐఐసి అనే సంస్థ (ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) ఏర్పాటు చేయబడింది. దీనిని సులభతరంగా చెప్పాలంటే రాజ్యం తరపున భూ స్వాధీన వ్యవహారాలు చూసే నిర్దయ కలిగిన కండబలమైన నిర్మాణంగా చెప్పవచ్చు. కొత్త రాష్ట్రంలో ఇప్పుడు ఇలాంటి వ్యవహారాలన్నీ టిఐఐసి(తెలంగాణ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్) చూస్తుంది. ఎపిఐఐసి గతంలో అపరిమితంగా 4,93,700 ఎకరాల భూములను సేకరించింది. ఈ భూములలో ఎస్‌సి, ఎస్‌టిల భూములు, అసైన్డ్ భూములు అధికంగా ఉన్నాయనేదీ స్పష్టమే. ఎస్‌సి, ఎస్‌టిల భూమి అసైన్డ్ భూమి వైపు మొదటగా రావడానికి వీరి నుండి బలమైన ప్రతిఘటనకు ఆస్కారం ఉండదని ప్రభుత్వం భావించడమే ప్రధాన కారణంతోపాటు సులభంగా భూములు తీసుకోవచ్చనే అభిప్రాయం కూడా ఉంది.

పారిశ్రామిక మౌలిక సదుపాయాల కల్పన శాఖ వారు దళితుల అసైన్డ్ భూములు బెదిరించి మార్కెట్ విలువ కన్నా 50 నుంచి 70 రెట్లు అధిక ధరలకు అమ్ముకుంటుంది. కనీసం ప్రైవేటు సంస్థలు, లేదా వ్యక్తులపై ఫిర్యాదు చేయవచ్చు కానీ బాధితులు రాజ్యంపై ఫిర్యాదు చేయడం అంత సులభమా?

మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల పట్టణ సమీపంలో గల పోలేపల్లి సెజ్ ఏర్పాటు కోసం చేపట్టిన భూ సేకరణ క్రమాన్ని పరిశీలిస్తే రాజ్యమే భూ ఆక్రమణకు పూనుకుంటే బాధితులు ఎలా నిస్సహాయులు కాగలరో కండ్లకు కనిపించే సత్యంగా చరిత్రలో నిలిచిపోయింది.

హెటిరో డ్రగ్స్, అరబిందో ఫార్మా కంపెనీలకు పోలేపల్లి సెజ్ కింద 1100 ఎకరాలు 2006లో ప్రభుత్వం భూమి కేటాయించింది. స్థానిక టిఆర్ఎస్ ఎంఎల్ఏ డాక్టర్ లక్ష్మారెడ్డితో పాటు రియల్ ఎస్టేట్ వ్యాపారులంతా ఆ గ్రామ భూములపై దృష్టి సారించారు. ప్రజలు తమ భూములు ఇవ్వమని తిరగబడి సెజ్ నిర్మాణ పనులను అడ్డుకొని

బోర్‌వెల్స్‌ను, ట్రాక్టర్లను ధ్వంసం చేశారు. క్రమంగా గ్రామంలోని వివిధ కులాల మధ్య చీలిక తెచ్చిన ప్రభుత్వం అగ్రకుల రైతులను లోబర్చు కున్నారు. దళితులు, ఇతర పేదల భూములను బలవంతంగా గుంజు కున్నారు. అసైన్డ్ భూములకు చెల్లించింది 8 వేల నుంచి 20 వేల వరకు మాత్రమే. అవే భూములను తిరిగి కంపెనీలకు 40 నుంచి 50 లక్షల రూపాయల వరకు విక్రయించారని" పోలేపల్లి ప్రజలు వాపోతున్నారు. ఈ క్రమంలో గ్రామంలో 2006 నుండి సెజ్ వ్యతిరేక పోరాటం మొదలైన నాటి నుండి 2012 నాటికి 34 మంది చనిపోయారు. వీరిలో '12 మంది ఆత్మహత్య చేసుకోగా 22 మంది ఒత్తిడి తట్టుకోలేక గుండెపోటుతో మృతి చెందారు. 2005 సెజ్ చట్టం ప్రకారం ప్రకటించిన లక్ష్యం ప్రకారంగా భూమి వినియోగంలో లేకపోతే దానిని తిరిగి స్వాధీనం చేసుకునే అధికారం ప్రభుత్వానికుంటుంది. కేవలం 200 ఎకరాలు మాత్రమే భూమిని ఫార్మా కంపెనీలు వినియోగిస్తున్నాయి. మిగిలిన భూమి అర్హులైన భూమిని సర్వాన్ని కోల్పోయిన దళిత గిరిజనులకు ఇవ్వాలని చట్టాలు చెబుతున్నాయి. అయినా వారికి భూమి దక్కదు. చట్టాన్ని ఉల్లంఘిస్తూ వేయి ఎకరాలు కలిగిన కంపెనీల భూస్వామ్యాన్ని ప్రశ్నించే స్థితి లేకపోవడం కనిపిస్తుంది. జిల్లా కలెక్టర్, పోలీసు అధికారులు సెజ్ కోసం భూములివ్వమని ప్రతిఘటించిన ప్రజలపై కేసులు బనాయించి, జైళ్లలో నిర్బంధించారు. పోలేపల్లి గ్రామ ఉప సర్పంచ్ నాగన్నపై కూడా అడ్డు తొలగించుకోవడం కోసం హత్య ప్రయత్నం చేశారు." (శ్రీశైలం, పోలేపల్లి)

ప్రజలు నిత్యం సెజ్ పరిసరాలలోని వేప చెట్టు కింద కూర్చునే వారు. అది వారి గ్రామీణ జీవితంలో సర్వసాధారణం. కానీ నలుగురు మనుషులు ఒక చోట చేరడం ప్రమాదమని భావించే పెట్టుబడిదారీ వ్యవస్థ చివరికి చెట్టును నరికించింది. నిజానికి కోల్పోయిన మనుషుల ముందు, ఆస్తుల ముందు చెట్టు చాలా చిన్నదే అయినా అమానవీయ మైనదనీ కథా రచయిత గీతాంజలి విశదీకరించారు. చివరికి గ్రామంలో 10 మందికి సెక్యూరిటీ గార్డులుగా ఉద్యోగాలు లభించాయి. 300 కుటుంబాలు వీధిన పడ్డాయి. వీరిలో 70 దళిత కుటుంబాలు దుర్భర దారిద్ర్యాన్ని ఎదుర్కొంటూ హైద్రాబాద్‌కు వలసబాట పట్టాయి. ఇటువంటి అమానుషమైన భూ కుంభకోణాలు అనేకం జరిగినాయి. ప్రతి సందర్భంలోనూ అటవీ ప్రాంతాలలో ఆదివాసులు మైదానంలోనైతే దళితులు ప్రధాన బాధితులుగా ఉంటున్నారు. పాలకులు అభివృద్ధిగా చెపుతున్న ఏ ప్రాజెక్ట్ గానీ ఏ ఇతర భూ సేకరణ ప్రక్రియ ద్వారా గానీ ఎటువంటి ప్రయోజనం పొందలేకపోతున్న దళితులు అడుగడుగున భూమికి దూరంగా నెట్టివేయబడుతున్నారు. ఈ క్రమం తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత కూడా రోజు రోజుకు వేగంగా పెరుగుతుంది.

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ భూ సేకరణ విధానం-దళితులు

ప్రభుత్వం మొదట తేలికగా ఆక్రమణకు దిగేది దళిత భూముల్లోనే అనేది నిస్సందేహమైన సత్యం. గత మూడేళ్లలో 2017 సెప్టెంబర్ 17 నాటికి 5660 మంది దళితులకు 10 వేల 122 ఎకరాల భూమి పంచినట్లు నివేదికలు తెలుపుతున్నాయి. రిజిస్ట్రేషన్లు అయింది కేవలం 4340 ఎకరాలకు మాత్రమే. సాగులోకి వచ్చింది కేవలం 1100 ఎకరాలు మాత్రమే. అసెంబ్లీలో ఈ ఏడాది ప్రభుత్వం 10 వేల ఎకరాలు కొనుగోలు చేస్తున్నట్లు ప్రకటించింది. కాని ఆచరణలోకి రాలేదు. భూ కొనుగోలు, పంపిణీ నాటకంగా జరుగుతుండడం వలన అర్హులైన నిజమైన పేదలకు దక్కని పరిస్థితి సర్వత్రా నెలకొంది. కరీంనగర్ జిల్లా బెజ్జంకి మండలం గూడెం గ్రామంలో రాజకీయ నాయకులు వారి అనుయాయులకే అర్హత లేకున్నా భూ కేటాయింపు చేయడం జరిగింది. అప్పటికే 8 ఎకరాల భూమి గల అదే గ్రామానికి చెందిన బాబు అనే వ్యక్తికి 3 ఎకరాలు కేటాయిస్తూ స్థానిక నాయకులు, ప్రభుత్వాధికారులు నిర్ణయం తీసుకున్నారు. ఈ అర్హత మరికొందరికి అన్యాయం జరిగింది. అధికారులకు, ప్రజా ప్రతినిధులకు మొరపెట్టుకొని చివరికి మనకొండూర్ ఎంఎల్ఏ కార్యాలయం ముందు ఇద్దరు దళిత యువకులు శ్రీనివాస్, పరుశురాములు ఆత్మహత్య ప్రయత్నం చేశారు. పరుశురాములు బతుకు దెరువుకోసం గల్ఫ్‌కు వలసపోయి వచ్చాడు. తెలంగాణ వచ్చింది బతుకు బాగుపడుద్దని ఆశించాడు. తెలంగాణ ఉద్యమానికి వ్యతిరేకంగా ఉన్నవారు "ఇప్పుడు అధికార పార్టీలో చేరి మా తలరాతలు రాస్తున్నారు. అన్ని అర్హతలున్నవారిని వదిలి వారి అనుచరులకు, ఎకరాకు 20 వేలు లంచం ఇచ్చిన వారికి భూ కెటాయింపు చేశారని" బాధితులు ఆరోపిస్తున్నారు. కనీసం జాబితా తయారి ప్రక్రియలో గ్రామ సర్పంచ్‌కు కూడా ఎలాంటి ప్రమేయం లేదని స్వయంగా సర్పంచ్ ప్రతాప్‌రెడ్డి చెప్పారు. మంత్రి హరీష్‌రావు సోదరుడైన స్థానిక జడ్‌పిటిసి శరత్‌రావు కనుసన్నల్లో ఎంఎల్ఏ అధికారులు పనిచేస్తున్నారనేది స్పష్టం.

ఇదీ దళితులకు భూ పంపిణీలో ప్రభుత్వ విధానం, దాని అమలులో ఇమిడి ఉన్న సమస్యలు. అయితే మరోవైపు ఉన్న భూములు ప్రభుత్వం తీసుకునేందుకు 2017 తెలంగాణ భూ సేకరణ పునరావాస చట్టం తీసుకవచ్చింది. రాజ్యాంగ విరుద్ధంగా రూపొందించబడిన చట్టం, దాని ముసాయిదా ఆమోదం ప్రక్రియ ప్రతి మలుపులోనూ అత్యంత అప్రజాస్వామికంగా జరిగింది. చివరికి ఆ చట్టం అమలు బీద, బిక్కి రైతాంగానికి తీవ్ర నష్టంగా మారింది. ప్రభుత్వం వివిధ ప్రాజెక్టులు, అభివృద్ధి పథకాల పేర సేకరిస్తున్న దాదాపు 2 లక్షల ఎకరాల్లో ఉన్నది అత్యధికంగా పీడిత కులాల రైతాంగమే. ప్రధానంగా దళితులు తమకున్న కొన్ని భూమిని కోల్పోతే తిరిగి ప్రభుత్వం చూపించే జీవన ప్రత్యామ్నాయంతో జీవితం సాగించలేరు. ఈ పరిస్థితుల్లో బాధిత రైతాంగం ప్రతిఘటిస్తున్నారు. రైతాంగ సమస్యలను ప్రజాస్వామికంగా పరిష్కరించే తీరులో వ్యవహరించలేని పాలక వర్గం గ్రామ సభల ప్రజాస్వామిక స్ఫూర్తిని దెబ్బతీసింది. బాధిత గ్రామాలలో భూ సేకరణ చేయకుండా జిల్లా, డివిజన్ కేంద్రాలలో ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించడం, వందల వేల మంది పోలీసులను మోహరించడం, భూములివ్వమనే రైతులను గ్రామ సభలోకి రానివ్వకపోవడం. ప్రశ్నించిన బాధితులపై కేసులు బనాయించడం, కొట్టడం, చిత్రహింసలకు గురి చేయడం, చంపుతామని తప్పుడు పద్ధతులు ప్రభుత్వం అవలంబిస్తుంది. ప్రభుత్వమే భూకబ్జా కోరుగా మారి దళిత పీడిత కులాల భూములపై రాబందుగా మారింది. ఈ నేపథ్యంలో ఉన్న భూమిని రక్షించుకోవడం, ప్రభుత్వ వాగ్దానాన్ని అమలు చేసుకోవడం కోసం పీడిత రైతాంగంతో కలిసి దళితులు ప్రతిఘటిస్తున్నారు.

(అయిపోయింది)

(రచయిత తెలంగాణ ప్రజా ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు) వీ

ఆర్‌ఎస్ రావు స్మారక సదస్సు 2017 నివేదిక

ప్రత్యామ్నాయ విద్య గురించి తెలుసుకుందాం

విద్యారంగంలో ప్రత్యామ్నాయాలు - అవగాహన, ఆచరణ అనే అంశంపై ప్రొ. ఆర్.ఎస్. రావు స్మారక సదస్సు 2017 నవంబర్ 12, 2017 ఆదివారం హైదరాబాదులో ఆలోచనాత్మకంగా, ప్రేరణాత్మకంగా జరిగింది.

ప్రఖ్యాత మార్క్సిస్టు రాజకీయార్థిక శాస్త్రవేత్త, అరుదైన ప్రజా మేధావి, అమరుడు ప్రొ. ఆర్.ఎస్. రావు సంస్మరణలో గత ఆరు సంవత్సరాలుగా నిరంతరాయంగా జరుగుతున్న ఈ స్మారక సదస్సు ప్రతి సంవత్సరం కూడ ఆర్.ఎస్. రావు గారు తీవ్రంగా కృషిచేసిన, సమాజం అత్యవసరంగా ఆలోచించవలసిన రాజకీయార్థిక అంశాలలో ఏదో ఒకదానిమీద లోతైన అధ్యయనాన్ని, అన్వేషణను, చర్చను ప్రేరేపించడానికి జరుగుతున్నది. ఉన్న విద్యా విధానం మీద, విద్యావ్యవస్థ మీద ప్రతి ఒక్కరూ విమర్శలు చేస్తారు గాని, అసలు జరగవలసింది దీనిస్థానంలో ఏమి రావలసి ఉన్నదో, ఆ ప్రత్యామ్నాయం ఎలా వస్తుందో, ఎలా అమలవుతుందో చర్చ. ఎప్పుడైనా ఏ విషయం మీదనైనా అది ఎలా ఉందో అనే అంశం మీద కాకుండా, అది ఎలా మారుతున్నదో, ఎలా మారాలో అనే అంశాల మీద చర్చించాలి అని ఆర్.ఎస్. రావు గారు అనేవారు. అందువల్లనే ఈ సంవత్సరపు సదస్సు, ఆర్.ఎస్. రావు గారు ఎంతో ఆలోచించిన, అధ్యయనం చేసిన, రాసిన అంశమైన విద్యారంగంలో ప్రత్యామ్నాయాల గురించి చర్చించింది.

మొదటి సమావేశానికి చిరకాల ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు ఎ నరసింహ రెడ్డి అధ్యక్షత వహించగా, సదస్సుకు హాజరైన వక్తలకు, శ్రోతలకు స్వాగతం పలుకుతూ వీక్షణం సంపాదకుడు ఎన్ వేణుగోపాల్ విద్యా ప్రత్యామ్నాయాల గురించి ఆర్.ఎస్. రావు కృషినీ, ఆయన సంస్మరణలో ప్రస్తుతం జరుగుతున్న సదస్సునూ పరిచయం చేశారు. విద్యారంగంలో ప్రత్యామ్నాయాల గురించి ఎందరో ఎన్నో ఆలోచనలు వెలిబుచ్చారని, వాటిని స్థిరంగా, దీర్ఘకాలికంగా ఆచరణలోకి తెచ్చే ప్రయత్నాలు మాత్రం ఎక్కువ జరగలేదని, అటువంటి ప్రయత్నాలలో కొన్నిటి గురించి ఇక్కడ పత్ర సమర్పణ జరుగుతుందని అన్నారు. పూర్తిగా సామాజిక వ్యవస్థనే మార్చి వేసి, కొత్త వ్యవస్థను నిర్మించే క్రమంలో భాగంగా విద్యారంగంలో కూడ ప్రత్యామ్నాయాలను అన్వేషించిన సోవియట్ యూనియన్, చైనా అనుభవాలు, కొత్త వ్యవస్థ కోసం పోరాడే క్రమంలోనే విద్యారంగంలో ప్రత్యామ్నాయాల కోసం ప్రయోగాలు చేస్తున్న దండకారణ్య జనతన సర్కార్ అనుభవాలు, ఉన్న వ్యవస్థలోనే ప్రత్యామ్నాయ విద్యకు అవకాశాలు ఉన్నాయా, ఉంటే ఎంతవరకు ఆచరణ సాధ్యమవుతాయి అని అన్వేషించిన కిశోర్ భారతి అనుభవాలు, అసలు ప్రజా ఉద్యమ క్రమమే విద్యాబోధనకు ఎలా దారి తీస్తుంది అనే విస్తృత చర్చనీయాంశం వంటి అంశాలు చర్చకు వస్తాయని పరిచయం చేశారు.

మొదట ఈ సమావేశం కోసం తాను తయారుచేసిన ప్రాతిపదిక పత్రాన్ని ప్రవేశపెడుతూ, డా. ముదునూరి భారతి గారు ఉన్న విద్య గురించీ, ప్రత్యామ్నాయాల గురించీ ఆలోచించే ముందు అసలు విద్య ఎందుకు అనే ప్రశ్న దగ్గర ప్రారంభించవలసి ఉంటుందని అన్నారు. మన సమాజంలో సాంప్రదాయికంగా ఉన్న విద్యావిధానాన్ని దాదాపు అలాగే ఉంచుతూనే ఆధునిక విద్యావిధానాన్ని అంటు కట్టడం జరిగిందని, అందువల్ల మన విద్యావ్యవస్థలో ఈ పరస్పర వ్యతిరేకమైన, పోటీ పడే విద్యావిధానాలు రెండూ ఒక్కోసారి విడివిడిగానూ, ఒక్కోసారి కలిసిపోయీ, ఒకదాన్ని ఒకటి వక్రీకరిస్తూ సాగుతూ ఉండడమే విద్యారంగ సంక్షోభానికి ఒక కారణమని అన్నారు. ఈ సంక్షోభం బోధనా భాష (జ్ఞాన వ్యాప్తి సాధనం), నేపథ్యానికి తగిన పాఠ్యాంశాలు, జ్ఞాన సముపార్జనా సంవిధానాలు, సంపాదించిన జ్ఞానానికి వాస్తవికతలో ఆచరణ, అన్వయ సాధ్యత అనే రంగాల్లో వ్యక్తమవుతున్నదని అన్నారు. ఈ సంక్షోభ పరిస్థితిలో ప్రత్యామ్నాయాల గురించి ఏడు రకాల ఆలోచనలు, ఆచరణలు ఉన్నాయని ఆమె అన్నారు. అవి 1. స్థలకాలాలకు తగిన జ్ఞానాన్ని, స్థానిక వాతావరణానికి సంబంధించిన జ్ఞానాన్ని అందించడం (కిశోర్ భారతి). 2. బోధనా మాధ్యమంగా మాతృభాష ఉండడం (రష్యన్ ప్రాథమిక విద్య). 3. సామూహిక కార్యాచరణలో జ్ఞానాన్ని సృష్టించడం. 4. పోరాటక్రమంలో జ్ఞానాన్ని సృష్టించడం. 5. ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాలు విద్యారంగ సంక్షోభాన్ని గుర్తించి, విశ్లేషించడం. 6. విడివిడిగా వ్యక్తులు విద్యారంగ సమస్యలను గుర్తించి విద్యారంగాన్ని రక్షించడానికి ఆలోచనలు చేయడం. 7. పూర్తిగా ప్రత్యామ్నాయ దృక్పథం తీసుకోవడం.

ఆ తర్వాత 'సోవియట్ యూనియన్ లో ప్రత్యామ్నాయ విద్య' అనే వివరమైన పత్రం సమర్పించిన బి ఎస్ రాజు అసలు ప్రత్యామ్నాయ విద్య అంటే ఏమిటి అనే దగ్గర ప్రారంభించి సోవియట్ బోల్షివిక్ విప్లవం ఎలా సమాజాన్ని మార్చే క్రమంలో చరిత్రలో కనీవినీ ఎరగని విద్యా విజ్ఞాన వెల్లువకు ఎలా దారితీసిందో, ప్రత్యామ్నాయ శ్రామిక విద్యావిధానాన్ని ఎలా స్థాపించిందో వివరించారు. ఆ విద్యకు సోవియట్ నాయకులు ఎంచుకున్న తాత్వికతను, ఆ విద్యావిధానపు మౌలిక సూత్రాలను వివరించారు. బోల్షివిక్ విప్లవం విజయం సాధించిన వెంటనే యావత్తు ప్రజానీకాన్నీ విద్యావంతుల్ని చేయడానికి, పాఠశాలలకు పంపించడానికి ఏ ప్రయత్నాలు చేసిందో సమకాలీన అమెరికన్ రచయితలు లూసీ ఎల్ డబ్ల్యు విల్సన్ (న్యూ స్కూల్స్ ఇన్ న్యూ రష్యా), అన్నా లూయీ స్ట్రాంగ్ (ఫస్ట్ టైమ్ ఇన్ హిస్టరీ) పుస్తకాల ఆధారంగా వివరించారు. శిశువిద్యకూ, శిశు సంరక్షణ - శిక్షణ అంశాలకూ, వయోజన విద్యకూ ఇచ్చిన ప్రాధాన్యతను వివరించారు. జార్ పాలనలో ఉద్దేశపూర్వకంగా అవిద్యలో, నిరక్షరాస్యతలో ఉంచిన గ్రామసీమల్లో విద్యా విప్లవం సాధించడానికి సోవియట్ ప్రభుత్వం చేసిన ప్రయత్నాలను వివరించారు. వ్యవసాయ పాఠశాలలు, అగ్రోనోమ్స్, వ్యవసాయ విజ్ఞాన సాహిత్య ప్రచారం, వివిధ జాతులకు విద్య, ముస్లిం జాతులకు విద్య

వంటి విభిన్న రంగాల గురించి వివరాలు అందించారు. సోవియట్ విద్యా విధాన రూపం శ్రోతల మనసుల్లో నాటుకునేలా చేయడానికి ఒక పెద్ద పటం సాయంతో సామాజిక విద్య, వృత్తి విద్య, రాజకీయ విద్య అనే మూడు స్థాయిల నిర్మాణాలు, ప్రయత్నాలు వివరించారు. అలాగే సోవియట్ యూనియన్‌లో ఉన్నత విద్య గురించి, విశ్వవిద్యాలయాల గురించి, విద్యార్థి జీవితం గురించి విస్తృతమైన సమాచారాన్ని అందించారు.

తర్వాత కిశోర్ భారతి ప్రయోగాల గురించి కమల్ మహేంద్రూ మాట్లాడారు. లిఖిత పత్రం ప్రవేశపెట్టకపోయినా తన జ్ఞాపకాల ఆధారంగా, ముప్పై ఐదు సంవత్సరాలకు పైగా విద్యారంగంలో పనిచేస్తున్న అనుభవాల ఆధారంగా శ్రోతలతో ఎన్నో విలువైన విషయాలు పంచుకున్నారు. ప్రత్యామ్నాయ విద్యా శిక్షణ గురించి మేధావులు మకరెంకో, పాలో ఫ్రయరీ ల రచనలతో ప్రేరణ పొందిన తాము ఏదైనా మారుమూల పల్లెటూరిలో వయోజనులకు, చిన్నపిల్లలకు అర్థవంతమైన, ఉపాధికి అవకాశం ఇచ్చే విద్య నేర్పాలనే ఉద్దేశంతో మధ్యప్రదేశ్‌లోని హోషంగాబాద్ జిల్లా పల్లెలకు అనిల్ సద్గోపాల్‌తో కలిసి వెళ్లామని, వయోజనులకు నేర్పే క్రమంలో తాము చాల నేర్చుకున్నామని, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు తమ పరిసర జ్ఞానం అందిస్తూ క్రమక్రమంగా వారి జ్ఞాన పరిధిని పెంచే పాఠ్యపుస్తకాలను తయారు చేశామని, అవి ఒకదశలో రాష్ట్ర వ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలన్నీ వినియోగించు కున్నాయని, కాని విద్యారంగ ప్రయోగాలు విద్యారంగానికి మాత్రమే పరిమితమై విజయం సాధించలేవని, అవి విశాల సామాజిక పరివర్తనలో కూడ భాగం కావాలని నేర్చుకున్నామని అన్నారు.

మధ్యాహ్నం సమావేశానికి చిరకాల ఉపాధ్యాయ ఉద్యమ నాయకులు డా. ఎం గంగాధర్ అధ్యక్షత వహించారు.

సమసమాజంలో విద్య, జనచైనాలో విద్యావిధానం పేరుతో కన్సర్న్‌డ్ ఏషియన్ స్కాలర్స్ 1971లో చేసిన అధ్యయనం ఆధారంగా చైనాలో విద్యా విధానం గురించి బి. రామకృష్ణ మాట్లాడారు. చైనాలో విప్లవానంతరం కూడ విద్యావిధానంలో గణనీయమైన మార్పులు జరగలేదని, అనేక కారణాల వల్ల పాత పద్ధతులే కొనసాగాయని, సాంస్కృతిక విప్లవ కాలంలో మొదటిసారిగా విద్యారంగ మార్పుల గురించి లోతైన ఆలోచనలు తలెత్తాయని, ప్రయోగాలు జరిగాయని అన్నారు. కన్సర్న్‌డ్ ఏషియన్ స్కాలర్స్ చైనా గ్రామసీమల్లోనూ, పట్టణాల్లోనూ పర్యటించి వేరువేరు స్థాయిల విద్యార్థులతో, ఉపాధ్యాయులతో మాట్లాడి చేసిన నిర్ధారణలను, అక్కడి విద్యావిధాన విశిష్టతల గురించి ఇచ్చిన ఉదాహరణలను వివరించారు.

మొదట కిశోర్ భారతిలో, ఆ తర్వాత గత ముప్పై సంవత్సరాలుగా విద్యారంగంలో పనిచేస్తూ, ప్రజా ఉద్యమాలలో భాగంగా విద్య అనే అంశంపై పిఎచ్‌డి సిద్ధాంతపత్రం రాసిన ఢిల్లీ విశ్వవిద్యాలయ విద్యా శాఖ ప్రొఫెసర్ సాధనా సక్సేనా, కిశోర్ భారతి అనుభవాలను, తన సిద్ధాంతపత్రం కోసం చేసిన పరిశోధననూ వివరించారు. తెలంగాణలో ఇరవయో శతాబ్ది తొలి దశకాలలో గ్రంథాలయోద్యమం ద్వారా, కిశోర్ భారతి ద్వారా, నెల్లూరు సారా వ్యతిరేక ఉద్యమం ద్వారా, రాజస్తాన్‌లో మహిళా ఉద్యమం ద్వారా జరిగిన విద్యా వ్యాప్తినీ, ఉద్యమానికీ విద్యా వ్యాప్తికీ ఉన్న సంబంధాన్నీ ఘర్షణనూ ఆమె వివరించారు.

'బాల్యం – విద్య: ఒక ప్రత్యామ్నాయ ప్రయత్నం – దండకారణ్య ఆచరణ' అనే పత్రంలో పాణి విద్యను బాల్యం నుంచి విడదీసి చూడగూడదని, దండకారణ్యంలో బాల్యంలో మనిషిని సామాజికీకరించే పద్ధతుల్లో, ప్రాథమిక విద్యలో అనేక గుణాత్మకమైన ప్రయోగాలు జరుగుతున్నాయని అన్నారు. దండకారణ్యంలో జనతన సర్కార్ నాయకత్వంలో అమలవుతున్న విద్యావిధానాన్ని విద్య ప్రయోజనం, పాఠ్యాంశాలు, బోధనా పద్ధతులు, పరీక్షా విధానం, విద్యార్థి–ఉపాధ్యాయుల సంబంధం అనే ఐదు ప్రాతిపదికల మీద వివరించి విశ్లేషించారు.

విద్యా పరిరక్షణ కమిటీ, ఆల్ ఇండియా ఫోరమ్ ఫర్ రైట్ టు ఎడుకేషన్ నాయకులు, ప్రొ. కె లక్ష్మీనారాయణ, మంచి పుస్తకం నిర్వాహకులు కె. సురేష్ కూడ విద్యారంగంలో ప్రత్యామ్నాయాల గురించి తమ ఆలోచనలు పంచుకున్నారు. దాదాపు వంద మంది ఉపాధ్యాయులు, విద్యార్థులు, ఆలోచనాపరులు హాజరైన ఈ సదస్సులో సమయం సరిపోక పోయినా ఎన్నో ప్రశ్నలు వచ్చాయి, ఉపయుక్తమైన చర్చజరిగింది. వీక్షణం సహాయ సంపాదకులు వై. రామచంద్రం స్వాగతం పలుకగా, ఆర్.ఎస్. రావు మిత్రుల తరఫున రాంకి వందన సమర్పణ చేశారు. వీ

మార్క్సిస్టు వ్యతిరేక చెత్త పుస్తకానికి వీక్షణంలో ప్రశంసలా?

- ఎ. వీరస్వామి

వీక్షణం నవంబర్ 2017 సంచికలో 'అక్టోబర్ విప్లవం తర్వాత పరిణామాలు' అనే వ్యాసం శీర్షిక చూసి ఆసక్తిగా చదవడం మొదలుపెట్టాను. మూడు నాలుగు పేరాలు చదవగానే ఆ ఆసక్తి అంతా సన్నగిల్లి, ఇది వీక్షణమేనా ఏదైనా కమ్యూనిస్టు వ్యతిరేక పత్రికా అని అనుమానం వచ్చి ముందూ వెనుకా చూశాను. వీక్షణంలో ఇంత దుర్మార్గమైన వ్యాసం రావడం చాల విచారంగా ఉంది. ఆ వ్యాసం అక్టోబర్ విప్లవం మీద, ఆ విప్లవ విజయాల మీద కనీస గౌరవం లేని ఒక చెత్త పుస్తక పరిచయం. అమెరికా ప్రభుత్వం, సిఐఎ, పెట్టుబడిదారీ పత్రికలు, కమ్యూనిస్టు వ్యతిరేకులు 1920ల నుంచీ, మాజీ కమ్యూనిస్టులు, స్టాలిన్ వ్యతిరేకులు, జెండా తిప్పేసినవారు 1930ల నుంచీ, సోవియట్ రివిజనిస్టులు, వారి అనుచరులు 1950ల నుంచీ వండివారుస్తున్న బండ్లకొద్దీ దురుద్దేశపూరిత, అసత్య, అర్ధసత్య, విషపూరిత రచనల్లోని అశుద్ధ పదార్థమే ఈ వ్యాసం నిండా ఉంది.

ఈ వ్యాసం 1917 నుంచి 1953 దాకా ఎన్నో ఒడిదుడుకులతో, ఇంటా బయటా కుట్రలనూ దాడులనూ ఎదిరిస్తూ సాగిన సోవియట్ సోషలిజపు పరిణామంలోని విజయాలను, మంచిని, కఠోరదీక్షతో సాగిన ప్రయత్నాలను ఎంతమాత్రం చూడలేకపోయింది. జరిగిన పొరపాట్లను గోరంతలు కొండంతలు చేసి చూసింది. జరగని ఘటనలను జరిగినట్టుగా పచ్చి అబద్ధాలు రాసింది. వాస్తవ ఘటనలను వాటి స్థల కాలాల పరిమితులలో అధ్యయనం చేయాలనే కనీస హేతుబద్ధ, మార్క్సిస్టు దృష్టిని కోల్పోయింది.

ముందే ఆవు వ్యాసం రాసి పెట్టుకుని ఆ తర్వాత ఆవును దొరకబట్టుకుని, దాని చెవులు తన వ్యాసంలో రాసినదానికన్న మూడు మిల్లీమీటర్లు పక్కకు ఉన్నాయి గనుక, తోక ఒక సెంటీమీటరు తక్కువ ఉంది గనుక అది ఆవు కాదు అని తీర్మానించినట్టు ఈ వ్యాసం సాగింది. ఎం నిర్మల్ కుమార్ రాసిన వ్యాసంలోని ఈ లోపాలన్నీ అసలు రంగనాయకమ్మ పుస్తకం లోనే ఉన్నాయి గనుక ఈ పరిచయం అసలు పుస్తకానికి న్యాయం చేసిందనే అనాలి.

చార్లెస్ బెతల్ హామ్ రాసిన క్లాస్ స్ట్రగుల్స్ ఇన్ యుఎస్ఎస్ఆర్ అనే నాలుగు వాల్యూముల, దాదాపు 1,800 పేజీల పుస్తకాన్ని ఓ 350 పేజీల్లోకి కుదించి, తన సొంత పైత్యం ఓ 100 పేజీలు జోడించి 'సోవియట్ రష్యాలో ఏం జరిగింది?' అని రంగనాయకమ్మ రాసిన పుస్తకానికి ఇది పరిచయం. బోల్షివిక్ విప్లవం తమ అధికారాన్నీ, దోపిడీ పీడనలనూ రద్దు చేసిందనే కోపంతో పెట్టుబడిదారులు దాని మీద మొదటినుంచీ దుష్ప్రచారాలు, అబద్ధ ప్రచారాలు సాగిస్తూనే ఉన్నారు. ఆ విప్లవం తాము అనుకున్న పద్ధతిలో జరగలేదని, విప్లవానంతరం తమకు కోరుకున్న ప్రాధాన్యత దక్కలేదని, తాము సరైనవనుకున్న విధానాలు అమలు కాలేదని మార్క్సిస్టులమనే చెప్పుకునే పాత విప్లవకారులు కొందరు ఆ దుష్ప్రచారాలకు వంతపాడారు. వారూ వీరూ కలిసి బోల్షివిక్ ప్రభుత్వం మూడునాళ్లలో కూలిపోతుందని జోస్యాలు చెప్పారు. యుద్ధ కమ్యూనిజాన్నీ, నూతన ఆర్థిక విధానాలనూ, సోవియట్ ప్రభుత్వం చేసిన ప్రతి పనినీ తప్పుడు వ్యాఖ్యానాలతో విమర్శించడమే పనిగా పెట్టుకున్నారు. ఐదున్నర సంవత్సరాలలోనే లెనిన్ మరణించడంతో ఇక తమ జోస్యాలు నిజమవుతాయనుకున్నారు.

లెనిన్ మరణం తర్వాత అధికారం చేపట్టి, సోషలిజాన్ని సుసాధ్యమూ, సుస్థిరమూ చేయడానికి స్టాలిన్ అప్రతిహతంగా ముందుకు సాగుతుంటే, ఆ విధానాల మీద, అమలు మీద మళ్లీ పెద్ద ఎత్తున దుష్ప్రచారానికి లంకించుకున్నారు. ఆ నిందలను, అబద్ధాలను ఎదుర్కొంటూ, ఇంటా బయటా ప్రత్యర్థులను మట్టి కరిపిస్తూ, అత్యంత క్లిష్టమైన పరిస్థితులలో ముప్పై సంవత్సరాల పాటు సోవియట్ యూనియన్‌లో సోషలిజాన్ని పరిరక్షించిన వాడు స్టాలిన్. పెట్టుబడిదారీ పునరుద్ధరణ అవకాశాలను మొగ్గలోనే తుంచేశాడు గనుక పెట్టుబడి దారులకూ, తమ తప్పుడు సిద్ధాంతాల విశ్వసనీయతను వాస్తవాచరణతో పటాపంచలు చేశాడు గనుక మాజీ విప్లవకారులకూ స్టాలిన్ పెద్ద బూచి అయిపోయాడు.

స్టాలిన్ చేసిన పొరపాట్లూ తప్పులూ లేవని కాదు, కాని మూడు దశాబ్దాల సోవియట్ సోషలిజం నిర్మాణ ప్రయోగాలు, పంచవర్ష ప్రణాళికలు, సమష్టి వ్యవసాయం, పారిశ్రామికీకరణ, ప్రజలకు విద్యా వైద్య ఆరోగ్య సౌకర్యాలు, జాతులసమస్య పరిష్కారం, స్త్రీ పురుష సమానత్వం, ప్రపంచమంతా ఆర్థిక సంక్షోభం చుట్టుముట్టినప్పుడు ఆ సంక్షోభం అంటకుండా సోవియట్ యూనియన్ ను కాపాడటం, ఫాసిజం ఓటమి వంటి విజయాలెన్నిటికో స్టాలిన్ నాయకత్వంలోని బోల్షివిక్ పార్టీ కారణం. సరిగ్గా ఆ విజయాల వల్ల స్టాలిన్, సోవియట్ యూనియన్ ప్రపంచానికి ఆదర్శంగా మారతారని, మారకుండా ఉండాలంటే స్టాలిన్ మీద, సోవియట్ మీద దుష్ప్రచారం సాగించి, పెద్ద ఎత్తున ప్రచారం చేయాలని పెట్టుబడిదారులు భావించారు. దానికి కొందరు మార్క్సిస్టులమని చెప్పుకునేవారు సహకరించారు.

ఆ నేపథ్యంలో స్టాలిన్ మీద వాళ్లు రాసిన అబద్ధాల, అర్ధసత్యాల, విష, దుష్ప్రచారాల వ్యాసాలు, పుస్తకాలు పేరిస్తే ఒక కొండ తయారవుతుంది. స్టాలినిజం అనేదాన్ని తిట్టుమాటగా తయారు చేసి, సోషలిజం నిర్మాణం అనే అపూర్వమైన, తొలి ప్రయోగంలో జరిగిన పొరపాట్లన్నిటికీ స్టాలిన్‌ను బాధ్యుడిని చేసి, తన ప్రత్యర్థులను ఊచకోత కోయించిన వాడిగా, హంతకుడిగా, నేరస్తుడిగా, మార్క్సిజం తెలియని వాడిగా, మొరటు మార్క్సిస్టుగా చిత్రించడంలో ఈ రచనలు పెద్ద పాత్ర పోషించాయి.

అయినా స్టాలిన్ మీద ప్రపంచ పీడిత ప్రజల అభిమానం చెక్కుచెదరలేదు. ఇవాళ్టికీ మార్క్సిస్టు మహోపాధ్యాయుల వరుసలో ఆయన నిలిచే ఉన్నాడు. స్టాలిన్‌ను విమర్శనాత్మకంగా పరిశీలించి, ఆయనలో ప్రగతిశీల భాగం ఎంతో, పొరపాట్లు ఏమిటో, ఆ పొరపాట్లు ఏ స్థలకాల

పరిమితుల వల్ల తలెత్తాయో వస్తుగత పరిశీలన చేసిన వారు ఎందరో ఉన్నారు. స్టాలిన్ మీద కమ్యూనిస్టు ముసుగులోనే కృశ్చేవ్ అబద్ధాలూ అవాకులూ చవాకులూ ప్రకటించి, ప్రపంచ పెట్టుబడిదారులకూ కుహనా మార్క్సిస్టులకూ కానుకగా అందించిన సోవియట్ పార్టీ ఇరవయో కాంగ్రెస్ *1956* ఫిబ్రవరిలో జరిగితే, వెంటనే, ఆ ఆగస్టు లోనే స్టాలిన్‌ను మార్క్సిస్టు పద్ధతిలో సరిగా ఎలా అంచనా వేయాలో మావో స్పష్టం చేశాడు.

"....సోవియట్ యూనియన్ లో కొన్ని పొరపాట్లు జరిగాయి గనుక, అవి చాల ఎక్కువగా చర్చలోకి వస్తున్నాయి, అతిశయోక్తులలో చూపబడు తున్నాయి. అటువంటి పొరపాట్లు చాల దారుణమైనవనే అభిప్రాయం వ్యక్తమవుతున్నది. కాని ఈ ధోరణి తప్పుడు ధోరణి. ఏ దేశమైనా ఏ పొరపాట్లూ చేయకుండా ఉండడం అసాధ్యం. అలాగే, సోవియట్ యూనియన్ ప్రపంచంలోనే మొట్టమొదటి సోషలిస్టు దేశం గనుక, సుదీర్ఘమైన అనుభవం ఉంది గనుక, అటువంటి పొరపాట్లు జరగకుండా ఉండే అవకాశం లేదు. మొత్తం వ్యవహారంలో సోవియట్ యూనియన్ పొరపాట్లు, లేదా స్టాలిన్ చేసిన పొరపాట్ల స్థానం ఏమిటి? అవి కేవలం పాక్షికమైనవీ, తాత్కాలికమైనవీ మాత్రమే. వీటిలో కొన్ని ఇరవై ఏళ్లుగా జరుగుతూనే ఉన్నాయని అంటున్నారు గాని, అయినా కూడా అవి తాత్కాలికమైనవే, పాక్షికమైనవే. సవరించడానికి వీలైనవే. సోవియట్ యూనియన్‌లో ప్రధాన ధోరణి, దాని ప్రధానాంశం, అక్కడి ప్రజలలో అత్యధిక సంఖ్యాకులు సరిగానే ఉన్నారు. రష్యా లెనినిజంకు జన్మనిచ్చింది. అక్టోబర్ విప్లవం తర్వాత అది మొట్టమొదటి సోషలిస్టు దేశంగా మారింది. అది సోషలిజాన్ని నిర్మించింది. ఫాసిజాన్ని ఓడించింది. ఒక మహత్తర పారిశ్రామిక దేశంగా మారింది. దాని నుంచి మనం నేర్చుకోవలసిన విషయాలెన్నో ఉన్నాయి. అయితే, మనం దాని నుంచి పురోగామి అంశాలనే అధ్యయనం చేయాలి గాని తిరోగామి అంశాలను కాదు. సోవియట్ యూనియన్ లోని పురోగామి అంశాలనే అధ్యయనం చేయాలనే నినాదం మనం గతం నుంచే ఇస్తున్నాం. మరి తిరోగామి అంశాలను అధ్యయనం చేయమని ఎవరు చెప్పారు? ఏది ఏమైనా రష్యన్ల పిత్తులు కూడ సువాసన వస్తాయని అనేవాళ్లు కొందరున్నారు. అది స్వీయమానసిక ధోరణి. తమ పిత్తులు కంపు వాసన కొడతాయని రష్యన్లు కూడ అంగీకరిస్తారు! అంటే, మనం విషయాలను విశ్లేషించాలి. స్టాలిన్ గురించి గతంలో మనం అనుకున్నట్టుగానే, ఆయనలో మూడు పాళ్లు చెడు, ఏడు పాళ్లు మంచి ఉన్నాయి" అని మావో అన్నాడు.

స్టాలిన్‌ను కూడ విమర్శించవచ్చుననీ, కాని ఆ విమర్శ ఎందుకోసమో తెలిసి చేయాలని అన్నాడు. లెనిన్, స్టాలిన్ అనే రెండు శ్రామికవర్గ కరవాలాలలో ఒకటైన స్టాలిన్ అనే కరవాలాన్ని సోవియట్ కమ్యూనిస్టు పార్టీ వదిలేసిందనీ, దాన్ని రివిజనిస్టులు, హంగరీలో గొముల్కా, యూరప్ లో టోగ్లియాటి నాయకత్వాన్ని అంగీకరించే కమ్యూనిస్టు పార్టీలు, చివరికి డల్లెస్ వంటి సామ్రాజ్యవాదులు చేపట్టి స్టాలినిజం అనే పేరుతో మార్క్సిజం మీద దాడి చేస్తున్నారని అన్నాడు. "చైనీయులుగా మనం ఆ స్టాలిన్ అనే కరవాలాన్ని వదిలేయలేదు. మన మొట్టమొదటి సూత్రం స్టాలిన్ ను సమర్థించడం. రెండవ సూత్రం స్టాలిన్ చేసిన పొరపాట్లను విమర్శించడం..." అన్నాడు.

చార్లెస్ బెతల్ హేం చేసిన పని అది కాదు. ఆయన తన పుస్తక శీర్షికలో వర్గపోరాటాలు అనే ఆదర్శవంతమైన పేరు పెట్టుకున్నప్పటికీ, చేసిన పని వర్గపోరాటాలను అధ్యయనం చేయడం కాదు. చరిత్రలోనే మొదటిసారిగా జరిగిన ఒక గొప్ప సోషలిస్టు నిర్మాణ ప్రయత్నాన్ని దాని స్థల కాలాల నుంచి విడదీసి తన స్వీయాత్మక దృష్టితో, ఉదారవాద దృష్టితో పరిశీలించడం. ఎంత పరిశోధన అయినా చేసి ఉండవచ్చు, ఎంత సమాచారమైనా సేకరించి ఉండవచ్చు గాని, అసలు దృక్పథం లోనే స్పష్టత లేనప్పుడు దొరికిన సమాచారమంతా, చేసిన పరిశోధనంతా తన అభిప్రాయాల పాత్రలలోకి నింపడమే జరుగుతుంది. స్టాలిన్ మీద దాడి జరుగుతున్న నేపథ్యంలో, ఆ దుష్ప్రచారాల ప్రభావంలో సాగిన పరిశోధన, రచన అది.

అటువంటి చార్లెస్ బెతల్ హేం ను రంగనాయకమ్మ "మార్క్సిజం నుంచి ఏ మాత్రమూ పక్క అడుగులు వేయని వ్యక్తి" అని ప్రశంసిస్తున్నారు. మార్క్సిజంలోని మౌలికాంశాలను తిరస్కరిస్తూనే, ఆచరణను దుమ్మెత్తిపోస్తూనే తనను తాను మార్క్సిస్టునని చెప్పుకునే రంగనాయకమ్మ చార్లెస్ బెతల్ హేం కు "మార్క్సిస్టు" అని కితాబు ఇవ్వడం సరిగ్గా సరిపోయింది. ఆయన ఎటువంటి మార్క్సిస్టో, ఆయన ఎన్ని తప్పుడు భావనలు ప్రకటించాడో, మార్క్స్ లెనిన్ ల భావనలు ఎన్నిటిని వక్రీకరించి మార్క్సిజంగా చలామణీ చేసి అమాయకులను తప్పుదారి పట్టించాడో ఫ్రెంచి రచయిత్రి క్లాడ్ వార్లె *1978*లోనే, క్లాస్ స్ట్రగుల్స్ ఇన్ యు ఎస్ ఎస్ ఆర్ రెండు భాగాలు వెలువడిన వెంటనే ఒక పెద్ద పుస్తకం రాసి ఖండించారు. తాను మార్క్సిజం అనుకున్న భావాలతో అంగుళం పక్కకు జరిగినా కత్తి దూసే రంగనాయకమ్మ, నెహ్రూను తన స్నేహితుడిగా చెప్పుకున్న, నెహ్రూ ప్రభుత్వానికి వేతనం మీద ఆర్థిక సలహాదారుగా పనిచేసిన, 'ఇండియా ఇండిపెండెంట్' అనే పుస్తకం రాసిన బెతల్ హేం కు మార్క్సిస్టు అని కితాబు ఇవ్వటం ఆశ్చర్యకరం. అది అవకాశవాదమైనా కావాలి, స్టాలిన్ పట్ల తన విద్వేషాన్ని ప్రకటించడానికి ఆధారం ఇచ్చిన బెతల్ హేంకు కృతజ్ఞత చెప్పుకోవటమైనా కావాలి.

బెతల్ హేం పుస్తకం మీద, సంక్షిప్తీకరణ పేరుతో రంగనాయకమ్మ జోడించిన రంగనాయకమ్మిజం మీద సవివరంగా ఒక పుస్తకమే రాయవలసి ఉంటుంది. మార్క్సిస్టు సిద్ధాంతాన్ని గొప్పగా గౌరవిస్తున్నట్టు కనబడుతూనే, ఆ సిద్ధాంతపు వెలుగులో సాగిన, సాగుతున్న ఆచరణలలో ప్రతి ఒక్కదాన్నీ ఖండఖండాలుగా నరకడానికే తన శక్తినంతా వెచ్చిస్తున్న రంగనాయకమ్మ తాను మార్క్సిస్టునని ఇంకా కొందరినైనా నమ్మించగలుగుతుండడమే విషాదం. సిద్ధాంతం ముద్దు, ఆచరణ వద్దు అనే సూత్రం అంతిమంగా ఎవరి ప్రయోజనాల కొరకో ఆమె భక్తులు ఎప్పటికైనా గ్రహించగలిగితే బాగుండును. శ్రమశక్తిని సరుకుగా గుర్తించడం తప్పు, గతితర్కం తప్పు, తత్వశాస్త్రం అనవసరం అంటూ మార్క్సిస్టు సిద్ధాంతపు ఆర్థిక, తాత్విక మౌలికాంశాలనే వ్యతిరేకిస్తూ కూడ మార్క్సిస్టుగా ఆమె సాగిస్తున్న నటనను 'సోవియట్ రష్యాలో ఏం జరిగింది?' పుస్తకం కొంతవరకైనా బహిర్గతం చేయగలుగుతుంది. అటువంటి పుస్తకం మీద మార్క్సిస్టు దృక్పథం నుంచి, సోవియట్ సోషలిస్టు అనుభవం ఆధారంగా, వాస్తవికమైన సమీక్ష రావలసిన వీక్షణం పత్రికలో ఈ రంగనాయకమ్మిస్టు దృక్పథపు, భజనబృందపు ప్రశంస వ్యాసం రావడం నిజంగా విచారకరం. వీ

చలో అసెంబ్లీ

రైతు సమస్యలపై తెలంగాణ కాంగ్రెస్ అక్టోబర్ 27న 'చలో అసెంబ్లీ' కార్యక్రమం చేపట్టింది. ఈ సందర్భంగా ఉదయం 10 గంటలకు గాంధీ భవనం నుంచి కార్యకర్తలు, నాయకులు ర్యాలీగా అసెంబ్లీకి బయలుదేరారు. హ్యాండ్లూమ్ హౌజ్ వరకు రాగానే పోలీసులు బారికేడ్లు ఏర్పాటు చేసి అడ్డుకోవడంతో నేతలు అక్కడే రోడ్డుపై బైటాయించి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దీంతో పోలీసులు వారిని అరెస్ట్ చేసి వివిధ పోలీసు స్టేషన్‌లలో నిర్బంధించారు. జిల్లాల్లో నిరసన కార్యక్రమాలు చేస్తున్న నాయకులను, కార్యకర్తలను అరెస్ట్ చేశారు. సిఎల్‌పి నేత జానారెడ్డి ఈ మూడేళ్లలో అరెస్టయినన్ని సార్లు ఎప్పుడూ అరెస్ట్ కాలేదన్నారు. అసెంబ్లీలో మాట్లాడనివ్వరు, బయటకు వచ్చి న్యాయం అడిగితే అరెస్ట్ చేశారని, ఇది ప్రజాస్వామ్యమేనా అని ప్రశ్నించారు.

కలెక్టరేట్ ముట్టడిలో మహిళ మృతి

ఎస్‌సి వర్గీకరణను వెంటనే అమలు చేసేలా అఖిల పక్షాన్ని ఢిల్లీకి తీసుకువెళ్లాలనే డిమాండ్‌తో ఎంఆర్‌పిఎస్ నవంబర్ 5న రాష్ట్ర వ్యాప్తంగా కలెక్టరేట్‌ల ముట్టడి కార్యక్రమాన్ని చేపట్టింది. అబిడ్స్‌లోని హైదరాబాద్ కలెక్టరేట్ ఎదుట పోలీసులకు, ఆందోళనకారులకు మధ్య జరిగిన ఘర్షణలో ఎంఆర్‌పిఎస్ కార్యకర్త భారతి (45) స్పృహ తప్పారు. ఆస్పత్రికి తరలించేలోపే ఆమె మృతిచెందారు. పాలకుల నిర్లక్ష్యమే భారతిని బలికొందని ఎంఆర్‌పిఎస్ నాయకులు, ప్రతిపక్షాలు విమర్శించాయి.

చుక్క సత్తయ్య మృతి

ఒగ్గు కథ కళాకారుడు చుక్క సత్తయ్య (86) అనారోగ్యంతో బాధపడుతూ స్వగ్రామం మాణిక్యాపురంలో నవంబర్ 8న మృతి చెందారు. ఆయన పాత వరంగల్ ప్రస్తుత జనగాం జిల్లా మాణిక్యాపుర్‌లో 1931 జూన్ 30న జన్మించారు. పెద్దబాల శిక్ష మాత్రమే చదువుకున్న ఆయన ఒగ్గుకథ కళారంగంలో ప్రావీణ్యం సాధించారు. మల్లన్న కథ, మాందాత, అక్క మాంకాళి, అల్లిరాణి, కనకతార, బాలనాగమ్మ, సత్య హరిశ్చంద్ర లాంటి అనేక కథలను ఒగ్గు కళారూపంలోకి మలిచారు. సత్తయ్య ప్రజలను చైతన్యపరిచే విద్య ఆవశ్యకత, కుటుంబ నియంత్రణ, వరకట్న దురాచారం లాంటి అంశాలపై ప్రదర్శనలు ఇచ్చారు.

ఆంధ్రప్రదేశ్‌లో జగన్ ప్రజా సంకల్ప యాత్ర

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రజల సమస్యలను తెలుగుకునేందుకు 'ప్రజా సంకల్ప యాత్ర'ను నవంబర్ 11 నుంచి జూలై 10వ తేదీ వరకు కొనసాగుతుందని వైఎస్‌ఆర్‌సిపి అధ్యక్షుడు జగన్‌మోహన్ రెడ్డి వెల్లడించారు. ఈ యాత్ర ఇడుపులపాయలో ప్రారంభించారు. ఇది ఇచ్చాపురం వరకు కొనసాగుతుందని మొత్తం 180 రోజులు 125 నియోజకవర్గాల్లో మూడువేల కిలోమీటర్ల మేర పాదయాత్ర సాగుతుందన్నారు.

దళితులపై బిజెపి నాయకుడి దాడి

నిజామాబాద్ జిల్లా నవీపేట మండలం అభంగపట్నం ఎర్రగుంట శివారులో బిజెపి నేత భరత్‌రెడ్డి మొరం క్వారీ నిర్వహిస్తున్నారు. అదే గ్రామానికి చెందిన దళిత యువకులు కొండ్ర లక్ష్మన్, రాజేశ్వర్ క్వారీ వద్దకు వెళ్లి మొరం తవ్వకాల అనుమతుల గురించి ప్రశ్నించారు. దీంతో భరత్‌రెడ్డి యువకుల్నిద్దరినీ కర్రతో కొట్టి రాయలేని భాషలో బూతులు తిట్టారు. పక్కనే ఉన్న నీటి గుంటలో మునగాలని ఆదేశించారు. ఆ తర్వాత ముక్కు నేలకు రాయించారు. సెప్టెంబర్ 17న ఈ ఘటనను స్థానికులు వీడియో తీసి సోషల్ మీడియాలో పెట్టడంతో విషయం బయటికి వచ్చింది. ఆ యువకుల్నిద్దరిని కిడ్నాప్ చేసి ఇప్పటికి వారిని విడుదల చేయలేదు. ఈ అంశం పై దళిత సంఘాలు, ప్రజాస్వామికవాదులు దళిత యువకుల్ని విడుదలచేయాలని, భరత్‌రెడ్డిని శిక్షించాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరంగల్ డిక్లరేషన్ సదస్సు

వరంగల్ డిక్లరేషన్‌కు 20 ఏళ్ల సందర్భంగా 'తెలంగాణ నిన్న, నేడు, రేపు' అనే అంశం పై నవంబర్ 11, 12 తేదీల్లో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ ప్రజా ఫ్రంట్ సదస్సు నిర్వహించింది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన ప్రొ. హరగోపాల్ ఉద్యమం చేసి సాధించుకున్నది భౌగోళిక తెలంగాణను మాత్రమేనని, దానిని ప్రజాస్వామ్య తెలంగాణగా మార్చుకోవాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణలో సభలు, సమావేశాలకు ప్రభుత్వం అనుమతించకుండా నియంతృత్వ పాలన కొనసాగిస్తుందని విమర్శించారు. తెలంగాణలో విద్య నీరు, నిరుద్యోగం పై ప్రొ. కె. లక్ష్మినారాయణ, స్వాతంత్ర సమరయోదుడు జైని మల్లయ్య గుప్తా, సి.ఎచ్. రవి, ఎ. నిర్సంహా రెడ్డి, నలమాస క్రిష్ణ ఈ సదస్సులో మాట్లాడారు.

విజయవాడ పడవ ప్రమాదం

విజయవాడ పవిత్ర సంగమం వద్ద విహార యాత్రకు వచ్చిన ఒంగోలుకు చెందిన 22 మంది నవంబర్ 13న జరిగిన పడవ ప్రమాదంలో మృతి చెందారు. ఈ మార్గంలో బోటు నడపడం బోటు డ్రైవర్‌కు కొత్త కావడంతో అక్కడ మేటవేసిన మట్టిని గమనించక పోవడంతో మట్టి బోటు కింది భాగానికి తగిలింది. దీంతో బోటు కుదుపులకు గురై భయానికి లోనైన పర్యాటకులు బోటుకు ఒకవైపు రావడంతో అడ్డంగా తోసుకొస్తున్న గోదావరి నీరు బోటును తలకిందులు చేయడంతో ఈ ప్రమాదం జరిగింది. ఈత వచ్చిన వారు బయటపడగా మిగిలిన 22 మంది మృతి చెందారు. ఇందులో మొత్తం 40 మంది ఉన్నారు.

సి.వి. కన్నుమూత

ప్రముఖ హేతువాది చిత్తజల్లు వరహాలరావు (సివి) (88) నవంబర్ 8న విజయవాడలోని ఎచ్‌బి కాలనీలోని తన స్వగృహంలో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన 1930 జనవరి 14న గుంటూరులో జన్మించారు. మద్రాస్‌లో ఎంఎ పూర్తి చేసి సహకార శాఖలో ఆడిటర్‌గా పనిచేశారు. అప్పటి కమ్యూనిస్టు ఉద్యమ ప్రేరణతో దూరాచారాలై పోరాడాలనుకొని ఉద్యోగానికి రాజీనామా చేసి పాత్రికేయ రంగంలోకి అడుగుపెట్టారు. జనశక్తి పత్రికలో ఆయన తొలి రచనలు అచ్చయ్యాయి. కేరళలో ఇఎంఎస్ నంబూద్రిపాద్ ప్రభుత్వ పతనంపై 'విషాద భారతం' అనే రచన చేశారు. ఆయన రచించిన పారిస్ కమ్యూన్, ఊళ్లోకి సాములోరు వచ్చారు వంటి కావ్యాలు ఎంతో మందిని కమ్యూనిస్టులను, హేతువాదులను చేశాయి. ఆయన రచనలను ప్రజాశక్తి బుక్‌హౌజ్ 16 సంపుటాలుగా వెలువరించింది.

ప్రొ. కంచ ఐలయ్యపై బిజెపి దాడి

ప్రొ. కంచ ఐలయ్య 'సామాజిక స్మగ్లర్లు కోమటోళ్లు' అనే పుస్తకాన్ని రాసినందుకు కోరుట్లలో కేసునమోదైనందున నవంబర్ 22న కోర్టుకు హాజరయ్యారు. ఐలయ్య జగిత్యాలలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసేందుకు ప్రయత్నించగా బిజెపి శ్రేణులు, ఆర్యవైశ్య సంఘం నాయకులు అడ్డుకొని నిరసన తెలిపారు. కోడిగుడ్లు, చెప్పులతో దాడిచేశారు. కోరుట్ల కోర్టులో హాజరు కాగా కేసు డిసెంబర్ 27కు వాయిదా పడింది.

చలో అమలాపురం

మావోయిస్టులతో సంబంధం ఉందనే కారణంతో నాగపూర్ జైల్లో జీవిత ఖైదు అనుభవిస్తున్న సాయిబాబాతో పాటు శిక్షకు గురయిన వారిని బెయిల్ పై విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ నవంబర్ 27న 'చలో అమలాపురం'కు సాయిబాబా విడుదల పోరాట కమిటీ పిలుపునిచ్చింది. ప్రజా సంఘాల నాయకులు ఆర్‌డిఓ కార్యలయం వద్దకు చేరి సాయిబాబాతో పాటు ఇదే కేసులో శిక్షకు గురైన వారిని బెయిల్‌పై విడుదల చేయాలని డిమాడ్ చేస్తూ ఆందోళనకు దిగారు. పోలీసులు వారితో వాగ్వాదానికి దిగి బలవంతంగా 41 మందిని అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌లో నిర్బంధించారు. వీ

ఛత్తీస్‌గడ్‌లో మావోయిస్టుల ఎన్‌కౌంటర్

ఛత్తీస్‌గఢ్‌లోని రాజ్‌నంద్‌గావ్ జిల్లాలో అక్టోబర్ 26న జరిగిన ఎన్‌కౌంటర్లో ముగ్గురు మావోయిస్టులు మృతిచెందినట్లు పోలీసులు వెల్లడించారు. ఇండో–టిబెటన్ సరిహద్దు పోలీస్ (ఐటిబిపి), జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో పక్కా సమాచారంతో ఖడ్‌గావ్ గ్రామ శివార్లలో కూంబింగ్ జరుపుతుండగా మావోయిస్టులు పోలీసులపైకి కాల్పులు జరిపారని, దానికి ప్రతిగా పోలీసులు జరిపిన కాల్పుల్లో పల్లెమాడి స్థానిక కార్యక్రమాల బృందం (ఎల్‌వొఎస్) కమాండర్ రాకేష్ దుగ్గ, డిప్యూడి కమాండర్ రంజిత్ నురేటితో పాటు మరో మావోయిస్టు మహేష్ పోతావి మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

ఎన్‌టిపిసిలో పేలుడు

ఉత్తరప్రదేశ్ రాష్ట్రం రాయ్‌బరేలి జిల్లా ఊంచాహార్‌లోని నేషనల్ థర్మల్ పవర్ కార్పొరేషన్ (ఎన్‌టిపిసి)లో నవంబర్ 1న భారీ పేలుడు జరిగి 20 మంది కార్మికులు మరణించారు. 100 మందికి పైగా గాయపడ్డారు. మధ్యాహ్నం ఎన్‌టిపిసి ప్లాంట్ ఆరో యూనిట్‌లోని బాయిలర్ ట్యూబ్ పేలిపోవడంతో వాయువులు, ఆవిరి ఎగిసిపడ్డాయి. దీంతో 20 మంది కార్మికులు అక్కడికక్కడే చనిపోగా క్షతగాత్రులను రాయ్‌బరేలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. 'యాష్ పైప్'పై ఒత్తిడి పెరిగి పేలిపోయిందని జిల్లా మేజిస్ట్రేట్ తెలిపారు. ప్రమాద సమయంలో 150 మంది కార్మికులు ఉన్నారు.

ప్యారడైజ్ పేపర్లలో అవినీతి పరుల గుట్టు

భారతదేశంలో అక్రమంగా సంపాదించిన 714 మంది భారతీయుల వివరాలను 'ప్యారడైజ్ పేపర్లు' నవంబర్ 5న బయటపెట్టాయి. ఇందులో రాజకీయ నాయకులు, కార్పొరేట్లు, వ్యాపారవేత్తలు, సెలబ్రిటీలు వీరంతా దేశం నుంచి అక్రమంగా సంపాధించిన డబ్బును తీసుకెళ్లి విదేశాల్లో పెట్టుబడులు పెట్టారు. పన్ను ఎగవేతకు అవకాశమున్న దేశాల్లోని వివిధ సంస్థలతో లావాదేవీలు జరిపినట్లుగా ఈ పేపర్లు వెల్లడిస్తున్నాయి. ఈ జాబితాలో కేంద్ర ప్రభుత్వంలోని కేంద్ర మంత్రి జయంత్ సిన్హా, బిజెపి ఎం.పి. ఆర్.కె. సింగ్, వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, విజయ్ మాల్యా, నీరా రాడియా, హెటీరో డ్రగ్స్, జిందాల్, హిందూజా, అమితాబ్, జిఎంఆర్ తదితర సంస్థల పేర్లు ఉన్నాయి.

హిమాచల్‌ప్రదేశ్‌లో 74 శాతం పోలింగ్

హిమాచల్‌ప్రదేశ్ శాసనసభకు నవంబర్ 9న ఎన్నికలు జరిగాయి. రాష్ట్రంలో 50 లక్షల మంది ఓటర్లు ఉండగా 74 శాతం పోలింగ్ నమోదైంది. మొత్తం 68 నియోజక వర్గాల్లో అధికార కాంగ్రెస్, విపక్ష బిజెపి అన్ని స్థానాల్లో అభ్యర్థులను నిలిపి పోటీపడుతున్నాయి. 68 స్థానాలకు 337 మంది అభ్యర్థులు పోటీపడుతున్నారు. అధికార కాంగ్రెస్ అవినీతి తమను గెలిపిస్తుందని బిజెపి భావిస్తుండగా, పెద్దనోట్ల రద్దు–జిఎస్‌టి పై ప్రజల్లో ఉన్న వ్యతిరేకత తమను గెలిపిస్తుందని కాంగ్రెస్ భావిస్తోంది.

మహారాష్ట్రలో చెరుకు రైతులపై కాల్పులు

మహారాష్ట్రలోని ఔరంగాబాద్, అహ్మద్‌నగర్, సోలాపూర్ జిల్లాల్లోని రైతులు చెరుకు టన్నుకు 3,100 ధర చెల్లించాలని గత మూడు రోజులుగా నిరసన వ్యక్తం చేస్తున్నారు. శివగాన్ ప్రాంతంలో నవంబర్ 15న నిరసన వ్యక్తం చేస్తున్న రైతులపై పోలీసులు లాఠీచార్జీ, ప్లాస్టిక్ బుల్లెట్స్‌తో కాల్పులు జరిపి, టియర్ గ్యాస్ ప్రయోగించారని 'స్వాభిమాని శేట్కారీ సంఘటన్' నాయకుడు రాజు శెట్టి తెలిపారు. ఈ కాల్పుల్లో భారీ సంఖ్యలో రైతులు గాయపడ్డారన్నారు. రైతు పండించిన చెరుకుతో చక్కెర అమ్ముకొని ఫ్యాక్టరీ యాజమాన్యాలు లాభాలు గడిస్తున్నాయని కాని తమకు మాత్రం గిట్టుబాటు ధర ఇవ్వడం లేదని రైతు సంఘాలు బిజెపి ప్రభుత్వం పై ఆగ్రహం వ్యక్తం చేశాయి.

త్రిపురలో జర్నలిస్టును కాల్చి చంపిన జవాను

త్రిపుర స్టేట్ రైఫిల్స్ (టిఎస్ఆర్) జవాన్ సీనియర్ పాత్రికేయుడు సుదీప్ దత్తా భౌమిక్ (50)ను నవంబర్ 21న కాల్చిచంపాడు. ఆయన స్థానిక బెంగాలీ వార్తాపత్రిక 'శ్యాన్‌దన్' పత్రికలో పనిచేస్తున్నారు. కథనం కోసం వెళ్లిన సుదీప్‌కు అక్కడి టిఎస్ఆర్ జవాను పాల్ రియాంగ్‌కు మధ్యన కొద్దిసేపు వాగ్వాదం జరిగింది. కోపోద్రిక్తుడైన పాల్ రియాంగ్ తన వద్ద ఉన్న సర్వీసు తుపాకీతో సుదీప్ పై కాల్పులు జరిపారు. దీంతో రక్తమోడుతున్న సుదీప్‌ను ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన మరణించినట్లు వైద్యులు ప్రకటించారు. సుదీప్ తన అవినీతిపై కథనాలు ప్రచురించినందుకు ప్రతీకారంగా త్రిపుర స్టేట్ రైఫిల్స్ (టిఎస్ఆర్) కమాండెంట్‌కు బాడీగార్డుగా పనిచేస్తున్న నంద రియాంగ్ కాల్చి చంపారని దీన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని ఇండియన్ న్యూస్‌పేపర్ సొసైటీ అధ్యక్షురాలు అఖిల ఉరంకార్ నవంబర్ 22న తెలిపారు.

జంతర్ మంతర్ వద్ద రైతుల ధర్నా

ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నవంబర్ 20న అఖిల భారత కిసాన్ సంఘం ఆధ్వర్యంలో 'రైతు పార్లమెంట్' నిర్వహించారు. సామాజిక శాస్త్రవేత్త మేధాపాట్కర్ అధ్యక్షతన మహిళా పార్లమెంట్ జరిగింది. దేశవ్యాప్తంగా ఉన్న 180 రైతు సంఘాల నేతలు ఈ సదస్సులో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రభుత్వాల నుంచి ఎటువంటి సహాయం అందక, పండించిన పంటకు గిట్టుబాటు ధర లేక, అప్పులు పెరిగి రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారనీ, రైతాంగానికి ఉపశమనం కలిగించేందుకు కేంద్రం వెంటనే స్వామినాథన్ కమిటీ సిఫారుసులను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో రైతు ఆత్మహత్యలు 120 శాతం పెరిగాయని, కార్పొరేట్ కంపెనీలకు రాయితీలు ఇస్తున్న ప్రభుత్వం తిండి పెట్టే రైతాంగానికి రుణ మాఫీ ఎందుకు చేయడం లేదని వారు ప్రశ్నించారు.

కశ్మీర్‌లో ఎన్‌కౌంటర్

జమ్మూ కశ్మీర్‌లోని కుప్వారా జిల్లాలో నవంబర్ 21న జరిగిన రెండు వేర్వేరు ఎన్‌కౌంటర్లలో ముగ్గురు లష్కరే తొయిబాకు చెందిన వారిని భద్రతా బలగాలు కాల్చి చంపాయి. ఈ ఘటనలో ఒక సైనికుడు ప్రాణాలు కోల్పోగా ఇద్దరు జవాన్లు గాయపడ్డారు. మగామ్‌లో మిలిటెంట్లు ఉన్నట్లు సమాచారం అందుకున్న సైన్యం, సిఆర్‌పిఎఫ్, పోలీసులు ఆ ఇంటికి చేరుకొని లొంగిపొమ్మని హెచ్చరించగా వారు కాల్పులు జరుపగా సైన్యం కాల్పులు జరిపిందని భద్రతాధికారి వెల్లడించారు. ఇదే జిల్లాలోని జిర్హామా వద్ద భద్రతా దళాలు, మిలిటెంట్లకు మధ్య జరిగిన మరో ఎన్‌కౌంటర్‌లో ఒక సైనికుడు మరణించగా ఇద్దరు గాయపడ్డారు.

జడ్జి లోయా మృతిపై న్యాయ విచారణకు డిమాండ్

బిజెపి జాతీయ అధ్యక్షుడు అమిత్ షా కేసులో ప్రమేయం ఉన్న సిబిఐ ప్రత్యేక కోర్టు న్యాయమూర్తి బ్రిజ్ గోపాల్ లోయ మృతి పై న్యాయ విచారణ జరిపించాలని ఆల్ ఇండియా లాయర్స్ యూనియన్(ఐలు) ఒక డిమాండ్ చేసింది. న్యాయమూర్తి బ్రిజ్ గోపాల్ లోయ అనుమానస్పద పరిస్థితుల్లో 2014 డిసెంబర్‌లో మరణించారు. ఆయన మృతిపై అల్లుకున్న అనుమానాలను నివృత్తి అయితే, సాధారణ పౌరుడిలో న్యాయవ్యవస్థ నిజాయితీ పట్ల విశ్వాసం పునరుద్దరింప బడుతుందని ఐలు తన ప్రకటనలో తెలిపారు. బ్రిజ్ గోపాల్ లోయ మృతిపై పలు అనుమానాలను వ్యక్తం చేస్తూ కారవాన్ మ్యాగ్‌జైన్ సోషల్ మీడియాలో కథనాన్ని పోస్టు చేసింది. వీ

సౌదీ అరేబియాలో రాజకీయ పరిణామాలు

సౌదీ అరేబియాలో రాజ కుటుంబానికి చెందిన పదకొండు మంది యువరాజులను అవినీతి ఆరోపణలతో ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీరితో పాటు అనేక మంది మాజీ మంత్రులు, అధికారులపై చర్యలకు అవినీతి నిరోధక కమిటీకి నేతృత్వం వహిస్తున్న క్రౌన్ ప్రిన్స్ మహ్మద్ బిన్ సల్మాన్ నవంబర్ 4న ఆదేశాలు జారీ చేశారు. జాతీయ భద్రతా దళానికి నేతృత్వం వహించే యువరాజుతోపాటు, ఆర్థిక మంత్రిని కూడా తొలగించారు. 2009లో జెడ్డా నగరంలోని పలు ప్రాంతాల్లో వరదలు, కొన్ని సంవత్సరాలుగా విజృంభిస్తున్న మెర్స్ వైరస్ కారణంగా వందలాది మంది చనిపోయారు. దీనిపై దర్యాప్తు చేపడుతున్న క్రమంలో యువరాజు, మాజీ మంత్రుల అవినీతి అక్రమాలు బయటపడ్డాయి. దీంతో రాజు బిన్ సల్మాన్ అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని అరెస్టు చేయాల్సిందిగా ఆదేశించారు.

సిరియాలో బాంబు దాడి

సిరియాలో నవంబర్ 4న డైర్ ఎజార్ ప్రాంతంలో ఇస్లామిక్ స్టేట్ ఉగ్రవాదులు కారు బాంబుతో దాడి చేశారు. ఈ దాడిలో డెబ్బై ఐదు మంది మృతి చెందారు. నూట నలభై మంది గాయపడ్డారు. మృతుల్లో అధికంగా చిన్నపిల్లలు ఉన్నారు. సిరియాలో పట్టుకోల్పోతున్న ఇస్లామిక్ స్టేట్ దళాలు తూర్పు సిరియాలో వందల సంఖ్యలో శరణార్థులు ఉన్న ప్రాంతంలో ఈ దాడులకు పాల్పడుతున్నాయి.

అమెరికాలో కాల్పులు

అమెరికాలోని టెక్సాస్ నగరంలో నవంబర్ 5న ఒక చర్చిలో తుపాకితో జరిపిన కాల్పుల్లో 27 మంది మరణించారు. మరో ఇరవై మందికి పైగా గాయపడ్డారు. మాజీ వైమానిక అధికారి ఈ కాల్పులకు పాల్పడి తరువాత తనను తాను కాల్చుకుని చనిపోయాడు. మృతుల్లో రెండు సంవత్సరాల చిన్నారి ఉన్నారు.

న్యూయార్క్‌లో జి.ఎన్. సాయిబాబాకు సంఘీభావం

మావోయిస్టులతో సంబంధాలున్నాయన్న అభియోగంతో జీవిత ఖైదు శిక్ష పడి జైలు జీవితం అనుభవిస్తున్న ఢిల్లీ యూనివర్సిటీ ప్రొ. జి.ఎన్. సాయిబాబా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్నారనీ, ఆయనను వెంటనే జైలులో నుంచి విడుదల చేయాలంటూ నవంబర్ 5న న్యూయార్క్‌లోని భారతీయ కాన్సులేట్ ఎదుట ప్రదర్శన చేశారు.

యెమెన్‌లో సంకీర్ణ దళాల దాడులు

యెమెన్‌లో సౌదీ సంకీర్ణ దళాలు వైమానిక దళాలతో విచ్చలవిడిగా దాడులకు పాల్పడుతున్నాయి. హజ్జా ప్రాంతంలో వైమానిక దళాలు జరిపిన దాడుల్లో ముప్పై మంది పౌరులు మరణించారు. మార్కెట్లు, పాఠశాలలు, ఆస్పత్రులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడులు జరుగుతున్నాయి. బోకోహరమ్ తిరుగుబాటుదారులను అంతం చేయడానికి సౌదీ సంకీర్ణ దళాలు వైమానిక దాడులు చేస్తున్నాయి. అయితే ఈ దాడుల్లో సామాన్య ప్రజలు అధిక సంఖ్యలో మరణిస్తున్నట్లు ఐక్యరాజ్య సమితి ఆందోళన వ్యక్తం చేసింది.

కాటలోనియాలో నిరసనలు

కాటలోనియా స్వాతంత్ర్యం కోసం పోరాటం తీవ్ర రూపం దాలుస్తోంది. స్పెయిన్ నుంచి వేర్పడాలని కోరుతూ స్వాతంత్ర్యం కోసం పోరాడి అరెస్టయిన వారిని బేషరతుగా విడుదల చేయాలని బార్సిలోనా నగరంలో ప్రజలు భారీ ర్యాలీ నిర్వహించారు. నవంబర్ 12న దాదాపు ఏడు లక్షల యాభై వేలమంది బార్సిలోనా వాసులు వీధుల్లోకి వచ్చి ర్యాలీలో పాల్గొన్నారు. స్పెయిన్ నుంచి వేర్పడాలని కోరుతూ 90 శాతం కాటలోనియా ప్రజలు మద్దతు తెలిపారు.

ఇరాన్, ఇరాక్ సరిహద్దులో భూకంపం

ఇరాన్-ఇరాక్ దేశాల ఉత్తర సరిహద్దులో నవంబర్ 13 రాత్రి భారీ భూకంపం సంభవించింది. రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.3గా నమోదైంది. ఇరు దేశాల సరిహద్దులోని కెర్మన్‌షా ప్రావిన్స్‌లో ఈ భూకంపం ప్రభావం అధికంగా కనిపించింది. మొత్తం ఐదు వందల ముప్పై మంది మరణించగా, ఏడు వేలకుపైగా గాయపడ్డారు. భారీ ఆస్తి నష్టం జరిగింది.

డోనాల్డ్ ట్రంప్ ఆసియా పర్యటన

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ ఆసియా పర్యటన నవంబర్ 4 నుంచి 14 వరకు సాగింది. ఈ పర్యటనలో భాగంగా జపాన్, దక్షిణ కొరియా, వియత్నాం, ఫిలిప్పీన్స్, చైనా దేశాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా జపాన్ ప్రధాని షింజో అబే, దక్షిణ కొరియా అధ్యక్షుడు మూన్ జె, చైనా అధ్యక్షుడు జీ జింగ్‌పింగ్, వియత్నాం అధ్యక్షుడు టాన్ డా క్వాంగ్, ఫిలిప్పైన్ అధ్యక్షుడు రోడ్రిగోను కలిశారు.

తూర్పు ఆసియా సదస్సు

ఫిలిప్పీన్స్‌లో నవంబర్ 13-14 తేదీల్లో ఆసియా సదస్సు జరిగింది. ఈ సదస్సుకు పద్దెనిమిది దేశాలు - ఆస్ట్రేలియా, బ్రూనై, కంబోడియా, చైనా, భారతదేశం, ఇండోనేషియా, జపాన్, లావోస్, మలేషియా, మయన్మార్, న్యూజిల్యాండ్, ఫిలిప్పీన్స్, రష్యా, సింగపూర్, దక్షిణ కొరియా, థాయ్‌లాండ్, వియత్నాం పాల్గొన్నాయి. కెనెడా ప్రధాన మంత్రి, యురోపియన్ యూనియన్ అధ్యక్షుడు, ఐక్యరాజ్య సమితి సెక్రటరీ జనరల్ ముఖ్యఅతిథులుగా పాల్గొన్నారు.

జింబాబ్వేలో రాజకీయ పరిణామాలు

జింబాబ్వే అధ్యక్షుడు రాబర్ట్ ముగాబే తన పదవికి నవంబర్ 21న రాజీనామా చేశారు. దీంతో మూడున్నర దశాబ్దాల ముగాబే పాలన ముగిసింది. అంతకుముందు ఆయనను అధికార జెడ్ఎన్‌యు-పిఎఫ్ పార్టీ నుంచి బహిష్కరించారు. ఆయన స్థానంలో ఉపాధ్యక్షుడుగా ఉన్న ఎమెర్సన్ నంగాగ్వా పార్టీ నేతగా, జింబాబ్వే అధ్యక్షుడుగా ఎన్నికయ్యారు. 93 ఏళ్ల ముగాబే తరువాత ఆయన భార్య గ్రేస్ అధ్యక్ష పదవి చేపట్టాలని భావించింది. దీంతో సైన్యం ఆయనను గృహ నిర్బంధంలో ఉంచింది. బ్రిటన్ నుంచి స్వాతంత్ర్యం పొందినప్పటి నుండి జింబాబ్వే అధ్యక్షుడిగా ముగాబేనే ఉన్నారు. ఆయన పాలనలో జింబాబ్వే ఆర్థిక పరిస్థితి దారుణంగా పడిపోయింది.

నైజీరియాలో ఆత్మాహుతి దాడి

నైజీరియాలో నవంబర్ 21న జరిగిన ఆత్మాహుతి దాడిలో యాభై మంది మరణించారు. ముబిలోని ఓ మసీదు వద్ద ప్రార్థనలు జరుగుతున్న సమయంలో ఓ వ్యక్తి తనను తాను పేల్చుకున్నాడు. బోకోహారమ్ తీవ్రవాదులు ఈ దాడికి పాల్పడినట్లుగా అధికారులు తెలిపారు.

రోహింగ్యా ముస్లింలపై కుదిరిన ఒప్పందం

మయన్మార్‌లో రోహింగ్యాల ముస్లింలపై సాయుధ బలగాలు చేస్తున్న దాడులతో వేలాది మంది మరణించారు. ప్రమాదకరమైన సముద్ర ప్రయాణాలు చేస్తూ వందలాదిగా రోహింగ్యాలు మరణిస్తున్నారు. నవంబర్ 23న నేపిడాలో మయన్మార్ అధినేత అంగ్ సాన్ సూకీ, బంగ్లాదేశ్ విదేశాంగ మంత్రి ఎ.ఎచ్. మహమూద్ అలీల మధ్య ఒప్పందం కుదిరింది. దీని ప్రకారం బంగ్లాదేశ్‌కు వలస వచ్చిన రోహింగ్యాలను తిరిగి మయన్మార్‌కు పంపించేందుకు మార్గం సుగమమైంది.

ఈజిప్ట్‌లో మారణహోమం

ఈజిప్ట్‌లోని సినాయ్ ప్రావిన్స్‌లో నవంబర్ 24న ఉగ్రవాదులు దాడి చేశారు. శుక్రవారం సందర్భంగా మసీదులో ప్రార్థనలు చేస్తున్న వారిపై సాయుధులైన ఉగ్రవాదులు విచ్చలవిడిగా కాల్పులు జరిపారు. ఈ కాల్పుల్లో రెండు వందల ముప్పై ఐదు మంది మరణించారు. వంద మందికి పైగా గాయపడ్డారు. వీ

వీక్షణం 2017 సూచిక

జనవరి 2017 సంచిక : **186**

యాభై రోజుల గడువు తీరిన అబద్ధాలు (సంపాదకీయం)
ప్రైవేటు యూనివర్సిటీలు, ఇష్టారాజ్యపు భూఆక్రమణలు;
ఆదివాసుల నెత్తురు కలిసిన పోలవరం జలాలు;
ఇజ్రాయెల్ దుర్మార్గాన్ని అమెరికా అడ్డుకుంటుందా? (సంపాదకీయ వ్యాఖ్యలు)
పాఠకుల వీక్షణం

పదిహేనో జన్మదిన ప్రత్యేక సంచిక వ్యాసాలు

నెహ్రూ నుంచి మోడీ వరకు అవినీతి - వి. హనుమంత రావు
భారత సామాజికార్థిక రాజకీయ పరిస్థితి - ఎ. నర్సింహా రెడ్డి
ఫాసిజం, మతోన్మాదం, యుద్ధోన్మాదం - బైరెడ్డి సతీష్
తెలంగాణలో మారని అభివృద్ధి నమూనా - రాజేంద్రబాబు అర్విణి
మహత్తర శ్రామికవర్గ సాంస్కృతిక విప్లవం - వరవరరావు
అక్టోబర్ విప్లవ శతజయంతి - బి.ఎస్.రాజు
ఒక అడుగు ముందుకీ, రెండడుగులు వెనక్కీ - కోబడ్ గాంధీ
వ్యవసాయ సమస్య - భారత వ్యవసాయరంగ పరివర్తన - డి. నరసింహారెడ్డి
ఆంగ్ల నవలల్లో ఉత్పత్తి సంబంధాల ప్రతిఫలనం - జి.ఎన్. సాయిబాబా
తెలంగాణలో మారుతున్న భూ సంబంధాలు - నలమాస క్రిష్ణ
సంస్మరణ - క్యూబా విప్లవ నేత ఫిడెల్ క్యాస్ట్రో - సంతోష్
రాంగూడ సంఘటన - ఆర్థిక, రాజకీయ నేపథ్యం - వి.ఎల్. ఏసు
రంగనాయకమ్మ తత్వశాస్త్ర పరిచయం గురించి -2 - తోలేటి జగన్మోహన్‌రావు
సంస్మరణ - మానవీయ విలువల చిరునామా శివరామకృష్ణారావు - తోట జ్యోతీరాణి
కొత్త పుస్తకాలు / సి.డి.లు
ఈనెల - వై. రామచంద్రం
ఇరుగు-పొరుగు - వై. రామచంద్రం
భూగోళం - సి. రాజశేఖర్
అసహజ మరణాలు - ఎస్. వెంకటేష్

ఫిబ్రవరి 2017 సంచిక : **187**

పాఠకుల వీక్షణం
విస్ఫోటన అంచుకు చేరుతున్న అంతరాల వ్యవస్థ (సంపాదకీయం)
ఇది ప్రజాస్వామ్యం అనడం హాస్యాస్పదం; ప్రపంచవేదికల మీద అవే ప్రగల్భాలు;
దుర్మార్గానికి అద్దం ట్రంప్ తొలి అధ్యక్షోపన్యాసం (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు

వి. హనుమంతరావు నివాళి

దాసరి అమరేంద్ర; విద్యాభూషణ్; కె.ఆర్. చౌదరి; ముదునూరి భారతి; బి.ఎస్. రాజు; పి. అరవింద; డి.వి.రామక్రిష్ణారావు; వై. రామచంద్రం; ఎన్. వేణుగోపాల్; కృష్ణాబాయి; డా. ఇమ్మానేని సత్యసుందరం; సజయ; నరిశెట్టి ఇన్నయ్య; కందిమళ్ల ప్రతాప్ రెడ్డి; బి.వి. రాఘవులు; భారత కమ్యూనిస్టు విప్లవకారుల సమైక్యతా కేంద్రం (మార్క్సిస్టు-లెనినిస్టు); కె. గోవర్ధన్; వరవరరావు

భూసేకరణ చట్టానికి సవరణలు - బి. రామకృష్ణ
ఏనగదు రహితం వెనక అమెరికా హస్తం - ఎ. నర్సింహా రెడ్డి
నోట్ల రద్దు అవివేక చర్య - అమర్త్యసేన్
నగదు రహిత ఆర్థిక వ్యవస్థ అసలు రహస్యాలు - సొదుం శ్రీకాంత్
ప్రైవేట్ విశ్వవిద్యాలయాల వ్యాపారం - బి. సతీష్
సంస్మరణ - ఉద్యమ మేధావి బి జనార్దన్ రావు - డా. సుంకరి సత్యం
నిజ నిర్ధారణే నేరమా? - పద్మజా షా
మార్కెట్ల పునర్విభజన వేటలో ట్రంప్ - పి. ప్రసాద్
భారత లౌకిక స్ఫూర్తికి వన్నె తెచ్చిన తీర్పు - షేక్ కరిముల్లా
జైళ్లలోనే జీవితంలో సగభాగం - రాజేంద్రబాబు అర్విణి
మార్క్సిస్టు భావవాదుల సృజనాత్మక మార్క్సిజం - లంకా పాపిరెడ్డి
వర్గ రాహిత్యమే సమాజానికి చివరి స్థిర రూపం! - జె.యు.బి.వి. ప్రసాద్
ఈనెల - వై. రామచంద్రం
ఇరుగు-పొరుగు - వై. రామచంద్రం
భూగోళం - సి. రాజశేఖర్
అసహజ మరణాలు - ఎస్. వెంకటేష్

మార్చ్ 2017 సంచిక : **188**

పాఠకుల వీక్షణం
పెచ్చరిల్లుతున్న మోడీ విష విద్వేష రాజకీయం (సంపాదకీయం)
రాచరికం రెండో రాకడ; అదే భాగస్వామ్య సదస్సు, అవే అబద్ధాలు;
అసలు రంగు చూపుతున్న ట్రంప్ విధానాలు (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
నిరుద్యోగుల ఆందోళనపై దమననీతి - ఎన్. వేణుగోపాల్
సంస్కరణల బడ్జెట్ 2017-18 - ఎ. నర్సింహా రెడ్డి
ప్రజల ఆకాంక్షలు ప్రతిబింబించని బడ్జెట్ - ఎ. పున్నయ్య
మోడీ గారడీ బడ్జెట్ - షేక్ కరిముల్లా
ఐదు రాష్ట్రాల్లో ఎన్నికలు - వై. రామచంద్రం
తమిళనాడులో కుర్చీ కొట్లాట - వై.ఎచ్.కె. మోహన్‌రావు
జల్లికట్టు పోరాటంలో దాచేస్తే దాగని కోణం - రాజేంద్రబాబు అర్విణి
బస్తర్‌లో హక్కుల హననం - బి. రామకృష్ణ
రాజకీయ హక్కులు - నాగాలాండ్ మహిళలు - డా.కె.సుభాషిణి
ఆంధ్రప్రదేశ్‌కి ప్రత్యేక హోదా - డా. గోవాడ వీర్రాజు
ట్రంప్ చర్యలు - ప్రపంచ పరిణామాలు - బి. సతీష్
ఆటోమేషన్‌తో ఉద్యోగాలు గల్లంతు - సంతోష్
బోరేవాలా ముస్లింల బతుకుచిత్రం - షేక్ ఇబ్రహీం
నల్లడబ్బు - నరేంద్రమోడీ - ఒక పరిశీలన - పి. పోలేశ్వరరావు
నోట్ల రద్దు - కొన్ని రహస్య కోణాలు - లోక సంచారి
నగదు రహిత ఆర్థిక వ్యవస్థ అసలు రహస్యాలు-2 - సొదుం శ్రీకాంత్
పాలకుల వేట - ప్రజల ప్రతిఘటనా సందర్భం - బి.ఎస్.రాజు
కులం - బహుజన ప్రజాస్వామిక విప్లవం - డా. పట్టా వెంకటేశ్వర్లు
డచ్ రోగం - 'జనతన' వాక్సిన్ - వెన్నెలకంటి రామారావు
తరాలు మారినా మారని మన్యం వైద్యం - జి.రజిని కుమారి
చర్చ గురించిన చర్చ - లంకా పాపిరెడ్డి
సంపాదకీయ వ్యాఖ్యలు
ఈనెల - వై. రామచంద్రం
ఇరుగు-పొరుగు - వై. రామచంద్రం
భూగోళం - సి. రాజశేఖర్
అసహజ మరణాలు - ఎస్. వెంకటేష్

ఏప్రిల్ 2017 సంచిక : **189**

పాఠకుల వీక్షణం
నాజీజం విస్తరణ ఉత్తరప్రదేశ్ ఉదాహరణ (సంపాదకీయం)
తిరోగమన చిహ్నాల తెలంగాణ బడ్జెట్; మాటల్లో కోటలు దాటిన ఆంధ్రప్రదేశ్ బడ్జెట్;
ప్రపంచానికి సిరియా నేర్పుతున్న పాఠాలు (సంపాదకీయ వ్యాఖ్యలు)
కొత్త పుస్తకాలు / సి.డి.లు
అబద్ధాల కేసులో అన్యాయమైన తీర్పు - ఎన్. వేణుగోపాల్
సంస్మరణ - వకుళాభరణం లలిత
భారత న్యాయ వ్యవస్థ పయనమెటు? - చిమ్మె జాన్ బర్నబాస్
భ్రమపెట్టే తెలంగాణ బడ్జెట్ - డా. అక్కెనపల్లి పున్నయ్య
అప్పులే ఆధారంగా ఎపి బడ్జెట్ - షేక్ కరిముల్లా
నిరాశపరిచిన విద్యారంగ బడ్జెట్ - డా. సిలువేరు హరినాథ్
ఐదు రాష్ట్రాల ఎన్నికలు - హిందూత్వ ఎజెండా - బైరెడ్డి సతీష్
ఎన్నికల ఫలితాలు - గమనించాల్సిన విషయాలు - ఎం. కృష్ణ ఆదిత్య
మారుతి కార్మికులకు జీవిత ఖైదు - పి. ప్రసాద్
భయమే దాడులకు మూలకారణం - దేవి
దేవతలకు మొక్కులు - లౌకిక పాలన - గొడితాల వెంకటేశ్వర్లు
ఎవరు దేశ ద్రోహులు? - బి. రామకృష్ణ
జాతి విద్వేషాన్ని పెంచుతున్న ఫాసిస్టు నేతలు - ఎ. నర్సింహా రెడ్డి
ఎచ్ 1 వీసాలపై అమెరికా ఆంక్షలు - జి. కిరణ్
తమిళ తంబి చెవిలో పూలు - రాజేంద్రబాబు అర్విణి
దేశ పునర్నిర్మాణమే అంబేద్కర్ స్ఫూర్తి - డా. కత్తి పద్మారావు
ప్రైవేట్ ట్రావెల్స్ ప్రమాదాలు - ఎం.కె. కుమార్
మళ్లీ పెరుగుతున్న మార్క్స్ ప్రాధాన్యత - ఇ.ఎస్. బ్రహ్మచారి
కులం-బహుజన ప్రజాస్వామిక విప్లవ దశ-2 - డా. పట్టా వెంకటేశ్వర్లు
డచ్ రోగం - 'జనతన' వాక్సిన్ - 2 - వెన్నెలకంటి రామారావు
ఈనెల - వై. రామచంద్రం

సంస్థాగతం

సెప్టెంబర్ 2017 — **సంచిక : 194**

పాఠకుల వీక్షణం

అరాచక రాజ్యంలో భక్తి ముసుగులో అరాచక మూక (సంపాదకీయం)

అవే దగుల్బాజీ పొగడ్తలు; దొందూ దొందే అయినప్పుడు ఎవరు గెలిస్తేనేమిటి?;

కల్లోల వెనిజులాలో మదురో స్వామ్యం (సంపాదకీయ వ్యాఖ్యలు)

కొత్త పుస్తకాలు / సి.డి.లు

మత్తులో జోగుతున్న మహానగరం - గొడిశాల వెంకటేశ్వర్లు

ఉద్యమాల ఊసెత్తొద్దు... - బైరెడ్డి సతీష్

నంద్యాల శాసనసభ ఉపఎన్నిక - చిమ్మె జాన్ బర్నబాస్

యోగి నిర్లక్ష్య పాలనలో చిన్నారుల మరణాలు - అరణ్య

అదానీ కోపం - ఇపిడబ్ల్యు సంపాదకుడి రాజీనామా - ఎన్. వేణుగోపాల్

జీవన్మరణ పోరాటంలో ఆదివాసులు - దుడ్డు ప్రభాకర్

సామాజిక జీవనాన్ని ఛిద్రం చేస్తున్న మద్యం - ముప్పాళ్ళ భార్గవశ్రీ

మన్యంలో మైనింగ్ పేరుతో విధ్వంసం - కొర్ర జ్యోతి

మోడీ కుతంత్రం - నితీశ్ అవకాశవాదం - ఎ. నర్సింహా రెడ్డి

భారత్ - చైనాల మాటల యుద్ధం - సంతోష్

చైనాతో భారత్ యుద్ధం వాంఛనీయం కాదు - వై.ఎచ్.కె. మోహన్‌రావు

సత్యాసత్యాల పునర్ వీక్షణం - ఎం. కృష్ణ ఆదిత్య

ప్రాంతీయ సమగ్ర ఆర్థిక భాగస్వామ్యం!? - బి. రామకృష్ణ

ఆర్మీ, అమెరికానే షరీఫ్‌ను దింపాయి - ఆజాద్

సంస్మరణ - రాజీపడని హేతువాది డా. భార్గవ - ఆశాలత

ఉత్తర కొరియాపై యుద్ధానికి అమెరికా సై - బి.ఎస్. రాజు

హిందూ ఉగ్రవాదం రాలుస్తున్న నెత్తుటి చుక్కలు - డా. కత్తి పద్మారావు

డెబ్బై ఏళ్ల బూటకపు స్వాతంత్ర్యం-2 - ఎడ్ల పోచయ్య

తత్వశాస్త్రం కొంతే, సొంత కవిత్వమే అంతా...-2 - లంకా పాపిరెడ్డి

ఈనేల - వై. రామచంద్రం

ఇరుగు-పొరుగు - వై. రామచంద్రం

భూగోళం - సి. రాజశేఖర్

అసహజ మరణాలు - ఎస్. వెంకటేష్

అక్టోబర్ 2017 — **సంచిక : 195**

పాఠకుల వీక్షణం

హిట్లర్ కూడా ఆశ్చర్యపోయే సంఘ్ పరివార్ దూకుడు (సంపాదకీయం)

కొత్త గ్రామీణ ఆధిపత్య వర్గాల తయారీ; ఇది ప్రజాస్వామిక, రాజ్యాంగబద్ధ ప్రభుత్వమేనా?;

సామ్రాజ్యవాదాన్ని సవాలు చేస్తున్న ఉత్తర కొరియా - ఎ. నర్సింహారెడ్డి (సంపాదకీయ వ్యాఖ్యలు)

'సామాజిక స్మగ్లర్లు కోమటోళ్లు' వివాదం - ఎన్. వేణుగోపాల్

చర్విత చర్వణం గౌరీ లంకేశ్ హత్య! - విద్యాభూషణ్

గౌరీ లంకేశ్ వాదన ఇంకా ముగియలేదు - మానష్ ఫిరాక్ భట్టాచార్జీ

మనువాద శవపేటికకు దిగ్గొట్టిన నాలుగు మేకులు - ఎన్.నారాయణరావు

ఎవరికీ పట్టని రోహింగ్యాల రోదన - ఎ. నర్సింహా రెడ్డి

వ్యక్తిగత గోప్యత హక్కు - సుప్రీంకోర్టు తీర్పు - బి. రామకృష్ణ

తెలంగాణ భూ సర్వే - పరిశీలన - డా. ఎ. పున్నయ్య

సంస్మరణ - మోహన్ స్ఫూర్తి చిరకాలం జీవిస్తుంది!

భూమి కోసం దళిత యువకుడి ఆత్మహత్య - వై. రామచంద్రం

రాచకోయలు ఏం నేరం చేశారని? - వంగాల సంపత్ రెడ్డి, నాగవెల్లి వెంకటేశ్వర్లు

డేరా సచ్చా సౌదా నేర సామ్రాజ్యం - సంతోష్

విద్యార్థినులపై కేంద్ర బలగాల లైంగిక వేధింపులు - లక్ష్మణ్ గడ్డం

తలాఖ్... తలాఖ్... తలాఖ్... - రాజేంద్రబాబు అర్విణి

అక్టోబర్ విప్లవ శత జయంతి - కొండూరు వీరయ్య

భద్రతను తుంచేసిన నూతన పెన్షన్ విధానం - సతీష్ బైరెడ్డి

వాకపల్లి ఘటనపై సుప్రీంకోర్టు స్పందన - చిమ్మె జాన్ బర్నబాస్

జన్యుమార్పిడి ఆవాల పంటను తిరస్కరించండి - పి.వి. రమణ

మెటాఫిజిక్స్ గందరగోళం - సత్యం

'జిగిరి' నవల-రాజ్యాంగ నైతికత (పుస్తక సమీక్ష) - కె.పి. అశోక్‌కుమార్

ఓటు, నోటు, కులాధిపత్య రాజకీయాలు - డా. కత్తి పద్మారావు

తత్వశాస్త్రం కొంతే, సొంత కవిత్వమే అంతా...-3 - లంకా పాపిరెడ్డి

70 ఏళ్ల బూటకపు స్వాతంత్ర్యం - కృష్ణ ఆదిత్య

ఈనేల - వై. రామచంద్రం

ఇరుగు-పొరుగు - వై. రామచంద్రం

భూగోళం - సి. రాజశేఖర్

అసహజ మరణాలు - ఎస్. వెంకటేష్

నవంబర్ 2017 — **సంచిక : 196**

పాఠకుల వీక్షణం

యశ్వంత్ సిన్హా అప్రూవర్ ప్రకటన (సంపాదకీయం)

జిల్లాల విభజన ప్రజలకేం ఇచ్చింది?;భిన్నాభిప్రాయంపై దమనకాండ;

ఇప్పుడిక 'జిన్‌పింగ్ ఆలోచనా విధానం'! (సంపాదకీయ వ్యాఖ్యలు)

పెరుగుతున్న విద్యార్థుల ఆత్మహత్యలు - చిమ్మె జాన్ బర్నబాస్

విద్యార్థుల మెడకు కార్పొరేట్ చదువుల ఉచ్చు - షేక్ కరిముల్లా

ఉద్దానంలో ప్రాణాలు బలిగొంటున్న కిడ్నీ వ్యాధి - అన్నెపు జ్ఞానానందం

బెనారస్ యూనివర్సిటీలో పితృస్వామ్యం - బి. రామకృష్ణ

నాగా ఉద్యమంపై పాలకుల అణచివేత - జి. రామదేవుడు

నేనిక మాట్లాడక తప్పదు - యశ్వంత్ సిన్హా

కుదేలవుతున్న భారత ఆర్థిక వ్యవస్థ - ఎ. నర్సింహా రెడ్డి

చేనుకు 'కంచ' వరం - కృష్ణతేజ

రచయిత స్వీయ నియంత్రణ పాటించాలి - వై.ఎచ్.కె. మోహన్‌రావు

అమలు కాని దళితుల భూమి హామీ - నలమాస క్రిష్ణ

బస్తర్‌లో భూసంబంధాలు - విశ్వం

స్పెయిన్‌లో కాటలోనియా పోరాటం - బైరెడ్డి సతీశ్

వికృత తుపాకీ సంస్కృతి - రాజేంద్రబాబు అర్విణి

జర్మన్ పార్లమెంటులోకి నియో నాజీలు - సంతోష్

అక్టోబర్ విప్లవం తర్వాత పరిణామాలు - ఎం. నిర్మల్ కుమార్

'రాజ్యం-విప్లవం' : అక్టోబరు విప్లవ నేపథ్యం - కొండూరి వీరయ్య

పూష్కిన్ గురించి గోర్కీ ప్రశంస - ఎన్.వి.ఎస్. నాగభూషణ్

హిందుత్వ ప్రత్యామ్నాయంగా చార్వాకవాదం - డా. కత్తి పద్మారావు

తత్వశాస్త్రం కొంతే, సొంత కవిత్వమే అంతా...-4 - లంకా పాపిరెడ్డి

ఈనేల - వై. రామచంద్రం

ఇరుగు-పొరుగు - వై. రామచంద్రం

భూగోళం - సి. రాజశేఖర్

అసహజ మరణాలు - ఎస్. వెంకటేష్

డిసెంబర్ 2017 — **సంచిక : 197**

పాఠకుల వీక్షణం

హంతకుడే అధినేత, విచారించే న్యాయమూర్తి హతుడు(సంపాదకీయం)

ఈ అంతర్జాతీయ తమాషాలు ఏం సాధిస్తాయి?;చంద్రబాబుపై ప్రపంచ బ్యాంకు ప్రేమ;

జింబాబ్వేలో ముగిసిన ముగాబే శకం - **ఎ. నర్సింహారెడ్డి** (సంపాదకీయ వ్యాఖ్యలు)

ఎవరివీ ప్రపంచ తెలుగు మహాసభలు? - ఎన్. వేణుగోపాల్

తెలంగాణ ప్రభుత్వ పనితీరుపై కాగ్ వ్యాఖ్యలు - బి. రామకృష్ణ

అధికార వ్యామోహం, అవకాశవాదమే పునరేకీకరణా? - బైరెడ్డి సతీష్

సాయిబాబా నిర్బంధం - అనవసర వివాదం - జి. లింగమూర్తి

అభంగపట్నం దళితులపై దాడి - బహిష్కరణ వ్యతిరేక కమిటీ సభ్యులు

ఆదివాసీ-లంబాడా వివాదం - ఎం. రత్నమాల

పెరిగిపోతున్న ఫాసిస్టు సాంస్కృతిక ఉన్మాదం - అరణ్య

కార్పొరేట్ ఎగవేతదార్లకు నూతనోత్సాహం - బి.ఎస్. రాజు

మార్క్స్-అంబేద్కర్ సమన్వయం సి.వి. - డా. కత్తి పద్మారావు

ప్రజారోగ్యం పట్ల పాలకుల నిర్లక్ష్యం - విద్యాభూషణ్

పనామా పేపర్స్ నుంచి ప్యారడైజ్ పేపర్స్ దాకా - సంతోష్

చైనాలో ప్రజావైద్యం - సాంస్కృతిక విప్లవం - భూసారం శివన్న

సోషల్ సామ్రాజ్యవాద శక్తిగా చైనా - ఎ. నర్సింహారెడ్డి

అమలు కాని దళితుల భూమి హామీ-2 - నలమాస క్రిష్ణ

ఆర్ఎస్ రావు స్మారక సదస్సు 2017 నివేదిక

మార్క్సిస్టు వ్యతిరేక చెత్త పుస్తకానికి వీక్షణంలో ప్రశంసలా? - ఎ. వీరస్వామి

ఈనేల - వై. రామచంద్రం

ఇరుగు-పొరుగు - వై. రామచంద్రం

భూగోళం - సి. రాజశేఖర్

వీక్షణం 2017 సూచిక

అసహజ మరణాలు - ఎస్. వెంకటేష్

అసహజ మరణాల సూచి

సంకలనం: ఎస్. వెంకటేష్

మరణం ఎప్పుడయినా విషాద సూచకమే. మృతుల బంధువులకూ, మిత్రులకూ విచారకరమే కాని అందులోనూ మరణించిన మనిషి నిండు జీవితం గడిపి వయోభారంతోనే మరణిస్తే దాన్ని సహజ మరణంగా అంగీకరించి ఊరట పడవచ్చు. సగటు ఆయు ప్రమాణంలో సగం కూడా అనుభవించక ముందే మరణిస్తున్నారు. ఈ అసహజ మరణాలకు లెక్కలేనన్ని ఆర్థిక, సామాజిక, రాజకీయ కారణాలున్నాయి. మన పక్కనే మనతోనే ఉండే మనుషులు అర్థాంతరంగా అసహజంగా అకాలంగా అదృశ్యమైపోతున్నారు. ఇటువంటి అసహజ మరణాలు ఇటీవలి కాలంలో విపరీతంగా పెరిగిపోతున్నాయి. ఇవి సామాజిక సంక్షోభానికి, సమాజం దిగజారుడుకు ఒక చిహ్నం. మన రాష్ట్రంలో సాలీనా ఈ రకంగా చనిపోతున్న వారి సంఖ్య వేలల్లోనే ఉంటుందని అంచనా. నిజానికి అసహజ మరణాలన్నీ అసహజ మరణాలుగా నమోదు కావడం లేదు గనుక ఈ సంఖ్య వాస్తవంలో ఒక భాగం మాత్రమే కావచ్చు. పత్రికలలో అచ్చయిన ఇటువంటి ఘటనలన్నిటినీ ఒక్కచోట నమోదు చేయాలని భావిస్తున్నాం. ఈ శీర్షిక ప్రతి నెల ఉంటుంది. అయితే రాష్ట్రంలో ప్రతి గ్రామంలో జరుగుతున్న సంఘటనలన్నీ ఇక్కడ రిపోర్ట్ కాకపోవచ్చు. కొన్నయినా మనల్ని ఆలోచింపజేస్తే, మనం మనచుట్టూ ఉన్న మనుషుల కోసం ఇంకాస్త బాధ్యతగాను, జాగ్రత్తగాను వ్యవహరిస్తూ మొత్తంగా పరిష్కారాలవైపు వెళ్లడానికి ఏమయినా తోడ్పడితే ఈ శీర్షిక విజయవంతమైనట్లే.

(అక్టోబర్ 1 నుండి అక్టోబర్ 31, 2017 వరకు తెలంగాణలోని 10 జిల్లాలు (948), ఆంధ్రప్రదేశ్‌లోని 13 జిల్లాలలో (947) అసహజ మరణాల పాలైన వారి సంఖ్య 1895)

జిల్లా	ఆకలి	ఆత్మహత్యలు				చికిత్స అందక, అనారోగ్యం			గుర్తు తెలియని		హత్యలు		ప్రమాదాలు				పోలీసు కాల్పుల్లో		పోలీసులు, సైన్యం	మిస్సింగ్/ లాకప్ మరణాలు	ప్రకృతి వైపరీత్యాలు
		వ్యవసాయ రంగం	చేనేత రంగం	ఇతరాలు									పనిచేసే స్థలంలో	కరెంట్	రహదారి	ఇతరాలు	ఉద్యమ కారులు	ఇతరులు			
				స్త్రీ	పు.	స్త్రీ	పు.	పి.	స్త్రీ	పు.	స్త్రీ	పు.									
(1)	(2)	(3)	(4)	(5)	(6)	(7)	(8)	(9)	(10)	(11)	(12)	(13)	(14)	(15)	(16)	(17)	(18)	(19)	(20)	(21)	(22)
ఆదిలాబాద్	1	4	–	27	29	8	10	6	3	2	3	3	1	2	27	32	–	–	–	4	–
హైదరాబాద్	–	–	–	7	12	3	5	2	1	2	1	3	3	2	13	15	–	–	–	–	–
కరీంనగర్	–	2	–	2	5	4	2	4	–	1	1	2	–	3	23	12	–	–	–	–	–
ఖమ్మం	–	2	–	10	9	5	4	4	–	1	2	1	4	2	15	11	–	–	–	–	2
మహబూబ్‌నగర్	–	2	–	3	6	4	5	5	4	3	5	5	4	12	48	1	–	–	–	–	–
మెదక్	4	15	5	10	8	19	14	2	4	12	4	4	8	29	22	19	–	–	–	6	4
నల్గొండ	–	6	–	7	9	1	3	2	1	1	1	3	1	2	32	12	–	–	–	–	1
నిజామాబాద్	–	2	–	3	3	2	–	2	–	2	1	1	–	2	13	7	–	–	–	–	2
వరంగల్	1	19	4	6	5	9	6	4	1	5	8	4	9	17	20	9	–	–	–	5	2
వికారాబాద్	–	–	–	3	5	–	–	–	–	2	2	3	1	4	7	5	–	–	–	–	–
తెలంగాణ	**6**	**52**	**9**	**78**	**91**	**55**	**49**	**31**	**14**	**31**	**28**	**29**	**31**	**75**	**220**	**123**	**-**	**-**	**-**	**15**	**11**
అనంతపురం	–	6	1	24	22	7	9	3	2	2	2	3	24	7	44	1	–	–	–	–	–
చిత్తూరు	–	–	–	4	8	9	5	–	2	3	4	9	4	1	13	7	–	–	–	–	–
కడప	–	–	–	3	3	1	4	2	–	1	4	2	–	2	11	16	–	–	–	–	–
గుంటూరు	–	–	–	2	5	5	3	4	1	2	–	4	2	5	18	12	–	–	–	–	–
కృష్ణా	–	–	–	3	1	–	3	–	3	1	2	1	1	2	21	11	–	–	–	–	2
కర్నూలు	2	1	1	6	4	3	2	6	3	2	1	4	8	4	18	15	–	–	2	–	–
తూర్పు గోదావరి	–	–	–	5	8	2	5	2	1	6	–	5	1	4	22	16	–	–	–	–	–
ప్రకాశం	–	1	–	3	5	5	7	11	–	3	1	5	–	5	15	12	–	–	–	1	2
శ్రీకాకుళం	–	–	–	4	14	3	7	–	–	6	–	–	2	9	20	11	–	–	–	–	–
పశ్చిమ గోదావరి	–	–	–	5	6	2	5	1	1	3	3	2	–	7	16	13	–	–	–	–	3
నెల్లూరు	–	–	–	2	3	9	8	5	–	3	1	1	1	2	15	8	–	–	–	–	–
విజయనగరం	–	–	–	2	3	2	2	3	1	3	–	–	–	3	9	10	–	–	–	–	1
విశాఖపట్నం	–	–	–	3	14	–	2	–	–	9	3	2	1	4	21	11	–	–	–	12	1
ఆంధ్రప్రదేశ్	**2**	**8**	**2**	**66**	**96**	**48**	**62**	**37**	**14**	**44**	**21**	**38**	**44**	**55**	**243**	**143**	**-**	**-**	**2**	**13**	**9**

వీక్షణం విడిప్రతి కొనుగోలు కోసం

మీ సమీపంలోని ఈ కింది న్యూస్‌స్టాల్‌లో వీక్షణం విడిప్రతి కొనుక్కోవచ్చు

రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ (సోల్ డిస్ట్రిబ్యూటర్)	ఆబిడ్స్, హైదరాబాద్	96666 80857
నవోదయ బుక్‌హౌస్, కాచిగూడ	హైదరాబాద్	90004 13413
సహచర బుక్‌మార్క్	బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్	98483 48173
బాల రాజేశ్వర బుక్ డిపో	నల్లకుంట బస్ స్టాప్	9705055738
వెంకటేశ్వర బుక్ స్టాల్, స్టేషనరీ	నల్లకుంట, శంకర్‌మఠ్	040-66131071
పస్ట్ లక్కీ పాన్ షాప్	విద్యానగర్ సిగ్నల్స్	9848672831
సుధాకర్ బుక్ స్టాల్	సన్‌మాన్ హోటల్ పక్కన, తార్నాక	9949337605
వెంకటేశ్వర బుక్ స్టాల్	రామ్‌నగర్ గుండు	9502964995
భవాని బుక్ స్టాల్	శివం రోడ్	9849836996
శ్రీభవాని బుక్ స్టాల్	శివం రోడ్ (ఇండియన్ బ్యాంక్ దగ్గర)	9640712555
ఓరియన్ బుక్ స్టాల్	అంబర్‌పేట్ (శ్రీరమణ టాకీస్ దగ్గర)	7702535137
అరవింద్ బుక్ స్టాల్	రామంతాపూర్ (టివి స్టూడియో ఎదురుగా)	8977995537
రెడ్డి బుక్‌స్టాల్	అశోక్‌నగర్, హైదరాబాద్	
నేషనల్ బుక్‌హౌస్	అబిడ్స్, హైదరాబాద్	9394495189
దుర్గా భవన్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9030656640
డైమాండ్ బుక్‌స్టాల్	నాంపలి, హైదరాబాద్	9885127491
రాజు రామ్‌దాస్ బుక్‌స్టాల్	మెహిదీపట్నం, హైదరాబాద్	7799244409
రిలెబుల్ బుక్ సెంటర్	నానల్‌గూడ, హైదరాబాద్	040-23512447
ఇస్పెక్ట్రం బుక్‌హౌస్	లంగర్‌హౌజ్, హైదరాబాద్	98486 68354
శ్రీలక్ష్మి బుక్‌స్టాల్	హైదర్‌గూడ, హైదరాబాద్	98855 81249
లక్ష్మణ్	చిక్కడపల్లి, హైదరాబాద్	93910 12051
మల్లిఖార్జున్ బుక్‌స్టాల్	దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్	90594 40756
సుధీర్ బుక్‌స్టాల్	తార్నాక, హైదరాబాద్	95426 04166
లడ్డు బుక్‌స్టాల్	పంజగుట్ట, హైదరాబాద్	99492 15135
వినోద్ బుక్‌స్టాల్	సరూర్‌నగర్, హైదరాబాద్	95536 03603
రాజ్ బుక్స్ స్టేషనరీ	ఓల్డ్ బస్‌స్టాండ్ దగ్గర, మెదక్ రోడ్, సిద్దిపేట్	87905 60097
బాల్‌రెడ్డి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మహబూబ్‌నగర్	98660 18829
శ్రీ స్వయం రాజరాజేశ్వర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుస్నాబాద్	90592 85948
భాస్కర్ పాన్ షాప్ & జనరల్ స్టోర్	కోహెడ	95021 82545
భండారి కిష్టయ్య బుక్‌స్టాల్	ఫైర్‌స్టేషన్ దగ్గర, గోదావరిఖని	98497 93836
గణేష్ బుక్‌స్టాల్	కళాభారతి ఎదురుగా, కరీంనగర్	97019 99007
సాయిగణేష్ బుక్‌స్టాల్	టు టౌన్ పోలీస్ స్టేషన్ దగ్గర, కరీంనగర్	93979 94268
మహాలక్ష్మి బుక్‌స్టాల్	సిటీ బస్‌స్టాండ్, హన్మకొండ చౌరస్తా, వరంగల్	99893 30297
వినయ్ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, మంచిర్యాల	94407 57503
పాండు బుక్ స్టాల్, కూల్ డ్రింక్స్	ఆర్‌టిసి కాంప్లెక్స్, మిర్యాలగూడ	98857 38144
శరత్ బుక్ స్టాల్	షాప్ నం. 3, ఆర్‌టిసి బస్‌స్టాండ్, హుజూరాబాద్	98662 73720
సత్యసాయి బుక్‌స్టాల్	ఖమ్మం	
మహాకవి శ్రీశ్రీ బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, పార్వతీపురం	73825 60366
మణి బుక్‌స్టాల్	సండేమార్కెట్, నెల్లూరు	73862 23538
గణేష్ పుస్తక ప్రదర్శన	గాంధీ రోడ్, ప్రొద్దటూరు	
పద్మావతి బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, అనంతపూర్	73965 09767
అనేక బుక్‌స్టాల్	ఏలూరు రోడ్డు, విజయవాడ	92472 53884
మైత్రీ బుక్‌హౌస్	మజీద్ వీథి, అరండల్‌పేట, విజయవాడ	98486 31604
రాజేశ్ బుక్ సర్వీస్	ఆర్‌టిసి బస్‌స్టేషన్ కాంప్లెక్స్, విశాఖపట్నం	99483 19842
వి. భాస్కర్ న్యూస్‌పేపర్ ఏజెన్సీ	డాబా గార్డెన్, విశాఖపట్నం	99482 90318
రాఘవేంద్ర బుక్‌స్టాల్	ఆర్‌టిసి బస్‌స్టాండ్, ఒంగోల్	90595 23091
శ్రీసత్యసాయి బుక్‌స్టాల్	ఆర్‌టిసి కాంప్లెక్స్, రాజమండ్రి	73860 66226, 94419 07321

VEEKSHANAM Telugu Monthly Journal of Political Economy and Society - 197 - December 2017 ● **ISSN 2231-6892**
● RNI Regn.No.APTEL/2003/11482 ● Published on 27/11/2017 ● Postal Regn. No. L II/RNP/HD/1100/2017-19

Date of Posting : 29th, 30th

ఆర్.ఎస్. రావు స్మారక సదస్సు - 2017

నవంబర్ 12, ఆదివారం,
షోయబ్ హాల్ (సుందరయ్య విజ్ఞాన కేంద్రం), బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్


బి.ఎస్. రాజు


కమల్ మహేంద్రూ


సాధనా సక్సేనా


బి. రామకృష్ణ


కె. సురేష్


కె. లక్ష్మీనారాయణ


ముదునూరి భారతి, కవిత









Edited, printed, published and owned by N. Venugopal Rao, Printed at Charitha Impressions, Azamabad, Hyderabad - 500 020
and Published at 3-6-394, Mythri Residency, Street No. 3, Himayatnagar, Hyderabad 500 029. Editor : N. Venugopal Rao